


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 336

SUNDAY Special | ఆదివారం 18-8-2024



బ్రదర్ అంటే బెస్ట్ ఫ్రెండ్

బహుమతులు ఆనందాన్నిస్తాయి... అయితే వస్తువుల రూపంలో కన్నా మాటల రూపంలో ప్రేమను వ్యక్తపరిస్తే ఆ ఫీలింగ్ హృదయంలో నిలిచిపోతుంది. అన్నయ్య గౌతమ్ నుంచి అలాంటి ప్రేమనే ఎక్కువగా కోరుకుంటున్నానని చిన్నారి సితార అంటోంది. సూపర్ స్టార్ మహేశ్‌బాబు, నమ్రతల కుమార్తెగా పన్నెండేళ్ల సితార పాపులర్. ఓ జ్యువెల్లరీ బ్రాండ్ అంబాసిడర్‌గా తనకంటూ పాపులార్టీ తెచ్చుకుంది. సోమవారం రాఖీ పండుగ సందర్భంగా 'సాక్షి'కి సితార చెప్పిన ప్రత్యేకమైన ముచ్చట్లు..

11లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | BANGALORE | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వైద్యుల భద్రతపై కమిటీ

డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై సిఫార్సుల కోసం కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది.

వివరాలు 6లో ▸



రాణాను అప్పగించవచ్చు

ముంబై దాడుల కేసులో ప్రధాన నిందితుడైన తహవ్వుర్ రాణా(పాక్)ను భారత్‌కు అప్పగించవచ్చని కాలిఫోర్నియా కోర్టు స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸



పోర్టబుల్ ఆస్పత్రి పారా-డ్రాప్

భారత ఆర్మీ, వైమానిక దళం పోర్టబుల్ ఆస్పత్రిని 15 వేల అడుగుల ఎత్తు నుంచి విజయవంతంగా నేలపైకి దింపాయి.

వివరాలు 6లో ▸



సూడాన్‌లో 85 మంది ఊచకోత

సూడాన్‌లోని జల్క్ని గ్రామాన్ని పారా మిలటరీ బలగాలు ముట్టడించి దాదాపు 85 మందిని చంపేశారని స్థానికులు వాపోయారు.

వివరాలు 6లో ▸

మార్గదర్శి డిపాజిట్లు చట్టవిరుద్ధం

ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 45 ఎస్‌ను ఉల్లంఘించారు

అందుకు మార్గదర్శి, రామోజీరావులను ప్రాసిక్యూట్ చేయాలి

నేరం చేశారనేందుకు ప్రాథమిక ఆధారాలున్నాయి

మార్గదర్శి సేకరించిన రూ.2,600 కోట్లకుపైగా డిపాజిట్లన్నీ చట్ట విరుద్ధమే

తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన ఆర్‌బీఐ

- చట్ట ఉల్లంఘనకు రెండేళ్ల జైలు లేదా రెండింతల జరిమానా విధించొచ్చు
- మార్గదర్శి ఫైనాన్షియర్స్ వ్యక్తుల సమూహం పరిధిలోకే వస్తుంది
- వ్యక్తులు డిపాజిట్లు వసూలు చేయకుండా నిరోధించడానికే చట్ట సవరణ
- అందువల్ల వారు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టేయండి
- రామోజీ మరణంతో కిరణ్‌ను హెచ్‌యూఎఫ్ కర్తగా చేరుస్తూ అనుబంధ పిటిషన్
- తదుపరి విచారణ ఈ నెల 20న చేపట్టనున్న తెలంగాణ హైకోర్టు

2లో



ఆర్బీఐ చట్టం సెక్షన్ 45 (ఎస్)ను మార్గదర్శి యథేచ్ఛగా ఉల్లంఘించింది. చట్ట ఉల్లంఘనలకు పాల్పడినందుకు రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ప్రాసిక్యూట్ చేయాలి. ఆర్బీఐ చట్టాన్ని ఉల్లంఘించారనేందుకు ప్రాథమిక ఆధారాలున్న నేపథ్యంలో తమపై దాఖలైన కేసు కొట్టివేయాలంటూ మార్గదర్శి, రామోజీ దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేయాలి. - రిజర్వ్ బ్యాంక్

అక్రమాలు బయటపడినందునే చెలరేగిన 'ఈనాడు'



రామోజీ అక్రమ ఆర్థిక సామ్రాజ్యానికి 'మార్గదర్శి' పునాది కాగా.. 'ఈనాడు' ఆ అరాచకాలకు రక్షణ కవచంలా నిలుస్తోంది. మరి అలాంటి 'మార్గదర్శి' అక్రమాలను బట్టబయలు చేస్తే ఈనాడు సహిస్తుందా? అందుకే నాడు దివంగత వైఎస్సార్‌పై.. నేడు జగన్‌పై కట్టుకథలు అల్లుతూ దుష్ప్రచారం చేస్తోంది.

అక్రమాల సినిమాలో ఆయన త్రిపాత్రాభినయం

ప్రజల సొమ్ము దోచుకునేందుకు రామోజీరావు త్రిపాత్రాభినయం చేశారు. ఆయన హెచ్‌యూఎఫ్ కర్తగా, ప్రొప్రైటర్‌గా, చైర్మన్‌గా మూడు వేర్వేరు పాత్రలలో అవసరాలకు తగ్గట్టుగా వ్యవహరిస్తూ ఆర్‌బీఐకి మస్కా కొట్టారు.

4లో

18 ఏళ్లుగా నెట్టుకొచ్చారు

మార్గదర్శి ఫైనాన్షియర్స్, రామోజీరావుపై చర్యలు కోరుతూ 2006 నవంబర్ 6న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తొలి ఫిర్యాదు అందింది. నాంపల్లి కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు మొట్టికాయలు వేసినా.. ఆర్బీఐ తప్పుబట్టినా రామోజీరావు మాత్రం 18 ఏళ్లుగా తన అక్రమ దందాను కొనసాగిస్తూ వచ్చారు.

సొంత ఆడిట్ కుదరదు.. ఎప్పుడో చెప్పిన సుప్రీంకోర్టు



'డిపాజిట్‌దారులకు సొమ్మును చెల్లించేశాం... మా ఆడిటర్లు లెక్క తేల్చేసి నివేదిక ఇచ్చారు' అంటూ కనికట్టు చేసేందుకు యత్నించారు. ఆ కుతంత్రాన్ని పసిగట్టిన సుప్రీంకోర్టు.. 'నేరం నాదే... దర్యాప్తు నాదే... తీర్పు నాదే' అంటే కుదరదని, నిజాలు నిగ్గు తేలాల్సిందేనని స్పష్టం చేసింది.

న్యూస్‌రీల్

అరకు అందాలు అద్భుతం



ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోని ప్రకృతి అందాలు అద్భుతమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి అన్నారు. శనివారం జస్టిస్ జేకే మహేశ్వరి దంపతులు అరకు లోయలో పర్యటించారు. గిరిజన మ్యూజియాన్ని, గిరి గ్రామదర్శిని, బొర్రా గుహలను సందర్శించారు.

వివరాలు 5లో ▸

స్తంభించిన వైద్యసేవలు



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా వైద్యవర్గాలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఐఎంఏ పిలుపు మేరకు అత్యవసర వైద్యసేవలు మినహా మిగిలిన సేవలు స్తంభించాయి.

వివరాలు 5లో ▸

భర్త అనుమానం.. పెను'మంటలై'



భర్త అనుమానం.. వేధింపులు తట్టుకోలేక గ్యాస్ సిలిండర్‌కు నిప్పంటించుకొని ఇద్దరు బిడ్డలతో సహా ఓ తల్లి సజీవ దహనమయ్యింది. ఈ హృదయ విదారక ఘటన అన్నమయ్య జిల్లా రాయచోటిలో చోటుచేసుకుంది.

వివరాలు 5లో ▸

రేపటి నుంచి ఉద్యోగుల బదిలీలు

- బదిలీలపై నిషేధం తాత్కాలిక తొలగింపు
- 14 శాఖల్లో ఈ నెలాఖరు వరకు బదిలీలు
- నెలాఖరులోగా బదిలీల ప్రక్రియ పూర్తి
- ఆ తర్వాత మళ్లీ నిషేధం అమల్లోకి..
- ఎక్సైజ్ శాఖలో వచ్చే నెల 5 నుంచి 15 వరకు బదిలీలు
- ఐదేళ్లు ఒకే చోట పనిచేస్తే తప్పనిసరిగా బదిలీ.. వైకల్యం, అనారోగ్య కారణాలతో బదిలీ కోరితే ప్రాధాన్యత
- గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా పనిచేసిన వారికీ ప్రయారిటీ
- మార్గదర్శకాలతో ఆర్థిక శాఖ ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా తొలగించింది. ప్రజా సంబంధిత సేవలందించే 14 శాఖల్లోని ఉద్యోగుల బదిలీలకు సోమవారం నుంచి ఈ నెలాఖరు వరకు అనుమతించింది. ఎక్సైజ్ శాఖలో మాత్రం వచ్చేనెల 5 నుంచి 15వ తేదీ వరకు బదిలీలకు అనుమతించింది. ఈ మేరకు మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ శనివారం జారీ చేశారు. ఈ నెలాఖరుకల్లా 14 శాఖల్లో బదిలీలు పూర్తవ్వాలని, వచ్చే నెల 1వ తేదీ నుంచి నిషేధం తిరిగి అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఎక్సైజ్ శాఖలో వచ్చే నెల 16 నుంచి నిషేధం అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. 5 సంవత్సరాలుగా ఒకే చోట పని చేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇతర ఉద్యోగుల్లో పరిపాలన అవసరాలు లేదా వ్యక్తిగత అభ్యర్థనలపై బదిలీలకు అర్హులు. ఎన్నికల ప్రక్రియ కోసం బదిలీలను బదిలీగా పరిగణించరు. కారుణ్య ప్రాతిపదికన నియమితులైన

మిగతా 3వ పేజీలో ▶



అంతా కేంద్రం చేతుల్లోనే..

- రూ.15 వేల కోట్ల రుణం త్వరగా ఇప్పించండి
- వెనకబడిన జిల్లాలకు నిధులు విడుదల చేయండి
- ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- ఆర్థిక, హోం మంత్రులతోనూ భేటీ
- రాష్ట్రంలో హింసాత్మక ఘటనలపై అమిత్‌షా ఆరా

10లో

ప్రధాని మోదీకి జ్ఞాపిక అందజేస్తున్న సీఎం చంద్రబాబు

'నిలువెత్తు' సేద్యం

- నిలువు పందిరి సేద్యంపై రైతన్నల ఆసక్తి
- ఈ పద్ధతితో తీగపంటల సాగు ఇక సులువు
- తోటల్లో కర్రలకు నైలాన్ క్రీపర్ నెట్టింగ్
- దీంతో భారీగా తగ్గనున్న కూలీల ఖర్చు





నిలువు పందిళ్ల ద్వారా సాగవుతున్న దోస పంట (ఇన్‌సెట్) వైర్‌నెట్

వ్యవసాయాన్ని నమ్ముకున్న అన్నదాతలు ఆరుగాలం శ్రమించినా ఫలం దక్కకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. కొందరు మల్చింగ్ విధానం అనుసరిస్తున్నారు. మరికొందరు సరికొత్త వంగడాలు సాగు చేస్తున్నారు. ఇంకొందరు విదేశీ పంటలను ప్రయోగాత్మకంగా పండిస్తున్నారు. రైతులు నష్టాలు, కష్టాల నుంచి విముక్తి కోసం పాకులాడుతున్నారు. అందులో భాగంగా పాకే పంటలను సరికొత్తగా పండిస్తున్నారు. నిలువు పందిరి పంటలపై మక్కువ చూపుతున్నారు. కూలీల ఖర్చుకు స్వస్తి పలుకుతూ పొలమంత పందిరేసి కూరగాయల పంటలు చేస్తున్నారు. ఈ విధానంపై రైతులు మక్కువ చూపుతున్నారు. పడమటి మండలాల్లో ఉన్న రైతులు పరిస్థితులకనుగుణంగా పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు.

పలమనేరు: సాధారణంగా తీగ పంటలైన దోస, బీర, కాకర, సొర, చిక్కుడు తదితర పంటలను జిల్లాలోని పడమటి ప్రాంతాల రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ పంటలకు చేలలో ఇరువైపులా కర్రలు కట్టి వాటికి ట్వైన్ చుట్టుకుంటూ తీగలను అల్లించే విధానం ఇప్పటిదాకా చేస్తున్నారు. అయితే దీనికి కూలీలతో పని ఎక్కువ తోట పెరిగేలోపు నాలుగైదురోజులకోసారి తీగలను కర్రకు కట్టుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. ఇప్పుడలా కాకుండా నిలువు పందిరి విధానంతో నైలాన్ నెట్‌ను మొక్కకు పక్కనే నిలువుగా కట్టడం ద్వారా తీగలు వాటతంటకవే పాకుతూ పైకెళ్లిపోతాయి. మొక్కను కూలీలు తాకాల్సిన పని లేదు. ఫలితంగా రైతులకు భారీగా కూలీల ఖర్చు తగ్గి పంటసాగు సులభతరమైంది.

క్రీపర్ నెట్టింగ్ ఎలాగంటే..

నైలాన్ దారంతో విభిన్న కొలతల రంధ్రాలు కలిగిన నైలాన్ నెట్ ఉంటుంది. కావాల్సిన పంటను బట్టి సైజును తెచ్చుకోవాలి. వీటిని తోటలో రెండువైపులా కర్రలను కట్టి వాటికి రెండు వైపులా నిలువుగా వీటిని కట్టుకోవాలి. ఈ విధానాన్ని నైలాన్ గార్డెన్ ప్లాంట్ క్రీపర్ నెట్టింగ్ అని చెబుతున్నారు. ఇందులో ఎకరా పొలానికి ఐదు కిలోల నెట్ అవసరముంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో నైలాన్ నెట్ ధర నాణ్యతను బట్టి రూ.200 నుంచి రూ.350 వరకూ ఉంది. కొన్ని దుకాణాలతో పాటు ప్రముఖ ఆన్‌లైన్ సంస్థలైన అమేజాన్, ఫ్లిప్‌కార్ట్‌లోనూ వీటిని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఈ పద్ధతిలో పొరుగులో ఉన్న కోలారు, శ్రీనివాసపురం, చింతామణిలో పలువురు రైతులు ప్రయోగాత్మకంగా సాగుచేసి మంచి ఫలితాలను సాధిస్తున్నారు. దీన్ని గమనించిన ఇక్కడి రైతులు సైతం ఇక్కడ కొత్తగా సాగు చేస్తున్నారు. వీరిని గమనించిన చుట్టుపక్కల రైతులు సైతం ఇప్పుడిప్పుడే కొత్త విధానాన్ని అవలంభిస్తున్నారు.

భారీగా తగ్గనున్న కూలీల ఖర్చు

ఎకరా పొలంలో తీగజాతి పంటను సాగు చేయాలంటే మూడు నెలల పాటు 12 దఫాలు కూలీల అవసరముంటుంది. ఒక్కో దఫాకు ఆరుగురు కూలీలతో పని ఉంటుంది. ఆ లెక్కన 72 మంది కూలీలు కావాలి. ఒక్కో కూలీకి రోజుకి రూ.300 అనుకున్నా రూ.21,600 ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే నిలువు పందిరి ద్వారా ఎకరానికి నైలాన్ నెట్‌కు పెట్టే ఖర్చు రూ.2వేల లోపే ఉంటుంది. దానికితోడు మళ్లీ పంటలకు ఇది ఉపయోగపడుతుంది. భవిష్యత్తులో ఇలాంటి కొత్త పద్ధతులను ఇక్కడి రైతులు మరింతగా సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

ట్రేడింగ్‌లో పెట్టుబడి రూ. 5.4 కోట్లు..

లాభం రూ. 15.58 కోట్లు




విత్ డ్రాకు అవకాశం లేకపోవడంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు

ఇద్దరు కీలక నిందితులను విజయవాడలో అరెస్టు చేసిన టీజీ సీఎస్‌బీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: ట్రేడింగ్‌లో పెట్టుబడులతో అధిక లాభాలంటూ ఆశ చూపించి ఒకరి నుంచి రూ.5.4 కోట్లు కొల్లగొట్టిన ఇద్దరిని విజయవాడలో టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ఆ వివరాలను టీజీ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ శనివారం మీడియాకు తెలిపారు. హైదరాబాద్ చిక్కడపల్లికి చెందిన ఓ వ్యక్తి వాట్సాప్‌నకు సైబర్ నేరగాళ్లు జూన్ 8న ఇన్వెస్టిమెంట్ లింకు పంపారు. దీంతో లింక్ ఓపెన్ చేసి ఆ వ్యక్తి గ్రూపులో చేరాడు. 'బీ6/ స్టాక్ విజనరీస్' పేరుతో ఉన్న గ్రూప్‌లో లైదియశర్మ గోల్డ్‌మెన్ స్కీం గురించి వివరించింది. త్వరలో రాబోతున్న మరిన్ని ఐపీఓల గురించి తెలుసుకొని ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టి లాభాలు ఆర్జించాలంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. పాన్‌కార్డు, ఆధార్‌కార్డుతోపాటు ఇతర వివరాలతో ఆమె చెప్పిన వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యాడు. ఆపై ట్రేడింగ్ మొదలుపెట్టాడు. ప్రముఖ సంస్థలకు సంబంధించిన ట్రేడింగ్ ఆప్షన్స్ వెబ్‌సైట్‌లో పొందుపర్చగా, బాధితుడు సులువుగా నమ్మాడు. జూలై 10 నుంచి పలు దఫాలుగా నెలరోజుల్లోనే రూ.5.4 కోట్లు పెట్టుబడిగా పెట్టాడు. ఇలా వెబ్‌సైట్‌లో బాధితుడికి రూ.15.58 కోట్లు లాభం వచ్చినట్టు చూపించింది. దీంతో ఆ అమౌంట్ విత్ డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా వీలు కాలేదు. విత్‌డ్రా సదుపాయం కల్పించాలంటే మరికొంత చెల్లించాలని సైబర్ నేరగాళ్లు బాధితుడ్ని డిమాండ్ చేశారు. దీంతో తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్ సెక్యూరిటీ బ్యూరోలోని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు ముమ్మరం చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు రాంపల్లి కొండల్‌రావు, అతని సోదరుడు చంద్రశేఖర్‌ఆజాద్‌లను విజయవాడలో అరెస్ట్ చేశారు. వీరిద్దరూ రిక్కీ సాఫ్ట్‌వేర్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. నిందితులు ఈ తరహా మోసాలకు ఉపయోగించిన బ్యాంకు ఖాతాలపై దేశవ్యాప్తంగా 26 ఫిర్యాదులు ఉన్నట్టు విచారణలో వెల్లడైంది. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని శిఖాగోయల్ ప్రజలకు సూచించారు.

కెన్-బెట్వాలానే పోలవరం పరుగెత్తేది



పోలవరం నిర్మాణ బాధ్యతలను కేంద్రమే చేపట్టి ఉంటే.. ఈ పాటికి ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేదని నీటి పారుదల రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇందుకు కేంద్రం శరవేగంగా పూర్తి చేస్తున్న కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టే ఉదాహరణ అని అధికార వర్గాలు సైతం పేర్కొంటున్నాయి.

- వివరాలు 3లో

కొండపల్లి బొమ్మ.. కోటకట్టి కూచుందమ్మా!



ప్రసిద్ధి చెందిన కొండపల్లి కొయ్య బొమ్మలు ఆన్‌లైన్ మెట్లెక్కి అదుర్స్ అనిపిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఏటా రూ.3 కోట్ల విలువైన కొండపల్లి బొమ్మల విక్రయాలు జరుగుతుండగా.. ఆన్‌లైన్ మార్కెట్‌లోనూ అమ్మకాలు క్రమంగా ఊపందుకుంటున్నాయి.

- వివరాలు 5లో

సిద్ధరామయ్య మెడకు ముడా ఉచ్చు



మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (ముడా) భూముల కేటాయింపుల వివాదానికి సంబంధించి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆ రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లోత్ విచారణకు ఆదేశించారు.

- వివరాలు 6లో

మా దారి గూండాగిరి!



స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) చైర్మన్ పదవి దక్కలేదని టీడీపీ నేతలు ఏకంగా పాఠశాలకు విద్యార్థులు రాకుండా రోడ్డును తవ్వి.. ముళ్ల కంప అడ్డం వేశారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి పంచాయతీలోని ముద్దలాపురంలో ఈ ఘటన చోటుచేసుకుంది. టీడీపీ మద్దతుదారును గెలిపిస్తేనే 'దారి' ఇస్తామని ఆ పార్టీ నేతలు విజయ్‌కుమార్, రాయల్ మంజునాథ్ చౌదరి తెగేసి చెప్పడంతో మరో దారి లేక పిల్లల తల్లిదండ్రులు వారు చెప్పినట్లుగా ఓట్లేశారు. - కళ్యాణదుర్గం/బ్రహ్మసముద్రం

అక్రమ రవాణాకు పోలీస్ ఎస్కార్ట్!

సీఎం చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లె ఉన్న చంద్రగిరి నియోజకవర్గంలో పోలీసుల అండదండలతో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. రామచంద్రాపురం మండలం బొప్పరాజుపల్లి, పాడిపేట నుంచి మట్టి, ఇసుక ప్రతి రోజూ రాత్రిళ్లు 30 టిప్పర్లలో తిరుపతికి తరలి వెళ్తోంది. ఈ దందాను అరికట్టాల్సిన పోలీసులే ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాలతో ఆ వాహనాలకు రక్షణ కల్పిస్తుండటం విస్తుగొలుపుతోంది. - సాక్షి ప్రతినిధి, తిరుపతి



మార్గదర్శి డిపాజిట్లు చట్టవిరుద్ధం

> సెక్షన్ 45 ఎస్‌కు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించినట్లు తేలితే ఆ వ్యక్తికి రెండేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు లేదా వసూలు చేసిన డిపాజిట్ల మొత్తానికి రెండింతల జరిమానా విధించవచ్చు.

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను అడ్డు పెట్టుకుని రామోజీరావు సాగించిన ఆర్థిక అక్రమాలను ఆర్‌బీఐ ఎట్టకేలకు బహిర్గతం చేసింది. రామోజీ నిస్సందేహంగా ఆర్థిక నేరగాడేనని రుజువైంది. చట్ట విరుద్ధంగా దశాబ్దాల తరబడి ఆర్థిక దోపిడీ తెగించారని తేటతెల్లమైంది. 1997 నుంచి 2006 వరకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ ప్రజల నుంచి చట్ట విరుద్ధంగా డిపాజిట్లు సేకరించినట్లు తెలంగాణ హైకోర్టుకు ఆర్బీఐ తాజాగా నివేదించింది. ఆర్బీఐ చట్టం సెక్షన్ 45 (ఎస్)ను మార్గదర్శి యథేచ్ఛగా ఉల్లంఘించిందని తెలిపింది. చట్ట ఉల్లంఘనలకు పాల్పడినందుకు రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ప్రాసిక్యూట్ చేయాలని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల ప్రకారం సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద క్వాష్ పిటిషన్ దాఖలు చేసినప్పుడు ఆరోపిత నేరాలకు ప్రాథమిక ఆధారాలను మాత్రమే పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆర్బీఐ చట్టాన్ని ఉల్లంఘించారనేందుకు ప్రాథమిక ఆధారాలున్న నేపథ్యంలో తమపై దాఖలైన కేసు కొట్టివేయాలంటూ మార్గదర్శి, రామోజీ దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేయాలని హైకోర్టును ఆర్బీఐ అభ్యర్థించింది.

సుప్రీం ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టు పునర్విచారణ...

చట్ట నిబంధనలను ఉల్లంఘించినందుకు మార్గదర్శి, దాని కర్త రామోజీరావులపై డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ కేసులో అధీకృత అధికారి నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టి వేస్తూ ఉమ్మడి హైకోర్టు 2018 డిసెంబర్ 31న తీర్పు వెలువరించింది. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అంతకుముందు హైకోర్టు తీర్పులో కొంతభాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్గదర్శి, రామోజీరావు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై ఈ ఏడాది ఏప్రిల్ 9న విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. హైకోర్టు తీర్పును రద్దు చేసింది. హైకోర్టు తీర్పును తప్పుబట్టింది. డిపాజిట్ల సేకరణకు సంబంధించిన వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని స్పష్టం చేసింది. కేసు లోతుల్లోకి వెళ్లి అందరి వాదనలు వినాలని తెలంగాణ హైకోర్టుకు స్పష్టం చేసింది. సీనియర్ న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించాలని స్పష్టం చేసింది. పునర్విచారణను ఆరు నెలల్లో ముగించాలని సూచించింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టు ఇటీవల ఈ విచారణ మొదలు పెట్టింది. హైకోర్టులో నెంబర్ టూ స్థానంలో ఉన్న సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. ఇందులో తెలంగాణ ప్రభుత్వాన్ని, ఆర్బీఐని ప్రతివాదులుగా చేర్చి కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఆర్బీఐ పూర్తి వివరాలతో తాజాగా కౌంటర్ దాఖలు చేసింది. ఆర్బీఐ కౌంటర్‌లో ముఖ్యాంశాలివీ...

> అన్ ఇన్ కార్పొరేటెడ్ సంస్థలు తమ స్వీయ నిధులతో లేదా బంధువుల వద్ద రుణంగా తీసుకున్న నిధులతో లేదా ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న నిధులతో వ్యాపారం చేసుకోవచ్చు. అంతేగానీ ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేసి వాటి ద్వారా వ్యాపారం చేయడానికి వీల్లేదు' అని ఆర్బీఐ తన కౌంటర్‌లో తేల్చి చెప్పింది.


సెక్షన్ 45 ఎస్‌ను సుప్రీంకోర్టు గతంలోనే సమర్థించింది...

'1997లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్ట సవరణలో భాగంగా సెక్షన్ 45 ఎస్‌ను కూడా సవరించాం. ఓ వ్యక్తి వ్యక్తిగతంగా, సంస్థగా, వ్యక్తుల సమూహంతో కూడిన అన్ ఇన్‌కార్పొరేటెడ్‌లు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయడాన్ని పూర్తిగా నిషేధించాం. చట్ట సవరణ వల్ల నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల వ్యాపారాన్ని సమర్థంగా నియంత్రించేందుకు మాకు అధికారం లభించింది. కంపెనీలు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ లావాదేవీలు చేపట్టాలంటే మా నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. సెక్షన్ 45 ఎస్ చట్టబద్ధతను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో 2000లో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు సెక్షన్ 45 ఎస్‌ను సమర్థించింది. చట్టం ప్రకారం వ్యక్తులు, అన్ ఇన్ కార్పొరేటెడ్ కంపెనీలు చేసే వ్యాపారాన్ని సెక్షన్ 45 ఎస్ కింద ఆర్‌బీఐ నిషేధించలేదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. అన్ ఇన్ కార్పొరేటెడ్ సంస్థలు తమ స్వీయ నిధులతో లేదా బంధువుల వద్ద రుణంగా తీసుకున్న నిధులతో లేదా ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న నిధులతో వ్యాపారం చేసుకోవచ్చు. అంతేగానీ ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేసి వాటి ద్వారా వ్యాపారం చేయడానికి వీల్లేదు' అని ఆర్బీఐ తన కౌంటర్‌లో తేల్చి చెప్పింది.

> చట్టవిరుద్ధంగా డిపాజిట్ల సేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అధీకృత అధికారి సంబంధిత కోర్టులో ఫిర్యాదు దాఖలు చేయాల్సి ఉంటుంది. మార్గదర్శి వ్యవహారంలో కూడా అధీకృత అధికారి అలాగే ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదునే గతంలో హైకోర్టు కొట్టేసింది. దానిపైనే ఇప్పుడు హైకోర్టు విచారణ జరుపుతోంది.

రెండేళ్ల జైలు.. రెండింతల జరిమానా

'చట్ట విరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేశారని భావించినప్పుడు ఆర్బీఐ లేదా రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత కోర్టు నుంచి సెర్చ్ వారెంట్లు పొంది ఆ డిపాజిట్ల వసూలు తాలుకూ డాక్యుమెంట్లన్నింటినీ తనిఖీ చేసే అధికారాన్ని సెక్షన్ 45 టీ కట్టబెడుతోంది. సెక్షన్ 45 ఎస్‌కు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించినట్లు తేలితే ఆ వ్యక్తికి రెండేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు లేదా వసూలు చేసిన డిపాజిట్ల మొత్తానికి రెండింతల జరిమానా విధించవచ్చు. చట్టవిరుద్ధంగా డిపాజిట్ల సేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అధీకృత అధికారి సంబంధిత కోర్టులో ఫిర్యాదు దాఖలు చేయాల్సి ఉంటుంది. మార్గదర్శి వ్యవహారంలో కూడా అధీకృత అధికారి అలాగే ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదునే గతంలో హైకోర్టు కొట్టేసింది. దానిపైనే ఇప్పుడు హైకోర్టు విచారణ జరుపుతోంది' అని ఆర్‌బీఐ పేర్కొంది.



legislature to enact chapter III-B and chapter III-C is clear in as much as the business of accepting deposits from public by companies (non-banking financial companies) is sought to be brought within the regulatory purview of the RBI and the acceptance of public deposit by unincorporated bodies (including firm or individual or unincorporated association of individual, like 'Margadarsi Financiers'), which undertakes activities of the nature stated in Section 45S(1), which is completely prohibited. It is further submitted that the petitioners herein, being a HUF cannot assert an absolute right to accept deposits from public by contending that Section 45-S of the RBI Act is not applicable to it. Moreover, the provisions of Section 45-S are couched in prohibitive word which thus, is a mandatory provision. [Union of India and others v. A.K. Pandey reported in (2009) 10 SCC 552]. The High Court need to suppress the mischief by taking into consideration that the HUF by carrying on the business under the name and style of "Margadarsi Financiers" falls within the scope of an 'association of individuals' as mentioned in section 45S of the RBI Act and as such prohibited from accepting deposits from public in view of the provisions of section 45S of the RBI Act.

18. It is respectfully submitted that all the aforesaid facts prima facie attract Section 45S (1) and Section 45S (2) of the RBI Act as the petitioners have accepted deposits from the public at large in violation of the RBI Act for which they are liable for prosecution and in catena of Judgments, this Hon'ble court and Hon'ble Apex court have held that under

SUBHENDU DAS

11/13

మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమంగా డిపాజిట్లు సేకరించిందని తెలంగాణ హైకోర్టుకు ఆర్‌బీఐ సమర్పించిన నివేదిక

> వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం ఏ రకమైన వ్యాపారం, కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న దానిపై సెక్షన్ 45 ఎస్ వర్తింపు ఆధారపడి ఉంటుంది. వ్యాపారం చేసేందుకు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయడం ఈ సెక్షన్ కింద నిషిద్ధం. హెచ్‌యూఎఫ్ ఇలా డిపాజిట్లు వసూలు చేస్తే అది ఆర్‌బీఐ చట్ట నిబంధనలను ఉల్లంఘించినట్లే అవుతుంది.

హెచ్‌యూఎఫ్‌కు సెక్షన్ 45 ఎస్ వర్తిస్తుంది...

హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) లీగల్ పర్సన్ కాదు. ఇది కొందరు వ్యక్తుల సమూహం. కర్త ద్వారా ఈ హెచ్‌యూఎఫ్ పని చేస్తుంటుంది. దీన్ని వ్యక్తుల సమూహంగానే పరిగణించాల్సి ఉంటుంది. అందువల్ల హెచ్‌యూఎఫ్‌కు ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45 ఎస్ వర్తిస్తుంది. వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం ఏ రకమైన వ్యాపారం, కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న దానిపై సెక్షన్ 45 ఎస్ వర్తింపు ఆధారపడి ఉంటుంది. వ్యాపారం చేసేందుకు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయడం ఈ సెక్షన్ కింద నిషిద్ధం. హెచ్‌యూఎఫ్ ఇలా డిపాజిట్లు వసూలు చేస్తే అది ఆర్‌బీఐ చట్ట నిబంధనలను ఉల్లంఘించినట్లే అవుతుంది. ఈ కేసులో మొదటి ప్రతివాది అయిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ హెచ్‌యూఎఫ్‌గా ఆర్‌బీఐ చట్ట నిబంధనలకు తిలోదకాలు ఇచ్చింది. సెక్షన్ 45 ఎస్‌లో హెచ్‌యూఎఫ్‌ను చేర్చలేదని, తాము ఆ సెక్షన్ పరిధిలోకి రామని చెప్పడం సరికాదు. ప్రజల నుంచి డిపాజిట్ల స్వీకరణ నిషేధాన్ని ఆర్‌బీఐ పరిధిలోకి తేవడమే శాసనకర్తల ప్రధాన ఉద్దేశం. అందుకే ఆర్‌బీఐ చట్టంలో చాప్టర్ 3 బీ, 3 సీలను చేర్చింది' అని రిజర్వ్ బ్యాంక్ తన కౌంటర్‌లో తెలిపింది.

చట్ట విరుద్ధమన్న విషయాన్ని గతంలో హైకోర్టు పట్టించుకోలేదు

'హెచ్‌యూఎఫ్‌గా ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడం చట్ట విరుద్ధమన్న విషయాన్ని హైకోర్టు గతంలో పట్టించుకోలేదు. హెచ్‌యూఎఫ్ వ్యక్తుల సమూహం పరిధిలోకి వస్తుందన్న విషయాన్ని కూడా విస్మరించింది. ఇవన్నీ మార్గదర్శి, రామోజీరావు సెక్షన్ 45 ఎస్‌కు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించారన్న విషయాన్ని రూఢీ చేస్తున్నాయి. చట్ట విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేసినందుకు వీరికి సెక్షన్ 45ఎస్ (1), 45 ఎస్ (2) వర్తిస్తాయి. చట్టవిరుద్ధంగా వ్యవహరించారనేందుకు ఇవన్నీ ప్రాథమిక ఆధారాలే. సెక్షన్ 45 ఎస్‌కు విరుద్ధంగా వ్యవహరించినందుకు వారిని ప్రాసిక్యూట్ చేయాలి. ఈ వివరాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని మార్గదర్శి, రామోజీరావు దాఖలు చేసిన ఈ క్వాష్ పిటిషన్‌ను కొట్టివేయాలి' అని ఆర్‌బీఐ కౌంటర్‌లో అభ్యర్థించింది. కాగా రామోజీరావు ఇటీవల మరణించిన నేపథ్యంలో హెచ్‌యూఎఫ్ కర్తగా ఆ స్థానంలో ఆయన కుమారుడు చెరుకూరి కిరణ్‌ను చేర్చాలని (సబ్‌స్టిట్యూట్) కోరుతూ మార్గదర్శి ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను ఈ నెల 20న చేపట్టనున్నట్లు తెలంగాణ హైకోర్టు ప్రకటించింది.

రామోజీ ఆర్థిక నేరగాడే

ఆర్‌బీఐ నివేదికను బట్టి సుస్పష్టం

'మార్గదర్శి' సేకరించిన రూ.2,600 కోట్లకు పైగా డిపాజిట్లన్నీ చట్ట విరుద్ధమే

45 ఎస్ నిబంధన ఉల్లంఘన.. బాధ్యులను ప్రాసిక్యూట్ చేయాల్సిందేనని తేల్చిన ఆర్‌బీఐ

కేసులు విచారణలో ఉండగానే రూ.2 వేల కోట్ల అక్రమ డిపాజిట్ల వసూలు

ఉమ్మడి హైకోర్టు చివరి రోజు 'మార్గదర్శి'పై కేసు కొట్టివేత

సుప్రీంలో అప్పీల్ చేయని నాటి చంద్రబాబు ప్రభుత్వం

ఉండవల్లి పిటిషన్‌లో ఇంప్లీడ్ అయిన గత ప్రభుత్వం

చట్ట విరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేసినందుకు రెట్టింపు జరిమానా, జైలు



సాక్షి, అమరావతి: మార్గదర్శి ఫైనాన్సియర్స్ నిర్భీతిగా నిబంధనలను ఉల్లంఘించి ఆర్థిక దోపిడీకి పాల్పడినట్లు స్పష్టమైంది. మార్గదర్శి ఫైనాన్సియర్స్‌కు కూడా చైర్మన్‌గా వ్యవహరించిన ఈనాడు అధిపతి చెరుకూరి రామోజీరావు (ఇటీవల మరణించారు) ఆర్థిక నేరస్తుడని తేటతెల్లమైంది. చట్టానికి తాను అతీతమన్నట్టుగా దశాబ్దాలుగా ఆర్థిక ఉగ్రవాదానికి పాల్పడి భారీగా దోపిడీకి తెగించినట్లు నిగ్గు తేలింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి అక్రమ డిపాజిట్లు వసూలు చేసినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరోసారి విస్పష్టంగా ప్రకటించింది. ఈ మేరకు తాజాగా తెలంగాణ హైకోర్టుకు ఈ నెల 13న లిఖితపూర్వకంగా కౌంటర్‌లో నివేదించింది. ఈ నేపథ్యంలో మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్ల దందా పూర్వాపరాలివి.

ఆర్‌బీఐకి తెలియకుండానే...

హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) కింద మార్గదర్శి ఫైనాన్సియర్స్ ఏర్పాటైంది. ఈ హెచ్‌యూఎఫ్‌కు రామోజీరావు కర్త. డిపాజిట్లు వసూలు చేసేందుకు హెచ్‌యూఎఫ్‌లకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతివ్వదు. ఇక్కడ ఆసక్తికర విషయం ఏమిటంటే అసలు మార్గదర్శి ఫైనాన్సియర్స్ అనే సంస్థ ఉన్నట్లు రిజర్వ్ బ్యాంకుకే తెలియదు. ఎందుకంటే రిజర్వ్ బ్యాంకు అనుమతి లేకుండానే రామోజీరావు నేతృత్వంలోని మార్గదర్శి ఫైనాన్సియర్స్ తన కార్యకలాపాలను కొనసాగించింది. ఆర్‌బీఐ చట్ట నిబంధనలకు విరుద్ధంగా 2006 మార్చి నాటికి దాదాపు 2.75 లక్షల మంది డిపాజిటర్ల నుంచి రూ.2,610.38 కోట్లను డిపాజిట్లుగా సేకరించింది. ఇంత భారీ మొత్తాల్లో డిపాజిట్లు వసూలు చేసిన మార్గదర్శి అప్పట్లో ప్రతీ సంవత్సరం వందల కోట్ల రూపాయల్లో నష్టాలు చూపింది. 2000 మార్చి 30వ తేదీ నాటికి 619.25 కోట్లను డిపాజిట్ల రూపంలో వసూలు చేయగా, 2006 మార్చి 30 నాటికి వసూలు చేసిన డిపాజిట్ల మొత్తాన్ని రూ.2,610.38 కోట్లుగా చూపింది. ఇంత పెద్ద మొత్తంలో డిపాజిట్లు వసూలు చేసినప్పటికీ 2006 మార్చి నాటికి రూ.1,369.47 కోట్లను వృద్ధి చెందుతున్న నష్టాలుగా చూపింది. అంటే 50 శాతం డిపాజిటర్లకు డిపాజిట్లు చెల్లించలేని పరిస్థితికి మార్గదర్శి ఫైనాన్సియర్స్ చేరింది. డిపాజిటర్లకు వడ్డీలు, మెచ్యూరిటీ మొత్తాలు చెల్లించేందుకు మళ్లీ డిపాజిట్లు తీసుకోవడం మొదలు పెట్టింది. ఇలా మార్గదర్శి ఆర్థికంగా మనుగడ సాగించింది.

ఉండవల్లి ఫిర్యాదుతో కదిలిన మార్గదర్శి పునాదులు..

మార్గదర్శి ఫైనాన్సియర్స్ చట్ట ఉల్లంఘనలపై 2006లో అప్పటి కాంగ్రెస్ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఫిర్యాదు చేయడంతో ఈ అక్రమ డిపాజిట్ల కథ వెలుగులోకి వచ్చింది. ఉండవల్లి ఫిర్యాదును కేంద్ర ప్రభుత్వం ఆర్‌బీఐకి పంపింది. దీంతో ఆర్‌బీఐ మార్గదర్శి ఫైనాన్సియర్స్ వివరణ కోరింది. ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(ఎస్) హిందూ అవిభక్త కుటుంబం (హెచ్‌యూఎఫ్)కు వర్తించదని మార్గదర్శి ఆర్‌బీఐకి రాతపూర్వకంగా తెలిపింది. అందులో ఎక్కడా కూడా డిపాజిట్లు వసూలు చేయలేదని మాత్రం చెప్పలేదు. అంతేకాక 2006 సెప్టెంబర్ 16 నుంచి రూ.లక్ష అంతకన్నా తక్కువ మొత్తాలను డిపాజిట్లుగా స్వీకరించడాన్ని నిలిపేశామని ఆర్‌బీఐకి చెప్పింది. ఈ వివరాలను ఆర్‌బీఐ అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందని ఆర్‌బీఐ స్పష్టంగా చెప్పింది.

అక్రమాల నిగ్గు తేల్చే బాధ్యత రంగాచారికి

ఆర్‌బీఐ సూచన మేరకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా డిపాజిటర్ల ప్రయోజనాలను పరిరక్షించడంతోపాటు మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమాలను, అవకతవకలను నిగ్గు తేల్చి నివేదిక ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వ సలహాదారు (ఫైనాన్స్) ఎన్.రంగాచారిని నియమిస్తూ 2006 డిసెంబర్ 19న జీవో జారీ చేసింది. అలాగే మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై చట్ట ప్రకారం న్యాయస్థానాల్లో ఫిర్యాదు చేసేందుకు, తదనుగుణంగా చర్యలు తీసుకునేందుకు ఐపీఎస్ అధికారి టి.కృష్ణరాజును అధీకృత అధికారిగా నియమించింది. దీంతో ఉలిక్కిపడ్డ రామోజీరావు... మార్గదర్శి ఫైనాన్సియర్స్ ద్వారా అటు రంగాచారి, ఇటు కృష్ణరాజు నియామకాలను సవాలు చేస్తూ 2006లో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయించారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు వారి నియామకాలను రద్దు చేసేందుకు తిరస్కరిస్తూ మార్గదర్శి ఫైనాన్సియర్స్ పిటిషన్లను కొట్టేసింది.

బెడిసికొట్టిన 'పత్రికా స్వేచ్ఛ' పన్నాగం

పత్రికా స్వేచ్ఛ ముసుగులో ఈ కేసు నుంచి బయటపడేందుకు నాడు రామోజీరావు వేసిన ఎత్తుగడ బెడిసికొట్టింది. ఈనాడు పత్రికకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యతిరేకం కాబట్టే ఈ కేసు విషయంలో పట్టుబడుతోందని రామోజీరావు తరపున ప్రముఖ న్యాయవాదులు వినిపించిన వాదనలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ అంశానికి, అక్రమ డిపాజిట్లకు సంబంధం లేదని స్పష్టం చేసింది. ఈనాడు పత్రికకు వ్యతిరేకంగా ఉండొద్దని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదేశించలేమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఎన్నికలు ఉన్నందునే ఈ కేసుపై ఏపీ ప్రభుత్వం పట్టుబడుతోందన్న రామోజీ తరపు న్యాయవాదుల వాదనలతో అత్యున్నత న్యాయస్థానం ఏకీభవించలేదు. 'ఎన్నికలు ఉంటే ఈనాడుకు ఏమైంది? ఈనాడు ఏమీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు కదా..? ఈనాడు కేవలం ఓ పత్రికే కదా..! ఎన్నికలతో ఏం సంబంధం?' అని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. దీంతో ఉండవల్లి అరుణ్ కుమార్‌పై నెపాన్ని నెట్టివేసేందుకు రామోజీ తరపు న్యాయవాదులు విఫలయత్నం చేశారు.

మార్గదర్శి, రామోజీల ప్రాసిక్యూషన్ కోసం కృష్ణరాజు ఫిర్యాదు

చట్ట ఉల్లంఘనలకు పాల్పడినందుకు మార్గదర్శి ఫైనాన్సియర్స్, హెచ్‌యూఎఫ్ కర్త రామోజీరావులను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ అధీకృత అధికారి టి.కృష్ణరాజు 2008, జనవరి 23న నాంపల్లి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ ఫిర్యాదు (సీసీ నెంబర్ 540) దాఖలు చేశారు. ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(ఎస్)కు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడం నిషిద్ధమని, అయితే మార్గదర్శి ఫైనాన్సియర్స్ ఇందుకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించి నేరం చేసిందని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 58ఈ కింద శిక్షార్హమని తెలిపారు. ఈ ఫిర్యాదును కొట్టేయాలని కోరుతూ మార్గదర్శి 2008లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం, మార్గదర్శిపై కృష్ణరాజు దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టేసేందుకు నిరాకరించింది.

మార్గదర్శిపై చర్యల నిలిపివేతకు సుప్రీంకోర్టు తిరస్కృతి

కృష్ణరాజు దాఖలు చేసిన ఫిర్యాదులో రామోజీరావు 2010లో ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. ఫిర్యాదులో విచారణను సెక్షన్ 45(ఎస్)(1), 45(ఎస్)(2), 58బీ(5ఏ) రెడ్ విత్ సెక్షన్ 58(ఈ)లకే పరిమితం చేసేలా ఆదేశాలు ఇవ్వాలని నాంపల్లి కోర్టును కోరారు. ఈ అభ్యర్థనను నాంపల్లి కోర్టు తోసిపుచ్చుతూ **2011లో** ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులపై మార్గదర్శి, రామోజీ**రావు హై**కోర్టును ఆశ్రయించారు. హెచ్‌యూఎఫ్ అయిన మార్గ**దర్శి ఫై**నాన్సియర్స్ ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45ఎస్ పరిధిలోకి **రాదంటూ** వాదించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన **అప్పటి** న్యాయమూర్తి జస్టిస్ తెలప్రోలు రజనీ... మార్గదర్శిపై **కృష్ణరా**జు దాఖలు చేసిన ఫిర్యాదులో తదుపరి చర్యలన్నీ నిలి**పేస్తూ** 2011లో మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఆ తర్వాత **ఈ** వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. సుప్రీంకోర్టు నాం**పల్లి** కోర్టు ముందున్న ఫిర్యాదు (సీసీ 540)లో తదుపరి **చ**ర్యలను నిలిపేసేందుకు నిరాకరించింది. అలాగే హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను కొనసాగించేందుకు సైతం నిరాకరించింది.

ఉమ్మడి హైకోర్టుకు చివరి రోజు మార్గదర్శికి అనుకూలంగా తీర్పు...

ఆ తర్వాత 2019, జనవరి ఒకటో తేదీన ఉమ్మడి ఆంధ్ర**ప్రదేశ్** హైకోర్టు విభజన జరిగింది. అంటే 31.12.2018న **ఉమ్మ**డి హైకోర్టుకు చివరి రోజు. అందరూ విభజన పనుల్లో **నిమగ్న**మయ్యారు. అటు న్యాయవాదులు, ఇటు న్యాయమూ**ర్తులు అ**ందరూ భావోద్వేగ వాతావరణంలో ఉన్నారు. కేసుల **విచారణపై** ఎవరూ దృష్టి సారించలేని పరిస్థితి. ఇదే అదునుగా **భావించిన** రామోజీరావు నాంపల్లి కోర్టులో కృష్ణరాజు ఫిర్యాదును **కొట్టేయాల**ంటూ 2011లో దాఖలు చేసిన తన వ్యాజ్యాలను **2018, డి**సెంబర్ 31వ తేదీన విచారణకు తెప్పించారు. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ తెలప్రోలు రజనీ విచారణ జరిపారు. రామోజీరావు తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు విన్న జస్టిస్ రజనీ అదే రోజున... అంటే 2018, డిసెంబర్ 31న తీర్పు కూడా ఇచ్చేశారు. హెచ్‌యూఎఫ్ ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45ఎస్ పరిధిలోకి రాదని జస్టిస్ రజనీ తన తీర్పులో తేల్చేశారు. మార్గదర్శి, రామోజీరావులను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ నాంపల్లి కోర్టులో కృష్ణరాజు దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టేస్తూ తీర్పునిచ్చారు.

మార్గదర్శి, రామోజీరావులకు క్లీన్‌చిట్ ఇచ్చేసిన న్యాయమూర్తి...

డిపాజిట్ల సేకరణ విషయంలో మార్గదర్శి ఫైనాన్సియర్స్, రామోజీరావులకు అసలు ఎలాంటి దురుద్దేశాలు లేవంటూ న్యాయమూర్తి సర్టిఫికెట్ ఇచ్చేయడం ఈ తీర్పులో ఆసక్తికర విషయం. అంతేకాక డిపాజిట్లను తిరిగి చెల్లించే ప్రక్రియను మొదలుపెట్టారని చెప్పిన హైకోర్టు, పరోక్షంగా మార్గదర్శి, రామోజీరావు చట్ట విరుద్ధంగా డిపాజిట్లు సేకరించిన విషయాన్ని నిర్ధారించినట్లు అయింది. ఇంత పెద్ద కేసులో ఒకే రోజు విచారణ జరిపి తీర్పునివ్వడం విశేషం. అసలు ఈ కేసు విచారణకు వచ్చినట్లు గానీ, న్యాయమూర్తి ఈ విధంగా తీర్పునిచ్చినట్లు గానీ ఎవరూ గుర్తించలేదు. ఆ తర్వాత కొద్ది నెలలకు ఈ తీర్పు వెలుగు చూసింది. దీంతో మార్గదర్శి ఫైనాన్సియర్స్ కుంభకోణాన్ని బయటపెట్టిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అప్రమత్తమై హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2019లో ఇంప్లీడ్ అయింది.

యావజ్జీవ ఖైదు... రెండింతల జరిమానా

అక్రమ డిపాజిట్ల కేసులో నేరం నిరూపితమైతే భారీ జరిమానాతో పాటు ఆ సంస్థ బాధ్యులకు రెండేళ్ల నుంచి యావజ్జీవ జైలు శిక్ష వరకు పడే అవకాశం ఉందని ఈ ఏడాది ఏప్రిల్‌లో న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఆ సంస్థ చైర్మన్ రామోజీ ఇటీవల మృతిచెందారు. కానీ నేరం రుజువైతే నేరంగానే పరిగణిస్తారు. ఆ సంస్థ నిర్వాహకులు అందుకు బాధ్యత వహించక తప్పదు. ఇక సేకరించిన అక్రమ డిపాజిట్లు రూ.రూ.2,610.38కోట్లకు రెట్టింపు జరిమానా విధించే అవకాశం ఉంది.

రంగాచారి నివేదికలోని కీలక అంశాలు

- రంగాచారి విచారణకు రామోజీరావు, మార్గదర్శి ఎంతమాత్రం సహకరించలేదు. కార్యాలయాల్లో తనిఖీలకు అడ్డుపడ్డారు. కావాల్సిన డాక్యుమెంట్లు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెట్టారు. తమ పిటిషన్లు కోర్టుల ముందు పెండింగ్‌లో ఉన్నాయని, అందువల్ల డాక్యుమెంట్లు ఇచ్చేది లేదన్నారు. చివరకు ఆదాయపు పన్ను శాఖ ఇచ్చిన అన్నీ డాక్యుమెంట్లను పరిశీలించిన రంగాచారి 2007 ఫిబ్రవరి 19న తన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు.
- ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(ఎస్)కు విరుద్ధంగా మార్గదర్శి ఫైనాన్సియర్స్ డిపాజిట్లు సేకరించిందని రంగాచారి తేల్చారు.
- డిపాజిటర్లకు వడ్డీ చెల్లించే అలవాటే మార్గదర్శికి లేదని, ఒత్తిడి చేస్తేనే చెల్లిస్తుందంటూ ఓ డిపాజిటర్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్న విషయాన్ని రంగాచారి తన నివేదికలో పొందుపరిచారు.
- డిపాజిట్లను తిరిగి చెల్లించే స్థితిలో మార్గదర్శి ఫైనాన్సియర్స్ లేదని, దాని ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని ఆయన తన నివేదికలో పేర్కొన్నారు. మార్గదర్శి ఫైనాన్సియర్స్ తీవ్ర నష్టాల్లో ఉండటమే అందుకు కారణమని స్పష్టంచేశారు.
- రామోజీరావు తన అనుబంధ కంపెనీలకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ నిధులను మళ్లించడమే నష్టాలకు ప్రధాన కారణమని రంగాచారి తేల్చారు. క్రియాశీలకంగా లేని అనేక కంపెనీలకు మార్గదర్శి నిధులను బదలాయించినట్లు వారు సమర్పించిన డాక్యుమెంట్లే స్పష్టంగా చెబుతున్నాయని పేర్కొన్నారు.
- రామోజీ గ్రూపులోని ఇతర కంపెనీల్లో కూడా ఇలాగే ఒక గ్రూపు నిధులను మరో గ్రూపునకు బదలాయించడం జరిగిందని పేర్కొన్నారు.
- 2000, ఆ తర్వాత సంవత్సరాల్లోని బ్యాలెన్స్ షీట్‌లను గమనిస్తే మార్గదర్శి ఫైనాన్సియర్స్‌లో రామోజీ ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టలేదని, మొత్తం ప్రజల నుంచి వసూలు చేసిన డిపాజిట్లతోనే మార్గదర్శిని నడిపారని తెలిపారు.
- ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ తప్ప మిగిలిన అన్నీ కంపెనీలు నష్టాల్లో ఉన్నట్లు బ్యాలెన్స్ షీట్ల పరిశీలన ద్వారా తెలిసిందని రంగాచారి తన నివేదికలో వివరించారు.

క్లుప్తంగా...

రాష్ట్ర కేబినెట్ భేటీ 28కి వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్ర కేబినెట్ సమావేశం ఈ నెల 27వ తేదీ నుంచి 28వ తేదీకి వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు అధ్యక్షతన సచివాలయం మొదటి బ్లాక్‌లో కేబినెట్ సమావేశం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ సమావేశానికి ప్రతిపాదించాల్సిన అంశాలను ఈ నెల 23వ తేదీ సాయంత్రం 4 గంటల కల్లా సాధారణ పరిపాలన శాఖ (కేబినెట్ విభాగం)కు పంపాల్సిందిగా అన్ని శాఖలకు సీఎస్ స్పష్టం చేశారు.

పోలవరం పూర్తికి 2029 వరకూ సమయం ఉంది

మంత్రి నిమ్మల రామానాయుడు



సాక్షి, న్యూఢిల్లీ: ఓ పక్క పోలవరం ప్రాజెక్టుపై తమ ప్రభుత్వానికి ఎంతో చిత్తశుద్ధి ఉందంటూనే మరో పక్క పనుల పూర్తికి 2029 వరకూ తమకు సమయం ఉందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ప్రజలు 2029 వరకు తమకు మ్యాండేట్ ఇచ్చారని, అప్పటిలోగా పూర్తి చేయాలన్న యోచనతో చంద్రబాబు సర్కారు ఉందని తెలిపారు. ఆయన శనివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. 2019 వరకు టీడీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా చేసిందని, ఆ తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన రివర్స్ టెండరింగ్ వల్లే ఆలస్యం అవుతోందని అన్నారు. ప్రాజెక్టుపై హైదరాబాద్ ఐఐటీ నిపుణులు ఇచ్చిన నివేదిక వాస్తవమా కాదా వైఎస్సార్‌సీపీ నేతలు చెప్పాలని అన్నారు. నదీ ప్రవాహాన్ని పూర్తి స్థాయిలో మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేయకపోవడం వల్ల 2017, 2018లో గోదావరి ప్రవాహం డయాఫ్రం వాల్ మీదుగా ప్రవహించి దెబ్బతినడానికి కారణమైందని సీడబ్ల్యూసీకి అంతర్జాతీయ నిపుణులు ఇచ్చింది కేవలం డ్రాఫ్ట్ నివేదిక మాత్రమేనని, ఫైనల్ రిపోర్టు కాదని కొట్టిపారేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పనులు ఏమీ చేయలేదని, నిధులు దారి మళ్లించారని అంటూనే ఐదేళ్లలో రూ.4,167 కోట్ల పనులు చేశారని చెప్పడం గమనార్హం.

ఐఏఎస్, ఐపీఎస్‌లకు వెంటనే పోస్టింగ్ ఇవ్వాలి

ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌బాబు


సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సివిల్స్ సర్వీస్ అధికారులను ప్రభుత్వం రెండు నెలలుగా ఖాళీగా కూర్చోబెట్టడం సరికాదన్నారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకుని వారి సేవలు వినియోగించుకోవాలని కోరారు. అధికారులు గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి ఉంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు చాలా అంచనాలతో ఉన్నారని, ఐఏఎస్, ఐపీఎస్‌లను పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం మంచి పద్ధతి కాదని సురేష్ బాబు స్పష్టం చేశారు.

మిగులు టీచర్లను ఎయిడెడ్‌కు సర్దుబాటు చేయండి



సాక్షి, అమరావతి: పని సర్దుబాటు ప్రక్రియలో భాగంగా మిగిలిపోయిన టీచర్లను ఎయిడెడ్ పాఠశాలలకు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, ఎల్కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిని శనివారం ఓ ప్రకటనలో కోరారు. ముందుగా ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, మండల పరిషత్ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా గిరిజన, ఎయిడెడ్ స్కూళ్లో అవసరమైన చోట సబ్జెక్టు టీచర్లను, పీఈటీలను ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎయిడెడ్ ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువున్నచోట రెండో టీచర్‌ను ప్రభుత్వ పాఠశాలల నుంచి కేటాయించాలని కోరారు.

వైద్య విద్యార్థినిపై హత్యాచార దోషులను శిక్షించాలి: సీపీఎం



సాక్షి, అమరావతి: కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై అఘాయిత్యం, హత్యకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందుకు నిరసనగా జరుగుతున్న డాక్టర్ల సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఏపీలోనూ డాక్టర్లకు ప్రత్యేకించి మహిళా డాక్టర్లు, నర్సులు, ఇతర మహిళా స్టాఫ్ భద్రతకు చర్యలు తీసుకోవాలని సీపీఎం విజ్ఞప్తి చేసింది. సీపీఎం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పూర్వ కార్యదర్శివర్గ సభ్యుడు, రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వలవల శ్రీరామ్మూర్తి (90) శుక్రవారం కన్నుమూశారు. ఆయన మరణానికి రాష్ట్ర కమిటీ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేసింది.

ఖాతాలు ఖాళీ చేస్తున్నారు!

2023-24లో దేశవ్యాప్తంగా 2.90 లక్షల ఆన్‌లైన్ ఆర్థిక నేరాలు



దేశంలో ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. కార్డు, డిజిటల్ చెల్లింపులను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. దేశంలో 2016లో పెద్దనోట్లు రద్దు చేసిన అనంతరం వచ్చిన మార్పుల్లో భాగంగా కార్డు చెల్లింపులు, డిజిటల్ చెల్లింపులు భారీగా పెరుగుతున్నాయి. అందుకు తగ్గట్టుగానే దేశంలో ఆన్‌లైన్ ఆర్థిక నేరాలు కూడా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఏకంగా రోజుకు సగటున 800 ఆన్‌లైన్ ఆర్థిక మోసాల కేసులు నమోదైనట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నివేదిక వెల్లడించింది. సుమారు రూ.2,110 కోట్లను సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టినట్లు తెలిపింది. - సాక్షి, అమరావతి

ఆర్‌బీఐ నివేదికలోని ప్రధాన అంశాలు

- 2023-24లో దేశంలో 2.90 లక్షల ఆన్‌లైన్ ఆర్థిక నేరాల కేసులు నమోదయ్యాయి. అంటే రోజుకు సగటున 800 కేసులు నమోదు కావడం గమనార్హం.
- రూ.లక్షకు పైగా కొల్లగొట్టిన కేసులు 29,082 నమోదయ్యాయి. మిగిలిన కేసులతో కలిపి 2023-24లో మొత్తం మీద 2.90లక్షల ఆన్‌లైన్ ఆర్థిక మోసాలకు పాల్పడ్డారు.
- 2016 తర్వాత ఆన్‌లైన్ ఆర్థిక నేరాల్లో గత ఆర్థిక సంవత్సరంలోనే అత్యధికంగా కేసులు నమోదయ్యాయి.
- ఆన్‌లైన్ ఆర్థిక మోసాల ద్వారా సైబర్ నేరాల ముఠాలు భారీస్థాయిలో మోసాలకు పాల్పడుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.2,110 కోట్లు కొల్లగొట్టాయి. వాటిలో రూ.లక్ష కంటే ఎక్కువ ఉన్న కేసుల్లో మొత్తం రూ.1,457 కోట్లు స్వాహా చేశారు. రూ.లక్ష కంటే తక్కువ కొల్లగొట్టిన కేసుల్లో మొత్తం రూ.653 కోట్లు దోచుకున్నారు.

అధిక మోసాలు ఈ రూపాల్లోనే

- బ్యాంకు ఖాతాదారులు సైబర్ ముఠాల మాటలు నమ్మి తమ ఓటీపీ, ఇతర వివరాలను వారికి తెలియజేయడం వల్లే అధికంగా ఆర్థిక మోసాలు జరుగుతున్నాయి.
- ఖాతాదారులు బోగస్ ఈ-కామర్స్ సైట్లకు నిధులు బదిలీ చేయడం ద్వారా పాల్పడుతున్న మోసాలు రెండో స్థానంలో ఉన్నాయి.
- బ్యాంకు ఖాతాలను హ్యాకింగ్/బ్రీచ్ ద్వారా పాల్పడుతున్న నేరాలు మూడో స్థానంలో ఉన్నాయి.
- బ్యాంకు ఖాతాదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ఆధార్, పాన్ కార్డ్, ఓటీపీ వివరాలను ఇతరులకు తెలియజేయకూడదని ఆర్‌బీఐ స్పష్టంగా పేర్కొంది. తమ వివరాలను ఇతరులకు వెల్లడించడం ద్వారాగానీ, అనధికారిక లావాదేవీలతో సంభవించే ఆర్థిక మోసాలకు బ్యాంకులు బాధ్యత వహించవని, దీనిపై 2017లోనే నిబంధనలు రూపొందించామని గుర్తుచేసింది.

'కెన్-బెట్వా'లానే పోలవరం పరుగెత్తేది

- నిర్మాణ బాధ్యతలు కేంద్రం చేపట్టి ఉంటే అదీ పరిస్థితి
- అలా జరగనందుకే జాప్యం అంటున్న అధికారులు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం పోలవరం నిర్మాణ బాధ్యతలను కేంద్రం చేపట్టి ఉంటే.. ఈ పాటికి ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేదని నీటి పారుదల రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇందుకు కేంద్రం శరవేగంగా పూర్తి చేస్తున్న కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టే ఉదాహరణ అని అధికార వర్గాలు సైతం ఉదహరిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం 2022-23, 2023-24లో రూ.9,105.01 కోట్లు ఖర్చు చేసిన కేంద్రం.. 2024-25 బడ్జెట్‌లో రూ.4000 కోట్లు కేటాయించి.. 2030 నాటికి పూర్తి చేసేలా శరవేగంగా అడుగులు వేస్తోంది. అంటే.. కెన్-బెట్వా అనుసంధానం ప్రాజెక్టుకు ఏడాదికి సగటున రూ.4,552.50 కోట్లు ఖర్చు చేసినట్లు స్పష్టమవుతోంది. పోలవరం ప్రాజెక్టు పనులకు కేంద్రం 2014-15 నుంచి ఇప్పటి వరకు పదేళ్లలో రూ.15,146.27 కోట్లు విడుదల చేసింది. అంటే.. ఏడాదికి కేవలం రూ.1,514.62 కోట్లు మాత్రమే ఇచ్చింది. కమీషన్ల కక్కుర్తితో నిర్మాణ ప్రోటోకాల్‌ను తుంగలో తొక్కిన చంద్రబాబు.. ఇష్టారాజ్యంగా పనులు చేపట్టడంతో పోలవరం ప్రాజెక్టులో విధ్వంసం చోటుచేసుకుంది. అంతర్జాతీయ నిపుణుల కమిటీ కూడా ఇదే అంశాన్ని స్పష్టం చేసింది. ఓ వైపు విధ్వంసం.. మరో వైపు నిధుల సమస్యతో ఈ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. పోలవరాన్ని ఎప్పుడు పూర్తి చేస్తామో చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నామని సీఎం చంద్రబాబు చెప్పడమే ఇందుకు నిదర్శనం. ఈ పాపమంతా ఆయనదేనని నీటి పారుదల రంగ నిపుణులు, అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కెన్-బెట్వా లింక్ ప్రాజెక్టు ఇలా

కెన్-బెట్వా నదుల్లోని మిగులు జలాలను మళ్లించి మధ్యప్రదేశ్‌లో 8.11 లక్షల హెక్టార్లు, ఉత్తరప్రదేశ్‌లో 2.51 లక్షల హెక్టార్లు వెరసి 10.62 లక్షల హెక్టార్లకు సాగునీరు, 62 లక్షల మందికి తాగునీరు (మధ్యప్రదేశ్‌లో 41 లక్షలు, ఉత్తరప్రదేశ్‌లో 21 లక్షలు) అందించేలా ఎన్‌డబ్ల్యూడీఏ (జాతీయ జల వనరుల అభివృద్ధి సంస్థ) అనుసంధానం ప్రాజెక్టును ప్రతిపాదించింది. కేంద్రప్రభుత్వ సారథ్యంలో అనుసంధాన పనులు చేపట్టడానికి అంగీకరిస్తూ 2021 మార్చి 22న మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ ప్రాజెక్టుకు అయ్యే వ్యయంలో 90 శాతం కేంద్రం, పది శాతం(ఆయకట్టు, తాగునీరు ఆధారంగా దామాషా పద్ధతిలో) రాష్ట్రాలు భరించేలా ఒప్పందం కుదిరింది. ప్రాజెక్టు అంచనా వ్యయం 2021 డిసెంబర్ ధరల ప్రకారం రూ.44,605 కోట్లు. ఇందులో కేంద్రం వాటా రూ.39,317 కోట్లు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌ల వాటా రూ.5,293 కోట్లు. ప్రాజెక్టు నిర్మాణ పనుల కోసం 2022 ఫిబ్రవరి 11న స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ)గా కెన్-బెట్వా లింక్ ప్రాజెక్టు అథారిటీ (కేబీఎల్‌పీఏ)ని కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ అథారిటీ సారథ్యంలో పనులు చేపట్టింది. 2022-23, 2023-24లో ప్రాజెక్టు పనుల కోసం రూ.9,105.01 కోట్లు ఖర్చు చేసింది. 2024-25 బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు కేటాయించింది. 2030 నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి, ఆయకట్టుకు నీళ్లందించేలా పనులను వేగవంతం చేసింది. నదుల అనుసంధానంలో ఇదే మొదటి ప్రాజెక్టు.

కమీషన్ల కోసం చట్టాన్ని తుంగలో తొక్కిన వైనం

రాష్ట్ర విభజన నేపథ్యంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్రం.. వంద శాతం వ్యయాన్ని భరించి తామే పూర్తి చేస్తామని విభజన చట్టం సెక్షన్-90లో స్పష్టంగా పేర్కొంది. ఆ చట్ట ప్రకారం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఎస్పీవీగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)ని 2014 మే 28న ఏర్పాటు చేసింది. పీపీఏతో ఒప్పందం చేసుకుంటే ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. కానీ.. 2014 జూన్ 8 నుంచే కమీషన్ల కక్కుర్తితో ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్రానికే అప్పగించాలని సీఎం చంద్రబాబు కేంద్రాన్ని కోరుతూ వచ్చారు. చివరకు ప్రత్యేక హోదాను కూడా తాకట్టు పెట్టేందుకు అంగీకరించడంతో 2016 సెప్టెంబరు 7న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను కేంద్రం.. రాష్ట్రానికి అప్పగించింది. ఈ క్రమంలో 2013-14 ధరల ప్రకారం 2014 ఏప్రిల్ 1 నాటికి నీటి పారుదల విభాగం పనుల్లో మిగిలిన పనులకు అయ్యే వ్యయం రూ.15,667.90 కోట్లు మాత్రమే ఇస్తామని కేంద్రం చెప్పినదానికీ చంద్రబాబు తలూపారు. ప్రాజెక్టు పనులకు తొలుత రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తే.. ఆ తర్వాత రీయింబర్స్ చేస్తామని కేంద్రం పెట్టిన షరతుకూ అంగీకరించారు. ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను దక్కించుకున్న చంద్రబాబు.. కమీషన్ల కోసం ప్రాజెక్టు నిర్మాణ ప్రోటోకాల్‌ను తుంగలో తొక్కారు. గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే ను పునాది స్థాయిలోనే వదిలేసి.. ప్రధాన డ్యామ్ పునాది డయా ఫ్రమ్ వాల్ పూర్తి చేసి చంద్రబాబు చారిత్రక తప్పిదం చేశారు. ఇది చాలదన్నట్టు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ పనులు చేపట్టి.. వాటిని పూర్తి చేయలేక ఇరు వైపులా ఖాళీ ప్రదేశాలు వదిలేసి చేతులెత్తేశారు. దాంతో.. 2019, 2020లో గోదావరికి వచ్చిన భారీ వరదలు కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉధృతితో ప్రవహించడం వల్ల డయా ఫ్రమ్ వాల్ కోతకు గురై దెబ్బతింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై భారీ అగాధాలు ఏర్పడ్డాయి. ఈ విధ్వంసానికి చంద్రబాబు సర్కార్‌దే పాపమని అంతర్జాతీయ నిపుణుల కమిటీ తేల్చి చెబుతూ ఈ నెల 12న సీడబ్ల్యూసీ, పీపీఏకు నివేదిక ఇచ్చింది. ఈ విధ్వంసం వల్లే పోలవరం పనుల్లో జాప్యం చోటు చేసుకుంటోంది. ప్రాజెక్టు నిర్మాణానికి 2014 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.16,761.74 కోట్లు ఖర్చు చేస్తే.. కేంద్రం రూ.15,146.27 కోట్లు రీయింబర్స్ చేసింది. మరో రూ.1615.47 కోట్లు రీయింబర్స్ చేయాల్సి ఉంది.

జీవనాడిని గాడిలో పెట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

కమీషన్ల కక్కుర్తితో పోలవరం పనుల్లో చంద్రబాబు చేసిన తప్పులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సరిదిద్దుతూ ప్రాజెక్టును గాడిలో పెట్టింది. కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ స్పిల్ వే, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్, అప్రోచ్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి.. 2021 జూన్ 11నే స్పిల్ వే మీదుగా 6.1 కిలోమీటర్ల పొడవున గోదావరి ప్రవాహాన్ని మళ్లించి వైఎస్ జగన్ రికార్డు సృష్టించారు. ప్రధాన డ్యామ్ గ్యాప్-1లో పునాది డయా ఫ్రమ్ వాల్, గ్యాప్-3లో కాంక్రీట్ డ్యామ్.. జలాశయాన్ని కుడి, ఎడమ కాలువలతో అనుసంధానం చేసే కనెక్టివిటీస్, ఎడమ కాలువలో వరాహ అక్విడెక్టు సహా కీలకమైన పనులు పూర్తి చేశారు. దెబ్బతిన్న డయా ఫ్రమ్ వాల్ భవితవ్యాన్ని తేల్చితే ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేస్తామంటూ 2022 డిసెంబర్ నుంచి కేంద్రాన్ని కోరుతూ వచ్చారు. ప్రాజెక్టు భూసేకరణ, నిర్వాసితుల పునరావాసానికే రూ.33 వేల కోట్లు వ్యయం అవుతుందని.. ఈ నేపథ్యంలో 2013-14 ధరల ప్రకారం రూ.15,667.90 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేయడం అసాధ్యమని వైఎస్ జగన్ చెప్పిన వాస్తవాలతో ప్రధాని మోదీ ఏకీభవించారు. తాజా ధరల మేరకు ప్రాజెక్టుకు నిధులు ఇచ్చేలా వైఎస్ జగన్ కేంద్రాన్ని ఒప్పించి నిధుల సమస్యను తప్పించారు. వైఎస్ జగన్.. వరద ప్రవాహాన్ని మళ్లించే పనులతోపాటు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేసిన నేపథ్యంలో ప్రధాన డ్యామ్ గ్యాప్-2లో డయా ఫ్రమ్ వాల్‌తో పాటు ప్రధాన డ్యామ్ పనులు చేపట్టడానికి ఎలాంటి ఆటంకాలు ఉండవు. చంద్రబాబు చారిత్రక తప్పిదానికి పాల్పడకుండా, విధ్వంసం సృష్టించకుండా ఉండి ఉంటే.. 2022 డిసెంబర్ నాటికే పోలవరాన్ని వైఎస్ జగన్ పూర్తి చేసి ఉండే వారని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

చంద్రబాబూ.. తప్పు ఒప్పుకో

- మీ బండారం బయట పెట్టిన అంతర్జాతీయ నిపుణుల కమిటీ
- మాజీ మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు చేసిన తప్పులను ఇప్పటికైనా ఒప్పుకుని, తక్షణమే ప్రజలకు క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు పనుల్లో జాప్యానికి, తప్పులు జరగటానికి కారణం చంద్రబాబేనని అంతర్జాతీయ నిపుణుల కమిటీ వెల్లడించిందని ఆయన స్పష్టం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు తప్పిదం, అవినీతి, అవగాహన రాహిత్యం వల్లే డయా ఫ్రమ్ వాల్ కొట్టుకుపోయింది. ఆ నేపథ్యంలో గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్.. అప్పటి కేంద్ర మంత్రితో మాట్లాడి, అంతర్జాతీయ ఎక్స్‌పర్ట్ ప్యానల్ తయారు చేశారు. అందులో ఇద్దరు కెనెడా, మరో ఇద్దరు అమెరికన్లు. ఆ నిపుణుల కమిటీ ఈనెల 12న కేంద్ర జల సంఘాని(సీడబ్ల్యూసీ)కి నివేదిక ఇచ్చింది' అని అంబటి వివరించారు. అంబటి ఇంకా ఏమన్నారంటే..

- పోలవరం ప్రాజెక్టు పనుల్లో చంద్రబాబు నిర్ణయాలన్నీ తప్పు. అయినా చంద్రబాబు తన ఎల్లో మీడియా ద్వారా అదే పనిగా గోబెల్స్ ప్రచారం చేశారు. జగన్ ప్రభుత్వంపై బురద చల్లాలని చూశారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ప్రాజెక్టు పనులన్నీ గాడిలో పడ్డాయి.
- బాబు హయాంలో ఏక కాలంలో కాఫర్ డ్యామ్, ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ పనులు ప్రారంభించారు. ఇది పెద్ద తప్పిదం. డయా ఫ్రమ్ వాల్ దెబ్బతిన్నా, దానిపైనే కాఫర్ డ్యామ్ నిర్మించారు. దీంతో ఇప్పుడు సీపేజ్ (ఊటనీరు) వస్తోంది. జెట్ గ్రౌటింగ్ వాల్ 200 నుంచి 260 మీటర్ల మధ్య దెబ్బతిన్నా పట్టించుకోలేదు. వీటన్నింటినీ అంతర్జాతీయ నిపుణుల కమిటీ ఎత్తిచూపింది.

రేపటి నుంచి ఉద్యోగుల బదిలీలు

▶ మొదటి పేజీ తరువాయి

వితంతువులైన మహిళా ఉద్యోగులు, దృష్టి లోపం గల ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది.

బదిలీలు జరిగే శాఖలు

- రెవెన్యూ (భూపరిపాలన), సెర్ప్‌తో సహా పంచాయత్ రాజ్ - గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్, గ్రామ, వార్డు సచివాలయాలు, పౌర సరఫరాలు, మైనింగ్- జియాలజీ, అన్ని విభాగాలలో ఇంజనీరింగ్ సిబ్బంది, దేవదాయ, రవాణా, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక, పరిశ్రమలు, ఇంధన, స్టాంపులు-రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్.

ఏజెన్సీ ప్రాంతాల్లో ఖాళీలను ముందు భర్తీ చేయాలి

నోటిఫైడ్ ఏజెన్సీ ప్రాంతాల్లోని అన్ని ఖాళీ పోస్టులను ముందుగా భర్తీ చేయాలి. ఐటీడీఏ ప్రాంతాలతో పాటు వెనుకబడిన ప్రాంతాల్లో పోస్టుల భర్తీకి శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లు ప్రాధాన్యత నివ్వాలి. నిబంధనల ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో రెండేళ్లు పూర్తి చేసిన ఉద్యోగులు కోరిన చోటుకు బదిలీ చేసేందుకు ప్రాధాన్యతనివ్వాలి. ఐటీడీఏ పరిధిలో బదిలీ చేసే ఉద్యోగులు 50 ఏళ్ల లోపు ఉండాలి. ఐటీడీఏ పరిధిలో గతంలో పనిచేయని ఉద్యోగులను బదిలీ చేయాలి. ఐటీడీఏ పరిధిలో బదిలీ చేసిన ఉద్యోగుల స్థానంలో ప్రత్యామ్నాయం లేకుండా రిలీవ్ చేయడానికి వీల్లేదు.

బదిలీ దరఖాస్తుల పరిశీలనకు అంతర్గత కమిటీలు

ప్రభుత్వ మార్గదర్శకాలు, షరతులకు అనుగుణంగా సంబంధిత అధికారులు బదిలీలను అమలు చేయాలి. జిల్లా, జోనల్, బహుళ జోనల్‌తో పాటు రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలి. ప్రాధాన్యతల విషయంలో దుర్వినియోగం జరగకుండా సంబంధిత శాఖల అంతర్గత కమిటీలు దరఖాస్తులను పరిశీలించి, తగిన సిఫార్సులు చేయాలి. ఎటువంటి ఫిర్యాదులు, ఆరోపణలకు అవకాశం లేకుండా పారదర్శకంగా గడువులోగా బదిలీల ప్రక్రియను సంబంధిత శాఖాధిపతులు పూర్తి చేయాలి. ఉద్యోగ సంఘాల ప్రతినిధుల బదిలీల విషయంలో నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలి.

ఈ వర్గాలకు బదిలీల్లో ప్రాధాన్యత

- దృష్టి లోపం ఉన్న ఉద్యోగులు, మానసిక వికలాంగ పిల్లలను కలిగి ఉన్న ఉద్యోగులు సంబంధిత వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్న చోటుకి బదిలీ చేయాలని కోరేవారు
- గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా పనిచేసిన ఉద్యోగులు
- 40 శాతంకన్నా ఎక్కువ వైకల్యం గల ఉద్యోగులు
- క్యాన్సర్, ఓపెన్ హార్ట్ ఆపరేషన్స్, న్యూరో సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ మొదలైన దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా అటువంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్న స్టేషన్లకు బదిలీలు కోరుకునే ఉద్యోగులు (స్వయం లేదా జీవిత భాగస్వామి లేదా ఆధారపడిన పిల్లల వైద్యం కోసం)
- భార్య, భర్త ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు అయితే, వారిద్దరినీ ఒకే స్టేషన్‌లో లేదా ఒకరికొకరు సమీపంలో ఉన్న స్టేషన్‌లలో ఉండేలా బదిలీకి ప్రయత్నించాలి.

ఈ మార్గదర్శకాల ప్రకారం జరిగే అన్ని బదిలీలు, ప్రాధాన్య స్టేషన్ల ఎంపికను వినియోగించుకున్న ఉద్యోగుల బదిలీలను అభ్యర్థన బదిలీలుగా పరిగణిస్తారు.

రూ.100 కోట్ల ఆస్తి.. సర్కారు స్పందన నాస్తి!

ఆదేశాలివ్వడానికి ముందుకు రాని రాష్ట్ర ప్రభుత్వం

- కార్పొరేషన్ స్థలంతో చిన్మయ విద్యాసంస్థల వ్యాపారం
- కోర్టును ఆశ్రయించిన డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు
- కార్పొరేషన్‌కు అనుకూలంగా న్యాయస్థానం తీర్పు
- జీవో రద్దు కోరిన కమిషనర్... స్పందించని సర్కార్
- శాశ్వత స్వాధీనానికి పావులు కదుపుతున్న యాజమాన్యం



చిన్మయ విద్యాసంస్థల కోసం లీజుకు తీసుకున్న కార్పొరేషన్ స్థలం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: సుమారు రూ.వంద కోట్లకుపైగా విలువ చేసే ఆస్తిని కార్పొరేషన్ కాపాడుకుంటుందా? దీనికి ప్రస్తుత ప్రభుత్వం సహకరిస్తుందా.. అనేది ప్రశ్నార్థకంగా మారింది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సుమారు వందకుపైగా మున్సిపల్ స్కూళ్లలో 20 వేల మందికిపైగా చదువుతున్నారు. వీరంతా ఇరుకు గదుల్లో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో కాసు సాయమ్మ స్కూల్‌ను దేవాదాయ శాఖ స్థలంలో నిర్వహిస్తూ.. దానికి రూ.2.25 కోట్లు చెల్లించలేదని మున్సిపల్ కమిషనర్‌కు నెల రోజుల జైలు శిక్ష కూడా పడింది. మరోవైపు రూ.వందల కోట్ల విలువ చేసే స్థలాలను ఉచితంగా కేటాయించి.. కనీసం ఆస్తి పన్ను కూడా కట్టించుకోలేని దుస్థితిలో కార్పొరేషన్ ఉంది.

కార్పొరేషన్ ఆదాయానికి గండి

ఇంత చేస్తున్నా కార్పొరేషన్‌కు చిల్లిగవ్వ కూడా చెల్లించలేదు. 1981 నుంచి స్థలం పన్ను, ఆస్తి పన్ను వడ్డీ లేకుండా చెల్లిస్తేనే కనీసం రూ.39 కోట్ల వరకు కార్పొరేషన్‌కు చెల్లించాల్సి ఉంది.


కార్పొరేషన్ స్థలంలోని కళ్యాణ మండపం

మున్సిపల్ అధికారులు కనీసం ఆస్తిపన్ను వసూలుకు ప్రయత్నం కూడా చేయలేదు. సేవ పేరుతో వ్యాపారం చేస్తున్న విషయాన్ని స్థానిక ఎస్‌వీఎన్ కాలనీ అసోసియేషన్ నాయకులు 2013లోనే ఫిర్యాదు చేశారు. ఈ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకోవాలని అప్పటి జిల్లా మంత్రికి వినతిపత్రం ఇవ్వడంతో ఆయన విద్యాసంస్థను స్వాధీనం చేసుకోవాలని కమిషనర్‌కు లేఖ రాశారు. దీంతో 2015లో కార్పొరేషన్ ఆ సంస్థకు నోటీసులు ఇచ్చింది. దీంతోపై హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకుంది. 2015 -22 వరకు నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ ఈ స్థలాన్ని కాపాడే ప్రయత్నం చేయలేదు. కౌంటర్ కూడా దాఖలు కాలేదు. కొత్త కౌన్సిల్ రావడంతో డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు ఈ అంశాన్ని కౌన్సిల్‌లో ప్రస్తావించారు. తర్వాత ఆయనే స్వయంగా కోర్టును ఆశ్రయించారు. ప్రత్యేకంగా న్యాయవాదిని నియమించి కోర్టులో వాదించేలా చూశారు. దీంతో గత ఏడాది డిసెంబర్ 26న కోర్టు ఆదేశాలు ఇచ్చింది. మున్సిపల్ కమిషనర్ విద్యాసంస్థ వారిని పిలిచి మాట్లాడి వాదనలు విన్న తర్వాత నెల రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని కోర్టు చెప్పింది. ఇది జరిగి ఎనిమిది నెలలైంది. గత నెలలో మున్సిపల్ కమిషనర్ ఆ సంస్థకు స్థలం కేటాయిస్తూ ఇచ్చిన జీవోను రద్దు చేయాలని కోరుతూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ సెక్రటరీకి లేఖ కూడా రాశారు. అక్కడి నుంచి వివరాల కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఫైల్ వచ్చినట్లు తెలిసింది. తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉండే యాజమాన్యం ఈ భూమిని దక్కించుకునేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం రావడంతో కార్పొరేషన్‌కు ఈ భూమి దక్కుతుందా.. లేదా.. అనే అనుమానం మొదలైంది. కోర్టు ఆదేశాలను వెంటనే అమలు చేయాలని, రూ. వంద కోట్లకుపైగా విలువైన కార్పొరేషన్ ఆస్తిని కాపాడాలని డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు డిమాండ్ చేశారు.

సేవల కోసం లీజుకు తీసుకుని..

సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ట్రస్ట్ పేరుతో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తామని చెప్పడంతో గుంటూరు నగరంలోని అత్యంత విలువైన ప్రాంతమైన ఎస్వీఎన్ కాలనీలో 1981లో చిన్మయ ట్రస్ట్‌కు నగరపాలక సంస్థ భూమిని కేటాయించింది. ఆ 3 ఎకరాల 31 సెంట్ల స్థలం విలువ ఇప్పుడు రూ.వంద కోట్లకుపైనే ఉంది. పేద విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పకపోగా ప్రతి విద్యార్థి నుంచి ఫీజుల రూపంలో ఏడాదికి రూ.30 వేల వరకు ఇక్కడ వసూలు చేస్తున్నారు. లీజుకు తీసుకున్న ఏడాదిలోగా స్కూల్ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, 1991లో ప్రారంభించారు. స్కూల్ ప్రాంగణంలో ఒక కళ్యాణ మండపాన్ని నిర్మించి ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చారు. గద్దె ఉమామహేశ్వరరావు పేరు పెట్టడానికి ఆయన సతీమణి నుంచి రూ.1.50 కోట్లను విరాళంగా తీసుకున్నారు. క్రికెట్ నెట్స్ ఏర్పాటు చేసి అక్కడా వ్యాపారం చేశారు. ఇక్కడ హోంసైన్స్ పేరుతో కాలేజీ నిర్మాణం చేపట్టారు.



“దుష్టుల ఆలోచన చొప్పున నడువక, పాపుల మార్గమున నిలువక యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు, దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు.
– క్రైస్తవ ధర్మం

మార్గదర్శి అక్రమాల పునాదికి ఈనాడు కవచం

తన ఆర్థిక అక్రమాలు బట్టబయలుతో రామోజీ బెంబేలు

నాడు వైఎస్సార్‌పై... నేడు జగన్‌పై ఈనాడు దుష్ప్రచారం

ప్రజల్ని మభ్యపెట్టేందుకు పుంఖానుపుంఖాలుగా కట్టుకథలు

తాజాగా ఆర్‌బీఐ నివేదిక సాక్షిగా రామోజీ మోసాలు బట్టబయలు

18 ఏళ్లు నెట్టుకొచ్చారు

6.11.2006: మార్గదర్శి ఫైనాన్సియర్స్, రామోజీరావులపై చర్యలు కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండవల్లి ఫిర్యాదు.

13.11.2006: ఉండవల్లి ఫిర్యాదును కేంద్ర ప్రభుత్వం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు పంపింది. ఆర్‌బీఐ మార్గదర్శి వివరణ కోరింది.

30.11.2006: తాము సెక్షన్ 45ఎస్ పరిధిలోకి రామన్న మార్గదర్శి. ఇకపై డిపాజిట్లు వసూలు చేయవద్దని మార్గదర్శికి ఆర్‌బీఐ ఆదేశం.

19.12.2006: మార్గదర్శి ఫైనాన్సియర్స్‌కు సంబంధించిన సమాచారం, డాక్యుమెంట్లు ఇవ్వాలంటూ ఆర్‌బీఐకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ.

19.12.2006: వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు ఎస్.రంగాచారిని నియమిస్తూ జీవో నంబర్ 801 జారీ. మార్గదర్శి అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు అధీకృత అధికారిగా టి.కృష్ణరాజు నియామకం జీవో 800 జారీ.

27.12.2006: రంగాచారి, కృష్ణరాజుల నియామకాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో మార్గదర్శి, రామోజీరావు పిటిషన్.

29.12.2006: మార్గదర్శిపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనంటూ ఆర్‌బీఐ లేఖ.

29.12.2006: ఏపీ డిపాజిటర్ల పరిరక్షణ చట్టం చట్టబద్ధతను సవాలు చేస్తూ మార్గదర్శి, రామోజీ హైకోర్టులో పిటిషన్.

19.2.2007: ఎస్.రంగాచారి మార్గదర్శి అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పణ.

19.2.2007: రంగాచారి నియామక జీవోపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరణ.

23.2.2007: రంగాచారి నియామకం విషయంలో హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన మార్గదర్శి, రామోజీ రావు.

23.1.2008: మార్గదర్శి అక్రమాలపై నాంపల్లి కోర్టులో అధీకృత అధికారి కృష్ణరాజు ఫిర్యాదు.

13.7.2009: అధీకృత అధికారి దాఖలు చేసిన ఫిర్యాదులో రామోజీరావు వ్యక్తిగత హాజరుకు నాంపల్లి కోర్టు ఆదేశం

20.7.2009: నాంపల్లి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టును ఆశ్రయించిన రామోజీ.

3.8.2009: రామోజీ పిటిషన్‌ను కొట్టేస్తూ వ్యక్తిగతంగా హాజరు కావాల్సిందేనన్న హైకోర్టు.

7.9.2009: అధీకృత అధికారి తరఫున వాదనలు వినిపించేందుకు ప్రత్యేక పీపీ నియామకంపై మార్గదర్శి, రామోజీ పిటిషన్.

27.11.2009: వ్యక్తిగత హాజరు విషయంలో హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన మార్గదర్శి, రామోజీ

17.10.2010: ప్రత్యేక పీపీ నియామకంపై మార్గదర్శి పిటిషన్ మూసివేత

1.7.2011: మార్గదర్శి అక్రమాల కేసులో విచారణను కొన్ని సెక్షన్లకే పరిమితం చేయాలంటూ రామోజీ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసిన నాంపల్లి

18.7.2011: నాంపల్లి కోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ రామోజీ హైకోర్టులో పిటిషన్

26.07.2011: మార్గదర్శి అక్రమాలపై దాఖలైన ఫిర్యాదును కొట్టేయాలంటూ హైకోర్టులో రామోజీ, మార్గదర్శి పిటిషన్

2011: రామోజీ, మార్గదర్శిపై నాంపల్లి కోర్టులో జరుగుతున్న విచారణకు సంబంధించి తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

2014: రాష్ట్ర విభజన జరిగిన తరువాత రాజకీయ పరిస్థితులు మారిపోవడంతో ఈ కేసు గురించి ఎవరూ పట్టించుకోలేదు.

18.9.2018: నాంపల్లి కోర్టులో మార్గదర్శికి వ్యతిరేకంగా దాఖలైన ఫిర్యాదులో తదుపరి చర్యలు నిలుపుదల చేయాలంటూ మార్గదర్శి, రామోజీ అనుబంధ పిటిషన్

12.10.2018: నాంపల్లి కోర్టులో మార్గదర్శికి వ్యతిరేకంగా దాఖలైన ఫిర్యాదులో తదుపరి చర్యలు నిలుపుదలకు సుప్రీంకోర్టు నిరాకరణ

31.12.2018: నాంపల్లి కోర్టులో మార్గదర్శి, రామోజీరావుపై అధీకృత అధికారి దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టేసిన హైకోర్టు

16.12.2019: హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో పిటిషన్

17.10.2022: డిపాజిటర్ల పరిరక్షణ చట్టంపై మార్గదర్శి, రామోజీరావు గతంలో దాఖలు చేసిన పిటిషన్‌ను మూసేసిన హైకోర్టు

9.4.2024: మార్గదర్శిపై అధీకృత అధికారి ఫిర్యాదును కొట్టేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసిన . ధర్మాసనం. మార్గదర్శి అక్రమాలపై నిగ్గు తేల్చాలని తెలంగాణ హైకోర్టుకు ఆదేశం.

సాక్షి, అమరావతి

సాక్షి, అమరావతి: ‘నిత్యం ఉషోదయంతో సత్యం నినదించుగాక..!’ అన్నది తమ నినాదమని ఈనాడు పత్రిక నీతులు వల్లిస్తూ ఉంటుంది. నిజానికి రామోజీ అక్రమ ఆర్థిక సామ్రాజ్యానికి ‘మార్గదర్శి’ పునాది కాగా ‘ఈనాడు’ ఆ అరాచకాలకు దశాబ్దాలుగా రక్షణ కవచంలా నిలుస్తోంది!! మరి అలాంటి ‘మార్గదర్శి’ అక్రమాలను బట్టబయలు చేస్తే ఈనాడు సహిస్తుందా? పాత్రికేయ పైశాచికత్వం జడలు విప్పి కరాళ నృత్యం చేస్తుంది. అందుకే 2004 నుంచి 2009 వరకు ముఖ్యమంత్రి నాడు దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డికి వ్యతిరేకంగా ఈనాడు పత్రిక అంతగా దుష్ప్రచారానికి తెగబడింది. వైఎస్సార్ హఠాన్మరణం తరువాత కూడా ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని కుట్రలకు పాల్పడింది. తదనంతరం 2019 నుంచి 2024 వరకు వైఎస్ జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనాడు బరి తెగించి విష ప్రచారం చేసింది. ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు వక్రభాష్యం చెబుతూ రోజుకో రీతిలో బురద జల్లింది. ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి అనే కనీస గౌరవం కూడా ఇవ్వకుండా రోజుకో రీతిలో వ్యక్తిత్వ హననానికి పాల్పడిందన్నది అక్షరసత్యం. రామోజీరావు ముమ్మాటికీ ఆర్థిక ఉగ్రవాది అనే వాస్తవాన్ని ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచడంతోనే ఈనాడు అంతగా విషం చిమ్మిందన్నది నిరూపితమైంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజాగా తెలంగాణ హైకోర్టుకు సమర్పించిన నివేదికే ఆ విషయాన్ని రుజువు చేస్తోంది. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో... అనంతరం నవ్యాంధ్ర ప్రదేశ్‌లో ఈనాడు ముసుగులో రామోజీ పాల్పడ్డ కుట్రలు తేటతెల్లమయ్యాయి. మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్ల కేసులో వాస్తవాలను వెల్లడిస్తూ తెలంగాణ హైకోర్టుకు ఆర్బీఐ సమర్పించిన నివేదిక లోగుట్టును విప్పింది.



ఆర్థిక దోపిడీని అడ్డుకున్నారనే అక్కసుతోనే

నాడు వైఎస్సార్‌కు వ్యతిరేకంగా దుష్ప్రచారం


‘మార్గదర్శి ఫైనాన్సియర్స్’ ముసుగులో రామోజీరావు దశాబ్దాలుగా సాగించిన ఆర్థిక దోపిడీకి నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. అప్పటి ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఫిర్యాదుతో 2006లో వైఎస్సార్ ప్రభుత్వం దీనిపై సీఐడీ విచారణకు ఆదేశించింది. ఆర్బీఐ నిబంధనలను ఉల్లంఘిస్తూ రామోజీరావు అక్రమ డిపాజిట్లు సేకరిస్తున్నారని, అప్పటికే ఏకంగా రూ.2,600 కోట్లకుపైగా అక్రమ డిపాజిట్లు సేకరించారని నిగ్గు తేల్చింది. అప్పటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రామోజీరావు అక్రమాలను ప్రశ్నించడం కాదు కదా మంత్రులు, ఉన్నతాధికారులు సైతం ఆయన పేరు పలికేందుకు సాహసించ లేదు. ఈ క్రమంలో అశేష ప్రజాదరణతో అధికారంలోకి వచ్చిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తమకు ఏ రాజగురువూ అవసరం లేదని, ప్రజల ఆశీస్సులే శ్రీరామరక్షగా భావించి దృఢ సంకల్పంతో వ్యవహరించారు. ఈ క్రమంలో మార్గదర్శి ఫైనాన్సియర్స్ మూసివేయడంతో రామోజీరావు ఆర్థిక అక్రమ సామ్రాజ్యం పునాదులు కదలిపోయాయి. దశాబ్దాలుగా తాను సాగిస్తున్న ఘరానా మోసానికి వైఎస్ రాజశేఖరరెడ్డి అడ్డుకట్ట వేయడాన్ని ఆయన సహించలేకపోయారు. దాంతో పట్టరాని ఆక్రోశం, విద్వేషంతో వైఎస్సార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనాడులో నిత్యం పేజీలకు పేజీలు తప్పుడు వార్తలు రాయించారు. యావత్ వైఎస్సార్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారానికి తెగించారు. అయితే రామోజీ బ్లాక్ మెయిల్ పాత్రికేయానికి వైఎస్ రాజశేఖరరెడ్డి వెరవలేదు. ఆయనతో ఏమాత్రం రాజీ పడలేదు.

మొత్తం వ్యవహారాలపై దర్యాప్తు చేయాలి



మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్లు వసూలు చేసినట్టు పూర్తి ఆధారాలతో సహా నిరూపితమైంది. ఆ సంస్థ చైర్మన్ రామోజీరావు లేకున్నా సరే మార్గదర్శి ఎండీగా ఉన్న ఆయన కోడలు శైలజ కిరణ్, భాగస్వాములుగా ఉన్న వారి కుటుంబ సభ్యులను చట్టపరంగా శిక్షించాలి. అంతేకాదు మార్గదర్శి మొత్తం అక్రమాలపై సమగ్రంగా దర్యాప్తు చేయాలి.
– వొగ్గు గవాస్కర్, న్యాయవాది

రామోజీ కుటుంబం బాధ్యత వహించాల్సిందే



మార్గదర్శి అక్రమాలు నిరూపితమయ్యాయి. హెచ్‌యూఎఫ్ కర్త రామోజీరావు ప్రస్తుతం లేకున్నా సరే ఆ హెచ్‌యూఎఫ్‌లోని ఇతర సభ్యులు బాధ్యత వహించాల్సిందే. వసూలు చేసిన డిపాజిట్లకు కనీసం పదిరెట్లు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఇతరత్రా శిక్షలకు రామోజీ కుటుంబ సభ్యులు అర్హులు.
– కోటంరాజు వెంకటేశ్ శర్మ, న్యాయవాది, విజయవాడ

18 ఏళ్లుగా ఉండవల్లి పోరాటం..

రామోజీ అక్రమాలకు వ్యతిరేకంగా ఉండవల్లి అరుణ్ కుమార్ పోరాడారు. రోశయ్య, కిరణ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు, అనంతరం చంద్ర బాబు ప్రభుత్వం ఏమాత్రం సహకరించకున్నా పట్టు వీడలేదు. ఉమ్మడి హైకోర్టు చివరి రోజు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తద్వారా ఆ కేసును కొనసాగేలా చూశారు.

డిపాజిట్‌దారుల పక్షాన నిలబడ్డ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఈ కేసులో ఇంప్లీడ్ అయింది. దాంతో సుప్రీంకోర్టు పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి ఆర్‌బీఐ అభిప్రాయాన్ని కోరింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ సేకరించినవి అక్రమ డిపాజిట్లేనని ఆర్‌బీఐ మొదట సుప్రీంకోర్టుకు, అనంతరం తెలంగాణ హైకోర్టుకు స్పష్టంగా నివేదించింది. దీంతో రామోజీరావు ఆర్థిక అక్రమాలు అధికారికంగా మరోసారి బట్టబయలయ్యాయి.

అక్రమాల పుట్ట మార్గదర్శి చిట్‌ఫండ్స్.. నిగ్గు తేల్చినందుకే జగన్‌పై దుష్ప్రచారం

రామోజీ నెలకొల్పిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ కూడా ఆర్థిక అక్రమాల పుట్టేనని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెలుగులోకి తెచ్చింది. చందాదారుల ఫిర్యాదులతో స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించడంతో అక్రమాలు బట్టబయలయ్యాయి. కేంద్ర చిట్ ఫండ్స్ చట్టానికి విరుద్ధంగా రామోజీరావు చందాదారుల సొమ్మును తమ కుటుంబ వ్యాపార సంస్థల్లో, మ్యూచ్‌వల్ ఫండ్స్‌లలో అక్రమంగా పెట్టుబడి పెడుతున్నట్లు గుర్తించారు. చందాదారులకు ప్రైజ్‌మనీ ఇవ్వకుండా రశీదు రూపంలో డిపాజిట్లు సేకరించారు. బ్రాంచి కార్యాలయాల్లోని నగదు నిల్వలలను హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తరలించారు. నకిలీ చందాదారుల ముసుగులో నల్లధనం దందా సాగించారు. డమ్మీ చెక్కులతో మోసగిస్తూ చందాదారులను ఇబ్బంది పెట్టి వారి ఆస్తులను సొంతం చేసుకున్నారు. ఇలా మార్గదర్శి చిట్‌ఫండ్స్ యథేచ్ఛగా పాల్పడుతున్న అక్రమాలన్నీ ఆధారాలతో సహా వెలుగులోకి వచ్చాయి. దీంతో ఈ కేసులో నిందితులైన రామోజీరావు, ఆయన కోడలు శైలజ కిరణ్‌లను సీఐడీ అధికారులు హైదరాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లి విచారించారు. తన ఇంటికి పోలీసులు రావడం ఇదే తొలిసారని రామోజీరావు సీఐడీ అధికారులతో వ్యాఖ్యానించడం గమనార్హం. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి మాదిరిగానే ఆయన తనయుడు వైఎస్ జగన్ తమ అక్రమాలకు అడ్డుకట్ట వేయడాన్ని రామోజీరావు సహించలేకపోయారు. వైఎస్ జగన్ మరోసారి అధికారంలోకి వస్తే తమ అక్రమ సామ్రాజ్యం పూర్తిగా కుప్పకూలడం ఖాయమని, తమకు శిక్ష పడటం ఖాయమని గ్రహించారు. దాంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీస్థాయిలో దుష్ప్రచారానికి తెగించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానాలకు వక్రభాష్యం చెబుతూ నిరాధార ఆరోపణలతో రోజుకో రీతిలో బురదజల్లారు.

సత్యం నినదించడం కాదు... దోపిడీ వర్థిల్లాలి అదే ఈనాడు నినాదం.. విధానం

రామోజీరావు తన ఆత్మనే ఈనాడు పత్రికగా ... ‘నిత్యం ఉషోదయంతో సత్యం నినదించుగాక’ అనే జ్యోతిని వెలిగించి పత్రిక తెచ్చారని ఇటీవల ఈనాడు స్వర్ణోత్సవాల్లో ఘనంగా ప్రకటించారు. ఈ మాటలు వినటానికి ఎంత అందంగా ఉంటాయో ఆచరణలోకి వచ్చేసరికి మాత్రం ఈనాడు పాత్రికేయం అంత పైశాచికంగా ఉంటుందన్నది 50 ఏళ్లుగా రోజూ నిగ్గుతేలుతున్న అక్షర సత్యం. రామోజీరావు అక్రమ ఆర్థిక సామ్రాజ్యానికి పునాది మార్గదర్శి ఫైనాన్సియర్స్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ అయితే.. ఆ ఆర్థిక ఉగ్రవాదానికి రక్షణ కవచంగా ఈనాడు పత్రికను వాడుకున్నారన్నది సీఐడీ దర్యాప్తులు, ఆర్‌బీఐ నివేదికల సాక్షిగా వెల్లడైన వాస్తవం. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సహ వ్యవస్థాపకుడు జీజే రెడ్డి కుటుంబం వాటాలను అక్రమంగా తన కోడలు పేరిట రామోజీ బదిలీ చేసుకున్నారు. ఈనాడు కార్యాలయాలు జాతీయ రహదారులు, నగరాల్లోని రహదారులను కబ్జా చేసినా వ్యవస్థలు కళ్లు మూసుకున్నాయి. తమకు పోటీగా ఉన్న ఉదయం పత్రికను దెబ్బతీసేందుకు సారా వ్యతిరేక ఉద్యమం...అనంతరం సంపూర్ణ మద్యపాన నిషేధ ఉద్యమాన్ని ఈనాడు నెత్తిన పెట్టుకుంది. నాటి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేసింది. ఇక 1995లో ఆనాటి సీఎం ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన కుట్రలో చంద్రబాబు భాగస్వామి రామోజీ. అందుకు ప్రతిగా సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని ఎత్తివేసి రామోజీ ఫిల్మ్ సిటీలో మద్యాన్ని ఏరులై పారించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఫిల్మ్ సిటీ పేరిట కబ్జా చేసిన రామోజీరావుకు టీడీపీ ప్రభుత్వం సహకరించింది. ఇక ఈనాడు స్వర్ణోత్సవ వేడుకల్లో ఆ పత్రిక ప్రతినిధులు మాట్లాడుతూ 2006లోనూ 2022లోనూ ఈనాడు పత్రికపై ప్రభుత్వాలు దాడులకు పాల్పడ్డాయని ఆరోపించడం విడ్డూరంగా ఉంది.

తలొగ్గిన తరువాత ప్రభుత్వాలు

ఆ అక్రమాలకు అండగా చంద్రబాబు

వైఎస్ రాజశేఖరరెడ్డి హఠాన్మరణం తరువాత కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రులుగా వ్యవహరించిన రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ఈనాడు రామోజీరావుకు జీహుజూర్ అన్నారు. మార్గదర్శి ఫైనాన్సియర్స్ ఆర్థిక అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వమే కేసు పెట్టిందనే విషయాన్ని విస్మరించి నీరుగార్చారు. అప్పటి కాంగ్రెస్ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ స్వయంగా రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిని కలసి మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్ల గురించి ప్రస్తావించి ప్రజా ప్రయోజనాలను కాపాడాలని ఎంత కోరినా ఆలకించలేదు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో రామోజీరావు అక్రమాలకు రక్షణ లభించింది. దాంతో గుట్టుచప్పుడు కాకుండా మార్గదర్శి ఫైనాన్సియర్స్ కేసును క్లోజ్ చేసేందుకు పావులు కదిపారు. ఈ నేపథ్యంలో 2018 డిసెంబర్‌లో మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై కేసును ఉమ్మడి హైకోర్టు కొట్టివేయడం గమనార్హం. డిపాజిటర్ల ప్రయోజనాల కోసం ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేయాల్సిన అప్పటి చంద్రబాబు ప్రభుత్వం మౌనంగా ఉండిపోవడం ద్వారా రామోజీ అక్రమాలకు రక్షణగా నిలిచింది.

ఇకనైనా ప్రభుత్వాలు స్పందిస్తాయా?

మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్లు వసూలు చేసినట్టు తాజాగా ఆర్‌బీఐ స్పష్టం చేసిన నేపథ్యంలో ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఇప్పుడు ఎలా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ఇరు ప్రభుత్వాలు తెలంగాణ హైకోర్టుకు ఈ నెల 20న తమ అభిప్రాయాన్ని తెలపాల్సి ఉంది. ఇకనైనా డిపాజిట్ దారుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడతాయా? లేక ఈనాడు ప్రాపకం కోసం రామోజీ కుటుంబ ఆర్థిక దోపిడీకి వంత పాడి మౌనంగా ఉండిపోతాయా? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. దాదాపు 18 ఏళ్లుగా మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉండవల్లి అరుణ్ కుమార్ ఈ కేసులో మునుముందు ఎలా వ్యవహరిస్తారన్నది కూడా ఆసక్తికరంగా మారింది.

సొంత ఆడిట్ కుదరదు

- నిజాలు నిగ్గు తేలాల్సిందే
- మార్గదర్శికి స్పష్టంచేసిన సుప్రీం

మార్గదర్శి అక్రమ డిపాజిట్ల బాగోతాన్ని కప్పిపుచ్చుకునేందుకు అప్పట్లో చెరుకూరి రామోజీరావు చేయని కుతంత్రం లేదు... ఎంతగా అంటే ‘అక్రమంగా సేకరించిన డిపాజిట్ల సొమ్మును డిపాజిట్‌దారులకు చెల్లించేశాం... ఆ విషయాన్ని మా ఆడిటర్లు లెక్క తేల్చేసి నివేదిక ఇచ్చారు’ అంటూ కనికట్టు చేసేందుకు యత్నించారు. కానీ, ఆ కుతంత్రాన్ని సుప్రీంకోర్టు ఈ ఏడాది ఏప్రిల్‌లోనే తిప్పికొట్టింది. ‘నేరం నాదే... దర్యాప్తు నాదే... తీర్పు నాదే’ అంటే కుదరదు అని తేల్చిచెప్పింది. డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లించారో... లేదో... నిర్ధారించాల్సిందిగా మార్గదర్శి ఆడిటర్లు కాదు... రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు అని విస్పష్టంగా ప్రకటించింది.
– సాక్షి, అమరావతి



డిపాజిట్లు చెల్లించేశాం... మా ఆడిటర్లు లెక్క తేల్చేశారు.. సుప్రీంకోర్టులో రామోజీ వితండవాదం

రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధంగా రూ.2,610.38కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించిన కేసులో చెరుకూరి రామోజీరావు సుప్రీంకోర్టులో అడ్డగోలు వాదనలతో కనికట్టు చేయాలని యత్నించారు. తాము అక్రమంగా సేకరించిన డిపాజిట్ల మొత్తాన్ని సంబంధిత డిపాజిట్‌దారులకు చెల్లించేశామని ఆయన తరఫు న్యాయవాదులు వాదించారు. మొత్తం రూ.2,610.38 కోట్ల అక్రమ డిపాజిట్లలో 2023, జూన్ 30నాటికి 1,247మంది డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లించేశామని చెప్పారు. కేవలం రూ.5.31కోట్లు మాత్రమే క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఉన్నాయని తెలిపారు. ఈ విషయాన్ని మార్గదర్శి ఫైనాన్సియర్స్ ఆడిటర్లు పూర్తిగా ఆడిట్ చేసి నివేదిక సమర్పించారని... అన్ని లెక్కలు సరిపోయాయని కూడా చెప్పుకొచ్చారు. కాబట్టి మార్గదర్శి ఫైనాన్సియర్స్ డిపాజిట్‌దారులు, వారికి చెల్లింపుల వివరాలను వెల్లడించాల్సిన అవసరం లేదని వితండవాదం చేశారు.

అదేం కుదరదు.. డిపాజిట్ల నిగ్గు తేలాల్సిందే – స్పష్టంచేసిన సుప్రీంకోర్టు


రామోజీరావు తరఫు న్యాయవాదుల వాదనలను ఏప్రిల్‌లోనే సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. ‘డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లించేశామని మీరు చెబితే... మీ దగ్గర పని చేసే ఆడిటర్లు నివేదిక ఇస్తే సరిపోదు. ఆ నివేదికను పరిగణలోకి తీసుకోము’ అని స్పష్టం చేసింది. ఎందుకంటే రూ.5వేలు డిపాజిట్‌చేసిన వ్యక్తి తనకు న్యాయం జరగలేదని న్యాయస్థానాన్ని ఆశ్రయించలేరు.. అంతటి వ్యయ ప్రయాసలు భరించలేరు కదా అని కూడా వ్యాఖ్యానించింది. అందుకే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ఉండవల్లి అరుణ్‌కుమార్‌ను కూడా పార్టీగా చేరుస్తూ ఈ కేసును తెలంగాణ న్యాయస్థానం విచారించాలని తీర్పునిచ్చింది. డిపాజిట్లు తిరిగి చెల్లించినది.. లేనిది పరిశీలించేందుకు ఓ జ్యుడిషియల్ అధికారిని నియమించాలని కూడా తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. మొత్తం విచారణ ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేయాలని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది.

అంతా నల్లధనం దందానే!

మార్గదర్శి ద్వారా బాబు అండ్ కో నల్లధనం చలామణి

అందుకే డిపాజిటర్ల వివరాలు వెల్లడించని రామోజీ

సాక్షి, అమరావతి: ‘మార్గదర్శి చిట్‌ఫండ్స్’ అనే బోర్డు ఉంటుంది... కానీ ఎక్కడా ‘మార్గదర్శి ఫైనాన్సియర్స్’ అనే బోర్డు మాత్రం ఉండదు. అయినా మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లోనే గుట్టుచప్పుడు కాకుండా ‘మార్గదర్శి ఫైనాన్సియర్స్’ అనే సంస్థను రామోజీరావు నిర్భయంగా నిర్వహించారు. ఆ ముసుగులో భారీగా నల్లధనం దందాను సాగించారు. సీఐడీ సోదాల్లో, ఆదాయ పన్ను శాఖ తనిఖీల్లో ఆ విషయం వెలుగు చూసింది. అందుకే తమ సంస్థలో డిపాజిట్‌దారుల వివరాలను వెల్లడించేందుకు రామోజీరావు దశాబ్దాలపాటు ససేమిరా అన్నారు. కేంద్ర ఆదాయపన్ను చట్టాన్ని కూడా ఉల్లంఘించి నల్లధనం దందా నడిపారు. డిపాజిట్‌దారుల పాన్ నంబర్లు, పూర్తి చిరునామాలు కూడా లేకుండానే డిపాజిట్లు సేకరించడం గమనార్హం. మార్గదర్శి ఫైనాన్సియర్స్ డిపాజిట్‌దారులకు చెల్లించాల్సిన మొత్తం రూ.2,610.38 కోట్లుగా రామోజీరావు 2006లో తమ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కానీ 2008లో సమర్పించిన అఫిడవిట్‌లో రూ.1,864.10 కోట్లు చెల్లించేశామని తెలిపారు. మరి మిగిలిన రూ.800 కోట్ల డిపాజిట్లు ఏమయ్యాయనే విషయంపై మౌనం వహించారు. గుట్టు చప్పుడు కాకుండా రికార్డుల నుంచి తొలగించిన ఆ రూ.800 కోట్లు రామోజీకి అత్యంత సన్నిహితుడైన పచ్చ బాబు, ఆయన గ్యాంగ్‌వే అని తెలుస్తోంది. పోనీ చెల్లించామని చెబుతున్న రూ.1,864.10 కోట్ల డిపాజిట్లు ఎవరెవరికి చెల్లించారో చెప్పడానికి రామోజీ ససేమిరా అన్నారు.




అక్రమాల సినిమాలో త్రిపాత్రాభినయం

హెచ్‌యూఎఫ్ కర్త, ప్రొప్రైటర్, చైర్మన్ పేరుతో కనికట్టు


ఆర్‌బీఐని బురిడీ కొట్టించి అక్రమ డిపాజిట్ల దందా

సాక్షి, అమరావతి: చట్టాలను ఉల్లంఘించి మార్గదర్శి ద్వారా ప్రజల సొమ్ము దోచుకునేందుకు చెరుకూరి రామోజీరావు ఏకంగా త్రిపాత్రాభినయం చేశారు. ఆయన హెచ్‌యూఎఫ్ కర్తగా, ప్రొప్రైటర్‌గా, చైర్మన్‌గా మూడు వేర్వేరు పాత్రలలో అవసరాలకు తగ్గట్టుగా వ్యవహరిస్తూ ఆర్‌బీఐకి మస్కా కొట్టారు. అక్రమంగా డిపాజిట్ల దందా సాగించారు.



హెచ్‌యూఎఫ్ కర్తగా రామోజీ రావు చేసిన సంతకం

డిపాజిట్ పత్రాలపై హెచ్‌యూఎఫ్ కర్తగా: మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమంగా వసూలు చేసిన డిపాజిట్ల విలువ మేరకు తమ డిపాజిట్‌దారులకు పత్రాలను జారీ చేసింది. ఆ పత్రాలపై తనను తాను ‘హెచ్‌యూఎఫ్ కర్త’ అని పేర్కొంటూ రామోజీరావు సంతకం చేశారు.



మార్గదర్శి ప్రొప్రైటర్‌గా రామోజీరావు చేసిన సంతకం

చెక్కులపై ప్రొప్రైటర్‌గా...: మార్గదర్శి ఫైనాన్సియర్స్ చెక్కుల దగ్గరకు వచ్చేసరికి రామోజీరావు ‘ప్రొప్రైటర్’గా మారారు. అక్రమ డిపాజిట్లను కాలపరిమితి తరువాత ఇచ్చే చెక్కులపై ఆయన ‘ప్రొప్రైటర్’ అని సంతకం చేశారు.



చైర్మన్‌గా రామోజీ రావు చేసిన సంతకం

బోర్డు మీటింగ్‌లో చైర్మన్‌గా..: మార్గదర్శి ఫైనాన్సియర్స్ బోర్డు మీటింగ్‌ల విషయం వచ్చేసరికి రామోజీరావు మరో పాత్రలోకి ప్రవేశించారు. బోర్డు మీటింగ్ మినిట్స్ బుక్‌లోనూ, తీర్మానాల్లోనూ ఆయన ‘చైర్మన్’ అని పేర్కొంటూ సంతకం చేశారు.

కొండపల్లి బొమ్మ.. కోటకట్టి కూచుందమ్మా!

కొండపల్లి కొయ్య బొమ్మ ఒక్కసారి మన ఇంట్లోని షోకేస్‌లో చేరిందంటే.. ఎన్ని తరాలైనా అక్కడే కోటకట్టుకుని కూచుండిపోతుంది. అమ్మకు చిన్నప్పుడు జాతరలో తాతయ్య కొనిచ్చిన 'అమ్మాయి.. అబ్బాయి' బొమ్మ నుంచి మొదలై.. అన్నయ్య ముచ్చటపడి కొనిపించుకున్న ఎడ్లబండి బొమ్మ.. అక్క కొనుక్కున్న తలాడించే బుట్టబొమ్మ.. నాన్నమ్మ భక్తిభావంతో కొనుక్కొచ్చిన దశావతారాల బొమ్మ ఒకదాని పక్కన మరొకటి చేరిపోతుంటాయి. ఎంతకాలమైనా చెక్కుచెదరకుండా తమ అందాలతో అలరిస్తుంటాయి.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై అమ్మకాలు

సాక్షి, అమరావతి: కొండపల్లి కొయ్య బొమ్మలు పురాణాల నేపథ్యం.. గ్రామీణ జీవితం.. జంతువుల రూపంలో సంతోషకరమైన వాస్తవిక వ్యక్తీకరణలను ప్రదర్శిస్తాయి. మెత్తటి కలప.. గింజలు.. పండ్ల తొక్కల నుంచి తీసిన రంగులతో ఆ బొమ్మలు అందాలను అద్దుకుంటాయి. పిల్లలు ఆడుకుంటూ ఆ బొమ్మల్ని ఒకరిపై ఒకరు విసురుకున్నా దెబ్బలు తగలవు. చంటి పిల్లలు ఆ బొమ్మల్ని నోట్లో పెట్టుకున్నా ఎలాంటి ఇబ్బంది కలగదు. వీటినే కొండపల్లి కొయ్య బొమ్మలంటారు. ఇప్పుడు ఈ బొమ్మలు కూడా ఆన్‌లైన్ మెట్లెక్కి అదుర్స్ అనిపిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఏటా రూ.3 కోట్ల విలువైన కొండపల్లి బొమ్మల విక్రయాలు జరుగుతుండగా.. ఆన్‌లైన్ మార్కెట్‌లోనూ అమ్మకాలు క్రమంగా ఊపందుకుంటున్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో వంటి ఈ–కామర్స్ సంస్థలు ఏటా రూ.15 లక్షల విలువైన బొమ్మల్ని ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నాయి. వీటి ధర కనిష్ఠంగా రూ.70 నుంచి గరిష్ఠంగా రూ.5 వేల వరకు పలుకుతున్నాయి. భౌగోళిక గుర్తింపు(జీఐ)ను పొందిన కొండపల్లి బొమ్మల ఖ్యాతి దేశవ్యాప్తమైంది. విజయవాడ సమీపంలోని కొండపల్లిలో ఇప్పటికీ దాదాపు 200 మంది హస్తకళాకారులకు ఇదే జీవనాధారం.

రాజస్థాన్ నుంచి వలస వచ్చి..

రాజస్థాన్ నుంచి 400 ఏళ్ల క్రితం సంప్రదాయ హస్త కళాకారులు కొండపల్లికి వలస వచ్చారు. అక్కడే స్థిరపడిన వారిని ఆర్యకుల క్షత్రియులుగా పిలుస్తారు. వీరు మొదట్లో అనేక ఆలయాల్లో గరుడు, నంది, సింహ వాహనాల వంటి విగ్రహాలను చెక్కినట్టు చెప్తారు. కాలక్రమంలో కొయ్య బొమ్మలు, ఆట బొమ్మలు, అలంకరణ బొమ్మలు తయారు చేయడం మొదలు పెట్టారని చెబుతారు. అతి తేలికైన తెల్ల పొణికి చెక్కలను సేకరించి వివిధ ఆకృతుల్లో బొమ్మల తయారీని వారు జీవనోపాధిగా ఎంచుకున్నారు. తెల్ల పొణికి కర్రను చెక్కి దానికి ప్రత్యేకంగా తయారు చేసిన నిమ్మ జిగురు పూతతో చింతపండు గింజలు, ఇతర చిన్నపాటి వస్తువులను అతికి బొమ్మల్ని రూపుదిద్దుతారు. వాటికి కూరగాయల నుంచి సేకరించిన సహజ సిద్ధమైన రంగులు, పొడి రంగులు, ఆయిల్ పెయింట్‌లు అద్దుతారు. ఆ బొమ్మల జుట్టుగా మేక వెంట్రుకలను అతికించి తీర్చిదిద్దుతారు.

గ్రామీణ వాతావరణం.. స్పష్టమైన వ్యక్తీకరణం

కొండపల్లిలో తయారు చేసే బొమ్మలు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. సాధ్యమైనంత వరకు గ్రామీణ వాతావరణానికి అద్దం పడతాయి. జంతువుల నుంచి మనుషుల బొమ్మల వరకు ప్రతీ దాని మొహంలోనూ స్పష్టమైన వ్యక్తీకరణ తొణికిసలాడుతుంది. జంతువులు, వృత్తులు, రోజువారీ మనిషి జీవితం నుంచి పౌరాణిక పాత్రలు సైతం వీరి చేతిలో ఆకృతి దాల్చుతాయి.




కొండపల్లి కొయ్య బొమ్మలు







దశావతారాలకు ప్రాచుర్యం

కళాత్మకమైన పనితనానికి కొండపల్లి కొయ్య బొమ్మలు గుర్తింపు పొందాయి. తాడిచెట్టు, ఎడ్లబండి, అంబారీ ఏనుగు, గ్రామీణ నేపథ్యంలోని బొమ్మలు, బృందావనం బొమ్మలకు భలే క్రేజ్ ఉంటుంది. వీరు తయారు చేసిన బొమ్మల్లో దశావతారాల బొమ్మలు అత్యంత ప్రాచుర్యం పొందాయి. గీతోపదేశం, పెళ్లికూతురు–పెళ్లికొడుకును మోస్తూ వెళ్తున్న పల్లకీ–బోయీలు, గ్రామాల్లోని చేతివృత్తుల వాళ్ళ సెట్, జంతువుల బొమ్మలకు డిమాండ్ ఉంది. తల ఊపుతూండే అమ్మాయి, అబ్బాయి, బ్రాహ్మణుడు వంటివి చాలామందికి ఇష్టమైన కొండపల్లి బొమ్మలు.

తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిట్టల్ శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

– తిరుమల



ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ పంచహారతుల సేవలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.కిరణ్మయి కుటుంబ సమేతంగా శనివారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఈవో కె.ఎస్.రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

– ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ)





చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు శనివారం దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు స్వామివారి చిత్రపటం, శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

– కాణిపాకం

కృష్ణాజిల్లా మోపిదేవిలో కొలువైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.రవీంద్రబాబు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం న్యాయమూర్తికి ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారి లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు.

– మోపిదేవి



జనరేటర్‌లో జుట్టు చిక్కుకుని బాలిక మృతి



వాకాడు: మైమరపించే ఉత్సాహం.. అందరితో కలిసి కోలాటం... అలుపుతో విశ్రాంతి కోసం కుర్చీలో కూర్చునే క్రమంలో ఓ చిన్నారి జుట్టు జనరేటర్‌లో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషాద ఘటన శనివారం వేకువ జామున తిరుపతి జిల్లా వాకాడులో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలం, మర్రిమాకుల కండ్రిగకు చెందిన 20 మంది కళాకారుల బృందం వాకాడులో వరలక్ష్మీవ్రతం సందర్భంగా చేపట్టిన మహాలక్ష్మి ఊరేగింపు ముందు కోలాట ప్రదర్శన ఇచ్చేందుకు వచ్చింది. అందులో ఒకే బంధువర్గానికి చెందిన ఐదుగురు కళాకారుల్లో నవ్యశ్రీ (11) ఉంది. ఆమె ఆరో తరగతి చదువుతోంది. బాలిక తన తల్లి చిట్టెమ్మ, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి రాత్రంతా ఉత్సాహంగా కోలాటం ప్రదర్శించింది. కొద్దిసేపట్లో కార్యక్రమం ముగుస్తుందనగా అలసిపోవడంతో సేదతీరేందుకు ఊరేగింపు వాహనం వెనకాల కూర్చునే ప్రయత్నం చేస్తున్న క్రమంలో నవ్యశ్రీ జుట్టు జనరేటర్‌పై జడను చుట్టేయడంతో క్షణాల్లో అక్కడికక్కడే మృతి చెందింది. నవ్యశ్రీ తల్లి చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖాతాదారుల ప్రయోజనాలకు పెద్దపీట

- కెనరా బ్యాంక్ ఎండీ, సీఈవో సత్యనారాయణరాజు



సాక్షి, భీమవరం: ఖాతాదారుల ప్రయోజనాలకు కెనరా బ్యాంక్ పెద్దపీట వేస్తుందని ఆ బ్యాంక్ ఎండీ, సీఈవో కలిదిండి సత్యనారాయణ రాజు తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని కెనరా బ్యాంక్ బ్రాంచి కార్యాలయాలకు కేంద్రంగా భీమవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాంతీయ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేశంలో మొట్టమొదటిసారి టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ తెచ్చిన ఘనత కెనరా బ్యాంకుదేనన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 1050 వరకు బ్రాంచ్‌లు ఉన్నాయని, మరో 22 బ్రాంచీల ఏర్పాటుకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో రాజమహేంద్రవరంలో ఉన్న రీజనల్ కార్యాలయానికి వెళ్లేందుకు ఖాతాదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, ప్రస్తుతం భీమవరంలో రీజనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి ఖాతాదారులకు తమ సేవలను మరింత చేరువ చేశామని తెలిపారు. విజయవాడ కెనరా బ్యాంక్ సర్కిల్ హెడ్, జీఎం రవివర్మ, ఏజీఎం తోట రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

భర్త అనుమానం.. పెను'మంటలై'..

గ్యాస్ బండకు నిప్పంటించుకుని ఇద్దరు బిడ్డలతో సహా తల్లి సజీవదహనం



రమాదేవి, మనోహర్,మన్విత (ఫైల్)

రాయచోటి: భర్త అనుమానానికి తోడు.. వేధింపుల ధాటికి తట్టుకోలేక ఇద్దరు బిడ్డలతో సహా ఓ తల్లి సజీవదహనమైన హృదయవిదారక ఘటన అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. పలువురిని కంటతడి పెట్టించిన ఈ దారుణ ఘటన వివరాలను బంధువులు వెల్లడించారు. జిల్లాలోని లక్కిరెడ్డిపల్లి మండలం బి.ఎర్రగుడి హరిజనవాడకు చెందిన ఎర్రగుడి రాజా పది సంవత్సరాల కిందట గాలివీడుకు చెందిన గాలివీటి రమాదేవిని వివాహం చేసుకున్నారు. వీరికి మనోహర్ (8), మన్విత (5) సంతానం. జీవనోపాధి నిమిత్తం రాజా గల్ఫ్ దేశంలో ఉంటూ భార్య, పిల్లలను రాయచోటి పట్టణం బోస్‌నగర్ తొగటవీధిలో ఉంచాడు. భార్య రమాదేవి టైలరింగ్ చేసుకుంటూ ఇద్దరు పిల్లలను స్కూలుకు పంపుతూ జీవనం సాగించేది. రెండు సంవత్సరాలుగా భార్యపై అనుమానాన్ని పెంచుకున్న రాజా తను నివాసం ఉంటున్న ఇంటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ మధ్యకాలంలో అనుమానం పెనుభూతమై వీడియో ఫోన్ ద్వారా వేధించేవాడు. వాటిని తట్టుకోలేక శనివారం ఉదయం ఆరుగంటలకు వంటగదిలో ఉన్న గ్యాస్ సిలిండర్‌ను బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్లి కన్నబిడ్డలు ఇద్దరినీ పట్టుకుని రమాదేవి (34) గ్యాస్‌బండకు నిప్పు అంటించి ఆ మంటల్లో ఆహుతి అయింది. ఇంటిలో నుంచి పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే మంటల్లో తల్లీ, ఇద్దరు పిల్లలు కాలిపోయారు. రమాదేవి సోదరుడు గాలివీటి నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి మృతదేహాల వద్ద నివాళులు అర్పించారు. ఈ ఘటన దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

అరకు అందాలు అద్భుతం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి | గిరి గ్రామదర్శిని సందర్శన

గిరిజన వస్త్రధారణలో న్యాయమూర్తి దంపతులకు వివాహం



గిరిజన థింసా కళాకారులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి



గిరిజన సాంప్రదాయబద్ధంగా తాళి కడుతున్న జస్టిస్ మహేశ్వరి

అరకులోయ టౌన్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోని ప్రకృతి అందాలు అద్భుతమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి అన్నారు. శనివారం జస్టిస్ జేకే మహేశ్వరి దంపతులు అరకులోయలో పర్యటించారు. విశాఖ– కిరోండూల్ అద్దాల రైలులో అరకు లోయ చేరుకున్న న్యాయమూర్తికి జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ స్వాగతం పలికారు. రైల్వే అతిథి గృహంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం జస్టిస్ జేకే మహేశ్వరి దంపతులు గిరిజన మ్యూజియాన్ని సందర్శించారు. ఆ తర్వాత గంజాయిగూడలోని గిరి గ్రామదర్శినిని సందర్శించగా.. వారికి స్థానిక పూజారులు గిరిజన వస్త్రధారణలో వివాహం చేయించారు. అనంతరం అనంతగిరి మండలంలోని బొర్రా గుహలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఆలపాటి గిరిధర్, పోక్సో కోర్టు జడ్జి జి.ఆనంది, అడిషనల్ జిల్లా జడ్జి పి.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన వైద్యసేవలు

కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు వెల్లువెత్తిన నిరసనలు

రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరించిన డాక్టర్లు, వైద్యసిబ్బంది



తిరుపతి నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు



ఓపీ సేవలు నిలిచిపోవడంతో నిర్మానుష్యంగా ప్రభుత్వాస్పత్రి పరిసరాలు



విశాఖలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న డాక్టర్లు

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ వైద్యకళాశాలలో రెసిడెంట్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా వైద్యవర్గాలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఆ అఘాయిత్యానికి నిరసనగా శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 వరకు 24 గంటల పాటు వైద్యసేవల బంద్‌కు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపునివ్వడంతో రాష్ట్రంలో అత్యవసర వైద్యసేవలు మినహా మిగిలిన సేవలు స్తంభించాయి. అన్ని జిల్లాల్లోను ఆస్పత్రుల్లో డాక్టర్లు, నర్సులు, వైద్యసిబ్బంది విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. ఐఎంఏ, పలు వైద్యసంఘాల ఆధ్వర్యంలో వైద్యులు, విద్యార్థిసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాల వారు గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం నగరాలతో పాటు అనేకచోట్ల కొవ్వొత్తులతో ర్యాలీలు, ప్రదర్శనలు, మానవహారాలు నిర్వహించారు. ఆర్‌జీ కార్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని ఈ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో వైద్యులపై దాడులు, అత్యాచారం, హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని కోరారు. ఇందుకోసం ఓ ప్రత్యేక రక్షణ చట్టాన్ని రూపొందించాలని, సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో జూనియర్ డాక్టర్లు అత్యవసర సేవలకు కూడా దూరంగా ఉండి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో రోగులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రభుత్వ వైద్యులు సైతం అన్ని ఆస్పత్రుల్లో విధులకు హాజరై నిరసన తెలిపారు. ఐఎంఏ చేపట్టిన ఈ బంద్ ఆదివారం ఉదయం 6 గంటలకు ముగుస్తుంది.

స్టేషన్‌లోనే పోలీసులపై దౌర్జన్యం

- రెచ్చిపోయిన తిరుపతి ఎమ్మెల్యే పీఏ, అనుచరులు
- మీ అంతు చూస్తాను అంటూ బెదిరింపు
- అడ్డగించిన పోలీసుపై చేయి చేసుకునే ప్రయత్నం
- తలుచుకుంటే రాజ్యాంగాన్నే మార్చేస్తామంటూ హూంకరింపు
- దౌర్జన్యం చేసిన వారిలో చిత్తూరు మేయర్ హత్య కేసు నిందితుడు



తిరుపతి క్రైమ్: రాజకీయ నాయకులో, రౌడీలో పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు వార్నింగ్ ఇవ్వడం, దౌర్జన్యం చేయడం, బూతులతో రెచ్చిపోవడం మనం ఇప్పటి వరకు సినిమాల్లోనే చూసుంటాం. కానీ, అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఇలాంటి ఘటన శుక్రవారం అర్ధరాత్రి రియల్‌గా జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారి ఆస్తులు, ప్రాణాలకే కాదు.. చివరకి స్టేషన్‌లోనే పోలీసులకు రక్షణలేదు అనే విషయం ఈ ఘటనతో ప్రస్ఫుటమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాత్రి 12 గంటల సమయంలో అలిపిరి పోలీస్ స్టేషన్ ముందునుంచి నలుగురు రాంగ్ రూట్లో ఒకే ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పోలీసులు ఆపారు. తాము తిరుపతి ఎమ్మెల్యే తాలూకా అని చెప్పి తప్పించుకోవడానికి వారు ప్రయత్నించారు. సరైన డాక్యుమెంట్స్ చూపించి ద్విచక్ర వాహనాన్ని ఉదయాన్నే తీసుకెళ్లమని చెప్పి వారిని పోలీసులు పంపేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పీఏ మహేంద్రకు ఆ నలుగురు చేరవేశారు. వెంటనే అనుచరులు మురళి, కమలాకర్‌తో కలిసి మహేంద్ర పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ''ఎమ్మెల్యే డ్రైవర్ ద్విచక్ర వాహనాన్ని పోలీస్ స్టేషన్లో పెడతార్రా నా కొడకల్లారా.. మీ అంతు చూస్తాను.. నేను తలుచుకుంటే మీకు ఎక్కడకు ట్రాన్స్‌ఫర్ అవుతుందో కూడా తెలియదు'' అంటూ చెప్పలేని బూతులతో రెచ్చిపోయాడు. పోలీస్ స్టేషన్లో పోలీసులకే వార్నింగ్ ఇస్తూ భయభ్రాంతులకు గురిచేశాడు. ఇది చిత్రీకరిస్తున్న కానిస్టేబుల్‌పై చేయి చేసుకునే ప్రయత్నం కూడా చేశాడు. మహేంద్ర అనుచరుడు, చిత్తూరు మేయర్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న కమలాకర్ కూడా పోలీసులపై దౌర్జన్యానికి దిగాడు. ''సీఐ ఎవడురా.. ఎమ్మెల్యే వాహనాలు ఆపే అంత ధైర్యం మీకు ఎక్కడి నుంచి వచ్చింది'' అంటూ రెచ్చిపోయాడు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన ఎస్ఐ.. వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ''ఉదయంలోపు అందర్నీ మార్చేస్తాం.. మేం తలుచుకుంటే రాజ్యాంగాన్నే మార్చేస్తాం'' అంటూ ఎస్ఐనీ బెదిరించారు. స్టేషన్లో ఉన్న సీసీ కెమెరాల్లో వీరి దౌర్జన్యం, బూతులు అన్నీ రికార్డు అయ్యాయి. ఈ ఘటనపై అలిపిరి ఇన్చార్జి సీఐ రామకృష్ణ వివరణ ఇస్తూ.. దౌర్జన్యం చేసిన వారందరిపై కేసు నమోదు చేశామని, త్వరలో అందరిని అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. హత్య కేసులో నిందితుడైన కమలాకర్.. ప్రస్తుతం తిరుపతిలో ఉంటూ సెటిల్మెంట్లు వ్యవహారాలు నడుపుతున్నట్లు సమాచారం.

నూతన క్రిమినల్ చట్టాలను నిలిపివేయాలి

ఐలూ ఆలిండియా వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్



కృష్ణలంక (విజయవాడ తూర్పు): కేంద్రం ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన మూడు నూతన క్రిమినల్ చట్టాలను తక్షణమే నిలుపుదల చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) ఆలిండియా వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రముఖ అడ్వకేట్ సుంకర రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. బ్రిటిష్ పాలకులు చేసిన చట్టాల కంటే ఇవి అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలోని రాఘవయ్య పార్కు సమీపంలో ఉన్న బాలోత్సవ భవన్‌లో శనివారం ఐలూ, ఐఏఎల్, కాంగ్రెస్ లీగ్ సెల్, సీఎల్‌సీ, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, ఏపీ సీఎల్ఏ, ఐఏపీఎల్ న్యాయవాద సంఘాల ఆధ్వర్యంలో 'నూతన క్రిమినల్ చట్టాలు–ప్రజా హక్కులకు విఘాతం' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. నూతన క్రిమినల్ చట్టాలు ప్రజా హక్కులకు విఘాతం కలిగిస్తున్నాయన్నారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కడానికి, దేశద్రోహం, ఉప చట్టంలోని అంశాలను భారత న్యాయ సంహితలో చొప్పించారని, ఇది ప్రజా హక్కులను కాల రాయటానికి, ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి ఉపకరిస్తుందని వివరించారు. నేతలు వై.కోటేశ్వరరావు, ఎస్.మాధవరావు, సీహెచ్ బాబూరావు, అక్కినేని వనజ, ఎన్.నరసింహారావు, నర్రా శ్రీనివాసరావు, డి.సురేష్ తదితరులు ప్రసంగించారు.

కలిసి పనిచేద్దాం.. సవాళ్లను ఎదిరిద్దాం

గ్లోబల్ సౌత్ దేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు ● 'సోషల్ ఇంపాక్ట్ ఫండ్'కు 25 మిలియన్ డాలర్లు ఇస్తామని వెల్లడి

న్యూఢిల్లీ/ఢాకా: ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఏర్పడుతుండడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార, ఇంధన భద్రత విషయంలో సంక్షోభాలను ఎదుర్కోవడానికి కలిసికట్టుగా పనిచేద్దామని గ్లోబల్ సౌత్ దేశాలకు పిలుపునిచ్చారు. ఉమ్మడి శత్రువైన ఉగ్రవాదాన్ని అరికట్టడానికి చేతులు కలుపుదామని సూచించారు. శనివారం వర్చువల్‌గా నిర్వహించిన 'వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్ శిఖరాగ్ర సదస్సు'లో ప్రధాని మోదీ ప్రసంగించారు. గ్లోబల్ సౌత్ దేశాల్లో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కోసం 'సోషల్ ఇంపాక్ట్ ఫండ్'కు 25 మిలియన్ డాలర్లు అందజేయబోతున్నట్లు ప్రకటించారు. పరస్పర వాణిజ్యం, సమగ్రాభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించడమే లక్ష్యంగా తమ శక్తిసామర్థ్యాలను అభివృద్ధి చెందుతున్న దేశాలతో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామని పునరుద్ఘాటించారు.



ఐకమత్యంతోనే మన బలం

కోవిడ్–19 మహమ్మారి ప్రభావం నుంచి ప్రపంచ దేశాలు ఇంకా పూర్తిగా బయటపడలేదని, ఇంతలో యుద్ధాలు ముంచుకొచ్చాయని మోదీ విచారం వ్యక్తంచేశారు. అభివృద్ధికి కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పారు. వాతావరణ మార్పులు, ఆరోగ్య భద్రత, ఆహార భద్రత, ఇంధన భద్రత వంటి సవాళ్లు ఇప్పటికే ఉండగా, టెక్నాలజీకి సంబంధించి కొత్తగా ఆర్థిక, సామాజిక సవాళ్లు మొదలయ్యాయని తెలిపారు. గత శతాబ్దంలో ఏర్పాటైన పాలనా వ్యవస్థలు, ఆర్థిక వ్యవస్థలు ఈ శతాబ్దపు సవాళ్లను పరిష్కరించలేకపోతున్నాయని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ ఒక్కటి కావాలన్నారు. ఒకే గళం వినిపించాలని, ఒకరికొకరు తోడుగా నిలవాలని సూచించారు. ఒకరి అనుభవాలను మరొకరు పాఠాలు నేర్చుకోవాలన్నారు. మన ఐకమత్యంలోనే మన బలం దాగి ఉందన్నారు. ఈ ఐకమత్య బలంతో నూతన దశలో ప్రయాణం సాగించాలని పిలుపునిచ్చారు.

'గ్లోబల్ డెవలప్‌మెంట్ కాంపాక్ట్'

గ్లోబల్ సౌత్ దేశాల ప్రగతి కోసం మానవ కేంద్రీకృత 'గ్లోబల్ డెవలప్‌మెంట్ కాంపాక్ట్' ఏర్పాటు చేద్దామని ప్రధాని మోదీ ప్రతిపాదించారు. భారతదేశ అభివృద్ధి యాత్ర, అభివృద్ధి భాగస్వామ్య అనుభవాలను స్ఫూర్తిగా తీసుకొని వ్యాపారం–వాణిజ్యంతోపాటు సాంకేతికతను పంచుకోవడానికి, అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించుకోవడానికి ఈ వేదిక దోహదపడుతుందని వెల్లడించారు. భాగస్వామ్య దేశాల సమతుల, సుస్థిరాభివృద్ధికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశాలపై మరింత అప్పుల భారం పడకుండా ఇలాంటి చర్యలు అవసరమని పేర్కొన్నారు. ట్రేడ్ ప్రమోషన్ కార్యకలాపాలను బలోపేతం చేయడానికి 2.5 మిలియన్ డాలర్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయబోతున్నామని నరేంద్ర మోదీ ప్రకటించారు. అంతర్జాతీయంగా నెలకొన్న పలు సంఘర్షణలు, ఉద్రిక్తతలకు పరిష్కార మార్గాలు సమగ్ర ప్రపంచాభివృద్ధి, సుస్థిర పాలనలోనే ఉన్నాయని తేల్చిచెప్పారు.

15 వేల అడుగుల ఎత్తు నుంచి..
పోర్టబుల్ ఆస్పత్రి పారా–డ్రాప్

న్యూఢిల్లీ: భారత ఆర్మీ, వైమానిక దళం కలిసి అరుదైన ఘనతను సాధించాయి. పోర్టబుల్ ఆస్పత్రి 'ఆరోగ్య మైత్రి హెల్త్ క్యూబ్'ను 15 వేల అడుగుల ఎత్తు నుంచి విజయవంతంగా లక్షిత ప్రాంతంలో నేలపైకి దింపాయి. అత్యంత ఎత్తులో నుంచి విజయవంతంగా పూర్తి చేసిన ఈ పారా–డ్రాప్ ప్రాజెక్టు ప్రపంచంలోనే మొట్టమొదటిదని రక్షణ శాఖ తెలిపింది. ఇందులోని క్రిటికల్ ట్రామాకేర్ క్యూబ్‌లను భీష్మ(భారత్ హెల్త్ ఇనిషియేటివ్ ఫర్ సహయోగ్ హిత అండ్ మైత్రి)ప్రాజెక్టులో భాగంగా దేశీయంగానే రూపొందించినట్లు వెల్లడించింది. మారుమూల, అటవీ కొండ ప్రాంతాల్లో వరదలు వంటి ప్రకృతి విపత్తులు, అత్యవసర సమయాల్లో బాధితులకు అత్యంత వేగంగా, సమర్థమైన వైద్యసేవలను అందించే లక్ష్యంతో ప్రధాని మోదీ ఆదేశాల మేరకు పోర్టబుల్ ఆస్పత్రికి రూపకల్పన జరిగిందని వివరించింది. ఇందులోనున్న వసతులతో 200 మందికి వైద్య సేవలందించొచ్చని తెలిపింది. ఈ క్యూబ్‌ను అధునాతన రవాణా విమానం సీ–130జే సూపర్ హెర్క్యులస్ ద్వారా అనుకున్న చోట అనుకున్న విధంగా నేలపైకి సురక్షితంగా పారాడ్రాప్ చేసినట్లు రక్షణ శాఖ పేర్కొంది. ఆర్మీ ఇందుకోసం అత్యాధునిక ప్రెసిషన్ డ్రాప్ సాంకేతికతను వినియోగించుకుందని తెలిపింది.





శనివారం ప్రయాగ్‌రాజ్‌లో వైద్యుల నిరసన ర్యాలీ

వైద్యుల భద్రతపై కమిటీ

- రాష్ట్ర ప్రభుత్వాలు, వైద్య సంఘాలు సలహాలు సూచనలు ఇవ్వొచ్చు
- కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటన

న్యూఢిల్లీ: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య.. తదనంతరం దేశవ్యాప్తంగా వైద్య సిబ్బంది ఆందోళన, నిరసన కార్యక్రమాల ఉధృతం అవుతుండడం, ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలిచిపోతుండడంతో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందికి తగిన భద్రత కల్పించడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టంచేసింది. వారి భద్రతకు ఎలాంటి చర్యలు చేపట్టాలన్న దానిపై సిఫార్సులు చేయడానికి ఒక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు, వైద్య సంఘాలు, ఇతర భాగస్వామ్య పక్షాలన్నీ ఈ కమిటీకి సలహాలు సూచనలు ఇవ్వొచ్చని, అభిప్రాయాలు తెలియజేయవచ్చని వెల్లడించింది. వైద్య సిబ్బంది వెంటనే విధుల్లో చేరాలని, రోగులకు చికిత్స అందించాలని కేంద్ర ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా డెంగ్యూ కేసులు పెరిగిపోతున్న సమయంలో డాక్టర్లు అందుబాటులో వైద్య సేవలు నిలిపివేయడం సరైంది కాదని సూచించింది.

ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలి: ఐఎంఏ

కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటనను నిశితంగా పరిశీలిస్తున్నామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెలియజేసింది. అన్ని రాష్ట్రాల్లోని తమ ప్రతినిధులతో చర్చించి, తమ నిర్ణయం వెల్లడిస్తామని స్పష్టంచేసింది. హాస్పిటల్స్‌ను సేఫ్ జోన్లుగా ప్రకటించాలని, తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని, వైద్య సిబ్బందిపై హింస జరగకుండా ఒక చట్టం తీసుకురావాలని ఐఎంఏ డిమాండ్‌చేసింది. తమ డిమాండ్ల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని కోరింది.

రెండో రోజు విచారణకు హాజరైన సందీప్ ఘోష్

జూనియర్ డాక్టర్ పట్ల జరిగిన అమానవీయ ఘటనపై సీబీఐ దర్యాప్తు కొనసాగిస్తోంది. అనుమానితులను పిలిపించి ప్రశ్నిస్తోంది. ఘాతకం జరిగిన ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ వరుసగా రెండో రోజు శనివారం కూడా సీబీఐ ఎదుట హాజరయ్యారు. సీబీఐ అధికారుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. జూనియర్ డాక్టర్ హత్య కేసులో అరెస్టయిన సంజయ్ రాయ్‌కి సైకలాజికల్ పరీక్షలు నిర్వహించాలని సీబీఐ అధికారులు నిర్ణయించారు. ఈ పరీక్షల కోసం ఢిల్లీ సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీ బృందం కోల్‌కతాకు చేరుకుంది.

దేశవ్యాప్తంగా స్తంభించిన వైద్య సేవలు

ఐఎంఏ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బంది శనివారం రోడ్డెక్కారు. తమకు భద్రత కల్పించాలని, తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అత్యవసరం కాని ఇతర వైద్య సేవలను నిలిపివేశారు. ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర, హరియాణా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు చాలావరకు నిలిచిపోయాయి.



కోల్‌కతాలోని ఓ ఆస్పత్రిలో బోసిపోయిన ఓపీడీ

సిద్ధూ మెడకు 'ముడా' ఉచ్చు

- సిద్ధరామయ్యపై విచారణకు ఆదేశించిన కర్ణాటక గవర్నర్ గెహ్లోత్
- నైతిక బాధ్యతగా రాజీనామా చేయాలన్న విపక్ష బీజేపీ
- రాజీనామా చేసేంత తప్పేమీ చేయలేదన్న ముఖ్యమంత్రి

సాక్షి, బెంగళూరు: మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ(ముడా) భూముల కేటాయింపుల వివాదం చివరకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మెడకు చుట్టుకుంటోంది. ఖరీదైన భూములు భార్య పార్వతికి దక్కేలా సిద్ధరామయ్య కుట్ర చేశారని సమాచార హక్కు చట్టం కార్యకర్తలు టీజే అబ్రహాం, ఎస్పీ ప్రదీప్, స్నేహమయి కృష్ణ చేసిన అభ్యర్థనపై రాష్ట్ర గవర్నర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఏకంగా ముఖ్యమంత్రిపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లోత్ శనివారం అనుమతి ఇచ్చినట్లు రాజ్‌భవన్ ప్రకటించింది. దీంతో సిద్ధూపై కేసు నమోదుచేసి పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టే అవకాశముంది. '' నాకు అందిన పిటిషన్ ప్రకారం భూకేటాయింపుల్లో అక్రమాలపై ప్రాథమిక ఆధారాలున్నాయి. మీపై విచారణకు ఎందుకు ఆదేశించకూడదో 7 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని సీఎంకు గత నెల 26న షోకాజ్ నోటీసు ఇచ్చా. దాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర మంత్రి మండలి చేసిన తీర్మానంలో హేతుబద్ధత లేదు. కేసు విచారణ పారదర్శకంగా జరగాలి. హడావిడిగా మాజీ ఐఏఎస్ వెంకటాచలపతి ఆధ్వర్యంలో విచారణ కమిటీ, హైకోర్టు విశ్రాంత జడ్జి పీఎస్ దేశాయ్ ఆధ్వర్యంలో విచారణ కమిషన్‌ను ఏర్పాటుచేయడం చూస్తుంటే ఇందులో భారీ అవకతవకలు జరిగినట్లు భావించవచ్చు'' అని గవర్నర్ గెహ్లోత్ వ్యాఖ్యానించారు. అయితే గవర్నర్ ఉత్తర్వులను రద్దుచేయాలంటూ సిద్ధరామయ్య హైకోర్టును ఆశ్రయిస్తే ఆ కేసు విచారణ సందర్భంగా తమ వాదనలు సైతం వినాలంటూ ఫిర్యాదుదారుల్లో ఒకరైన ప్రదీప్ శనివారం కర్ణాటక హైకోర్టులో కెవియట్ పిటిషన్ దాఖలుచేశారు. 21వ తేదీన ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టులోనూ కేసు వేస్తానని టీజే అబ్రహాం చెప్పారు.

తీవ్రంగా తప్పుబట్టిన సిద్ధరామయ్య

తనపై దర్యాప్తునకు గవర్నర్ ఆదేశించడాన్ని సీఎం తీవ్రంగా తప్పుబట్టారు. నైతిక బాధ్యతగా రాజీనామా చేయాలన్న బీజేపీ డిమాండ్‌పై స్పందించారు. ''గవర్నర్ కేంద్రప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారారు. చట్టవ్యతిరేక ఉత్తర్వులిచ్చి రాజ్యాంగబద్ధ పదవిని ఆయన దుర్వినియోగం చేస్తున్నారు. ఉత్తర్వులపై చట్టప్రకారం పోరాడతా. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్ర పన్నారు. కేంద్రం, బీజేపీ, జేడీ(ఎస్) ఇందులో కీలక పాత్రధారులు. మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల మద్దతు నాకు ఉంది. నేను రాజీనామా చేయాల్సినంత తప్పేమీ చేయలేదు. మైనింగ్ లైసెన్స్‌ల కుంభకోణంలో జేడీఎస్ నేత, ప్రస్తుత కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామిపై లోకాయుక్త దర్యాప్తునకు కోరితే ఆయనపై విచారణకు ఆదేశించలేదుగానీ నాపై ఆగమేఘాల మీద విచారణకు ఆదేశించారు. ఫిర్యాదులున్నా బీజేపీ మాజీ కేంద్ర మంత్రులు శశికళ జోశి, మురుగేశ్ నీలాని, జనార్దన్ రెడ్డిలపై దర్యాప్తునకు ఎందుకు ఆదేశాలివ్వలేదు?'' అని సీఎం అన్నారు.

విమర్శలు ఎక్కుపెట్టిన బీజేపీ

విచారణను ఎదుర్కొంటున్న సిద్ధరామయ్యకు సీఎంగా కొనసాగే అర్హత లేదని, రాజీనామా చేయాలని రాష్ట్రంలో విపక్ష బీజేపీ డిమాండ్‌చేసింది. ఆయన దిగిపోతేనే దర్యాప్తు పారదర్శకంగా సాగుతుందని కర్ణాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర అన్నారు. ''కాంగ్రెస్ వంచనకు, కుటుంబ రాజకీయాలకు ఈ స్కామ్ మరో మచ్చుతునక. దళితులకు అండగా ఉంటామనే సీఎం స్వయంగా దళితుల భూములను లాక్కున్నారు'' అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వ్యాఖ్యానించారు. దాదాపు రూ.4,000–5,000 కోట్ల భూకుంభకోణానికి పాల్పడ్డారని బీజేపీ నేతలు ఆరోపించారు.

బీజేపీయేతర ప్రభుత్వాలను వేధిస్తున్నారు: ఖర్గే

ప్రతిపక్షాలపాలిత రాష్ట్రాలను మోదీ సర్కార్ నియమించిన గవర్నర్లు తీవ్రంగా వేధిస్తున్నారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. '' ఏకంగా సీఎం మీదనే విచారణకు ఆదేశించేంత తప్పు ఏం జరిగింది?. ఏ కారణాలు చెప్పి దర్యాప్తునకు అనుమతి ఇచ్చారు?. పశ్చిమబెంగాల్, కర్ణాటక, తమిళనాడు ఇలా బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న చోట్ల గవర్నర్లు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందుల పాల్జేస్తున్నారు'' అని ఖర్గే అన్నారు.



ఏమిటీ ముడా భూవివాదం?

సిటీ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్ట్ బోర్డ్‌గా 1904లో ఏర్పాటై తదనంతరకాలంలో మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)గా అవతరించిన సంస్థ ఇప్పుడు భూకేటాయింపుల వివాదంలో కేంద్రబిందువుగా నిలిచింది. కెసెరె గ్రామంలో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి 3 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. ఈ గ్రామంలో దేవనార్ 3ఫేజ్ లేఅవుట్ కోసం ముడా ఈ భూమిని సేకరించింది. నష్టపరిహారంగా 2021లో మైసూర్‌లోని విజయనగర మూడో, నాలుగో ఫేజ్ లేఅవుట్లలో 38,284 చదరపు అడుగుల విస్తీర్ణంలో 14 ప్లాట్లను కేటాయించింది. అయితే పార్వతి నుంచి తీసుకున్న భూముల కంటే కేటాయించిన ప్లాట్ల విలువ రూ.45 కోట్లు ఎక్కువ అని ఆర్టీఐ కార్యకర్త అబ్రహాం లోకాయుక్త పోలీసులకు ఫిర్యాదుచేయడంతో కేటాయింపుల అంశం వార్తల్లోకెక్కింది. కెసెరె భూమిని పార్వతికి ఆమె సోదరుడు మల్లిఖార్జున స్వామి 2010 అక్టోబర్‌లో బహుమతిగా ఇచ్చాడు. ప్రభుత్వం సేకరించాక 2014 జూన్‌లో నష్టపరిహారం కోసం పార్వతి దరఖాస్తు చేసుకున్నారు. ప్లాట్ల కేటాయింపుపై సిద్ధూ గతంలోనే స్పష్టతనిచ్చారు. ''2014లో నేను సీఎంగా ఉన్నపుడు పరిహారం కోసం దరఖాస్తు చేసుకుంటే సీఎంగా ఉన్నంతకాలం ఆ పరిహారం ఇవ్వడం కష్టమని అధికారులు చెప్పారు. బీజేపీ అధికారంలో ఉన్నపుడు 2021లో మళ్లీ దరఖాస్తు చేసుకుంటే ఈ ప్లాట్లను కేటాయించారు'' అని సిద్ధూ అన్నారు. అయితే గతంలో ముడా 50: 50 పేరిట ఒక పథకాన్ని అమలుచేసింది. నిరుపయోగ భూమి తీసుకుంటే వేరే చోట 'అభివృద్ధి చేసిన' స్థలాన్ని కేటాయిస్తారు. ప్రతీ కేటాయింపు ముడా బోర్డు దృష్టికి తేవాలి. అయితే కొందరు ముడా అధికారులతో చేతులు కలిపి, బోర్డు దృష్టికి రాకుండా, పథకంలోని లోపాలను వాడుకుని సిద్ధరామయ్య కుటుంబం ఎక్కువ ప్లాట్లను రాయించుకుందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. లోపాలున్న పథకాన్ని 2023 అక్టోబర్‌లో రద్దుచేశారు. అయితే తన భూమికి ఎక్కువ విలువ ఉంటుందని రూ.62 కోట్ల నష్టపరిహారం కావాలని సిద్ధరామయ్య ఈఏడాది జూలై నాలుగున డిమాండ్ చేయడం విశేషం. అయితే అసలు ఈ భూమి పార్వతి సోదరుడు మల్లికార్జున స్వామిది కాదని, అక్రమంగా ఫోర్జరీ పత్రాలు సృష్టించి 2004లో తన పేరిట రాయించుకున్నాడని ఆరోపణలున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

అదనంగా 14.8 కోట్ల ఉద్యోగాలు

2030 నాటికి సృష్టించాల్సిన అవసరం ఉంది: గీతా గోపీనాథ్



న్యూఢిల్లీ: 'ఉపాధి కల్పనలో భారత్ జీ20 దేశాలలో వెనుకబడి ఉంది. జనాభా పెరుగుదల దృష్ట్యా 2030 నాటికి దేశం అదనంగా 14.8 కోట్ల ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం ఉంది' అని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ఫస్ట్ డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ శనివారం తెలిపారు. 2010–20 మధ్య భారత్ సగటున 6.6 శాతం వృద్ధిని సాధించిందని, అయితే ఉపాధి రేటు 2 శాతం కంటే తక్కువగా ఉందని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ వజ్రోత్సవంలో పాల్గొన్న సందర్భంగా గీత చెప్పారు. మరిన్ని ఉద్యోగాలను సృష్టించేందుకు ప్రైవేట్ పెట్టుబడులు పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. వ్యాపారాన్ని మరింత సులభతరం చేయడం, నియంత్రణ వాతావరణాన్ని మెరుగుపరచడం, ట్యాక్స్ బేస్‌ను విస్తృతం చేయడం అవసరమని తెలిపారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్ ఒక కీలక దేశంగా ఉండాలనుకుంటే దిగుమతి సుంకాలను తగ్గించాల్సిందేనని స్పష్టం చేశారు.

ప్రజా పద్దుల కమిటీ చైర్మన్‌గా వేణుగోపాల్



న్యూఢిల్లీ: ప్రభుత్వ ఖర్చులను క్షుణ్ణంగా అధ్యయనం చేసే కీలకమైన ప్రజాపద్దుల కమిటీ(పీఏసీ) చైర్మన్‌గా కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్‌ను నియమించినట్లు లోక్‌సభ సచివాలయం శుక్రవారం పేర్కొంది. అంచనాలు, ప్రభుత్వ సంస్థల కమిటీలుసహా 4 కొత్త కమిటీలకు చైర్మన్‌లుగా బీజేపీ నేతలను నియమిస్తూ లోక్‌సభ స్పీకర్ బిర్లా నిర్ణయం తీసుకున్నారు. ఆర్థికసంబంధాలకు సంబంధించి పీఏసీ, అంచనాలు, ప్రభుత్వ సంస్థల కమిటీలను ముఖ్యమైనవిగా పరిగణిస్తారు. ప్రభుత్వ చేస్తున్న ఖర్చులు, ప్రభుత్వరంగ సంస్థల సమర్థ నిర్వహణ వ్యవహారాలను ఈ కమిటీలు అధ్యయనం చేస్తాయి. ఓబీసీల సంక్షేమ కమిటీకి బీజేపీ నేత గణేశ్ సింగ్, ఎస్సీఎస్టీల సంక్షేమ కమిటీకి బీజేపీ నేత ఫగాన్ సింగ్ కులస్తే చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. అంచనా కమిటీకి బీజేపీ నేత సంజయ్ జైశ్వాల్, ప్రభుత్వ సంస్థల కమిటీకి చైర్మన్‌గా బీజేపీ నేత బైజయంతీ పాండాను నియమించారు.

ఉమ్మడి పౌరస్మృతి ఆమోదయోగ్యం కాదు

ముస్లిం పర్సనల్ లా బోర్డు

న్యూఢిల్లీ: ఉమ్మడి పౌరస్మృతి ముస్లింలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పేర్కొంది. ముస్లిం పర్సనల్ లా విషయంలో తాము రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి మాట్లాడుతూ 'లౌకిక పౌరస్మృతి' తేవాల్సిన అవసరం ఉందన్న విషయం తెలిసిందే. మతపరమైన పౌరస్మృతిగా పర్సనల్ చట్టాలను మోదీ అభివర్ణించడంపై ముస్లిం బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. లౌకిక పౌరస్మృతి పక్కా ప్రణాళికతో కూడిన కుట్రని, తీవ్ర విపరిణామాలుంటాయని ముస్లిం బోర్డు అధికార ప్రతినిధి ఎస్.క్యూ.ఆర్. ఇలియాస్ అన్నారు.

భారత సంతతి వ్యాపారి కాల్చివేత



వాషింగ్టన్: దోపిడీకి యత్నించిన దుండగుడు భారతసంతతికి చెందిన దుకాణదారును కాల్చిచంపాడు. ఈ ఘటన అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రం రొవాన్ కౌంటీలో చోటుచేసుకుంది. మైనాంక్ పటేల్(36) టొబాకో హౌస్ స్టోర్ పేరుతో దుకాణం నడుపుతున్నారు. మంగళవారం ఉదయం షాట్‌గన్‌తో దుకాణంలోకి ప్రవేశించిన శ్వేతజాతీయుడైన బాలుడు మైనాంక్‌పై విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. బాలుడిని కొద్ది గంటల్లోనే అదుపులోకి తీసుకున్నారు.

పట్టాలు తప్పిన సబర్మతి ఎక్స్‌ప్రెస్

ప్రయాణికులంతా సురక్షితం



కాన్పూర్/న్యూఢిల్లీ: వారణాసి–అహ్మదాబాద్ మధ్య నడిచే సబర్మతి ఎక్స్‌ప్రెస్ శనివారం యూపీలో పట్టాలు తప్పింది. పట్టాలపైనున్న ఒక వస్తువు రైలింజిన్‌ను బలంగా తాకడంతో 20 బోగీలు పట్టాలు తప్పాయి. కాన్పూర్–భీమ్‌సేన్ రైల్వే స్టేషన్ల మధ్య తెల్లవారు జామున 2.35 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పెద్ద శబ్దంతో బోగీలు ఊగుతూ, రైలు నిలిచిపోవడంతో నిద్రలో ఉన్న ప్రయాణికులంతా ఉలిక్కిపడి లేచారు. ఘటనలో ఎవరికీ ఎటువంటి అపాయం వాటిల్లలేదని రైల్వే అధికారులు తెలిపారు. ఘటన అనంతరం ప్రయాణికులందరినీ బస్సుల్లో కాన్పూర్ రైల్వే స్టేషన్‌కు, అక్కడికి నుంచి వేరే రైళ్లలో గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

కుట్ర కోణంలో దర్యాప్తు

'రైలు పట్టాలపైనున్న ఓ వస్తువు ఇంజిన్‌ను తాకినట్లు ఆనవాళ్లున్నాయి. అన్ని ఆధారాలను అధికారులు సేకరిస్తున్నారు. యూపీ పోలీసులతోపాటు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు దర్యాప్తు చేపట్టారు'అని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'బండరాయి వంటిదేదో గట్టిగా గుద్దుకోవడంతో ఇంజిన్ ముందు భాగం తీవ్రంగా దెబ్బతిని, వంగిపోయినట్లు లోకో పైలట్ చెబుతున్నారు. 16వ బోగీ సమీపంలో మాకు దొరికిన వస్తువే ఇంజిన్ దెబ్బతినేందుకు కారణమై ఉండొచ్చు. ఇది సంఘ వ్యతిరేక శక్తుల పని'గా అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రాణాను భారత్‌కు అప్పగించవచ్చు

అమెరికా కోర్టు ఆఫ్ అప్పీల్స్ తీర్పు



వాషింగ్టన్: 2008 నాటి ముంబై ఉగ్రవాద దాడుల కేసులో ప్రధాన నిందితుడైన తహవ్వుర్ హుస్సేన్ రాణా విషయంలో అమెరికా కోర్టులో భారత అనుకూల తీర్పు వెలువడింది. ఆయనను విచారణ నిమిత్తం భారత్‌కు అప్పగించవచ్చని అమెరికాలోని కాలిఫోర్నియా కోర్టు ఆఫ్ అప్పీల్స్ స్పష్టం చేసింది. రాణాను భారత్‌కు అప్పగించేందుకు భారత్, అమెరికా దేశాల మధ్య అమల్లో ఉన్న నేరగాళ్ల అప్పగింత ఒప్పందం అనుమతి ఇస్తోందని తేల్చిచెబుతూ ఈ నెల 15వ తేదీన న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈ ఒప్పందం కింద తనను భారత్‌కు అప్పగించడం సాధ్యం కాదంటూ రాణా చేసిన వాదనను న్యాయస్థానం తిరస్కరించింది. 2008 నవంబర్ 26వ తేదీన ముంబైలో 10 మంది పాకిస్తాన్ ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు అమెరికన్ పౌరులు సహా మొత్తం 166 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ దాడులకు నిధులు సమకూర్చినట్లు పాకిస్తాన్ జాతీయుడైన తహవ్వుర్ రాణాపై పలు ఆరోపణలున్నాయి. ఉగ్రవాద దాడులకు ప్రధాన సూత్రధారి అయిన లష్కరే తోయిబా ఉగ్రవాది డేవిడ్ కోల్‌మన్ హెడ్లీతో ఇతడికి సన్నిహిత సంబంధాలున్నాయి. ముంబై ఉగ్రవాద దాడుల కేసులో రాణా ప్రస్తుతం అమెరికాలోని లాస్ ఏంజెలెస్ జైలులో ఉన్నాడు. రాణాను తమకు అప్పగించాలని భారత దర్యాప్తు సంస్థలు చాలా సంవత్సరాలుగా కోరుతున్నాయి. అయితే, కోర్టు ఆఫ్ అప్పీల్స్ తీర్పుపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు అతడికి వెసులుబాటు ఉందని చెబుతున్నారు.

కమలా హారిస్‌పై తులసి అస్త్రం!

డిబేట్ కోసం ట్రంప్‌కు తర్ఫీదు



వాషింగ్టన్: ఒక డిబేట్‌తో బైడెన్‌ను అధ్యక్ష రేసు నుంచే వైదొలిగేలా చేసిన రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ కొత్త ప్రత్యర్థిపై పైచేయి సాధించేందుకు పెద్ద కసరత్తే చేస్తున్నారు. సెప్టెంబరు 10న ట్రంప్, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ మధ్య ఏబీసీ ఛానల్‌లో అధ్యక్ష చర్చ జరగనున్న విషయం తెలిసిందే. దీంట్లో కమలను ఏయే అంశాల్లో ఇరుకున పెట్టొచ్చనే అంశంలో తనకు మార్గనిర్దేశనం చేయడానికి మాజీ డెమొక్రాట్ (ప్రతినిధుల సభ మాజీ సభ్యురాలు), హిందూ– అమెరికన్ తులసి గబార్డ్ సహాయం తీసుకుంటున్నారు ట్రంప్. ఫ్లోరిడాలోని ట్రంప్‌కు చెందిన గోల్ఫ్ రిసార్ట్స్‌లో తులసి ఆయనకు సహాయపడుతున్నారు. 'రాజకీయ చరిత్రలోనే మంచి డిబేటర్లలో ఒకరిగా ట్రంప్ పేరుగాంచారు. జో బైడెన్‌ను నాకౌట్ చేశారు. చర్చకు సన్నద్ధం కావాల్సిన అవసరం ట్రంప్‌కు లేదు. అయితే విధానపరమైన సలహాదారులను, తులసి గబార్డ్ లాంటి సమర్థులైన వక్తలను కలుస్తూనే ఉంటారు' అని ట్రంప్ ప్రతినిధి కరోలిన్ లీవిట్ తెలిపారు. అయితే 2016, 2020ల కంటే ఈసారి డిబేట్‌లకు సిద్ధమవడానికి ట్రంప్ అధిక సమయం వెచ్చిస్తున్నారని న్యూయార్క్ టైమ్స్ పత్రిక తెలిపింది. 2020 డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వానికి బైడెన్‌తో పోటీపడిన వాళ్లలో కమలా హారిస్, తులసి గబార్డ్‌లు కూడా ఉన్నారు. ప్రైమరీల్లో భాగంగా 2019 జూలైలో హారిస్, తులసిల మధ్య డిబేట్ జరిగింది. దీంట్లో కమలా హారిస్‌ను తులసి తీవ్రంగా ఇరుకున పెట్టి పైచేయి సాధించారు.

సూడాన్‌లో 85 మంది ఊచకోత

ఖార్టూమ్: సూడాన్‌లో పారా మిలటరీ మూకలు గురువారం సిన్నార్ రాష్ట్రంలోని జల్క్నీ గ్రామంపై దాడిచేసి బాలికలను కిడ్నాప్ చేసేందుకు యత్నించగా గ్రామస్థులు ప్రతిఘటించారు. దీంతో మూకలు గ్రామాన్ని ఐదు రోజులపాటు ముట్టడించి 85 మందిని చంపేశారని మీడియా తెలిపింది. సిన్నార్ కోసం సైన్యం, మూకల మధ్య సాగుతున్న పోరుతో ఇన్నేళ్లలో 7.25 లక్షల మంది ప్రజలు వలస వెళ్లారు.

రక్తమోడుతున్న గాజా
ఒకే కుటుంబంలో 18 మంది మృతి

డెయిర్ అల్ బలాహ్: ఇజ్రాయెల్ సైన్యం యథేచ్ఛగా జరుపుతున్న దాడులతో గాజా ప్రాంతం రక్తమోడుతోంది. శనివారం ఉదయం జవైదా పట్టణంలోని ఓ నివాసంతోపాటు పక్కనే ఉన్న శరణార్థులు తలదాచుకున్న భవనంపై ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన దాడిలో సమీ జవాద్ అల్ ఎజ్లా, అతడి కుటుంబంలోని 18 మంది మృత్యువాతపడగా, మరో వ్యక్తి గాయపడ్డారు. మృతులను సమీ ఇద్దరు భార్యలు, 2 నుంచి 22 ఏళ్ల వయస్సున్న 11 మంది సంతానం, వారి అమ్మమ్మ, మరో ముగ్గురు బంధువులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఇజ్రాయెల్ నుంచి గాజాలోకి చేపలు, మాంసం తరలించే ప్రక్రియకు సమీ సమన్వయకర్తగా వ్యవహరించేవాడని, చాలా మంచి వ్యక్తని చెప్పారు. ఘటన సమయంలో రెండు భవనాల్లో కలిపి 40 మంది వరకు ఉన్నట్లు వివరించారు. ఇలా ఉండగా, సెంట్రల్ గాజాలోని మఘాజీ శరణార్థి శిబిరం చుట్టుపక్కల ప్రాంతాలను ఖాళీ చేయాల్సిందిగా ఇజ్రాయెల్ ఆర్మీ శనివారం పాలస్తీనియన్లను హెచ్చరించింది. ఆ ప్రాంతం వైపు నుంచే తమ భూభాగం మీదికి మిలిటెంట్లు రాకెట్లు ప్రయోగిస్తున్నారని పేర్కొంది.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి
10 మంది మృతి

బీరూట్: లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడిలో 10 మంది సిరియన్ దేశస్తులు ప్రాణాలు కోల్పోయారు. నబాటియే ప్రావిన్స్‌లోని వదీ అల్–కెఫార్‌పై ఈ దాడి జరిగింది. మిలిటెంట్ సంస్థ హెజ్బొల్లా ఆయుధ డిపో లక్ష్యంగా దాడి చేపట్టినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఆ ప్రాంతంలో సామగ్రి తయారీ యూనిట్ ఉందని స్థానికులు తెలిపారు. బాధితులంతా సిరియా నుంచి వచ్చి ఆశ్రయం పొందుతున్నవారేనన్నారు.

కీల్పాక్కం వైద్య కళాశాల ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం

సాక్షి, చెన్నై: చెన్నై కేఎంసీలో ఆస్పత్రిలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. కీల్పాక్కం వైద్య కళాశాల ఆస్పత్రిలో రోజూ వేలాది మంది రోగులు చికిత్సకు వస్తుంటారు. ఈ ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న ఆరు అంతస్తుల పాత భవనంలోని సెకెండ్ ఫ్లోర్‌లో శనివారం అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదం కారణంగా ఇన్ పేషంట్లు ఉన్న వార్డులో నల్లటి పొగ అలముకుంది. దీంతో రోగులకు శ్వాస తీసుకోవడంలో సమస్య ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. కాగా, అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ప్రమాద కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

న్యూస్‌రీల్

'నీట్'కు మరో విద్యార్థి బలి



సాక్షి, చెన్నై : నీట్ పరీక్ష తప్పిన ఓ విద్యార్థి తంజావూరులో ఆత్మహత్యకు పాల్పడడం శనివారం వెలుగులోకి వచ్చింది. ఈ మరణానికి కేంద్రమే బాధ్యత వహించాలని ఎండీఎంకే నేత వైగో డిమాండ్ చేశారు. ఇకనైనా నీట్‌ను రద్దు చేయాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళని స్వామి కోరారు. తమిళనాడులో నీట్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలు, విద్యార్థుల బలవన్మరణాల గురించి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో తంజావూరుకు చెందిన సెంథిల్ కుమార్, శాంతి దంపతుల కుమారుడు ధనుష్ (21) గత మూడేళ్ల నుంచి నీట్ పరీక్ష రాస్తూ వస్తున్నాడు. అయితే ఆశించిన మేరకు మార్కులు రాకపోవడంతో మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు. నీట్‌లో తప్పినా, తక్కువ మార్కులు వచ్చినా ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని విద్యార్థులకు ఎండీఎంకే నేత వైగో, అన్నాడీఎంకే నేత పళని స్వామి వేరువేరు ప్రకటనల్లో కోరారు. నీట్ రద్దుకు త్వరతగతిని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తిరుచ్చిలో 20న ఈపీఎస్ ఆందోళన

సాక్షి, చెన్నై : తిరుచ్చిలో భూగర్భ డ్రైనేజీ పథకం వంటి పలు పథకాలను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20 ఆందోళన చేపట్టనున్నట్టు ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి వెల్లడించారు. ఈ విషయంగా ఆయన శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. అందులో.. ''తిరుచ్చి కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాలలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు పనులు గత మూడేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. ఈ కారణంగా అన్ని రోడ్లలో వాహన రాకపోకలకు, జన సంచారం చేయలేని స్థితి నెలకొంది. తిరుచ్చి కార్పొరేషన్ ప్రాంతాలలోని కులాయిలలో తాగునీటితో పాటు మురికి నీరు కూడా కలిసి వస్తున్నాయి. ఇక్కడ కల్ల వీధి, రాణి వీధి, పెరియ సౌరాష్ట్ర వీధి, సందకడై, కొత్తమంగళం, పీరంగికుళం వీధి, అల్లిమాల్ వీధి వంటి పలు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకు డెంగీ, పచ్చి కామెర్లు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో తిరుచ్చిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ స్థితిలో భూగర్భ డ్రైనేజీ వంటి పలు పథకాలను త్వరితగతిన పూర్తి చేయాలంటూ అన్నాడీఎంకే తిరుచ్చి నగర జిల్లా పార్టీ తరపున ఈనెల 20న మరక్కడై ఎంజీఆర్ విగ్రహం వద్ద భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించనుంది.'' అని వెల్లడించారు.

ఎన్ఐఏ సోదాలు

సాక్షి, చెన్నై : చెన్నైలోని రాయపేట పరిసరాలలో శనివారం జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు విస్తృత సోదాలలో నిమగ్నమయ్యారు. వివరాలు.. రాయపేటలో తీవ్రవాద సంస్థలకు మద్దతుగా ప్రచారం సాగుతోన్నట్టు, యూట్యూబ్ ద్వారా సైతం మద్దతుదారులను ఆహ్వానిస్తున్నట్టుగా వచ్చిన సమాచారంతో ఈనెల మొదటి వారంలో ఆరుగురిని చెన్నై సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును ఎన్ఐఏకు అప్పగించారు. దీంతో కేసుకు సంబంధించిన అన్ని వివరాలతో రికార్డులను ఎన్ఐఏ అధికారులు క్రైం బ్రాంచ్ నుంచి చేజిక్కించుకున్నారు. కేసు విచారణను మరింత ముమ్మరం చేస్తూ శనివారం సోదాల్లో నిమగ్నమయ్యారు. రాయపేట పరిధిలో నిందితులు పట్టుబడ్డ కల్యాణ మండపం, ఆ పరిసరాల్లోని కొన్ని గృహాలలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు.

మదురైకు కర్ణాటక గాంధీ



భారత 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్ణాటక గాంధీగా గుర్తింపు పొందిన ముత్తన్నా పాదయాత్ర చేపట్టారు. మహాత్మా గాంధీజీ కీర్తిని చాటి చెప్పేతూ ఆయన కర్ణాటకలోని తన స్వగ్రామం కరిక్కికట్టి నుంచి పాదయాత్రగా బయలుదేరారు. ఈ క్రమంలో సుమారు 1,300 కిలో మీటర్ల దూరం పయనించిన ముత్తన్నా శనివారం మదురైకి చేరుకున్నారు. ఆయనకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. - సాక్షి, చెన్నై

దేశంలో తొలి ప్రభుత్వ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్



దేశంలోనే ప్రప్రథమంగా చెన్నై శివారులోని శ్రీపెరంబుదూరులో రాష్ట్ర ప్రభుత్వం, పాక్స్‌కాన్ సంస్థ సంయుక్తంగా బ్రహ్మాండ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. శ్రీపెరంబుదూరు పరిసరాల్లోని పారిశ్రామిక వాడలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పని చేసే మహిళల కోసం ఇది రూపుదిద్దుకుంది. రూ. 706 కోట్లతో నిర్మించిన ఈ హాస్టల్‌లో 18 వేల మంది బస చేయడానికి వసతులు ఉన్నాయి. దీన్ని సీఎం స్టాలిన్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. - సాక్షి, చెన్నై

ఆరున్నర దశాబ్దాల అన్నదాతల కల నెరవేరింది. వర్షాభావ పరిస్థితుల్లో అవస్థలు పడే రైతుకు స్వాంతన చేకూరింది. అత్తి కడవు- అవినాశి తాగునీటి పథకాన్ని ప్రజలకు శనివారం చెన్నై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ఎంకే స్టాలిన్ అంకితం చేయడంతో కొంగు మండలంలోని మూడు జిల్లాలో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నో పోరాటాలు, నిరసనలు, ధర్నాల తర్వాత ఎట్టకేలకూ ఈరోడ్, తిరుపూర్, కోయంబత్తూరు జిల్లాల ప్రజల కల సాకారమైంది.

'కొంగు' బంగారం

భవాని నదీతీరంలో అత్తికడవు - అవినాశి ప్రాజెక్టు వ్యూ, (ఇన్‌సెట్) పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్





కల సాకారం
- అత్తి కడవు – అవినాశి తాగునీటి పథకాన్ని ప్రారంభించిన సీఎం స్టాలిన్
- 65 ఏళ్ల పోరాటానికి దక్కిన ఫలితం
- కోవై, ఈరోడ్, తిరుపూర్ జిల్లాల్లో మిన్నంటిన సంబరాలు
- సమష్టి కృషితోనే సాధ్యమైందని కితాబు

సాక్షి, చెన్నై: ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 65 ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కింది. వర్షాభావ పరిస్థితులతో ఎదురయ్యే కరువు కాలంలో తమను ఆదుకునేందుకు కొత్త తాగునీటి పథకం అమలులోకి రావడంతో ఈరోడ్, తిరుపూర్, కోయంబత్తూరు జిల్లాల ప్రజలు, అన్నదాతలలో ఆనందం వెల్లి విరిసింది. అత్తి కడవు- అవినాశి తాగునీటి పథకంను ఆ మూడు జిల్లాల ప్రజలకు శనివారం చెన్నై నుంచీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ఎంకే స్టాలిన్ అంకితం చేశారు. వివరాలు.. తమిళనాడులో కొంగు మండలంగా పిలవ బడే జిల్లాలో కోయంబత్తూరు, ఈరోడ్, తిరుపూర్ ప్రధానమైనవి. వస్త్ర ఉత్పత్తి రంగంలో ఈరోడ్, తిరుప్పూర్ నగరాలు దూసుకెళ్తున్నా, అభివృద్ధి పథంలో కోయంబత్తూరు నగరం పైపైకి వెళుతున్నా.... ఇక్కడ వ్యవసాయం అన్నది ప్రజల ప్రధాన జీవనాధారం. పశ్చిమ కనుమల వెంబడి ఉన్న ఈ జిల్లాల పరిధిలోని గ్రామాలు పచ్చటి పంట పొలాలతో నిండి ఉంటాయి. ఒకప్పుడు ఈ పరిసరాలు సినీ షూటింగ్‌లకు ప్రసిద్ధి చెందినవే. పశ్చిమ కనుమలలో వర్షాలు పడితే ఇక్కడకు సంవృద్ధిగా నీళ్లు వస్తాయి. లేదా కరువు కోరల్లో చిక్కుకోవాల్సిందే. పశ్చిమ కనుమల నుంచి ప్రవహించే భవానీ నది, దాని ఉప నదుల నీళ్లు ఇక్కడి వ్యవసాయానికి కీలకం. వర్షాభావ పరిస్థితులతో కరువు కోరలలో చిక్కుకునే గ్రామీణ రైతాంగం 1957లోనే అప్పటి సీఎం దివంగత కామరాజర్ దృష్టికి తమకంటూ ఒక తాగు నీటి పథకం కోసం విన్నవించుకుంది. అయితే ఇది కార్యారూపం దాల్చేందుకు అక్కడి రైతాంగం ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 65 ఏళ్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కరుణ హయాంలో కార్యాచరణ

కొంగు మండలంలో తమ బలం పెంచుకునేందుకు దివంగత సీఎం కరుణానిధి తీవ్రంగానే కుస్తీలు పడుతూ వచ్చారు. 1972లో అత్తికడవు –అవినాశి తాగు నీటి పథకం కోసం కార్యాచరణ సిద్ధం చేశారు. పశ్చిమ కనుమలలో పుట్టి కేరళ, తమిళనాడు అడవులలో ప్రవహించి కోయంబత్తూరు పిల్లూరు జలాశయం ద్వారా భవానీ సాగర్ జలాశయంలోకి ప్రవేశించి కావేరీ నదిలో ఏకమయ్యే భవానీ, దాని ఉప నదుల నీటిని సద్వినియోగం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. 225 కి.మీ దూరం ప్రవహించే భవానీ నది మిగులు జలాలను మూడు జిల్లాలకు అందించేందుకు చేసిన ఏర్పాట్లుకు ఆ తదుపరి అధికారంలోకి వచ్చిన అన్నాడీఎంకే పాలకులు బ్రేక్ వేశారు. ఇలా ఐదు దశాబ్దాలుగా తమిళనాడులోకి మార్చి మార్చి అధికారంలోకి వచ్చిన పాలకులు ఈ పథకాన్ని తుంగలో తొక్కే స్థాయికి తీసుకొచ్చారు. ఇందుకు కారణం, ఈ పథకం అంచనా వ్యయం పదింతలు పెరగడమే. ఈ పథకం సాధన కోసం పార్టీలకు అతీతంగా ఈ మూడు జిల్లాల ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాలు కొనసాగిస్తూ వచ్చారు.

పళణితో మోక్షం

అన్నాడీఎంకే అధినేత్రి జయలలిత మరణంతో 2017లో అధికార పగ్గాలు చేపట్టిన సీఎం పళణి స్వామి అత్తికడవు - అవినాశి తాగు నీటి పథకానికి మోక్షం కలిగించేందుకు సిద్ధమయ్యారు. కొంగు మండలంకు చెందిన సీఎం కావడంతో ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అత్తి కడవు -అవినాశి ప్రాజెక్టుగా ఈరోడ్, కోయంబత్తూరు, తిరుపూర్ జిల్లాలోని అవినాశి, అన్నూరూ, కారమడై, తిరుప్పూర్, సేవూరు, కున్నత్తూరు, పెరుంతురై, కాంగేయం, ఊత్తుకులి, నంబియూరు, పులియం పట్టి తదితర డివిజన్లలోని కొలనులు, చెరువులకు పైప్ లైన్‌ల ద్వారా నీటిని పంపిణి చేయడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి అమలు చేయడానికి సిద్ధమయ్యారు. అయితే అడుగడుగునా ఈ పథకానికి అడ్డంకులు తప్పలేదు. స్థల సేకరణ పెద్ద సమస్యగా మారింది. అదే సమయంలో కరోనా పరిస్థితులు ఈ పథకంకు ఆర్థిక కష్టాలు సృష్టించాయి.

పట్టు విడువని సీఎం స్టాలిన్

2021లో రాష్ట్రంలో అధికారం మారింది. డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ సీఎంగా పగ్గాలు చేపట్టారు. కరోనా పరిస్థితుల్లో ఎదురైన ఆర్థిక కష్టాలతో ఈ పథకం ముందుకు సాగేనా అన్న చర్చ జరిగింది. అయితే సీఎం స్టాలిన్ ఈ పథకం విషయంలో ఏమాత్రం తగ్గలేదు. అత్తి కడవు - అవినాశి తాగు నీటి పథకం అమలును పలు మార్లు పనులను స్వయంగా వెళ్లి పరిశీలించారు. 2022 నుంచి నిర్విరామంగా పనులు జరిగాయి. భవానీ నది తీరంలో కాళింగరాయన్ రిజర్వాయర్ ఆధారంగా చేసుకుని ఆరు చోట్ల నీటి పంపింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయించారు. ఇక్కడి నుంచి ఏటా 1.50 ఈఎంసీల నీటిని 70 రోజుల పాటు సాగు , తాగు నీటి అవసరాలకు సరఫరా చేయడానికి 1,065 కి.మీ దూరం భూగర్భ మార్గంలో పైప్‌లైన్లను ఏర్పాటు చేయించారు. పలు దఫాలుగా ట్రయల్ రన్ నిర్వహించి విజయవంతం చేశారు.

ఎట్టకేలకు ప్రారంభం

మూడు జిల్లాల ప్రజల 65 ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కడమే కాకుండా వారి కల శనివారం సాకారమైంది. 1,916 కోట్లతో 50 లక్షల మందికి ఉపయోగ పడే విధంగా 24,468 ఎకరాల పంట పొలాలకు నీరు అందించడం, నీటి పారుదల శాఖ పరిధిలోని 32, యూనియన్ పంచాయతీ పరిధిలోని మరో 42 చెరువులు, 971 కొలనులు, గుట్టలను నిండు కుండులుగా మార్చే రీతిలో అత్తి కడవు - అవినాశి పథం రూపుదిద్దుకుంది. దీనిని ఉదయం చెన్నై నుంచి సీఎం ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించి ఆ మూడు జిల్లాల ప్రజలకు , రైతాంగానికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురై మురుగన్, కయల్విలి సెల్వరాజ్, సీఎస్ శివదాస్ మీన తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈరోడ్ లో జరిగిన కార్యక్రమంలో మంత్రులు ముత్తుస్వామి, స్వామినాథన్, ఎంపీ ప్రకాష్, ఎమ్మెల్యేలు ఈశ్వరన్, వెంకటాచలం, సరస్వతి, ఈరోడ్ కార్పొరేషన్ మేయర్ ఎస్ నాగరత్నం పాల్గొన్నారు. అత్తి కడవు - అవినాశి కల సాకారం కావడంతో ఆ జిల్లాలోని రైతాంగం, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా అందరూ సమష్టిగా చేసిన పోరాటానికి దక్కిన ఫలితం అని సంబరాలు చేసుకున్నారు.

నేడు 'కరుణ' రూ.100 నాణెం ఆవిష్కరణ

– ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్

సాక్షి, చెన్నై : డీఎంకే దివంగత నేత ఎం కరుణానిధి శత జయంతి స్మారకంగా ఆదివారం రూ. 100 నాణెం విడుదల కానుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరు కానున్నారు. దేశ రాజకీయాలలో సీనియర్ నేతగా, తమిళనాడులో ఓటమి ఎరుగని యోధుడిగా పేరుగడించిన కరుణానిధి శత జయంతి ఉత్సవాలు గత ఏడాది పొడవున రాష్ట్రంలో జరిగింది. డీఎంకే, రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలో వేర్వేరుగా వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా శత జయంతి స్మారకం రూ.100 నాణెం(కరుణ ముఖ చిత్రం)తో విడుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు కేంద్రం ఆమోదముద్ర వేసింది. ఈ నాణెం విడుదలకు ఆదివారం కలైవానర్ అరంగం వేదికగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని అన్ని పార్టీల నేతలను, ప్రముఖులను ఈ వేడుకకు ఆహ్వానించారు.

చెన్నైకు రానున్న రాజ్‌నాథ్..

చెన్నైకు ఆదివారం రాజ్‌నాథ్ సింగ్ రానున్నారు. తన పర్యటనలో భాగంగా చెన్నైలో స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసీజీ), మారిటైమ్ రెస్క్యూ కో-ఆర్డినేషన్ సెంటర్(ఎంఆర్‌సీసీ) భవనాన్ని ప్రారంభించనున్నారు. అలాగే చెన్నై హార్బర్ ఆవరణలో ఐసీజీ రీజినల్ మెరైన్ సొల్యూషన్స్ రెస్పాన్స్ సెంటర్‌ను , పుదుచ్చేరిలోని కోస్ట్‌గార్డ్ ఎయిర్ ఎన్‌క్లేవ్(ఐసీజీ), దక్షిణ తమిళనాడు సముద్ర తీరంలో భద్రతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించే విధంగా ఏఎల్‌హెచ్ స్క్వాడ్రన్‌ల ఏర్పాటు, వైమానిక నిఘా తదితర అంశాలకు సంబంధించిన ఏర్పాట్లు, సముద్ర తీర పర్యావరణ పరిరక్షణ తదితర కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం కరుణానిధి నాణెం విడుదల కార్యక్రమానికి రాజ్‌నాథ్ సింగ్ హాజరు కానున్నారు.



కరుణ నాణెం

నిందితులను శిక్షించాల్సిందే



చెన్నై స్టాన్లీ ఆస్పత్రి వద్ద నిరసన

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో ఓపీ వైద్య సేవలను బహిష్కరించి డాక్టర్లు శనివారం పోరుబాట పట్టారు. ప్రభుత్వాస్పత్రుల్లో అత్యవసర వైద్య సేవలు మాత్రమే కొనసాగాయి. వివరాలు.. కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ దేశవ్యాప్తంగా 24 గంటల వైద్యులు ఆందోళన బాట పట్టారు. దీనికి మద్దతుగా తమిళనాడులోని ప్రభుత్వ వైద్యులు, జూనియర్ డాక్టర్లు, కళాశాలల విద్యార్థులు శనివారం నిరసనలకు దిగారు. చెన్నైలో రాజీవ్ గాంధీ జీహెచ్ , స్టాన్లీ ఆస్పత్రుల వైద్యులు విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినదించారు. చెన్నైలో క్రోంపేట, శివారులోని చెంగల్పట్టు, తదితర ప్రాంతాలలోని ఆస్పత్రులలోని వైద్యులు విధులను బహిష్కరించి ఆందోళన, ర్యాలీ, మానవహారాలు నిర్వహించారు. కోయంబత్తూరు, తిరుచ్చి, మదురై, తిరునల్వేలి, తూత్తుకుడి, విరుదునగర్, వేలూరు, కాంచీపురం, తిరువళ్లూరు , తదితర జిల్లా, నగర కేంద్రాలలోని ప్రభుత్వ ఆస్పత్రులలో ఓపీ వైద్య సేవలను స్తంభింపజేస్తూ ఆందోళనలు జరిగాయి. ఇక ఔట్ పేషెంట్(ఓపీ) సేవలకు ఆటంకం కలిగినా, అత్యవసర సేవలను మాత్రం వైద్యులు కొనసాగించారు.

ఆధ్యాత్మికం



వేడుకగా సప్తకన్నికల ఊరేగింపు

తిరువళ్లూరు: ఆషాడమాసం ఉత్సవాల్లో భాగంగా తొయ్యూరు గ్రామంలోని ప్రసిద్ధి చెందిన మారియమ్మన్ సప్తకన్నిల ఆలయంలో అమ్మవార్ల ఊరేగింపు శనివారం వైభవంగా నిర్వహించారు. తిరువళ్లూరు జిల్లా తొయ్యూరు గ్రామంలో ప్రసిద్ధి చెందిన మారియమ్మన్ సప్తకన్నిల ఎల్లమ్మ ఆలయం ఉంది. ఈ ఆలయంలో ఏటా ఆషాడమాసం చివరి శుక్రవారం ప్రత్యేకంగా ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే 224వ వార్షికోత్సవ ఉత్సవాలను పది రోజుల క్రితం కాప్పు కట్టి ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు. కాగా ఆదివారం రాత్రి నిర్వహించే అగ్నిగుండ ప్రవేశంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

ప్రారంభం



'మెట్రో'వర్క్ షాపులో పరిశోధన కేంద్రం

సాక్షి, చెన్నై : మెట్రో రైళ్లకు సంబంధించి పరిశోధనలపై దృష్టి సారించే విధంగా కోయంబేడులో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని మెట్రో రైలు ఎండీ సిద్ధిక్ శనివారం ప్రారంభించారు. చెన్నైలో ప్రస్తుతం రెండు మార్గాలలో మెట్రో రైలు సేవలు విస్తృతంగా జరుగుతున్న విషయం తెలిసిందే. మరో మూడు మార్గాలలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆధునిక వసతులతో, డ్రైవర్ హితంగా మెట్రో సేవలకు తగ్గ కార్యాచరణ సాతున్నాయి. కొత్త మెట్రో రైళ్ల కొనుగోలుకు ఒప్పందాలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మెట్రో రైలు సేవలలో భాగంగా ఆయా రైళ్ల పనితీరు, ఆయా మార్గాలలో రైళ్ల రాక పోకలకు సంబంధించిన పటిష్ట ఏర్పాట్లు తదితర అంశాల పై పరిశోధనలు చేపట్టేందుకు వీలుగా కోయంబేడులోని మెట్రో వర్క్‌షాపులో పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ కొలువుదీర్చిన ఆధునిక పరికరాలను అధికారులు పరిశీలించారు. ఈ పరిశోదన కేంద్రాన్ని మెట్రోరైలు ఎండీ ఎండీ సిద్ధిక్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెట్రో డైరెక్టర్ రాజేష్ చతుర్వేది, సలహాదారు రామ సుబ్బు, జీఎం రాజేంద్రన్, ఏజీఎం సిబాల మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవ



ఆరోగ్య సంరక్షణకు మొబైల్ వెల్నెస్ క్లినిక్

సాక్షి, చెన్నై : ప్రజల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలలో భాగంగా ఆళ్వార్ పేట కావేరి ఆస్పత్రి మొబైల్ వెల్నెస్ క్లినిక్ కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టింది. రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాసు, బే ఫోర్జ్ సహకారంతో చేపట్టిన మొబైల్ వైద్య సేవలను ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ జెండా ఊపి ప్రారంభించారు. చెన్నై జిల్లా, పరిసరాల్లో పేదలకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు వివిధ రకాల చికిత్సలు, పరిశోధనలు అందించేందుకు వీలుగా ఈ మొబైల్ క్లినిక్‌లో వసతులు కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుబ్రమణియన్ మాట్లాడుతూ, ప్రజలకు వైద్య సేవలను విస్తృతం చేయడమే లక్ష్యంగా, ఉన్నత వైద్యాన్ని మరింత దరి చేర్చేందుకు అందరూ సమష్టిగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మైలాపూర్ ఎమ్మెల్యే వేలు, కావేరి గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరవిందన్ సెల్వరాజ్, రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాసు చైర్మన్ పి. సతీష్, బే ఫోర్జ్ ఎడి జులియన్ క్రిష్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

విముక్తి



శ్రీలంక నుంచి చెన్నై చేరిన 13 మంది జాలర్లు

కొరుక్కుపేట: శ్రీలంక జైలు నుంచి విడుదలైన రాష్ట్రానికి చెందిన 13 మంది జాలర్లు ఎయిరిండియా విమానంలో శుక్రవారం రాత్రి చెన్నై చేరుకున్నారు. వారికి రాష్ట్ర అధికారులు స్వాగతం పలికి స్వగ్రామానికి పంపించారు. వివరాలు.. రామేశ్వరం, పుదుకోట్టై ప్రాంతాలకు చెందిన 13 మంది జాలర్లు జూలై 1 తెల్లవారుజామున పడవల్లో సముద్రం మధ్యలో చేపల వేటకు దిగారు. ఆ సమయంలో అక్కడ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న శ్రీలంక నేవీ పుదుకోట్టైకి చెందిన ఆరుగురు మత్స్యకారుల పడవను చుట్టుముట్టి సరిహద్దు దాటి వెళ్లి చేపల వేటకు సాగించారని వారి నుంచి వలలు, చేపలు, పడవను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని శ్రీలంక కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. అదేవిధంగా జూలై 12వ తేదీ ఉదయం సముద్రం మధ్యలో చేపల వేటకు వెళ్తున్న రామేశ్వరం నుంచి రెండు బోట్లను పెట్రోలింగ్ బోటులో వచ్చిన శ్రీలంక నేవీ అధికారులు చుట్టుముట్టారు. సరిహద్దు దాటి చేపలు పట్టినందుకు వారిని అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న పడవలు, వలలు, చేపలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏడుగురిని శ్రీలంక కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. కాగా వారిని విడుదల చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ కేంద్ర విదేశాంగ మంత్రికి అత్యవసర లేఖ రాశారు. అనంతరం శ్రీలంకలోని భారత రాయబార కార్యాలయ అధికారులు శ్రీలంక ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారు. అనంతరం శ్రీలంక కోర్టు 13 మంది జాలర్లను విడుదల చేశారు.



• అభినందనలు

విడుదలై సిరుత్తైగల్ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ తొల్ తిరుమావళవన్ 62వ జన్మదినం సందర్భంగా శనివారం సీఎం స్టాలిన్ కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు.

- సాక్షి, చెన్నై

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన



వేలూరు కలెక్టరేట్‌లో ధర్నా చేస్తున్న డాక్టర్‌లు, వైద్య సిబ్బంది



తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాల వద్ద ఆందోళన నిర్వహిస్తున్న వైద్యులు

వేలూరు: కోలకత్తాలో ట్రెనింగ్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దేశ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిలకు చెందిన డాక్టర్‌లు, వైద్య సిబ్బంది నిరసనకు దిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వేలూరు ఉమ్మడి జిల్లాతో పాటు తిరువణ్ణామలై జిల్లాలోనూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిలకు చెందిన డాక్టర్‌లు, పారామెడికల్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి ఆయా ప్రాంతాల్లోనే ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. అదేవిధంగా తిరువణ్ణామలై ప్రధాన ప్రభుత్వాసుపత్రి వద్ద డాక్టర్‌లు విధులను బహిష్కరించారు. వేలూరు కలెక్టరేట్ ఎదుట ఇండియన్ మెడికల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిలకు చెందిన డాక్టర్‌లు ధర్నా నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న వైద్యులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, మహిళా డాక్టర్‌పై హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న వైద్యులతో పాటు నర్సులకు రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ధర్నాలో ఇండియన్ మెడికల్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నర్మద, కార్యదర్శి మణిగండన్, నరువి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ అరవింద నాయర్, డాక్టర్‌లు పాల్గొన్నారు.

తిరువళ్లూరులో

తిరువళ్లూరు: కోల్‌కత్తాలో వైద్యురాలిపై హత్యాచారం ఘటననూ నిరసిస్తూ తిరువళ్లూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో డాక్టర్‌లు విధులు బహిష్కరించి నిరసనకు దిగారు. ఈ నిరసనకు వైద్యుల సంఘం కార్యదర్శి ప్రభుశంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రభుశంకర్ మాట్లాడుతూ విధులకు హాజరైన డాక్టర్‌పై అత్యాచారం చేసి ఆపై హత్య చేయడం దారుణమన్నారు. వైద్యురాలి కుటుంబానికి న్యాయం జరగాలని, మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. దీంతో పాటు తిరువళ్లూరు మెడికల్ కళాశాలలో అదనపు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని, రాత్రి సమయంలో డాక్టర్‌లు విధులు నిర్వహించే సమయంలో వారికి భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో సంఘం నేతలు జగదీశన్, విజయ్‌రాజ్, ప్రేమ్‌కుమార్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదిలో స్పృహతప్పి పడి ఉపాధ్యాయురాలు మృతి

అన్నానగర్: తిరుచ్చి కీళకల్కందర్ కోట, ధనలక్ష్మి నగర్ 7వ వీధికి చెందిన భువనేష్ కుమార్ (60) భార్య భవానీ (58). ఈమె ఎడమలైపట్టి పుదూర్ ప్రభుత్వ కాలనీలో ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో మ్యాథమెటిక్స్ టీచర్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం క్లాస్‌రూమ్‌లో ఉండగా, భవానికి అకస్మాత్తుగా ఛాతీ నొప్పి వచ్చింది. తోటి ఉపాధ్యాయులు గుర్తించి తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెని పరీక్షించిన డాక్టర్లు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ప్రకటించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైకు నుంచి జారి పడి పోలీసు..

అన్నానగర్: నామక్కల్ జిల్లా నార్రైకినరు కాళియమ్మన్ గార్డెన్ ప్రాంతానికి చెందిన పెరుమాల్ రైతు. ఇతని కుమారుడు విఘ్నేష్(31). ఇతని భార్య ముప్పిడాది(30), కొడుకు పాన్ కవిన్(5) ఉన్నాడు. ప్రస్తుతం ముప్పిడాది 8 నెలల గర్భిణి. ప్రస్తుతం విఘ్నేష్ బెలుకురిచ్చి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్నాడు. ఈ స్థితిలో శుక్రవారం విఘ్నేష్ బైకులో బేలుకురిచ్చి నుంచి ఆయిల్ పట్టి పోలీస్ స్టేషన్‌కి వెళ్తున్నాడు. తన్నీర్ పందల్ కాడ్ ప్రాంతంలో బైక్ అదుపుతప్పి ముందు మరో బైక్‌ను ఢీకొట్టాడు. విఘ్నేష్ కిందపడి తీవ్రగాయాలతో శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

అన్నానగర్: చెన్నైలోని వ్యాసర్‌పాడి భక్తవత్సలం కాలనీ 31వ వీధికి చెందిన మీనా (80) ఇంట్లో ఒంటరిగా నివసిస్తోంది. ఈమె కుమార్తె పద్మావతి(50) మాధవరంలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటోంది. శనివారం ఉదయం వృద్ధురాలు చాలా సేపటికి బయటకు రాకపోవడంతో పక్కింట్లో ఉన్న కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి చూడగా వృద్ధురాలు తలపై గాయంతో మృతి చెంది ఉండడంతో దిగ్భ్రాంతి చెందారు. అనంతరం ఈ విషయాన్ని మీన కుమార్తె పద్మావతికి తెలియజేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎం.కే.బీ.నగర్ పోలీసులు వృద్ధురాలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నైలోని స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు. పులియాంతోపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ముత్తుకుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

తిరుత్తణి ఆలయ హుండీ ఆదాయం రూ. 1.26 కోట్లు



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

తిరుత్తణి: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో 15 రోజుల్లో భక్తులు రూ. 1.26 కోట్లు కానుకలు చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఈ లెక్కింపు ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, ఛైర్మన్ శ్రీధరన్ సమక్షంలో సాగింది. వంద మంది సిబ్బంది దేవర మండపంలో కానుకలు శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ. కోటి 26 లక్షలు, 216 గ్రాముల బంగారం, 8. 395 కేజీల వెండి లభించినట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా మురసొలి 91వ జయంతి



మురసొలి మారన్ విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న సీఎం స్టాలిన్, మంత్రులు, డీఎంకే నేతలు

సాక్షి, చెన్నై : దివంగత కేంద్ర మంత్రి మురసొలి మారన్ 91వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి సీఎం స్టాలిన్ శనివారం అంజలి ఘటించారు. డీఎంకే మాజీ అధ్యక్షులు, మాజీ కేంద్ర మంత్రి, దివంగత మురసొలి మారన్ 91వ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే శ్రేణులు శనివారం వేడుకగా జరుపుకున్నాయి. ఈ సందర్భంగా చెన్నై కోడంబాక్కంలో ఉన్న మురసొలి కార్యాలయంలో మురసొలి మారన్ విగ్రహానికి పూల మాల వేసి, అక్కడ ఏర్పాటు చేసిన ఆయన చిత్ర పటానికి పువ్వులు చల్లి ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డీఎంకే ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్, కోశాధికారి టీఆర్ బాలు, మంత్రులు పొన్‌ముడి, ఉదయనిధి స్టాలిన్, ఎం.సుబ్రమణియన్, పీకే శేఖర్ బాబు, సెంట్రల్ చెన్నై నియోజకవర్గ ఎంపీ దయానిధి మారన్‌లతో పాటు ఎమ్మెల్యేలు, డీఎంకే నేతలు పాల్గొన్నారు.

అలరించిన అరుణాశ్రీనాథ్ గాత్ర కచేరి



కీర్తనలను ఆలపిస్తున్న గాయని అరుణాశ్రీనాథ్

కొరుక్కుపేట: చెన్నై అంబత్తూరులోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో గత 48 రోజులుగా నిర్వహించిన మండలాభిషేకం మహోత్సవం శనివారంతో వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా చివరి రోజు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రముఖ సంగీత గాయని అరుణాశ్రీనాథ్ సంగీత కచేరి శనివారం రాత్రి జరిగింది. సామవేదం షణ్ముక శర్మ రచించిన అమ్మచేతి పసుపు బొమ్మ అనే కీర్తన (గణపతి)తో అరుణాశ్రీనాథ్ సంగీత కచేరి ప్రారంభించారు. అనంతరం తమిళ్‌లో కురైఒన్రుమ్ ఇల్‌లై, అలాగే పలు కన్యకాపరమేశ్వరీ అమ్మవారి పాటలతో ఆద్యంతం అలరించారు. శంకరాయ శంకరాయ శంకరాయ మంగళంతో కచేరీని ఘనంగా ముగించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు అరుణాశ్రీనాథ్‌ను ఘనంగా సత్కరించారు . 48 రోజుల పాటు సాగిన మండలాభిషేకం కార్యక్రమంలో 55 పైగా ఈవెంట్‌లు నిర్వహించినట్లు మధుప్రియా శాంతారామ్ కల్పన తెలిపారు.

తేనెటీగల దాడిలో గాయపడి..

• వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి





చిన్నారి కార్తీక్ గిరీష్, సుందర మూర్తి(ఫైల్)

తిరువళ్లూరు: తేనెటీగల దాడిలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఓ బాలుడు, వృద్ధుడు మృతి చెందారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా తన్నీర్‌కుళం గ్రామానికి చెందిన మునస్వామి కుమారుడు కార్తీక్ గిరీష్(06). బాలుడు ఎయిడెడ్ పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో కార్తీక్‌గిరీష్ గత 16న ఇంటికి సమీపంలో ఆడుకుంటున్న సమయంలో తేనెటీగల దాడికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఇతడ్ని తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందజేశారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బాలుడు శనివారం ఉదయం మృతి చెందాడు. అలాగే తిరువళ్లూరు జిల్లా కైవండూరు గ్రామానికి చెందిన సుందరమూర్తి(82) తిరువళ్లూరు బస్ డిపోలో పని చేసి రిటైర్డ్ అయ్యాడు. ఇతను రెండు రోజుల క్రితం తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడి తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

ఈసీఆర్‌లో రోడ్డు ప్రమాదం

• తల్లి, నాలుగు నెలల శిశువు దుర్మరణం

తిరువొత్తియూరు: ఈసీఆర్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, నాలుగు నెలల శిశువు దుర్మరణం చెందారు. వివరాలు.. చెన్నైలోని ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని కానత్తూరు కలంజర్ వీధికి చెందిన ముగజిత్ అహమ్మద్ (40). అతని భార్య బెనజీర్ (35). వీరికి ఐసిత్ మహ్మద్ అనే కుమారుడు, 4 నెలల ఆడ శిశువు ఉంది. ముగజిత్ అహమ్మద్ తన కుటుంబంతో మోటారు బైక్ చెన్నై నగరానికి వచ్చారు. ఆ తర్వాత అక్కడి నుంచి కానతూర్‌కు తిరిగి బయలుదేరారు. పనయూర్ సమీపంలో ఉత్తండి వద్ద వస్తుండగా ఆ సమయంలో సినిమా క్యారవ్యాన్ చాలా దగ్గరగా రాసుకుని వెళ్లడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ సమయంలో చెన్నై నుంచి పుదుచ్చేరి వైపు వెళ్తున్న ప్రభుత్వ బస్సు బెనజీర్‌పై ఎక్కి దిగింది. తల నుజ్జునుజ్జు కావడంతో ఆమె అదే చోట మృతి చెందింది. ముగజిత్ అహమ్మద్, పిల్లలు కూడా గాయపడ్డారు. వారందరినీ అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రికి వెళుతున్న సమయంలో 4 నెలల శిశువు మృతి చెందింది. ఆ చిన్నారి ఆసియా అహ్మద్. ఈ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కుటుంబం గతంలో పుదుచ్చేరిలో నివసించే వారని వీరు 10 రోజుల క్రితమే కానత్తూరుకు వచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నట్లు తెలిసింది.

10 పిల్లలకు జన్మనిచ్చిన అనకొండ



అనకొండ పిల్లలు

అన్నానగర్: చెంగల్పట్టు జిల్లాలోని మామల్లపురం పక్కనే ఉన్న వడనెమ్మేలి వద్ద మొసళ్ల ఫారంలో మొసళ్లు, తాబేళ్లు, ఉడుములు, కొమోడో డ్రాగన్‌లను పెంచుతున్నారు. ఈ నేపథ్యంలో ఆఫ్రికాలోని అమెజాన్ అడవుల్లో కనిపించే అరుదైన అనకొండ పాములను ఈ మొసళ్ల ఫారంలో పర్యవేక్షిస్తున్నారు. ఈ అనకొండ పాములు గుడ్లు పెట్టవు. వైపర్ లాగా నేరుగా పిల్లలను పెట్టే ఒక రకమైన పాము. ఇక్కడి ఓ అనకొండ శుక్రవారం 10 పిల్లలకు జన్మనిచ్చింది. ముఖ్యంగా అనకొండ పాములు అమేజాన్ ఫారెస్ట్‌లో అత్యంత పెద్ద జలచరాలు. ఈ నేపథ్యంలో అనకొండ పాము పిల్లలను ప్రస్తుతం మొసళ్ల ఫారం ముందు ద్వారం వద్ద నీరు, గాజు గదులలో ఉంచారు. ఈ పాము పిల్లలకు ఇప్పుడు ఎలుక పిల్లలను ఆహారంగా ఇస్తున్నారు. పిల్ల అనకొండలను ఫారం సిబ్బంది, ఆన్ సైట్ అంబులేటరీ వైద్య బృందం 24 గంటలూ పర్యవేక్షిస్తోంది. అలాగే గ్లాస్ రూంలలో అనకొండ పాము పిల్లలను చూసేందుకు పర్యాటకులను అనుమతిస్తుండడంతో వారు వాటితో సెల్ఫీలు దిగుతున్నారు.

శింబుతో జత కట్టేవరో?



నటుడు శింబు




నటి మృణాల్ ఠాకూర్

నటి దీపికా పడుకోనే

తమిళసినిమా: నటుడు శింబు. ఈ పేరే ఒక సంచలనం. లిటిల్ మాస్టర్ నుంచి స్టార్‌గా ఎదిగిన ఈయన వివాదాలకు కేంద్రబిందువు అనే పేరుంది. ఏదేమైనా నటనతో మాత్రం కింగే. ఈయన ఇటీవల నటించిన మానాడు, తనిందదు కాడు చిత్రాలు మంచి విజయాన్ని సాధించాయి. ఆ తరువాత నటించిన పత్తుతల చిత్రం మాత్రం నిరాశ పరిచింది. కాగా శింబు కథానాయకుడిగా నటించే 48వ చిత్రాన్ని కమలహాసన్ తన రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించనున్నట్లు చాలా రోజుల ముందే ప్రకటించారు. దేశింగు పెరియసామి దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో శింబు నాయకుడు, ప్రతినాయకుడుగా ద్విపాత్రాభినయం చేయనున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన చిత్ర వర్గాలు ఇటీవల విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో ఇద్దరు శింబు ఎదురెదురుగా ఆగ్రహంతో చూసుకునే ఫొటోను పొందుపరిచారు. ఈ చిత్రాన్ని రూ. 100 కోట్ల బడ్జెట్‌లో తెరకెక్కించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే ఈ చిత్ర ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఇంకా ప్రారంభం కాకపోవడంతో శింబు ప్రస్తుతం మణిరత్నం దర్శకత్వంలో కమలహాసన్ కథానాయకుడిగా నటిస్తున్న థగ్‌లైఫ్‌లో ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. దీనితో దేశింగు పెరియసామి దర్శకత్వంలో నటించే చిత్రం శింబుకు 50వ చిత్రం కానుంది. కాగా పాన్ ఇండియా చిత్రంగా తెరకెక్కనున్న ఈ చిత్రంలో కథానాయకిగా బాలీవుడ్ భామ దీపికా పడుకోనేను గానీ, మరాఠీ బ్యూటీ మృణాల్ ఠాకూర్‌ను గానీ నటింపజేయడానికి చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. దీంతో శింబు సరసన నటించే భామ ఎవరన్న చర్చ సినీ వర్గాల్లో జరుగుతోంది. కాగా దర్శకుడు రాజమౌళి, హిందీ దర్శకుడు సంజయ్ లీలా బన్సాలీ కలిసి దర్శకత్వం వహిస్తే ఎలా ఉంటుందో, అలా ఈ చిత్రం ఉంటుందని ఇటీవల కళాదర్శకుడు ఎస్ఎస్.మూర్తి పేర్కొనడం విశేషం. మొత్తం మీద ఈ చిత్రం ప్రారంభానికి ముందే ఆసక్తిని, అంచనాలను ఏర్పరచుకుంటోందన్న మాట. కాగా నటుడు శింబు తన ఇన్‌స్టాగామ్‌లో ప్రత్యేకంగా తీయించుకున్న ఫొటోను పోస్ట్ చేశారు. అది ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

సెన్సార్ పూర్తి చేసుకున్న వణంగాన్



వణంగాన్ చిత్రంలో అరుణ్ విజయ్

తమిళసినిమా: సంచలన దర్శకుడు బాలా చాలా గ్యాప్ తరువాత దర్శకత్వం వహిస్తున్న చిత్రం వణంగాన్ వీ.హౌస్ ప్రొడక్షన్స్ పతాకంపై సురేష్ కామాక్షి నిర్మిస్తున్న ఈ చిత్రంలో అరుణ్ విజయ్ కథానాయకుడిగా నటిస్తున్నారు. నటి రోషిణి ప్రకాష్ నాయకిగా నటిస్తున్న ఇందులో సముద్రఖని, మిష్కిన్, ఛాయాదేవి తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. జీవీ.ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం చాలా కాలం నిర్మాణ కార్యక్రమాలను జరుపుకుని ఇటీవలే పూర్తి చేసుకుంది. అదేవిధంగా సెన్సార్ పూర్తి చేసుకుని యూ/ఏ సర్టిఫికెట్‌తో త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ అరుణ్ విజయ్ ఫొటోలతో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో అరుణ్ విజయ్ చాలా రఫ్ గెటప్‌లో కనిపించారు. ఈ పోస్టర్ చూస్తేనే వణంగాన్ చిత్రం పక్కా కమర్షియల్ కథా చిత్రంగా ఉంటుందని తెలుస్తోంది. కాగా దర్శకుడు బాలా ఈ చిత్రాన్ని పక్కా మాస్ మసాలా అంశాలతో తీర్చిదిద్దారు. అయితే ఇందులో ముందు నటుడు సూర్య కథానాయకుడిగా నటించి నిర్మించడానికి సిద్ధం అయ్యారు. ఆ తరువాత కొన్ని కారణాల వల్ల వణంగాన్ చిత్రం నుంచి వైదొలిగారు. దీంతో నటుడు అరుణ్ విజయ్‌ను హీరోగా ఎంపిక చేశారు బాలా. అదేవిధంగా మలయాళ వర్ధమాన బ్యూటీ మమితా బైజు కథానాయకిగా నటించారు. కొంత భాగం షూటింగ్ జరిగిన తరువాత ఆమె కూడా చిత్రం నుంచి వైదొలిగారు. ఎట్టకేలకు బాలా వణంగాన్ చిత్రాన్ని పూర్తి చేశారు. చిత్రాన్ని సెప్టెంబర్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత సురేష్ కామాక్షి పేర్కొన్నారు.

కోలీవుడ్ టాక్స్

మహారాజా చిత్ర దర్శకుడికి అంతర్జాతీయ అవార్డు



దర్శకుడు నితిలన్ స్వామినాథన్

తమిళసినిమా: నటుడు విజయ్‌సేతుపతి కథానాయకుడిగా నటించిన చిత్రం మహారాజా. ఇది ఈయన నటించిన 50వ చిత్రం కావడం విశేషం. నటి మామతామోహన్ నాయకిగా నటించిన ఇందులో బాలీవుడ్ నటుడు, దర్శకుడు అనురాగ్ కశ్యప్ ,నటరాజ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి నితిలన్ స్వామినాథన్ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించారు. ఫ్యాషన్ స్టూడియోస్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై సంచలన విజయాన్ని సాధించింది. విమర్శకుల నుంచి మంచి ప్రశంసలను అందుకుంది. కాగా ఇది నటుడు విజయ్‌సేతుపతి కెరీర్‌లోనే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన తొలి చిత్రంగా నిలిచింది. కాగా ఈ చిత్ర దర్శకుడు నితిలన్ స్వామినాథన్‌కు అంతర్జాతీయ అవార్డు వరించింది. మెల్‌బోర్న్‌లో జరిగిన అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ఈయనకు ఉత్తమ దర్శకుడు అవార్డును ప్రకటించారు. ఈ విషయాన్ని మహారాజా చిత్ర యూనిట్ మీడియాకు వెల్లడించారు. కురంగు బొమ్మై చిత్రంతో దర్శకుడిగా పరిచయం అయిన నితిలన్ స్వామినాథన్ తొలి చిత్రంతోనే విజయాన్ని అందుకున్నారు. కాగా మహారాజా చిత్రం ఈయన తెరకెక్కించిన రెండవ చిత్రం కావడం గమనార్హం.

నాది చాలా బ్యాడ్ బ్రేకప్



నటి రమ్యా పాండియన్

తమిళసినిమా: ప్రేమించిన వారు ఉండరు. అయితే అది ఒక్కోసారి చేదు అనుభవాన్ని మిగుల్చుతుంది. అలాంటి అనుభవాన్నే తాను ఎదుర్కొన్నానని నటి రమ్యా పాండియన్ ఆవేదనను వ్యక్తం చేశారు. కథానాయకిగా మంచి స్థాయికి చేరుకోవడానికి పోరాడుతున్న నటి ఈమె. ఈ తిరునెల్వేలి భామ దర్శకుడు మణిరత్నం శిష్యుడు షెల్లీ దర్శకత్వంలో మానే తూనే పొన్‌మానే అనే షార్ట్ ఫిలింలో నటించారు. ఆ తరువాత దర్శకుడు బాలాజీ శక్తివేల్ దర్శకత్వంలో రా రా రాజశేఖర్ అనే చిత్రంలో నాయకిగా ఎంపికయ్యారు. అయితే ఆ చిత్రం ప్రారంభం కాలేదు. దీంతో డమ్మీ టపాసు అనే చిన్న చిత్రంతో రమ్యా పాండియన్ నాయకిగా రంగప్రవేశం చేశారు. ఆ తరువాత రాజుమురుగన్ దర్శకత్వం వహించిన జోకర్ చిత్రంలో నటించి మంచి గుర్తింపు పొందారు. ఆ తరువాత సముద్రఖని సరసన ఆన్ దేవతై చిత్రంలో నటించారు. ఆ చిత్రం మంచి పేరు తెచ్చి పెట్టింది. అయితే స్టార్ హీరోలతో జత కట్టే అవకాశాలు రమ్యా పాండియన్‌కు ఇంకా లభించలేదనే చెప్పాలి. బిగ్‌బాస్ రియాలిటీ గేమ్ షోలోనూ పాల్గొన్న ఈ భామ బాగానే పాపులర్ అయ్యారు. ఆ తరువాత రామే ఆండాలుమ్ రావణే ఆండాలుమ్ చిత్రంలో నటించారు. అదేవిధంగా మలయాళంలో మమ్ముట్టి కథానాయకుడిగా నటించిన నన్‌పగల్ నేరత్తు మయక్కమ్ చిత్రంలో నటించారు. అలా పలు చిత్రాల్లో నటించిన ఈమె ప్రస్తుతం ఇడుమ్‌పన్‌కారి అనే చిత్రంలో నటిస్తున్నారు. కాగా ఇటీవల ఈమె ఒక భేటీలో తన ప్రేమ వైఫల్యంపై పేర్కొన్నారు. తన మాజీ ప్రేమికుడితో చాలా బ్యాడ్ బ్రేకప్ జరిగిందని వాపోయారు. అందులో నుంచి ఎలా బయట పడాలో కూడా తెలియక వేదనలో మునిగిపోయానన్నారు. ఆ ఘటన గురించి ఆలోచిస్తూ చాలా నీరసించి పోయానన్నారు. అలాంటి తరుణంలో తన సోదరినే తనకు పక్కా బలంగా నిలిచారని రమ్యా పాండియన్ పేర్కొన్నారు.

ఇక ప్రశాంత్ పెళ్లి పైనే దృష్టి



వేదికపై ప్రశాంత్, సిమ్రాన్, ప్రియా ఆనంద్, త్యాగరాజన్, కేఎస్.రవికుమార్ తదితరులు

తమిళసినిమా: టాప్‌స్టార్ ప్రశాంత్ చాలా గ్యాప్ తరువాత కథానాయకుడిగా నటించిన చిత్రం అంధగన్. నటి సిమ్రాన్, ప్రియా ఆనంద్, దర్శకుడు కేఎస్.రవికుమార్, కార్తీక్, యోగిబాబు, సముద్రఖని, ఊర్వశీ, వనితా విజయ్‌కుమార్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని స్టార్ మూవీస్ పతాకంపై శాంతి త్యాగరాజన్ నిర్మించగా, త్యాగరాజన్ దర్శకత్వం వహించారు. ఇది హిందీ చిత్రం అందాదూన్ చిత్రానికి రీమేక్ అన్నది గమనార్హం. కాగా గత వారం తెరపైకి వచ్చిన అంధగన్ చిత్రం విశేష ప్రేక్షకాదరణతో విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. దీంతో ఈ చిత్ర థ్యాంక్స్ గివింగ్ సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం చెన్నై, వడపళనిలోని ఒక స్టార్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో చిత్ర దర్శకుడు త్యాగరాజన్ మాట్లాడుతూ అంధగన్ చిత్రాన్ని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లిన మీడియా మిత్రులకు ధన్యవాదాలన్నారు. పాజిటివ్ రివ్యూలే చిత్ర విజయానికి కారణం అన్నారు. చిత్రం ఇందులో నటించిన నటీనటులకు, సాంకేతిక వర్గానికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టిందన్నారు. ఇందులోని చిన్న పాత్రలకు కూడా ప్రముఖ నటీనటులను ఎంపిక చేసినట్లు చెప్పారు. చిత్రానికి ప్రశాంత్ కథానాయకుడు అయినా , అన్ని పాత్రలకు ప్రాముఖ్యత ఇచ్చామన్నారు. ఈ చిత్రానికి ముందుగా మోహన్‌రాజాను దర్శకుడిగా ఎంపిక చేశామని, మూడు నెలలు చర్చలు జరిగిన తరువాత ఆయన తెలుగులో చిరంజీవితో చిత్రం చేసే అవకాశం రావడంతో వెళ్లిపోయారన్నారు. దీంతో తానే దర్శకత్వం బాధ్యతలను చేపట్టినట్లు చెప్పారు. కాగా ఈ వేదికపై దర్శకుడు కేఎస్.రవికుమార్ మాట్లాడిన తరువాత నటుడు ప్రశాంత్ పెళ్లి ఎప్పుడని ప్రశ్నించారు. అందుకు బదులిచ్చిన త్యాగరాజన్ అంధగన్ చిత్రం మంచి హిట్ అయ్యిందని, ఇక సినిమా విషయాలను పక్కన పెట్టి ప్రశాంత్ పెళ్లి పైనే పూర్తిగా దృష్టి పెట్టనున్నట్లు, త్వరలోనే మంచి అమ్మాయితో ప్రశాంత్ పెళ్లి ఉంటుందని చెప్పారు. కాగా నటుడు ప్రశాంత్ మాట్లాడుతూ అంధగన్ చిత్ర విజయానికి ప్రధాన కారణం దర్శకుడు త్యాగరాజన్, నటీనటులని పేర్కొన్నారు. ఈ చిత్రం తనకు కమ్ బ్యాక్ అనీ, ఇకపై చాలా చిత్రాలు చేస్తానని ఆయన అన్నారు.

క్లుప్తంగా

అన్నదమ్ముల దారుణ హత్య

అన్నానగర్: ఆలయ వేడుక వివాదంలో అన్నదమ్ముల దారుణ హత్యకు గురయ్యారు. నెల్లై జిల్లా అప్పువిళై కారంపాడు గ్రామంలోని సుడలైమాడ స్వామి దేవాలయ కొడై వేడుక శుక్రవారం రాత్రి జరిగింది. ఈ ప్రదర్శనను చూస్తున్న కిరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. వాగ్వాదం, తోపులాటగా మారి ఓ వర్గానికి చెందిన యువకుడు మరో వర్గానికి చెందిన అన్నదమ్ములు మదిరాజా(35), మదియళగన్ (39) ను కత్తితో పొడిచి హత్య చేశాడు. తీవ్రంగా గాయపడిన మరో సోదరుడు మహేశ్వరణ్ (42) పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లై ప్రభుత్వ వైద్య కళాశాలలో చేర్పించారు. ఈ మేర కు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రూ.27 లక్షల మోసం

- ముగ్గురి అరెస్టు

అన్నానగర్: చెన్నై సమీపంలో కాలేజీ ప్రొఫెసర్ నుంచి రూ.27 లక్షలు మోసం చేసిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై కీల్పాక్కంలోని ఎకే సామినగర్‌కు చెందిన గోపీనాథ్ (41) ప్రైవేటు కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది 2017లో పులియాంతోపు అమ్మైయమ్మాళ్ వీధిలోని ఓ ఇంటిని రూ.33 లక్షలకు భేరం కుదుర్చుకుని రూ.27 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించారు. కొనుగోలు చేసిన ఇంటి యజమానులు ఇల్లు, డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేశారు. దీనిపై గోపీనాథ్ ఎగ్మోర్ కోర్టులో కేసు వేశారు. కోర్టు ఆదేశాల మేరకు పులియాంతోపు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రొఫెసర్ గోపీనాథ్ ను జయరాజ్ (41), అతని భార్య పునీత (31), సోఫియా (38), మైఖేల్ (83), అతని భార్య మార్గరెట్ (74) మోసం చేసినట్లు తేలింది. అనంతరం జయరాజ్, పునీత, సోఫియా అనే ముగ్గురిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై కార్పొరేషన్‌లో ఉద్యోగ విరమణ చేసిన మైఖేల్ (83), అతని భార్య మార్గరెట్ (74) వయసుపై బడిన కారణంగా పోలీసులు బెయిల్‌పై విడుదల చేశారు.

పిచ్చికుక్క వీరంగం

- 17 మందికి గాయాలు

అన్నానగర్: వి.మామందూరు గ్రామంలో శనివారం ఓ పిచ్చికుక్క 17 మందిపై దాడి చేసి, కరిచి గాయపరిచింది. తీవ్రంగా గాయపడిన వారందరూ చిన్నసేలం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఫీజులు వసూలు చేస్తే చర్యలు

- డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అలర్ట్

కొరుక్కుపేట: విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తే ఆయా కాలేజీలపై తగ్గ చర్యలు తీసుకుంటామని డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో హెచ్చరించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఇంజినీరింగ్ పూర్తి చేసి, సింగిల్ విండో విధానంలో 7.5 శాతం ప్రాధాన్యత వెయిటేజీలో ప్రభుత్వ రిజర్వ్‌డ్ సీట్లలో చేరే విద్యార్థులకు కోర్సు ఫీజు, హాస్టల్ ఫీజు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టేషన్ ఫీజు వంటి విద్యకు అయ్యే ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొంది. రిజర్వేషన్‌లో చేరిన విద్యా ర్థుల నుంచి ఎటువంటి రుసుము వసూలు చే యకూడదని తెలియజేసింది. ప్రభుత్వ, ప్రభు త్వ ఎయిడెడ్, ప్రైవేట్ వృత్తి విద్యా కళాశాలల్లో సింగిల్ విండో కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశం పొందిన మొదటి గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ట్యూ షన్ ఫీజులో రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ క్రమంలో వారి వద్ద నుంచి మళ్లీ ఫీజులు వసూలు చేయకూడదని డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

యువకుడికి గాయాలు

తిరువొత్తియూరు: కొరుక్కుపేటలో ప్రయాణిస్తున్న రైలులో సెల్‌ఫోన్ లాక్కుని పారిపోతున్న దొంగలను పట్టుకోవడానికి రైలు నుంచి దూకిన ఒడిశా యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సెల్‌ఫోన్ చోరీ చేసిన ఇద్దరు రౌడీలను పోలీసులు అరెస్టు చేశారు. ఒడివా రాష్ట్రానికి చెందిన కిరణ్ కుమార్ బిస్వాల్ (23) కేరళలో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతను తన స్నేహితులతో కలసి చెన్నై సెంట్రల్‌కు వచ్చాడు. గత 13వ తేదీ కేరళకు ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరాడు. ఆ రైలు కొరక్కుపేట రైల్వేస్టేషన్ వద్ద నెమ్మదిగా వెళుతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేస్తున్న కిరణ్ కుమార్ బిస్వాల్ చేతిలో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యారు. దీంతో అతడు వారిని పట్టుకోవడానికి రైలు నుంచి కిందకు దూకాడు. అదుపు తప్పి రైలు పట్టాలపై పడడంతో రైలు చక్రం ఎక్కి దిగడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న కొరుక్కుపేట రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని, కిరణ్ కుమార్ బిస్వాల్‌ను చికిత్స కోసం స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, సెల్‌ఫోన్ అపహరించిన పాత చాకలిపేట, రామదాసునగర్‌కు చెందిన సుందరేశన్ (23), యువరాజ్ (20)ను అరెస్టు చే సి కోర్టులో హాజరుపరిచారు. పరారీలో ఉన్న మరో రౌడీ హరిబాబుకోసం పోలీసులు గాలిస్తున్నారు.

సంబా రవ్వలో నిషేధిత రసాయనం

తిరువొత్తియూరు: సంబా రవ్వ ఉత్పత్తి చేయడంలో దేశంలోనే తమిళనాడుకు ప్రత్యేక స్థానముంది. ఈ సంబ గోధుమ రవ్వలో పీచు పదార్థం, పౌష్టిక శక్తి ఎక్కువగా ఉందంటూ తిరుపూరు, కోవై, ఈరోడ్డు జిల్లాల్లో గోధుమను పిండి కొట్టి ప్యాకెట్లలో ప్యాక్ చేసి సంబా గోధుమ రవ్వగా విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో కోవై, తిరుపూరు తదితర జిల్లాల్లో ఆహార భద్రత అధికారులు ఇటీవల కాలంలో ఆ ప్యాకెట్లను సమీకరించి పరిశీలించారు. ఆ పరీక్షల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా నిషేధింపబడిన క్లోరోఫై రిబోస్ రసాయనం ఉన్నట్లు గుర్తించారు. దీన్ని తినే వారికి ఆరోగ్య సమస్యలు తప్పవని తేలింది. దీని గురించి జిల్లా ఆహార భద్రత విభాగం నియామక అధికారి తమిళ్ సెల్వన్ మాట్లాడుతూ జిల్లాలో సంబా రవ్వ ప్యాకెట్లలో నిషేధిత రసాయనం కలపబడి ఉన్నట్లు పరీక్షల్లో తేలిందని ఈ సంబా రవ్వ ప్యాకెట్లను తిరిగి దుకాణాల నుంచి వాపస్ తీసుకోవాలని వాటిని విక్రయించరాదని స్పష్టం చేశారు. ఈ ఘటన కోవైలో కలకలం రేపింది.

మహిషాసురమర్దిని ఆలయంలో దీపారాధన



దీపారాధన పూజలు చేస్తున్న మహిళలు



విశేషాలంకరణలో మహిషాసురమర్దిని

తిరుత్తణి: ఆడినెల శుక్రవారం, వరలక్ష్మీవ్రతం సందర్భంగా మహిషాసురమర్దిని అమ్మవారి ఆలయంలో శుక్రవారం రాత్రి దీపారాధన పూజలు నిర్వహించారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మద్దూరు మహిషాసురమర్దిని అమ్మవారి ఆలయంలో ఆడినెల చివరి శుక్రవారంతోపాటు వరలక్ష్మీవ్రతం సందర్భంగా అమ్మవారికి 110 లీటర్ల పాలతో అభిషేకం చేసి, చందనకాపు అలంకరణలో దీపారాధన పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం 6 గంటల సమయంలో జరిగిన దీపారాధన పూజల్లో 300 మందికిపైగా మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిషాసురమర్దిని అమ్మవారిని పుష్పాలంకరణలో కొలువుదీర్చి, మహిళలు దీపారాధన పూజలు చేశారు. తిరుత్తణి ఆలయం ద్వారా మహిళలకు ఉచితంగా చీరలు, పసుపు కుంకుమ ప్రసాదాలు అందజేశారు.

త్వరలో 'పళణి' టూర్

- 234 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పర్యటన



పళణి స్వామి

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి రాష్ట్ర పర్యటనకు రెడీ అవుతున్నారు. 234 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పర్యటించేందుకు రూట్ మ్యాప్ రూపకల్పనకు చర్యలు చేపట్టారు. జయలలిత మరణం తర్వాత అన్నాడీఎంకే ముక్కలైనా 2021 అసెంబ్లీ ఎన్నికలలో 75 చోట్ల ఆ కూటమి విజయ కేతనం ఎగుర వేసి బలాన్ని చాటుకుంది. ఇందులో 60 మంది అన్నాడీఎంకే సభ్యులు ఉన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో డీఎంకే కూటమి క్లీన్ స్వీప్ చేసినా, అన్నాడీఎంకే ఓటు బ్యాంక్ కొంత మేరకు పెరిగింది. ఓడినా, ప్రజా బలం తమకు పెరిగిందన్న ధీమాతో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడపాడి కెపళణిస్వామి వ్యూహాలకు పదును పెడుతూ వస్తున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల ద్వారా అధికారం లక్ష్యంగా ప్రజలతో మమేకం అయ్యే కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా చెన్నైలో జరిగిన రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో శుక్రవారం చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. పార్టీలో తన నిర్ణయమే శిరోధార్యం అని, దానిని ఆచరించే విధంగా నేతల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఇక, పార్టీకి అన్ని తానై గెలుపే లక్ష్యంగా అధికారం చేజిక్కించుకునే వ్యూహాలతో ప్రజలలోకి వెళ్లేందుకు పళణి సిద్ధమయ్యారు. డీఎంకే వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలచుకోవడమే కాకుండా, రాష్ట్రంలో బీజేపీ బల పడకుండా, కొత్తగా పుట్టుకొచ్చిన సినీ నటుడు విజయ్ తమిళగ వెట్రి కళగం వైపుగా జనం చూపు మరల కుండా, ×అన్నాడీఎంకే కేడర్ అంతా పార్టీ వైపు...ప్రజలంతా(తమ ఓటు బ్యాంక్) అన్నాడీఎంకే వైపే౯ అని చాటుకునే విధంగా ప్రజా పర్యటనకు పళణి రెడీ అవుతున్నారు. కార్యనిర్వాహక కమిటీలో ఈ విషయంగా చర్చించి 234 అసెంబ్లీ నియోజక వర్గాలలో పళని పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్ రూపకల్పనపై ఆ పార్టీ కార్యాలయం శనివారం దృష్టి పెట్టింది. అన్నాడీఎంకే దివంగత నేతలు ఎంజీఆర్, జయలలిత మార్గంలో పళణి రాష్ట్ర పర్యటనలు, ప్రజాకర్షణ కార్యక్రమాలు చేపట్టబోతున్నారు. గ్రామాలలో తమ ఓటు బ్యాంక్‌ను మరింత పదిలం చేసుకునే విధంగా ప్రజల కోసమే నేను... అన్న నినాదంతో దివంగత అమ్మ జయలలిత బాణీలో నియోజకవర్గ పర్యటనకు సిద్ధమవుతున్నారు. 234 అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ పళణి పర్యటనలు సుమారు ఏడాది కాలం పాటు జరిగే రీతిలో రూట్ మ్యాప్ రూపకల్పన కార్యాచరణ సిద్ధం చేశారు. ఏడాది కాలం పాటు ప్రజలతో మమేకం అయ్యే విధంగా ఈ పర్యటనలు సాగిన పక్షంలో అంతలోపు 2026 అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తుందని, ఆతదుపరి ఎన్నికల ప్రచార సభలో ప్రజల మన్ననలు పొందే విధంగా పళణి టూర్ రూపకల్పన జరుగుతోందని ఓ నేత పేర్కొన్నారు.

భర్త హత్యకేసులో భార్య అరెస్టు



అరెస్టయిన భాగ్యం

అన్నానగర్: భర్త మద్యం తాగి వచ్చి హింసించడంతో కోపోద్రిక్తురాలైన భార్య భర్తను నిద్రిస్తున్న సమయంలో చీరను మెడకు బిగించి హత్య చేసింది. ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. కోయంబత్తూరులోని సౌరిపాళయం కరుణానిధినగర్‌కు చెందిన షణ్ముగనాథన్ (42) కార్మికుడు. ఇతనికి భార్య భాగ్యం (38), ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. షణ్ముగనాథన్ తరచూ మద్యం సేవించి ఇంట్లో భార్యాపిల్లలతో గొడవ పడేవాడు. కాగా శుక్రవారం రాత్రి తన భర్త షణ్ముగనాథన్ ఆత్మహత్య చేసుకున్నాడని, అతడి భార్య భాగ్యం బంధువులకు తెలిపింది. షణ్ముగనాథన్ సోదరుడు కేశవన్, సోదరి మహాలక్ష్మి అతడి ఇంటికి వెళ్లి మృతదేహాన్ని చూడగా మెడపై గాయాలు కనిపించడంతో అనుమానించి కోయంబత్తూరు బీలమేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు షణ్ముగనాథన్ భార్య భాగ్యంను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. రోజూ మద్యం తాగి ఇంట్లో ఉన్న తన పిల్లలను, తనను కొట్టేవాడని, దీంతో ఆగ్రహించిన భాగ్యం షణ్ముగనాథన్ గాఢనిద్రలో ఉన్నప్పుడు మెడకు చీర బిగించి చంపినట్లు పోలీసుల విచారణలో తెలిపింది. దీంతో భాగ్యంను అరెస్టు చేశారు.

ఎలక్ట్రిసిటీ బోర్డుకు రూ.519 కోట్లు ఇవ్వండి

కొరుక్కుపేట: అధిక సబ్సిడీ ధర కారణంగా విద్యుత్ బోర్డు రూ.519 కోట్లు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరింది. తమిళనాడు ఎలక్ట్రిసిటీ బోర్డు అన్ని గృహాలకు ఉచితంగా 100 యూనిట్ల విద్యుత్‌ను అందిస్తోంది. వ్యవసాయం, కాటేజీలకు పూర్తిగా ఉచితంగా సరఫరా చేస్తోంది. ఇందుకోసం తమిళనాడు ప్రభుత్వం విద్యుత్ బోర్డుకు సబ్సిడీని అందజేస్తోంది. దీని ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ నియంత్రణ మండలి ఇప్పటికే రూ.15,332 కోట్ల సబ్సిడీని ప్రభుత్వానికి అందజేసింది. అందులో హౌసింగ్ సబ్సిడీ రూ.7,225 కోట్లు, వ్యవసాయ సబ్సిడీ రూ.6,780 కోట్లు ఉంది. ఈ నేపథ్యంలో జూలై 1 నుంచి అన్ని వర్గాలకు విద్యుత్ ఛార్జీలను 4.83 శాతం పెంచారు. దీంతో సబ్సిడీ ధర యూనిట్‌కు 0.20 నుంచి 0.55 పైసలు పెరిగింది. దీని ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అదనంగా రూ.519.25 కోట్లు విద్యుత్ బోర్డుకు అందించాలని విద్యుత్ నియంత్రణ సంఘం ప్రభుత్వాన్ని కోరింది.

అవినీతి కేసులో డీటీ అరెస్టు

తిరువొత్తియూరు: తిరువారూరు జిల్లాలో పట్టాలో పేరు మార్పు చేయడానికి డీఎంకే నిర్వాహకుడి వద్ద రూ. 12 వేలు లంచం తీసుకున్న మన్నారుకుడి డిప్యూటీ తహసీల్దార్‌ను ఏసీబీ పోలీసులు అరెస్టు చేశారు. తిరువారూరు జిల్లా మన్నార్ కుడికి చెందిన వ్యక్తి శక్తివేల్ (51) డీఎంకే వార్డు కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఇతని భార్య చిత్రాదేవి (45) ఏడో వార్డు డీఎంకే నగర మండలం కమిటీ సభ్యులుగా ఉన్నారు. శక్తివేల్ తన భార్య చిత్రా పేరులో ఉన్న పట్టాలో పేరు మార్పు చేయడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేశాడు. తర్వాత మన్నార్కుడి తాలూకా కార్యాలయంలో మండల డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు (40)ను సంప్రదించగా.. పట్టాలో పేరు మార్పు చేయడానికి రూ.12 వేలు లంచం అడిగాడు. ఈ విషయమై శక్తివేల్ ఏసీబీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి సూచన మేరకు శక్తివేల్ శుక్రవారం సాయంత్రం మన్నార్కుడి తాలూకా కార్యాలయం వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ నాగరాజుకు రూ.12 వేలు ఇస్తుండగా ఏసీబీ ఎస్పీ పూరణి నేతృత్వంలో పోలీసులు నాగరాజును అరెస్టు చేశారు.

507 ప్రాథమిక పాఠశాలల్లో భవన కమిటీల ఏర్పాటు



శిక్షణ పొందిన కమిటీ చైర్మన్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు

వేలూరు: జిల్లాలోని 507 ప్రాథమిక పాఠశాలల్లో భవన కమిటీలు ఏర్పాటు చేశామని తమిళనాడు సైన్స్ మూవ్‌మెంట్ కార్యదర్శి జనార్ధనన్ తెలిపారు. పాఠశాల భవన కమిటీ చైర్మన్లుగా ఎన్నికైన వారికి శిక్షణ తరగతులు కాట్పాడిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కమిటీ చైర్మన్లు సహాయ సహకారాలు అందజేయాలన్నారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడం, పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, తాగు నీరు తదితర వాటిని కమిటీ చైర్మన్లు తరచూ తనిఖీ చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామంలోని ప్రతి ఒక్కరూ వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలికల పాఠశాల హెచ్‌ఎం ఇందిర, కార్పొరేటర్ శివశంకరి, కమిటీ సభ్యులు సావిత్రి, భువనేశ్వరి, విజయకుమారి, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

యోగా విజేతలకు బహుమతుల ప్రదానం

- ముగిసిన 14వ రాష్ట్రస్థాయి యోగా పోటీలు



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

తిరువళ్లూరు: 14వ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తమిళనాడు యోగా అభివృద్ధి సంఘం, శక్తి ప్రపంచ యోగా సంస్థ ఉమ్మడిగా హఠయోగీ డాక్టర్ జీటీ అన్బరసన్ ట్రస్టు ఆధ్వర్యంలో 14వ రాష్ట్రస్థాయి యోగా పోటీలను గత 15వ తేదీ నుంచి రెండు రోజులపాటు తిరువళ్లూరు జిల్లా పట్టాభిరామ్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న శ్రీనికేతన్ పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ అవార్డు గెలుచుకున్నారు. రెండో స్థానంలో తుళీర్ యోగాసంస్థ, మూడో స్థానంలో ఏబీఎస్ విద్యా మందిర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు నిలిచారు. బహమతులను ప్రదాన కార్యక్రమం యోగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దయాళన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పారి శ్రామికవేత్త సురేష్‌కుమార్, స్వామి వివేకానంద కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసన్, యోగా సేవకుడు దురైరాజ్ హాజరై, విజేతలకు బహుమతులను అందజేశారు. సంఘం నిర్వాహకులు దండపాణి, తమిళ్‌సెల్వన్, వేలూరు జిల్లా కార్యదర్శి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగాలి

- విద్యార్థులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపు
- ఘనంగా వీఐటీ–చెన్నై వార్షిక స్నాతకోత్సవం



విద్యార్థులకు డిగ్రీ పట్టాల ప్రదానోత్సవంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, డాక్టర్ జి.విశ్వనాథన్

కొరుక్కుపేట: సవాళ్లను అధిగమిస్తూ పట్టుదల, అంకిత భావంతో అనుకున్న లక్ష్యాలను సాధించాలని మంత్రి కిషన్‌రెడ్డి విద్యార్థులకు హితవుపలికారు. వీఐటీ -చెన్నై వార్షిక స్నాతకోత్సవం-2024, డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ బ్లాక్ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఉదయం జరిగింది. వీఐటీ వ్యవస్థాపక చాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారత ప్రభుత్వ బొగ్గు, గనుల శాఖ కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, గౌరవ అతిథిగా ఎల్‌టీఐ మైండ్‌ట్రీ చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ చేతన పట్నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 38 మంది బంగారు పతక విజేతలతో పాటు దాదాపు 3 వేల మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అతిథులు ప్రదానం చేశారు. ముందుగా వీఐటీ చాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ అధ్యక్షోపన్యాసం చేశారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు విశ్వ విద్యాలయాలకు తగు ప్రోత్సాహకాలను అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రాలకు అధికంగా నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిగ్రీ పట్టాలను అందుకున్న విద్యార్థులకు శుభాభినందనలు తెలియజేస్తూ మాట్లాడారు. దేశాన్ని 2047లో స్వాతంత్ర శత వార్షికోత్సవాల్లోపు సంపన్న దేశంగా మార్చాలని, ప్రధాని మోడీ ఆశిస్తున్నారని, ఆయన ఆశయ సాధనకు యువ పట్టభద్రులు తోడ్పాటు అందించాలని కోరారు. దేశానికి వృత్తిపరమైన నిపుణుల అవసరం ఎంతైనా ఉందని నేటి పట్టభద్రులు ఉద్యోగాల కోసం వెంపర్లాడకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. దేశం పారిశ్రామిక పరంగా, శాస్త్ర సాంకేతికపరంగా పురోగమన దిశలో పయనిస్తుందని, మేధో పరిజ్ఞానాన్ని పంచిపెట్టే స్థాయికి ఎదగాలని కోరారు. యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, వికసిత భారత్ రూపకర్తలు యువ పట్టభద్రులేనని, వీరి ద్వారా కొత్త శకం, కొత్త అధ్యాయం ప్రారంభమై దేశం సంపన్న దేశంగా మారుతుందని ప్రధాని మోడీ అపారంగా విశ్వసిస్తున్నారన్నారు. యోగ, యుజుర్వేదం వంటి ప్రాచీన వైద్య పద్ధతులను అభివృద్ధి చేయాలన్నారు. మాతృభూమిని, మాతృభాషను, విద్య నేర్పిన గురువులు కన్న తల్లిదండ్రులను మరువరాదని సూచించారు. వీఐటీ లాంటి ఉత్తమ విద్యాసంస్థ దేశ పురోగమనానికి పట్టుకొమ్మ అని కొనియాడారు. వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వీఎస్ కాంచన భాస్కరన్ స్వాగతోపన్యాసం చేశారు. అతిథులను ప్రొ చాన్స్‌లర్ డాక్టర్ టి. త్యాగరాజన్ సభకు పరిచయం చేయగా వైస్ ప్రెసిడెంట్‌లు శంకర్ విశ్వనాథన్, డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదాంబరి ఎస్ విశ్వనాథన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంధ్య పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి

- సుందరంగా సముద్ర తీరాలు
- వివిధ నిర్మాణాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఐఏఎస్ చంద్ర మోహన్

సాక్షి, చెన్నై : పర్యాటక ప్రగతికి పెట్టుబడులపై తమిళనాడు టూరిజం దృష్టి సారించింది. సముద్ర తీరాలలో సుందరంగా వివిధ నిర్మాణాలతో పాటు హోటళ్లు, గెస్ట్ హౌస్‌లను ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా శనివారం చెన్నైలో సమావేశం జరిగింది. పర్యాటక పాలసీ గురించి ఇందులో చర్చించారు. వివరాలు.. పర్యాటక శాఖ కార్యదర్శి చంద్రమోహన్ , కమిషనర్ సమయ మూర్తి నేతృత్వంలో చెన్నైలో జరిగిన ఈ సమావేశానికి పలు హోటళ్ల యాజమాన్యాలు, వివిధ సంస్థల ప్రతినిధులు మాజరు అయ్యారు. ఏడాది పొడవున తమిళనాడులోకి పర్యాటకులు తరలి వచ్చే విధంగా పర్యాటక ప్రగతి, పెట్టుబడులపై ఈ సమావేశం ద్వారా దృష్టి పెట్టారు. స్వదేశీ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే రీతిలో వివిధ నిర్మాణలు, పర్యాటక ప్రాంతాల ఆధునీకరణ, సముద్ర తీరాలలో సుందరీకరణకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఆయా ప్రాంతాలలో హోటళ్లు, రిసార్ట్స్ ఏర్పాటు తదితర వాటి గురించి చర్చించారు. రామేశ్వరానికి పర్యాటకుల తాకిడి క్రమంగా పెరిగిన నేపథ్యంలో వారికి మెరుగైన వసతులు కల్పించేందుకు మదురై నుంచి రామేశ్వరం మార్గాలలో హోటళ్ల నిర్మాణాలకు అవకాశం కల్పించారు. సముద్ర తీరాలలో సాహస క్రీడలకు కార్యాచరణ సిద్ధం చేశారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం పరిసరాలలో సముద్ర తీరాల సుందకీరణకు నిర్ణయాలు తీసుకున్నారు. పెద్దగా ప్రచారంలోని పర్యాటక ప్రాంతాలు జవ్వాది మల్లై, వత్తల్ మలై, పచ్చైమలై, తిరుమూర్తి మలైలలో పర్యాటకంగా నిర్మాణాలు విస్తృతం చేయనున్నారు. తంజావూరు, కుంబకోణం పరిసరాలలో ఆలయాల సందర్శనకు విదేశీ పర్యాటకుల తాకిడి పెరుగుతుండటంతో ఇక్కడ వసతులను మెరుగు పరిచేదిశగా ఆయా సంస్థలకు పిలుపునిచ్చారు. కల్పకం నుంచి మరక్కానం వరకు కొత్త స్టార్‌హోటళ్ల నిర్మాణాలకు అవకాశం కల్పించారు.

ఆత్మరక్షణకు పోలీసు కాల్పులు

- ఇద్దరు రౌడీల కాళ్లకు దిగిన పోలీసు తూటాలు

సాక్షి, చెన్నై: ఇద్దరు రౌడీలను పట్టుకునే క్రమంలో వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు తుపాకీకి పని పెట్టారు. ఆత్మరక్షణ కోసం ఆ రౌడీల మోకాలిని గురి పెట్టి తూటాలను దింపారు. వివరాలలోకి వెళితే.. శివగంగై సమీపంలోని తిరుకువనం పరిధిలో ఉన్న మరత్తనాడుకు చెందిన అఖిలన్(23)పై 17కు పైగా హత్య, దోపిడీ తదితర కేసులు ఉన్నాయి. ఇతడి తల్లి ఓ హత్య కేసులో నిందితురాలిగా జైలులో ఉంది. కొంత కాలంగా అఖిలన్ అజ్ఞాతంలో ఉంటున్నాడు. పేరు, వేషం మార్చుకుని తిరుగుతూ వచ్చాడు. శనివారం ఉదయం కాలయార్ కోవిల్ మార్గంలో ఇన్‌స్పెక్టర్ ఆదివేల్, సబ్ ఇన్‌స్పెక్టర్ గుగన్, పోలీసులు ద్విచక్ర వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అటు వైపుగా మోటారు సైకిల్‌పై వచ్చిన యువకుడిని ప్రశ్నించారు. అతడు పొంతన లేని సమాధానాలు చెప్పడమే కాకుండా హఠాత్తుగా తన వద్ద కత్తితో సబ్ ఇన్‌స్పెక్టర్ గుగన్‌పై దాడి చేశాడు. తక్షణం అప్రమత్తమైన ఇన్‌స్పెక్టర్ ఆదివేలు తుపాకీకి పని పెట్టారు. సబ్ ఇన్‌స్పెక్టర్‌పై దాడి చేసి పారి పోతున్న యువకుడి కుడి కాలి మోకాలు చీల్చేలా తుపాకీ తూటా దూసుకెళ్లింది. దీంతో అతడు కింద పడి పోయాడు. అతడిని ఆస్పత్రికి తరలించి విచారించగా, అజ్ఞాతంలో ఉన్న అఖిలన్‌గా తేలింది.

మరో రౌడీపై..

తిరువారూర్ నీడ మంగళానికి చెందిన సీపీఐ నేత నటేషన్ తమిళరివన్ ఇటీవల హత్యకు గురయ్యారు. పువ్వనూరు రాజ్ కుమార్ ఈ హత్య చేసినట్టు తేలింది. తన తండ్రిని మట్టుబెట్టిన రాజ్‌కుమార్‌ను తమిళరివన్ తనయుడు భారతీ హతమార్చాడు. ఈ పరిస్థితుల్లో పువ్వనూర రాజ్‌కుమార్‌ను హతమార్చిన వారిపై ప్రతీకారం తీర్చుకునేందుకు స్నేహితుడు మనో నిర్మల్ రాజ్(22) సిద్ధమయ్యాడు. తన అనుచరులతో కలిసి శుక్రవారం సాయంత్రం రాజ్‌కుమార్ సమాధి వద్ద నివాళులర్పించి భారతీ కుటుంబాన్ని గురి పెట్టేందుకు వ్యూహరచన చేశారు. ఈ సమాచారంతో నీడ మంగళం పోలీసు స్టేషన ఎస్‌ఐ సంతోష్‌కుమార్, కానిస్టేబుల్ విఘ్నేష్‌తో పాటుగా మరి కొందరు సిబ్బంది వెళ్లారు. పోలీసు రావడంతో మనో నిర్మల్‌రాజ్ తప్పించుకున్నాడు. మిగిలిన ఐదుగురు పోలీసులకు చిక్కారు. మనో నిర్మల్‌రాజ్‌ను పట్టుకునేందుకు ఎస్‌ఐ సంతోష్ కుమార్, కానిస్టేబుల్ విఘ్నేష్‌లు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అర్ధరాత్రి వేళ నీడ మంగళం శివారులో విఘ్నేష్‌పై మనో నిర్మల్ రాజ్ కత్తితో దాడి చేయడంతో ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తన తుపాకీకి పని పెట్టారు. మనో నిర్మల్ రాజ్ కుడి కాలిని తుపాకీ తూటా చీల్చింది. అతడిని చికిత్స నిమిత్తం తిరువారూర్ ఆస్పత్రికి తరలించారు. ఆత్మరక్షణ కోసం తమ సిబ్బంది ఈ కాల్పులు జరపాల్సి వచ్చిందని పోలీసు యంత్రాంగం పేర్కొంది. ఇది వరకు ఎన్‌కౌంటర్ , ఆ తరువాత జారి పడ్డారని రౌడీలకు పుత్తూరు కట్లు వేసిన పోలీసులు, ప్రస్తుతం మోకాలి చిప్పలను చీల్చే దిశగా తుపాకీకి పని పెట్టడం గమనార్హం.

మహిళల ఆందోళన

తిరువళ్లూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళ హక్కు పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే వారు కలెక్టర్ కార్యాలయంలో 17,18,19 తేదీల్లో దరఖాస్తులు చేసుకోవాలని కొందరు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేసిన మెసేజ్‌లను నమ్మి వందలాది మంది మహిళలు కలెక్టర్ కార్యాలయానికి రావడంతో పరిస్థితి ఉద్రిక్తతగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కలైంజ్ఞర్ మహిళ హక్కు పథకానికి ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన వారు ఆధార్, రేషన్‌కార్డులతో వెళ్లి 17,18,19 తేదీల్లో దరఖాస్తు చేసుకోవచ్చని కొందరు ఫేస్‌బుక్ వాట్సాప్‌లో మెసేజ్‌ను వైరల్ చేశారు. దీంతో రెండు వందల మంది మహిళలు కలెక్టరేట్‌కు వచ్చి సాంఘిక సంక్షేమశాఖ అధికారులను వివరాలను కోరారు. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులను ఇవ్వలేదని చెప్పడంతో ఆగ్రహించిన మహిళలు కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి వారితో చర్చలు జరిపారు. అయినా ఫలితం లేకపోవడంతో డీఆర్వో రాజ్‌కుమార్‌ను రప్పించి మహిళలతో చర్చించి, ఆందోళన విరమింపజేశారు.

4 సవర్ల నగల అపహరణ

తిరువొత్తియూరు: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ వద్ద ఉన్న 4 సవర్ల నగలు అపహరించిన సంఘటన వెలుగుచూసింది. చెన్నై అరుంబాక్కం అశోక్ నగర్‌కు చెందిన ఇందిర (51) శుక్రవారం రాత్రి అమైంతకరై స్కైవాక్ వంతెన వద్ద బస్సు ఎక్కింది. బస్సులో ప్రయాణం చేస్తున్న సమయంలో ఆమె సంచిలో ఉంచిన 4 సవర్ల నగలు, రూ. 8 వేల అదృశ్యమైంది. బస్సులో చేతి సంచి చూసుకుని, నగలు, నగదు కనిపించకపోవడంతో దిగ్భ్రాంతి చెందిన ఆమె కేకలు పెట్టింది. దీంతో బస్సు ఆపి నగల కోసం వెతికారు. కానీ కనిపించలేదు. ఈ విషయమై ఇందిర ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమందకరై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక మాధ్యమాలు చూడమని చెప్పండి

- కుష్బూకు కనిమొళి ఘాటైన సమాధానం

సాక్షి, చెన్నై : మహిళా డాక్టర్ హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తూ సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యానించినట్లు కనిమొళి తెలిపారు. వెస్ట్ బెంగాల్‌లో వైద్య విద్యార్థిని అత్యాచార ఘటనకు వ్యతిరేకత వ్యక్తం చేసిన డీఎంకే ఎంపీ కనిమొళి ఎందుకు గళం విప్పలేదని నటి కుష్బూ ప్రశ్నించారు. దీనిపై స్పందిస్తూ డీఎంకే ఎంపీ కనిమొళి ఘాటైన సమాధానం ఇచ్చారు. శనివారం కనిమొళి మీడియాతో మాట్లాడుతూ వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి, దారుణంగా హత్య చేసిన ఘటనను తాము తీవ్రంగా ఖండించామన్నారు. ఈ ఘటనపై తాను అభిప్రాయం తెలుపలేదని బీజేపీకి చెందిన కుష్బూ ఆరోపించారన్నారు. అయితే తనపై ఆరోపణలు గుప్పించడానికి ముందు కుష్బూను సామాజిక మాధ్యమాలను సరిగ్గా చూడమని చెప్పండంటూ బదులిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో నిత్యం హల్‌చల్ చేస్తే సరిపోదని, సామాజిక మాధ్యమాలలోను, మీడియాలోను ఎలాంటి వార్తలు వస్తున్నాయో సరిగ్గా చూసి ఆ తర్వాతే వ్యాఖ్యలు చేయాలని కుష్బూకు సూచించారు.

రౌడీ నాగేంద్రన్, అశ్వథామన్ కోర్టుకు హాజరు



ఆమ్‌స్ట్రాంగ్ (ఫైల్) కోర్టులో హాజరైన నాగేంద్రన్, అశ్వథామన్

కొరుక్కుపేట: ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసుకు సంబంధించి ప్రముఖ రౌడీ నాగేంద్రన్, అతని కుమారుడు అశ్వథామన్ శనివారం కోర్టులో హాజరయ్యారు. ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో ఇప్పటి వరకు 23 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా జీవిత ఖైదీ నాగేంద్రన్, అతని కుమారుడు, కాంగ్రెస్ నాయకుడు అశ్వథామన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మీంజూరు కాంగ్రెస్ నేత జయప్రకాష్ కిడ్నాప్, భూవివాదం తదితర అంశాలపై అశ్వథామన్‌ను పోలీసులు విచారించారు. ఈ సందర్భంగా ఆమ్‌స్ట్రాంగ్‌ని ఎన్నిసార్లు వ్యక్తిగతంగా కలిసి మాట్లాడారన్న విషయాల గురించి ప్రశ్నించారు. పోలీసుల ప్రశ్నలకు నాగేంద్రన్ స్పష్టమైన సమాధానాలు చెప్పలేదని సమాచారం. దీంతో వారిని ఎగ్మూరు కోర్టులో హాజరుపరిచి, విచారణ నిమిత్తం పోలీసు కస్టడీకి తరలించాలని పోలీసు అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది.


200 స్థానాలతో మళ్లీ అధికారంలోకి అన్నాడీఎంకే



డాక్టర్ సునీల్‌ను సత్కరిస్తున్న అన్నాడీఎంకే నాయకులు

కొరుక్కుపేట: రాష్ట్రంలో 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే 200 స్థానాల్లో గెలుపొంది, మళ్లీ అధికారంలోకి వస్తుందని ఎంజీఆర్ యువజన విభాగం డిప్యూటీ కార్యదర్శి డాక్టర్ సునీల్ ఆశాభావం వ్యక్తం చేశారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడపాడి పళనిస్వామి నాయకత్వంలో ఆ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపొంది, రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి రావాలిని ఆకాంక్షిస్తూ డాక్టర్ సునీల్ తన స్నేహితులతో కలసి చెన్నై నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళ్లి తిరిగి చెన్నై నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అన్నాడీఎంకే నాయకులు పెద్ద ఎత్తున డాక్టర్ సునీల్‌కు ఘన స్వాగతం పలికి, సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడపాడి పళనిస్వామి నాయకత్వంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 200 స్థానాల్లో గెలుపొందాలని, తమ పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి రావాలని వేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ఎడపాడి పళనిస్వామి నేతృత్వంలో అమ్మ జయలలిత సంక్షేమపాలన తీసుకుని వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

చంద్రగిరిలో జోరుగా గంజాయి అక్రమ రవాణా



కారు డిక్కీలో నుంచి గంజాయి ప్యాకెట్లు కింద పడినట్లు సీసీ పుటేజీలో నమోదైన దృశ్యం

- గాదంకి టోల్‌ప్లాజా వద్ద కారు డిక్కీలో నుంచి కిందపడ్డ గంజాయి ప్యాకెట్లు
- గుట్టుచప్పుడు కాకుండా విచారణ చేస్తున్న పోలీసు శాఖ



గాదంకి టోల్‌ప్లాజా వద్ద వేగంగా వెళ్తున్న కారు

చంద్రగిరి: గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామంటూ ప్రగల్భాలు పలుకుతున్న టీడీపీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోందనే విమర్శలొస్తున్నాయి. రాత్రి సమయాల్లో కిలోల కొద్దీ చంద్రగిరి మీదుగా గంజాయి అక్రమ రవాణా జరుగుతోంది. ఈ క్రమంలో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి పార్శిళ్లు కారు డిక్కీలో నుంచి కిందపడిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లో కెళితే...శుక్రవారం రాత్రి ఓ నలుపు రంగు కారు తిరుపతి జిల్లా చంద్రగిరి నుంచి చిత్తూరు వైపుగా వెళ్తూ.. పాకాలవారిపల్లి వద్ద ఉన్న టోల్‌ప్లాజా వద్ద టోల్ రుసుము చెల్లించింది. అనంతరం అక్కడ నుంచి ముందుకెళ్లగానే స్పీడు బ్రేకర్ల వద్ద వాహనం వేగంగా వెళ్లడంతో కారు వెనుక డిక్కీలోని రెండు పెద్ద ప్యాకెట్లు కింద పడ్డాయి. దీంతో అక్కడ పని చేస్తున్న సిబ్బంది కారులో నుంచి ప్యాకెట్లు పడ్డాయని వాహనంలోని వ్యక్తులకు తెలిపినా.. కారు ఆపకుండా మరింత వేగంగా అక్కడ నుంచి వెళ్లిపోయింది. అనంతరం టోల్ సిబ్బంది చంద్రగిరి పోలీసులకు ఈ సమాచారం అందజేయడంతో ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది ప్యాకెట్లను పరిశీలించారు. అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించి, సుమారు 4 కిలోల బరువు గల రెండు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. పెద్ద మొత్తంలో గంజాయి రవాణా జరుగుతున్నట్లు వార్తలు చక్కర్లు కొట్టడంతో అప్రమత్తమైన పోలీసు అధికారులు గుట్టు చప్పుడు కాకుండా విచారణ చేస్తున్నట్లు సమాచారం.

'పచ్చ' పంచాయతీ భవనం!



ప్రజల పంచాయతీ భవనాన్ని కాస్తా.. 'పచ్చ' పంచాయతీ భవనంగా మార్చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు పచ్చ రంగు వేయకూడదన్న విషయాన్ని మరచిన కొందరు టీడీపీ నేతలు.. ఏకంగా ఇలా పచ్చ రంగును పులిమేశారు. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం వేంపాడులోని పంచాయతీ కార్యాలయానికి పచ్చ రంగు వేయడంతో పాటు దివంగత ఎన్టీఆర్, ప్రస్తుత సీఎం చంద్రబాబు ఫొటోలను ముద్రించారు. అంతేకాదు, స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, దివంగత ఎంపీపీ వడ్లమూడి ప్రసాద్‌ల ఫ్లెక్సీలనూ ఏర్పాటు చేశారు. ఇంత జరుగుతున్నా స్థానిక అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. – ద్వారకా తిరుమల

క్లుప్తంగా...

చింతపల్లిలో శిలాఫలకం ధ్వంసం



శిలాఫలకం తొలగించిన చింతపల్లిలోని హెల్త్ వెల్‌నెస్ భవనం

అచ్చంపేట: పల్నాడు జిల్లా చింతపల్లిలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. శిలాఫలకంపై అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి, అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఫొటోలున్నాయి. అయినా వైద్యాధికారులు ఇప్పటివరకు స్పందించలేదు. కనీసం పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఇది ముమ్మాటికి టీడీపీ వర్గీయుల దుశ్చర్యేనని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా, శిలాఫలకం ధ్వంసం చేసిన విషయంపై తనకెవరూ ఫిర్యాదు చేయలేదని అచ్చంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి తెలిపారు.

విద్యార్థిపై దస్తగిరి దాడి



పాఠశాల నుంచి విద్యార్థిని బయటకు తీసుకెళ్తున్న దస్తగిరి

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలోని ప్రైవేట్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిపై మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి దాడి చేసి గాయపరిచాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పులివెందుల మండలం మోట్నూతలపల్లె గ్రామానికి చెందిన గంగరాజు వ్యవసాయ పనులు చేసుకుంటూ అతని కుమారుడిని పులివెందులలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 10వ తరగతి చదివిస్తున్నాడు. అదే పాఠశాలలో దస్తగిరి కుమార్తె చదువుతోంది. ఆ బాలికతో ఈ విద్యార్థి మాట్లాడుతున్నాడని తెలియడంతో దస్తగిరి శనివారం పాఠశాలకు వెళ్లి పాఠశాల నుంచి విద్యార్థిని బయటకు తీసుకువచ్చి దాడి చేసి గాయపరిచాడు. ఈ దాడిలో విద్యార్థి తలకు గాయాలైనట్లు తెలిపారు. ఎస్ఐ నారాయణ తన సిబ్బందితో పాఠశాలకు వెళ్లి విద్యార్థిపై దాడి ఘటనను సీసీ పుటేజ్ ద్వారా పరిశీలించారు.

సీఎంపై ఎఫ్‌బీలో పోస్ట్ పెట్టిన మహిళ అరెస్ట్

కంభం: సోషల్ మీడియాలో అనుచిత పోస్టు చేసిన మహిళను అరెస్టు చేసినట్లు ప్రకాశం జిల్లా కంభం సర్కిల్ ఇన్‌చార్జ్ సీఐ జె.రామకోటయ్య శనివారం తెలిపారు. ఫేస్‌బుక్ లో సీఎంపై అనుచిత పోస్టు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 7వ తేదీ టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోన చెన్నకేశవులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ చేపట్టారు. పోస్టులు పెట్టిన మహిళను శనివారం అరెస్టు చేసి.. ఆమె వద్ద ఉన్న మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

విమాన సర్వీసు రద్దు.. ప్రయాణికుల ఆందోళన

రేణిగుంట: తిరుపతి విమానాశ్రయం నుంచి బెల్గాంకు వెళ్లాల్సిన స్టార్ ఎయిర్ సంస్థకు చెందిన విమాన సర్వీసు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా రద్దు చేయడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. బెల్గాంకు వెళ్లేందుకు 45మంది ప్రయాణికులు శనివారం ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని వేచి ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 10.45గంటలకు వచ్చి 11.15గంటలకు ఈ సర్వీసు తిరుగు పయనం కావాలి. అయితే ఎంతకీ రాకపోవడంతో వేచి ఉన్న ప్రయాణికులు కౌంటర్ వద్ద విచారించారు. స్టార్ ఎయిర్ మేనేజర్ రామ్‌కుమార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సర్వీసు రద్దు అయిందని తాపీగా చెప్పడంతో, ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పట్టుబట్టారు. అయితే వారి అభ్యర్థనను పట్టించుకోకపోవడంతో కౌంటర్ ముందు ప్రయాణికులు బైఠాయించి ఆందోళన చేశారు.

భూ అక్రమాలు క్షేత్ర స్థాయిలో కనిపించలేదు

2 వేల ఎకరాలు మాజీ సీఎస్ రాయించుకున్నారన్నారు

- ఇక్కడ రిజిస్టర్ అయ్యింది 133 ఎకరాలు మాత్రమే
- వాటిలో మాజీ సీఎస్ జవహర్‌రెడ్డి ప్రమేయం ఉందని చెప్పలేం
- 20 ఏళ్లు దాటిన డి పట్టా భూముల్ని ఎవరైనా కొనొచ్చు
- మీడియాతో రెవెన్యూ శాఖ ప్రత్యేక సీఎస్ ఆర్‌పీ సిసోడియా
- జిల్లాలో భూముల పరిశీలన.. అధికారులతో సమీక్ష



భీమిలిలో జిల్లా అధికారులతో కలిసి భూములు పరిశీలిస్తున్న రెవిన్యూ శాఖ స్పెషల్ సీఎస్ ఆర్‌పీ సిసోడియా

సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విశాఖ జిల్లాలో భూ అక్రమాలు జరిగాయంటూ కూటమి నేతలు చేస్తున్న దుష్ప్రచారానికి తెరపడినట్లే. భూ అక్రమాలను పరిశీలించడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చిన రెవెన్యూ శాఖ స్పెషల్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా.. జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్‌తో కలిసి శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ భూ అక్రమాలు క్షేత్రస్థాయిలో కనిపించలేదని చెప్పారు. మాజీ సీఎస్ జవహర్‌రెడ్డి, ఆయన కుమారుడు దాదాపు 2 వేల ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములను బెదిరించి రాయించుకున్నారనే ప్రచారంపైనా పరిశీలించామని చెప్పారు. అయితే, జిల్లాలో 2,600 ఎకరాలు ఫ్రీహోల్డ్‌కు అవకాశం ఉండగా, వాటిలో 626 ఎకరాలు ఫ్రీహోల్డ్ చేసి 22ఎ నుంచి తీసివేశారని తెలిపారు. ఇందులో 4 మండలాల పరిధిలోని 133 ఎకరాలు మాత్రమే కొత్త వారి పేరుతో రిజిస్ట్రేషన్ జరిగిందని చెప్పారు. ఇందులో మాజీ సీఎస్‌కు ప్రమేయం ఉందని చెప్పలేమని స్పష్టం చేశారు. చట్టం ప్రకారం 20 ఏళ్లు దాటిన డి పట్టా భూములను ఎవరైనా కొనొచ్చని తెలిపారు. జిల్లాలో అసైన్డ్, డి పట్టా భూములను ఫ్రీ హోల్డ్ చేసి, రిజిస్ట్రేషన్ వంటివి ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. త్వరలో జీవీఎంసీ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో భూ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. నగరం విస్తరించడం, భోగాపురం ఎయిర్‌పోర్టు వల్ల విశాఖలో భూముల ధరలు పెరిగాయని చెప్పారు. ఏడాది క్రితం వరకు లేఅవుట్లకు అనుమతి ఉందో లేదో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తెలిసేది కాదని, నూతన విధానం వల్ల ఆ సమస్య పరిష్కారమైందని చెప్పారు.

ఎర్రమట్టి దిబ్బల్లో అనుమతులివ్వలేదు

ఎర్రమట్టి దిబ్బల్లో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులివ్వలేదని తెలిపారు. అక్కడ కొంత భూమిని చదును చేస్తుండగా, జిల్లా యంత్రాంగం నిలిపేసిందని తెలిపారు. దసపల్లా ఎస్టేట్ భూములపై కోర్టు కేసులున్నాయన్నారు. 60 ఎకరాల్లో 14.5 ఎకరాల ప్రభుత్వ భూమిని 22ఎ లో పెట్టారని, మిగతా భూమిని ఏ విధంగా పరిష్కరించాలో మార్గాలను వెదుకుతున్నామని అన్నారు. ఎస్టేట్ భూములపై సెటిల్‌మెంట్ ఆఫీసర్ ల్యాండ్ రెంట్ పట్టా ఇవ్వడాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో సిటీ మ్యాప్ తయారు చేసి, ప్రభుత్వ, ప్రభుత్వేతర భూములను, రోడ్లు, పార్కులు వంటివి రంగులతో చూపుతామని, దీని వల్ల ఆక్రమణలకు ఆస్కారం ఉండదని తెలిపారు. అంతకు ముందు ఆయన కలెక్టర్ కార్యాలయంలో భూ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

ఏపీలో మరిన్ని విమానాశ్రయాలు

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు

సాక్షి, న్యూఢిల్లీ : ఏపీలో మరిన్ని విమానాశ్రయాలు తేవడానికి మంత్రిత్వ శాఖ కృషి చేస్తోందని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఏడు విమానాశ్రయాలను 14కు పెంచాలనుకున్నట్టు చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రిత్వ శాఖ అధికారులతో కలిసి 30 ఏళ్ల తర్వాత పౌర విమానాశ్రయ రంగ పరిస్థితులపై సమీక్షించామన్నారు. శనివారం ఉదయం మంత్రిత్వ శాఖ కార్యాలయంలో రామ్మోహన్‌నాయుడు, ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. అనంతరం రామ్మోహన్‌నాయుడు మీడియాతో మాట్లాడుతూ శ్రీకాకుళం, కుప్పం, దగదర్తి, నాగార్జున సాగర్‌లో భూమి సమీకరిస్తే విమానాశ్రయాల నిర్మాణానికి కృషి చేస్తామని చంద్రబాబుకు చెప్పినట్టు తెలిపారు. తాడేపల్లిగూడెంలోని ఎయిర్‌స్ట్రిప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చే యత్నం చేస్తామన్నారు. రాష్ట్రంలో పలు విమానాశ్రయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై చంద్రబాబు దిశా నిర్దేశం చేశారని చెప్పారు. పుట్టపర్తి విమానాశ్రయం నుంచి సివిల్ ఆపరేషన్లు ప్రారంభించడంపై చర్చించామన్నారు. భవిష్యత్తులో చిన్న పెద్ద విమానాశ్రయాలు నిర్మించాలంటే 700 ఎకరాల నుంచి 4 వేల ఎకరాల సేకరణ సాధ్యం కాకపోవచ్చని, అందుకే ఇప్పటి నుంచే వాటిపై దృష్టి సారించాలని చంద్రబాబు ఆలోచన చేశారన్నారు. రాష్ట్రంలో సీప్లేన్‌లో భాగంగా ప్రకాశం బ్యారేజీ, శ్రీశైలం బ్యారేజీల వద్ద వాటర్ ఎయిరోడ్రోమ్ నిర్మించాలని చూస్తున్నట్టు వెల్లడించారు. జిల్లాకో హెలీపోర్టు ఏర్పాటు చేసి టూరిజం, మెడికల్ ఎమర్జెన్సీకి వినియోగించే యత్నం చేస్తామన్నారు. భోగాపురం పనులను 2026 జూన్ నాటికి పూర్తి చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో డ్రోన్ల వినియోగంపైనా చర్చించామని, దీనికి సంబంధించి త్వరలోనే ఓ ప్రత్యేక ఈవెంట్ నిర్వహిస్తామని రామ్మోహన్‌నాయుడు వివరించారు.

స్టీల్‌ప్లాంట్‌కు మైన్స్ లీజు పొడిగింపు

ఉక్కు నగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గర్భాం మాంగనీస్ గనుల లీజును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వం ఈ నెల 13న జీవో జారీ చేసింది. స్టీల్‌ప్లాంట్ అవసరాల కోసం విజయనగరం జిల్లా మెరకముడిదం మండలం గర్భాం గ్రామంలోని మాంగనీస్ గనులను 50 ఏళ్ల లీజుకు 1982 అక్టోబర్ 8న నాటి ప్రభుత్వం కేటాయించింది. 2022 అక్టోబర్ 8కి లీజు గడువు ముగిసింది. లీజు పొడిగించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అభ్యర్థన మేరకు 264.54 హెక్టార్ల పరిధిలో ఉన్న ఈ గనుల లీజును 2032 అక్టోబర్ 7వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది.

అంతా కేంద్రం చేతుల్లోనే..

- రూ.15 వేల కోట్ల రుణం త్వరగా ఇప్పించండి
- ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- ఆర్థిక, హోం మంత్రులతోనూ భేటీ



ప్రధాని మోదీతో చంద్రబాబు

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కేంద్రం చేతుల్లోనే ఉందని, అందువల్ల నిధులు త్వరగా మంజూరు చేయించాలని ప్రధాని నరేంద్ర మోదీకి ఏపీ సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల రుణ సాయం, పోలవరం నిర్మాణ ఖర్చు, వెనకబడిన జిల్లాలకు నిధులపై కేంద్రం ఇచ్చిన హామీ మేరకు నిధులు వెంటనే ఇచ్చేలా చూడాలని కోరినట్లు తెలిసింది. ఢిల్లీ పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం ఆయన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, సహాయ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి ప్రధాని మోదీకి తిరుమల శ్రీవారి ప్రతిమ బహూకరించారు. అనంతరం ప్రధానితో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సుమారు గంట సేపు చర్చించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా రూ.15 వేల కోట్ల రుణ సాయం తక్షణమే వచ్చేలా చూడాలని ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. దీంతోపాటు కొత్తగా రుణాలు వచ్చే అవకాశాలపై కూడా చర్చించినట్లు తెలిసింది. అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి ఏపీకి విడుదల చేయాల్సిన నిధులపై చర్చించినట్లు సమాచారం.

మాజీ సీఎం వైఎస్ జగన్ నిరసనపై ఆరా

ఏపీలో ఎన్నికల ఫలితాల అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా.. చంద్రబాబును ఆరా తీసినట్లు తెలిసింది. ఆయా ఘటనలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ఫొటో, వీడియోలతో నిరసన ప్రదర్శన వివరాలను కేంద్ర ఇంటెలిజెన్స్ ద్వారా తెప్పించుకొని.. వాటిపై వివరణ కోరినట్లు సమాచారం. ఈ ఘటనలకు కారణాలు, ప్రజల్లో విశ్వసనీయత తగ్గిపోయే పరిణామాల గురించి చర్చించినట్లు తెలిసింది. ఢిల్లీ పర్యటనలో భాగంగా హోం శాఖ మంత్రి అమిత్‌షాతో ఏపీ సీఎం చంద్రబాబు సుమారు గంట సేపు చర్చించారు. ఎక్కువ సమయం కూటమి కార్యకర్తల హింసాత్మక దాడులపైనే చర్చ జరిగినట్లు సమాచారం.

8మంది ఐఏఎస్ అధికారుల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎనిమిది మంది ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలు..

ఐఏఎస్	ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
ఎన్.తేజ్‌భారత్	మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్	ప్రాజెక్ట్ డైరెక్టర్, పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన మిషన్
అభిషేక్.వి	ప్రాజెక్ట్ ఆఫీసర్, పాడేరు ఐటీడీఏ	జాయింట్ కలెక్టర్, చిత్తూరు జిల్లా
ప్రకార్ జైన్	తెనాలి సబ్ కలెక్టర్	ప్రాజెక్ట్ ఆఫీసర్, పాడేరు ఐటీడీఏ
రాహుల్ మీనా	మార్కాపురం సబ్‌కలెక్టర్	జాయింట్ కలెక్టర్, కాకినాడ
శివ్ నారాయణ శర్మ	ఆదోని సబ్‌కలెక్టర్	జాయింట్ కలెక్టర్, అనంతపురం
గొబ్బిళ్ల విద్యాధరి	కందుకూరు సబ్‌కలెక్టర్	కర్నూలు మున్సిపల్ కమిషనర్
అశుతోష్ శ్రీవాత్సవ	కొవ్వూరు సబ్ కలెక్టర్	ప్రాజెక్ట్ ఆఫీసర్, పార్వతీపురం ఐటీడీఏ
అపూర్వ భరత్	పెనుకొండ సబ్‌కలెక్టర్	ఎటపాక సబ్ కలెక్టర్‌తో పాటు చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు

సదస్యతా అభియాన్ ఇన్‌చార్జి అర్వింద్ మేనన్

కేరళ, పుదుచ్చేరి, తమిళనాడుకు పురందేశ్వరి

సాక్షి, న్యూఢిల్లీ: బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ప్రజల్లోకి వెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ శ్రేణులకు ఆ పార్టీ అధ్యక్షుడు జె.పి.నడ్డా పిలుపునిచ్చారు. శనివారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం నడ్డా అధ్యక్షతన 'సదస్యతా అభియాన్-2024' జరిగింది. సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభం కానున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బి.ఎల్ సంతోష్, రాష్ట్రాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నడ్డా మాట్లాడుతూ ఈ ఏడాది 10 కోట్లకుపైగా నూతన సభ్యత్వాలు నమోదయ్యేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. సదస్యతా అభియాన్ కోసం ఏపీ, తెలంగాణ, అండమాన్ నికోబార్, లక్షద్వీప్‌లకు ఇన్‌చార్జిగా పార్టీ జాతీయ కార్యదర్శి అర్వింద్ మేనన్‌ను నియమించారు. కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాలకు ఇన్‌చార్జిగా పార్టీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి నియమితులయ్యారు.

ఐదేళ్లలో అందరినీ చంపేస్తాం

- రోజూ దాడులు చేసి కొడతాం..
- వైఎస్సార్‌సీపీ వాళ్లు ఎవరడ్డొస్తారో రండి..
- మంత్రి అనగాని ఇలాకాలో టీడీపీ స్వైరవిహారం
- తాజాగా చెరుకుపల్లి మాజీ ఎంపీపీ అనుచరుడి ఇంటిపై దాడి
- ఐదుగురికి గాయాలు



టీడీపీ దాడిలో గాయపడిన శ్రీనివాసరావు, సంపత్‌కుమార్



ధ్వంసమైన సంపత్‌కుమార్ ఇంటి అద్దాలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: 'ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలందరినీ చంపేస్తాం.. రోజు ఇళ్ల మీదకు వచ్చి కొడతాం. వైఎస్సార్‌సీపీ నా కొడుకులు ఎవడడ్డొస్తాడో రమ్మను. ఒక్కొక్కరి అంతు చూస్తాం' చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలో శనివారం తెలుగుదేశం కార్యకర్తల హెచ్చరిక ఇది. మంత్రి అనగాని ఇలాకా రేపల్లె నియోజకవర్గంలో తెలుగుదేశం వర్గీయులు రెచ్చిపోయి ప్రవర్తిస్తూనే ఉన్నారు. గుళ్లపల్లిలో శుక్ర, శనివారాల్లో చెరుకుపల్లి మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు అనుచరుడైన రిటైర్డ్ ఆర్మీ జవాను సంపత్‌కుమార్ ఇంటిపై దాడి చేశారు. ఇంటిని ధ్వంసం చేసి, సంపత్‌కుమార్‌తో సహా ఐదుగురిని గాయపరిచిన వారు.. రేపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ వారందరినీ చంపేస్తామంటూ బెదిరించారు. శుక్రవారం సాయంత్రం టీడీపీ కార్యకర్త కుమార్ మరికొందరు వైఎస్సార్‌సీపీ కార్యకర్త సంపత్‌కుమార్ ఇంటిపై దాడిచేశారు. ఆయన ఇంట్లో లేకపోవడంతో రాళ్లతో ఇంటి అద్దాలు ధ్వంసం చేశారు. బూతులు తిట్టి వెళ్లిపోయారు. శనివారం 15 మందితో కలిసి కుమార్ మళ్లీ సంపత్‌కుమార్ ఇంటిపై దాడిచేశాడు. ఒక్కసారిగా ఇంట్లోకిదూరి బూతులు తిడుతూ దొరికిన వారిని దొరికినట్లు కొట్టారు. ఇంట్లో సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ దాడిలో సంపత్‌కుమార్, ఆయన బాబాయి గాలి శ్రీనివాసరావు, తమ్ముడు గాలి శివకృష్ణ, మరో ఇద్దరు గాయపడ్డారు. గాలి శ్రీనివాసరావు దవడకు పెద్ద గాయమైంది. సంపత్‌కుమార్‌కు ఎదపైన, పొట్టమీద గాయాలయ్యాయి. గాయపడినవారిని స్థానికులు తెనాలి ఆస్పత్రికి తరలించారు. వారిని ఆస్పత్రికి తరలించిన తరువాత తెలుగుదేశం వర్గీయులు మరోసారి సంపత్‌కుమార్ ఇంటిపై దాడిచేశారు.

దాడులు, ఆస్తుల ధ్వంసం

బాధ్యతాయుతమైన మంత్రి అనగాని నియోజకవర్గంలో రెండు నెలలుగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై టీడీపీ వారు దాడులు చేస్తున్నారు. ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. బలహీనవర్గాలపై ఈ తరహా దాడులు పెరిగాయి. ఊళ్లు విడిచి వెళ్లకపోతే చంపేస్తామని మైకు అనౌన్స్‌మెంట్ల ద్వారా హెచ్చరిస్తున్నారు. ఊరువదలి వెళ్లక పోతే చంపేస్తామని టీడీపీ మూకలు హెచ్చరించడంతో రెండునెలలు అజ్ఞాతంగా గడిపిన చెరుకుపల్లి మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు నాలుగు రోజుల కిందట సొంత గ్రామం గుళ్లపల్లికి వచ్చారు. ఆయన రాగానే తెలుగుదేశం వర్గీయులు ఆయన అనుచరులపై దాడులకు దిగారు. ఇటీవల తమ ఇంటివద్ద అరుగుపై కూర్చుని ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలు వాకా వెంకటేశ్వరరావు, వీరంకి శివయ్యలపై కర్రలతో దాడిచేసి కొట్టి గాయపరిచారు. కస్తూరివారిపేటలో ఆంధ్రప్రభ విలేకరి యనుముల వెంకటేశ్వరరావు ఇంటిని జేసీబీతో ధ్వంసం చేశారు. రాంబొట్లవారిపాలేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజేష్ కుమార్ ఇంటిపై 30 మంది టీడీపీ కార్యకర్తలు దాడిచేసి కొట్టారు. ఇదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం నాయకుడు ప్రసాదరెడ్డిని గ్రామం వదలి పెట్టకపోతే చంపేస్తామని హెచ్చరించారు. దీంతో ప్రసాదరెడ్డి గ్రామం వదలిపెట్టి వెళ్లిపోయారు. నగరం, నిజాంపట్నం తదితర మండలాల్లోను ఈ తరహా దాడులు పెరిగాయి. టీడీపీ మూకల దాడులు తట్టుకోలేక నియోజకవర్గంలోని వందలాదిమంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గ్రామాలు వదలిపెట్టి వెళ్లారు.

స్పందించని పోలీసులు

నియోజకవర్గంలో తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నా పోలీసులు ఏ మాత్రం స్పందించడం లేదు. దాడుల గురించి తెలిసినా తెలియనట్లే వ్యవహరిస్తున్నారు. తెలుగుదేశం వర్గీయుల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చేరిన వారి వద్దకు వెళ్లి మొక్కుబడిగా కేసు నమోదు చేస్తున్నారు.

విలువైన పత్రాలు దహనం చేశారంటూ హడావుడి

పనికిరాని పత్రాలేనని తేల్చిన అధికారులు



ధవళేశ్వరంలోని పోలవరం భూసేకరణ కార్యాలయం వద్ద దహనం చేసిన పనికిరాని పత్రాలు

ధవళేశ్వరం: తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు భూసేకరణ లెఫ్ట్ మెయిన్ కెనాల్ కార్యాలయంలో విలువైన పత్రాలను దహనం చేశారంటూ శనివారం మధ్యాహ్నం నుంచి పెద్ద ఎత్తున ఆరోపణలొచ్చాయి. దీంతో ఉన్నతాధికారులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. సగం కాలిన కొన్ని పత్రాలను ఆర్డీవో లక్ష్మీశివజ్యోతి, డీఎస్పీ భవ్యకిశోర్‌లు పరిశీలించారు. కార్యాలయంలో కొత్త బీరువాలు రావడంతో పనికిరాని పత్రాలను తీసివేశామని, ఆ పత్రాలనే స్వీపర్ తగలబెట్టారని ఆర్డీవో తెలిపారు. దగ్ధమైన ఫైళ్లు సైన్ లేని జిరాక్స్ కాపీలేనన్నారు. అయితే నిరుపయోగమైన కాగితాలను సైతం బహిరంగంగా దహనం చేయకూడదని, ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆర్డీవో చెప్పారు. పత్రాల దహనం ఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో టీడీపీ నాయకులు ధవళేశ్వరంలోని పోలవరం భూసేకరణ కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అక్కడకు చేరుకుని అధికారులతో మాట్లాడారు. కొత్త బీరువా రావడంతో ఫైల్స్ సర్దామని, తగులబెట్టిన పేపర్లు ప్రధానమైనవి కావని భావిస్తున్నామన్నారు. మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని కలెక్టర్‌ను కోరినట్టు ఆయన వెల్లడించారు. తన దృష్టికి తీసుకు రాకుండా పత్రాలను దహనం చేశారని, దీనిపై చర్యలు తీసుకుంటామని పోలవరం భూసేకరణ లెఫ్ట్ మెయిన్ కెనాల్ ఇన్‌చార్జి అధికారి వేదవల్లి చెప్పారు. కార్యాలయం వద్ద పత్రాలు దహనం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో రాజమహేంద్రవరం అగ్నిమాపక సిబ్బంది పోలవరం భూసేకరణ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అయితే అక్కడ ఎలాంటి మంటలు లేకపోవడంతో వెనుదిరిగారు.

సొసైటీ గుమాస్తా శ్రీనివాసరెడ్డి మృతి

- టీడీపీ వేధింపులు తాళలేక గడ్డి మందు తాగిన గుమాస్తా



శ్రీనివాసరెడ్డి మృతదేహం

నరసరావుపేట: పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం అన్నవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) గుమాస్తా ఓరుగంటి శ్రీనివాసరెడ్డి శనివారం సాయంత్రం మృతి చెందారు. టీడీపీ వేధింపులు తాళలేక ఓరుగంటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తన ఇంట్లో గడ్డి మందు తాగిన విషయం విదితమే. ఉద్యోగం నుంచి వైదొలగాలంటూ టీడీపీ నాయకులు, అధికారులు కొంతకాలంగా శ్రీనివాసరెడ్డిని వేధిస్తున్న విషయం తెలిసిందే. ఆయనకు మూడు నెలల నుంచి జీతం సైతం చెల్లించకుండా ఉద్యోగం మానేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా.. మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఆయన ఇచ్చిన మరణ వాంగ్మూలాన్ని అనుసరించి నిందితులపై హత్య కేసు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. కేసు విషయమై పోలీసులతో చర్చించారు. అధికారులైన డి.శ్రీనివాసరావు, సురేంద్రబాబుపై హత్యకేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
ఆదివారం ॥ 18-8-2024



బహుమతులు ఆనందాన్నిస్తాయి... అయితే వస్తువుల రూపంలో కన్నా మాటల రూపంలో ప్రేమను వ్యక్తపరిస్తే ఆ ఫీలింగ్ హృదయంలో నిలిచిపోతుంది. అన్నయ్య గౌతమ్ నుంచి అలాంటి ప్రేమనే ఎక్కువగా కోరుకుంటున్నానని చిన్నారి సితార అంటోంది. సూపర్ స్టార్ మహేశ్‌బాబు, నమ్రతల కుమార్తెగా పన్నెండేళ్ల సితార పాపులర్. ఓ జ్యువెలరీ బ్రాండ్ అంబాసిడర్‌గా తనకంటూ పాపులార్టీ తెచ్చుకుంది. సోమవారం రాఖీ పండగ సందర్భంగా 'సాక్షి'కి సితార చెప్పిన ప్రత్యేకమైన ముచ్చట్లు...

బ్రదర్ అంటే బెస్ట్ ఫ్రెండ్

- సితార ఘట్టమనేని

రాఖీ పండగను ఇంట్లో చిన్న పూజతో ప్రారంభిస్తాం. ఆ తర్వాత అన్నయ్యకు రాఖీ కట్టి, ఇద్దరం బహుమతులు ఇచ్చి, పుచ్చుకుంటాం. నాకు ఎనిమిది.. తొమ్మిదేళ్లప్పుడు అనుకుంటా... రాఖీకి అసలైన అర్థం తెలిసింది. చేతికి రాఖీ కట్టడం అనేది ఓ ఆచారం కాబట్టి పాటించాలి. అంతవరకే నాకు తెలుసు. అయితే సోదరుడి అనుబంధం, రక్షణ ఎంతో అవసరమని, అది సూచించే విధంగా కట్టే రాఖీకి చాలా ప్రాధాన్యం ఉందని ఈ పండగ అసలు విషయం అర్థమైంది. ఆచారం అర్థం అయ్యాక ఈ ఫెస్టివల్‌కి ప్రాధాన్యం ఇస్తున్నాను.



గౌతమ్, సితార

రాఖీ కొనడానికి చాలా టైమ్ తీసుకుంటా

ఈ సంవత్సరం ఎప్పటికీ గుర్తుండి పోతుందని అనుకుంటున్నాను. ఎందుకంటే మా అన్నయ్య పై చదువుల కోసం విదేశాలు వెళుతున్నాడు. ఇప్పటిరకూ ఒక విధంగా ఉండేది.. ఇప్పుడు తనకు దూరంగా ఉండటం అనే మార్పు చాలా స్పష్టంగా కనబడుతుంది. రాఖీ కొనడం అనేది పెద్ద పనే. ఎందుకంటే ఒక పట్టాన సెలక్ట్ చేయలేను. చాలా టైమ్ పడుతుంది. మా అన్నయ్య మనస్తత్వానికి దగ్గరగా ఉన్న రాఖీ కొంటుంటాను.

అమ్మ గైడెన్స్‌తో పండగ చేసుకుంటాం

ఈ పండగ అనే కాదు ప్రతి పండగకీ మా అమ్మ గైడెన్స్ ఉంటుంది. అయితే అన్నయ్యకి హారతి ఇవ్వడం, స్వీటు తినిపించడం... ఇలా నేను మాత్రమే చేయాల్సినవే ఉంటాయి కాబట్టి రాఖీ పండగ అప్పుడు ఎక్కువ గైడెన్స్ ఉంటుంది. అమ్మకు సంప్రదాయాలు పాటించడం చాలా ఇష్టం. మేం కూడా పాటించాలని కోరుకుంటారు. అలాఅని ఒత్తిడి చేయరు. మా స్వేచ్ఛ మాకు ఉంటుంది.

నా ప్రేమను మెసేజ్ రూపంలో చెబుతా

ఒకవేళ వచ్చే ఏడాది మా అన్నయ్య రాఖీ పండగ సమయంలో విదేశాల్లో ఉంటే వీడియో కాల్ చేస్తాను. దాంతో పాటు తన మీద నాకు ఉన్న ప్రేమను ఒక మంచి మెసేజ్ రూపంలో చెబుతాను. ఆ మెసేజ్ హృదయ పూర్వకంగా తను నాకెంత ముఖ్యమో చెప్పేలా ఉంటుంది. దూరం అనేది విషయం కాదు అని చెప్పేలా ఉంటుంది.

నన్ను సర్‌ప్రైజ్ చేస్తే ఇష్టం

అన్నయ్య నాకు ఫలానా గిఫ్ట్ ఇవ్వాలని అనుకోను. కానీ నన్ను సర్‌ప్రైజ్ చేస్తే నాకు ఇష్టం. తను నా గురించి ఆలోచిస్తున్నాడని సూచించే ఏ గిఫ్ట్ అయినా నాకు ఓకే. పుస్తకం అయినా, ఏదైనా జ్యువెలరీ అయినా లేక తన చేతితో రాసిన లెటర్ అయినా సరే... తను నా గురించి ఆలోచిస్తున్నాడనే ఆ ఫీల్ నాకు ముఖ్యం.

నా బ్రదర్ నా ఆత్మవిశ్వాసం

బ్రదర్ ఒక బెస్ట్ ఫ్రెండ్‌లాంటి వాడు... రక్షణగా నిలబడేవాడు. ఏ విషయంలోనైనా నా బ్రదర్ మీద ఆధారపడిపోవచ్చు అనే భరోసా నాకు ఉంది. తను నా ఆత్మవిశ్వాసం... మా బాండింగ్‌ని నేను చాలా గాఢంగా ఇష్టపడతాను. ఒక బ్రదర్ ఉండటం అనేది ఎప్పుడూ అండగా నిలిచే వ్యక్తి పక్కనే ఉండటంలాంటిది.

– డి.జి. భవాని

కదలిక

90 ఏళ్లు... రెండు మైళ్లు

సొసైటీకేమె దివిటీ





పత్రికలకు, రేడియోకు దూరంగా ఉండే ఆ బామ్మ ఆగ్రహంతో రగిలిపోయింది. కోలకతాలో జూనియర్ డాక్టర్‌పై సాగిన హత్యాచారకాండను మనవరాళ్ల ద్వారా వినగానే 'సమాజం ఇలాంటి వాటిని ఎలా అంగీకరిస్తుంది? పదండి అందరం నిరసన తెలుపుదాం' అని 90 ఏళ్ల మాయా రాణి అర్ధరాత్రి కేండిల్ పట్టి రెండు మైళ్లు నడిచింది. ప్రతి అడుగు మనలో కదలిక ఆశిస్తోంది.

ఆమెను చూసిన వారందరూ ఆశ్చర్యపోయారు. నడుము ఒంగిపోయినా అడుగులు తొణకడం లేదు. శరీరం బలహీనంగా ఉన్నా మాట తీవ్రతలో వెనుకంజ లేదు. మొన్నటి బుధవారం (ఆగస్టు 14) కోల్‌కతాలో అర్ధ రాత్రి సాగిన నిరసనలో 90 ఏళ్ల ఆ బామ్మ చేతిలో క్యాండిల్ పట్టుకుని జనంతోపాటు నడుస్తూంటే అందరూ ఆమెను చూసి స్ఫూర్తి పొందారు. ఆమెతోపాటు మరింత ఉద్వేగంగా నడిచారు.

ఇంత దారుణమా...

కోల్‌కతాలోని జోకా ప్రాంతంలో నివాసం ఉండే 90 ఏళ్ల మాయారాణి చక్రవర్తికి ఆగస్టు 9న జరిగిన హత్యాచారం గురించి మనవరాళ్ల ద్వారా తెలిసింది. డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం జరిపి హత్య చేశారన్న వార్త తెలియగానే ఆమె కదిలిపోయింది. తన కోల్‌కతా నగరంలో ఇంత దారుణమా అనుకుందామె. 'ఇంతటి ఘోరాన్ని నా జీవితంలో వినలేదు' అందామె వాళ్లతో. 'దీనిని సమాజం ఎలా అంగీకరిస్తుంది? మీరంతా ఏం చేస్తున్నారు?' అని మనవరాళ్లను ప్రశ్నించింది. 'మేము అర్ధరాత్రి నిరసన చేయబోతున్నాం. రాత్రిళ్లు సురక్షితంగా తిరగ్గలిగే మా హక్కు కోసం నినదించబోతున్నాం' అని వాళ్లు చెప్పారు. 'అయితే నేనూ వస్తాను' అందామె. 'రెండు మైళ్లు నడవాలి' అన్నారు వాళ్లు. 'నేను నడుస్తాను' అందామె ఖండితంగా.

క్యాండిల్ పట్టుకుని...

మోకా అనే ఏరియాలోని తన అపార్ట్‌మెంట్ నుంచి ఆ ఏరియా ఇ.ఎస్.ఐ ఆస్పత్రి వరకు మూడు కిలోమీటర్లు నడిచింది మాయారాణి చక్రవర్తి. 'బయట క్షేమంగా లేకపోతే ఇంట్లో మాత్రం క్షేమంగా ఎలా ఉండగలరు ఆడవాళ్లు. నా మనవరాళ్లు పని మీద, చదువు కోసం బయటకు వెళితే వాళ్లు వచ్చేంత వరకూ బితుకుబితుకుమంటూ ఉండాలా నేను. ఈ పరిస్థితి మారాలి. ఈ పరిస్థితిని అందరం మార్చాలి. అంతేకాదు ఇంత దారుణ నేరం చేసినవారికి శిక్ష పడాలి' అందామె. సమాజంలో ఎన్ని ఘోరాలు జరిగినా జడత్వంతో మనకెందుకులే అనుకునేవారికి ఆ బామ్మ కదలిక ఒక దివిటీ కావాలని ఆశిద్దాం.

బ్యూటిప్స్

చర్మకాంతికి ఆలివ్ .. తేనె

చర్మం జీవం కోల్పోయినట్టుగా అనిపిస్తే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి...

● రోజూ రాత్రి పడుకునే ముందు ఆలివ్ ఆయిల్‌లో ముంచిన దూది ఉండతో ముఖమంతా రాయాలి. అదే ఉండతో కాస్త ఒత్తిడి చేస్తూ మసాజ్ చేయాలి. దీంతో ముఖంపైన దాగున్న దుమ్ము కణాలు, శుభ్రపరిచినా మిగిలిన మేకప్ సులువుగా వదిలిపోతుంది. తర్వాత శుభ్రపరుచుకొని మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ● నీటి శాతం ఎక్కువ ఉండే పుచ్చకాయ, దోసకాయ, ఆరెంజ్, స్ట్రాబెర్రీ వంటి పండ్లను తినాలి. ● ఒంటికి చెమట పట్టేలా చేసే రన్నింగ్, జాగింగ్, వాకింగ్ వంటివి రోజులో 20 నిమిషాలైనా చేయాలి. చెమట ద్వారా స్వేదరంధ్రాలలో చేరిన మురికి విడుదల అవుతుంది. చర్మకాంతి పెరుగుతుంది ● చర్మం పొడిబారుతోంది అంటే సరైన నిద్రకు దూరంగా ఉన్నారని అర్థం చేసుకోవాలి. రోజూ సరైన నిద్ర లేకపోతే కళ్ల కింద వలయాలు ఏర్పడతాయి. ఉదయం, రాత్రి పడుకునే ముందు వేలి కొనలతో తేనె అద్దుకొని కళ్ల కింద ఉబ్బుగా ఉన్న చోట రాయాలి. అలాగే ముఖమంతా తేనె రాసి, మృదువుగా రుద్దాలి. తర్వాత చల్లటి నీళ్లతో కడిగేయాలి. ఇలా వారంలో మూడుసార్లు చేస్తే చర్మకాంతి పెరుగుతుంది. ● చర్మం జీవం లేనట్టుగా కనిపిస్తే రోజూ తగినన్ని నీళ్లు తాగడం లేదని అర్థం. అందుకని రోజూ ఎనిమిది గ్లాసుల నీళ్లు తప్పనిసరిగా తాగాలనే నియమం పెట్టుకోవాలి. అలాగే, రోజులో మూడు సార్లు సబ్బు లేకుండా కేవలం మంచినీళ్లతో ముఖాన్ని శుభ్రపరిచి, మాయిశ్చరైజర్ రాయాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే చర్మం సహజకాంతితో కళకళలాడుతుంది.



హెల్త్

● జువెనైల్ ఆర్థరైటిస్

ఎదిగే వయసులో... ఎముకలకు ఇబ్బంది



సాధారణంగా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కీళ్ల దగ్గర నొప్పి, వాపు వచ్చి, అవి గట్టిగా మారడాన్ని 'ఆర్థరైటిస్'గా వ్యవహరిస్తుంటారు. మామూలుగానైతే పెద్దల్లోనే ఎక్కువగా కనిపించే ఈ సమస్య, పిల్లల్లోనూ కనిపిస్తుంది. ఇటీవల ఈ ధోరణి కాస్త ఎక్కువగానే ఉంది. పదహారేళ్ల లోపు పిల్లల్లో కారణమేమిటో తెలియకుండా వచ్చి, ఎదిగే ఎముకల్ని ప్రభావితం చేసే ఈ ఆర్థరైటిస్‌ను 'జువెనైల్ ఇడియోపథిక్ ఆర్థరైటిస్' అనీ, 'పేడియాట్రిక్ రుమాటిక్ డిసీజ్' అని కూడా అంటారు. ఈ సమస్యపై అవగాహన కోసం...

చిన్నారుల వ్యాధినిరోధక వ్యవస్థ తమ సొంత ఎముకల కీళ్ల కణాలను దెబ్బతీయడంతో వస్తుంది కాబట్టి ఇది ఆటో ఇమ్యూన్ వ్యాధి. జువెనైల్ ఇడియోపథిక్ ఆర్థరైటిస్ (జేఐఏ)లో అనేక రకాలు ఉండటంవల్ల లక్షణాలూ వేర్వేరుగా ఉంటాయి.

జేఐఏలోని రకాలు: ● **సిస్టమిక్ ఆన్‌సెట్ జేఐఏ :** ఇది ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కీళ్లను ప్రభావితం చేస్తుంది. తీవ్రమైన జ్వరం, ఒంటి మీద ర్యాష్‌తో కొన్నిసార్లు గుండె, కాలేయం, స్ప్లీన్, లింఫ్‌నోడ్స్‌ను ప్రభావితం చేయవచ్చు.

● **ఆలిగో ఆర్టిక్యులార్ జేఐఏ :** మొదటి ఆరు నెలల్లో ఇది ఒకటి నుంచి నాలుగు రకాల కీళ్లను ప్రభావితం చేస్తుంది. ఆర్నెల్లు దాటాక ఇంక ఏ కీలునూ ప్రభావితం చేయకపోతే దీన్ని 'పర్‌సిస్టెంట్' రకంగా పిలుస్తారు. ఒకవేళ ఆర్నెల్ల తర్వాత మరిన్ని కీళ్లను ప్రభావితం చేస్తే దీన్ని 'ఎక్స్‌టెండెడ్' రకంగా చెబుతారు.

● **పాలీ ఆర్టిక్యులార్ జేఐఏ :** మొదటి ఆర్నెల్లలో ఇది 5 లేదా అంతకంటే ఎక్కువ కీళ్లను ప్రభావితం చేస్తుంది. రుమటాయిడ్ ఫ్యాక్టర్ (ఆర్.ఎఫ్.) అనే రక్తపరీక్ష రిజల్ట్‌లో ఇది ఆర్‌ఎఫ్ పాజిటివ్‌గా లేదా ఆర్‌ఎఫ్ నెగెటివ్‌గా ఇలా ఎలాగైనా కనిపించవచ్చు.

● **ఎంథసైటిస్ జేఐఏ :** ఇందులో చిన్నారికి ఆర్థరైటిస్‌తో పాటు ఎంథసైటిస్ సమస్య కూడా ఉంటుంది. అంటే టెండన్ లేదా లిగమెంట్‌తో ఎముక కలిసే చోట వాపు కనిపిస్తుంది.

● **సోరియాటిక్ ఆర్థరైటిస్ :** ఇందులో ఆర్థరైటిస్‌తో పాటు చర్మవ్యాధి అయిన సోరియాసిస్ కూడా కనిపిస్తుంది లేదా ఆర్థరైటిస్‌తో పాటు చేతి వేలు / కాలి బొటనవేలి ఇన్‌ఫ్లమేషన్ లేదా ఆర్థరైటిస్‌తో పాటు చేతి గోళ్ల మీద చిన్న చిన్న గుంటల్లా / గ్రూవ్స్‌లా రావచ్చు.



దాక్టర్ విజయ ప్రసన్న పరిమి
సీనియర్ రుమటాలజిస్ట్

లక్షణాలు : ● మోకాలు, చేతి / పాదాల, మడమ, భుజాలు, మోచేయి లేదా ఏ ప్రదేశంలోని కీళ్లలో వాపు కనిపిస్తుంది. ముఖ్యంగా ఉదయం వేళ లేదా నిద్రలేవగానే ఈ కీళ్లవాపు కనిపించవచ్చు ● కళ్లు ఎర్రబారడం, మంట, వాపు ● కీళ్ల ఎర్రబారడంతో పాటు వేడిగా అనిపించడం ● కదలికలకు కీళ్లు సహకరించకపోవడం ● తీవ్రమైన అలసట, నీరసం, నిస్సత్తువ ● ఆకలి మందగించడం, బరువు అలాగే ఎత్తు వయసుకు తగినట్లుగా పెరగకపోవడం ● లింఫ్‌నోడ్స్ వాపు.

నిర్ధారణ : ● యాంటీ న్యూక్లియర్ యాంటీ బాడీ (ఏఎన్ఏ) పరీక్షతో పాటు ఇతర యాంటీ బాడీ పరీక్షలు ● కంప్లీట్ బ్లడ్ కౌంట్ ● ఎరిత్రోసైటిస్ సెడిమెంటేషన్ రేట్ (ఈఎస్ఆర్) పరీక్ష ● సీ రియాక్టివ్ ప్రోటీన్ (సీఆర్‌పీ) పరీక్ష ● క్రియాటినిన్ (కిడ్నీలు సరిగా పనిచేస్తున్నాయా అని తెలిపే పరీక్ష) ● హిమాటోక్రిట్ (రక్తంలో ఎర్రరక్తకణాల సంఖ్యను తెలిపే పరీక్ష. ఎందుకంటే ఈ వ్యాధి ఉన్నవారు రక్తహీనతతో బాధపడటం ఎక్కువ) ● రుమటాయిడ్ ఫ్యాక్టర్ పరీక్ష ● అలాగే ఎక్స్-రే, సీటీ స్కాన్, ఎమ్మారై, బోన్ స్కాన్ వంటి కొన్ని ఇమేజింగ్ పరీక్షలతో పాటు మూత్ర పరీక్ష, కీళ్లలోని కందెన వంటి ద్రవాన్ని పరీక్షించే 'ఆర్థ్రోసెంటైసిస్ పరీక్ష... ఇంకా పూర్తిస్థాయి కంటి పరీక్షలు అవసరం.

చికిత్స: పిల్లల్లో సగం మందికి చికిత్స తర్వాత దాదాపుగా పూర్తిగా కోలుకునే అవకాశాలుంటాయి అయితే రుమటాలజిస్ట్ ఆధ్వర్యంలో నిశితమైన చికిత్స అందించాలి. చికిత్సలో భాగంగా... ● నొప్పులూ, వాపు, మంట తగ్గించడానికి నాన్‌స్టెరాయిడల్ యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ (ఎన్ఎస్ఏఐడీ) ● జేఐఏను అదుపులో పెట్టడానికి డిసీజ్ మాడిఫైయింగ్ యాంటీ రుమాటిక్ మెడిసిన్స్ (డిఎమ్ఏఆర్‌డీ) ● డాక్టర్ నిర్ణయించిన మోతాదులో కార్టికోస్టెరాయిడ్స్ ● మిగతా మందులు అంతగా ప్రభావం చూపనప్పుడు 'బయాలజిక్స్' అనే పేరున్న అధునాతన మందులు.

మందులతో పాటు కండరాలు, కీళ్లను సక్రమంగా పనిచేయించడం కోసం ఫిజియోథెరపీ, మంచి ఆహారం కోసం న్యూట్రిషనల్ కౌన్సెలింగ్, క్రమం తప్పని వ్యాయామాలు, కంటి పరీక్షలు కూడా అవసరమవుతాయి.

● అర్లీ మెనోపాజ్

ముందే రుతుక్రమం ఆగిందా?



బాలికకు యుక్తవయసు నాటి నుంచి ప్రతి నెలా వస్తుండే రుతుక్రమం ఒక వయసులో ఆగిపోతుంది. అలా ఆగిపోవడాన్ని 'మెనోపాజ్' అంటారు. మామూలుగా వచ్చే నెలసరి కనీసం ఏడాది పాటు ఏ నెలలోనూ కనిపించకుండా పూర్తిగా ఆగిపోతే అప్పుడే దాన్ని 'మెనోపాజ్'గా చెప్పవచ్చు. సాధారణంగా ఇది మహిళల్లో 45 నుంచి 55 ఏళ్ల మధ్య జరుగుతుంది. అంటే సగటున 51వ ఏట ఇది సంభవిస్తుంది. కానీ కొందరిలో మామూలుగా ఆగిపోయే సమయం కంటే చాలా ముందుగానే ఆగితే దాన్ని 'అర్లీ మెనోపాజ్'గా చెబుతారు. ఇలా జరిగినప్పుడు మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకుందాం.

కొందరు మహిళల్లో 45 నుంచి 55 ఏళ్ల మధ్య రుతుక్రమం ఆగిపోవడానికి బదులు 40 ఏళ్ల లోపు కూడా రుతుక్రమం ఆగిపోవచ్చు. ఇలా జరగడాన్ని అర్లీ మెనోపాజ్ లేదా ప్రి-మెచ్యూర్ ఒవేరియన్ ఇన్‌సఫిషియెన్సీ అని కూడా అంటారు. దీనికి నిర్దిష్టంగా కారణం ఏమిటో స్పష్టంగా తెలియదు. అయితే... కొందరిలో శస్త్రచికిత్స చేసి అండాశయాలు (ఓవరీలు) తొలగించాల్సి రావడం. ● కొన్ని కుటుంబాల్లో జన్యుపరంగా త్వరగా రుతుస్రావం ఆగిపోతుండవచ్చు ● కొందరిలో క్రోమోజోముల సమస్య కారణంగా... అంటే టర్నర్ సిండ్రోమ్ వంటివాటితో ● మానసిక ఒత్తిడి, మంచి ఆహారం తీసుకోకపోవడం, ఏదైనా దెబ్బతగలడం ● కీమోథెరపీ, రేడియోథెరపీ ఇవ్వాల్సి రావడం (ముఖ్యంగా నడుము దగ్గర) ● అండాశయాలను తొలగించడం ● పళ్లు, కూరగాయలపై ఉండే రసాయనాలు ● పొగ, మద్యం అలవాట్లు (విదేశాల్లో ఎక్కువ) ● థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయకపోవడం ● ప్రోలాక్టిన్ అనే హార్మోన్ ఎక్కువగా స్రవించడం ● కుటుంబ నియంత్రణ కోసం వాడే మందులు డాక్టర్ సలహా లేకుండా విచక్షణరహితంగా వాడటం ● పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ (పీసీఓఎస్) ● స్థూలకాయం.

త్వరగా రుతుక్రమం ఆగడం ప్రమాదమా?

● మెనోపాజ్ రాబోతున్న సూచనగా కొందరు మహిళల ఒంట్లో నుంచి వేడి సెగలు వస్తున్నట్లు అనిపించడం (హాట్ ఫ్లషెస్), భావోద్వేగాలు వెంట వెంటనే మారడం (మూడ్ స్వింగ్స్) వంటి లక్షణాలు కనిపిస్తాయి ● కొందరిలో ఎముకలు పెళుసుబారి తేలిగ్గా విరిగిపోయేలా చేసే 'ఆస్టియోపోరోసిస్' ముప్పు ● నెలసరి ఆగిపోవడంతోనే ఈస్ట్రోజెన్ తగ్గడం వల్ల కొందరిలో గుండె పోటు, గుండెజబ్బుల ముప్పు ● మూత్ర సంబంధమైన వ్యాధులు (యూరిన్ ఇన్ఫెక్షన్స్) ● బరువు పెరగడం ● కొందరిలో డిప్రెషన్, అయోమయం, త్వరగా కోపగించుకోవడం, అలసట వంటి మానసికమైన సమస్యలూ కనిపిస్తాయి.



డాక్టర్ క్రాంతి శిల్ప
కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ & అబ్‌స్ట్రెట్రీషియన్

అర్లీ మెనోపాజ్‌కు తర్వాతి పరిణామాలకు చికిత్స?

● ఒకసారి మెనోపాజ్ ఆగిపోయాక దాన్ని పునరుద్ధరించడానికి ఏ చికిత్సతోనూ అవకాశముండదు. కాకపోతే మెనోపాజ్ తర్వాతి పరిణామంతో మహిళల్లో కొన్ని ఇబ్బందులు కనిపించవచ్చు. వీటికే చికిత్స అవసరం ● ఒంట్లోంచి వేడి సెగలు (హాట్‌ఫ్లషెస్) వస్తుండటం వల్ల బాధపడేవారికి హార్మోన్లను భర్తీ చేసేందుకు వచ్చే హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (హెచ్‌ఆర్‌టీ) ఇవ్వాల్సి రావచ్చు. ఈ మందుల వల్ల ఒంట్లోంచి సెగలు రావడం ఆగడంతో పాటు ఎముకలూ బలంగా మారతాయి. అర్లీ మెనోపాజ్ లక్షణాలు కనిపిస్తుండగా మొదలయ్యే ఈ చికిత్సను స్వాభావికంగా మెనోపాజ్ వచ్చే వయసు వరకు కొనసాగించాలి. హెచ్‌ఆర్‌టీలో ఇచ్చేవి ప్రత్యేకమైన మందులేమీ కావు. శరీరంలోనే స్రవించాల్సిన హార్మోన్లు కొన్ని కారణాల వల్ల స్రవించకపోవడంతో వాటిని డాక్టర్లు మాత్రలు, ఇంజెక్షన్ల రూపంలో ఇస్తారు. కాబట్టి వీటితో ముప్పు ఏదీ ఉండదు.

ప్రిమెచ్యూర్ మెనోపాజ్‌తో వచ్చే సమస్యలు, వాటి నివారణ కోసం...

● ఆకుకూరలు, పళ్లు సరిగ్గా కడిగి తీసుకోవాలి ● క్యాల్షియమ్ ఎక్కువగా ఉండే ఆహారం ● ఆరోగ్యకరమైన జీవనశైలి అనుసరించాలి. అంటే... పొట్టుతో ఉండే గింజ ధాన్యాలు ఎక్కువగా తీసుకోవడం, వేళకు నిద్రపోవడం, శరీరానికి తగినంత వ్యాయామాన్ని ఇవ్వడం, ప్రశాంతంగా ఉండటం.

ముక్కు బెదరడం మామూలే!



చిన్నారుల్లో అందునా మూడు నుంచి పదేళ్ల పిల్లల్లో ముక్కు నుంచి రక్తస్రావం అవుతుండటం తరచూ కనిపిస్తుంది. ఈ కండిషన్‌ను 'ఎపిస్టాక్సిస్' అంటారు. చూడ్డానికి తీవ్రంగా అనిపించినా ఇది చాలా మామూలు సమస్య.

ఇదీ ప్రథమ చికిత్స : ● పిల్లల్లో ముక్కు నుంచి రక్తస్రావం అవుతున్నప్పుడు ఆందోళన చెందకూడదు ● పిల్లలకు ధైర్యం చెప్పి, సౌకర్యంగా ఉండేలా వాళ్లను కూర్చోబెట్టాలి ● ముందుకు ఒంగేలా చూసి, నోటితో గాలిపీల్చుకొమ్మని చెప్పాలి ● పిల్లల శ్వాసక్రియకు అంతరాయం కలిగించని విధంగా... ముక్కుచివరి భాగాన్ని (ముక్కు రంధ్రాలపైన) బొటనవేలు, చూపుడువేలు సాయంతో కాసేపు నొక్కి పట్టి ఉంచాలి ● ముక్కుపైన ఐస్‌ప్యాక్ ఉంచాలి. పైన చెప్పిన చిన్నపాటి చర్యలతో రక్తస్రావం ఆగిపోతుంది.

కొన్నిసార్లు కాస్తంత తీవ్రమైన కండిషన్‌లలో.. అంటే ఎటోపిక్ రైనైటిస్, అడినాయిడ్స్, నేసల్ డిఫ్తీరియా, ఫారిన్‌బాడీ ఇన్ నోస్, ముక్కుకు దెబ్బతగలడం, రక్తం గడ్డకట్టడంలో సమస్యల వంటి అనేక సందర్భాల్లోనూ రక్తస్రావం అవుతుంది. జాగ్రత్తలు తీసుకున్న తర్వాత కూడా ఆగకుండా రక్తస్రావం అవుతుంటే వెంటనే ఈఎన్‌టీ నిపుణులను కలవడం తప్పనిసరి.

అపోహ | వాస్తవం

సిజేరియన్ తర్వాత బరువు పెరుగుతారా?



సాధారణంగా సిజేరియన్ తర్వాత మహిళలు బరువు పెరుగుతారనే అపోహ చాలామందిలో ఉంటుంది. సిజేరియన్ తర్వాత కొందరు కాస్తంత బరువు పెరిగినప్పటికీ అందుకు కారణం సిజేరియన్ మాత్రం కాదు. దేహానికి తగినంత శారీరక శ్రమలేకపోవడం వల్ల లేదా మరికొన్ని వేర్వేరు అంశాల వల్ల అలా జరిగినప్పుడు దాన్ని సిజేరియన్‌కు ఆపాదించడం జరుగుతుంది. బరువు పెరగకుండా ఉండేందుకు సిజేరియన్ అయిన పదిహేను రోజుల తర్వాత నుంచే నడక లేదా శరీరంపై భారం పడకుండా తేలిక పాటి వ్యాయామాలు మొదలుపెట్టవచ్చు. అయితే ఏవైనా ఇతరత్రా కారణాలతో కొందరు మహిళలను డాక్టర్లు ప్రత్యేకంగా విశ్రాంతి తీసుకోవాలని సూచించిన వారు తప్ప అందరూ తమకు తగిన వ్యాయామాలను చేయవచ్చు.

బరువు పెరగకుండా ఉండేందుకు సూచనలు : చిన్నారులకు తల్లిపాలు పట్టించడం వల్ల మహిళలు బరువు పెరగకుండా ఉంటారు. దీనివల్ల తల్లికీ, బిడ్డకూ ఇరువురికీ లాభమే. నడక వ్యాయామం అందరికీ ప్రయోజనకరం. మహిళలు నడక మొదలుపెట్టినప్పుడు రోజుకు కేవలం పది నిమిషాలు మాత్రమే నడుస్తూ కాలవ్యవధిని క్రమంగా పెంచుకుంటూ పోవాలి. ఇలా చేస్తూ పోతే మూడు నెలల నుంచి మహిళలు తమ అదనపు కొవ్వు కోల్పోతారు. పొట్ట కూడా మామూలు స్థితికి వచ్చి సెంట్రల్ ఒబేసిటీ కూడా తగ్గుతుంది.



బ్లిట్జ్‌లోనూ ఆఖరి స్థానమే!

సెయింట్ లూయిస్ (అమెరికా): భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందకు 'గ్రాండ్ చెస్ టూర్'లో సెయింట్ లూయిస్ అంచె పోటీలు ఏమాత్రం కలిసిరాలేదు. బ్లిట్జ్ ఈవెంట్‌లోనూ అతను ఆఖరి స్థానంలో నిలిచాడు. ఇంతకుముందు ర్యాపిడ్ కేటగిరీలో నాలుగు పాయింట్లతో చివరి స్థానంలో నిలిచాడు. అయితే శనివారం ముగిసిన బ్లిట్జ్ కేటగిరీలో కాస్త మెరుగైన ప్రదర్శన కనబరిచి 8 పాయింట్లు సాధించినా చివరకు ఆఖరి స్థానమైతే తప్పలేదు. మొత్తానికి గ్రాండ్ చెస్ టూర్ ఈవెంట్‌లో అతని ఖాతాలో 12 పాయింట్లు (4+8) ఉన్నాయి. ఈ టోర్నీకి ముందు మూడో ర్యాంకులో ఉన్న ప్రజ్ఞానంద... తాజా నిరాశాజనక ఫలితాలతో ఐదో స్థానానికి పడిపోయాడు. ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ అలిరెజా ఫిరోజా 23 పాయింట్లతో సెయింట్ లూయిస్ అంచె ఈవెంట్‌లో విజేతగా నిలిచాడు. అతను ర్యాపిడ్‌లో 11, బ్లిట్జ్‌లో 12 పాయింట్లు గెలుపొందాడు. అమెరికా ఆటగాళ్లు వెస్లీ సో (20 పాయింట్లు), హికరు నకమురా (19.5), లెవొన్ అరోనియన్ (19) వరుసగా 2, 3, 4 స్థానాల్లో నిలిచారు. తర్వాతి టోర్నీ సింక్యూఫీల్డ్ కప్‌లో ప్రజ్ఞానందతో పాటు భారత్ నుంచి డి.గుకేశ్ బరిలో ఉన్నాడు.

వినేశ్‌కు అపూర్వ స్వాగతం

- భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్న రెజ్లర్
- ఢిల్లీ నుంచి బలాలి వరకు భారీ ఊరేగింపు



న్యూఢిల్లీ: భారత స్టార్ మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ శనివారం స్వదేశానికి చేరుకుంది. స్వర్ణపతక పోరుకు ముందు అనర్హతకు గురై అప్పీల్‌కు వెళ్లిన ఆమె ఇన్నాళ్లూ పారిస్‌లోనే ఉండిపోయింది. ఫైనల్ రోజు కేవలం 100 గ్రాముల అధిక బరువు కారణంగా ఆమె అనర్హతకు గురైంది. ఫైనల్లో ఓడినా కనీసం రజతం ఖాయం అనుకోగా, అదీ చేజారిపోయింది. సంయుక్త రజతం కోసం కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)లో వినేశ్ అప్పీలు చేసింది. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) మద్దతుతో నిష్ణాతులైన లాయర్ల బృందం ఆమె కేసును వాదించింది. విచారణ తదుపరి వాయిదాల అనంతరం చివరకు భారత రెజ్లర్‌కు అక్కడ కూడా నిరాశే ఎదురైంది. దీంతో భారత్‌కు పయనమైన వినేశ్ ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగగానే క్రీడాభిమానులు అపూర్వ స్వాగతం పలికారు. డోలు బాజాలు, భాంగ్రా నృత్యాల మధ్య ఆమె బయటకు వచ్చింది. వినేశ్ భర్త సోమ్‌వీర్ రాఠీ కూడా ఆమె వెంట ఉన్నాడు. ఒలింపిక్ పతక విజేతలైన స్టార్ రెజ్లర్లు సాక్షి మాలిక్, బజరంగ్ పూనియాలతో పాటు, కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హుడా, పోటెత్తిన అభిమానులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. వెల్లువెత్తిన అభిమానం చూసి ఒక్కసారిగా భావోద్వేగానికి గురైన ఫొగాట్ కన్నీళ్లు పెట్టుకుంది. ఇది గమనించిన సాక్షి, బజరంగ్ ఆమెను దగ్గరికి తీసుకొని ఓదార్చారు. అనంతరం తేరుకొని వినమ్రంగా చేతులు జోడించి 'యావత్ దేశానికి నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని చెప్పింది. పెద్ద సంఖ్యలో అభిమానులంతా తమ వాహనాల్లో వినేశ్‌ను ఆమె స్వగ్రామం బలాలి (హరియాణా) చేరే వరకు అనుసరించారు. దీంతో ఈ 135 కిలో మీటర్ల మార్గమంతా వీఐపీ కాన్వాయ్‌ని తలపించింది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత బృందానికి చెఫ్ డి మిషన్‌గా వ్యవహరించిన మాజీ షూటర్ గగన్ నారంగ్ కూడా శనివారం ఆమెతో పాటు స్వదేశం చేరుకున్నారు. ఆమెతో పారిస్‌లో దిగిన ఫొటోని 'ఎక్స్'లో షేర్ చేస్తూ వినేశ్ నిజమైన చాంపియన్‌గా అభివర్ణించారు. 'క్రీడా గ్రామంలో తొలి రోజే ఆమె చాంపియన్‌గా అడుగుపెట్టింది. అనర్హతకు గురైనా ఇప్పటికీ ఆమెనే చాంపియన్. పతకాలు, విజయాలే కాదు... కొన్నిసార్లు పోరాటం కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. వినేశ్ కనబరిచింది కూడా అదే! యువతరానికి ప్రేరణగా నిలిచిన ఆమెకు నా సెల్యూట్' అని నారంగ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. వినేశ్ కోసం ఢిల్లీలో, తమ స్వగ్రామంలో ఎదురు చూసిన అభిమానులు ఆమెకు బ్రహ్మరథం పట్టారని సోదరుడు హర్వీందర్ ఫొగాట్ చెప్పాడు. 'ఒలింపిక్స్ నిర్వాహకులు నాకు పతకం ఇవ్వకపోతే నేమి. ఇక్కడి ప్రజలంత ఎంతో ప్రేమ, గౌరవం అందించారు. నాకు ఇది 1000 ఒలింపిక్ పతకాలతో సమానం' అని వినేశ్ వ్యాఖ్యానించింది.


వినేశ్‌పై పూల వర్షం

'25 పతకాలు పక్కా'

భారత పారాలింపిక్ కమిటీ అధ్యక్షుడు ఝఝారియా



న్యూఢిల్లీ: పారా షట్లర్ ప్రమోద్ భగత్‌పై సస్పెన్షన్ వేటు పడడం పారిస్ పారాలింపిక్స్‌లో మన అథ్లెట్ల ప్రదర్శనపై ప్రభావం చూపదని భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ) అధ్యక్షుడు దేవేంద్ర ఝఝారియా అన్నాడు. పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ 25 పతకాలు సాధించగలదని ఝఝారియా ఆశాభావం వ్యక్తం చేశాడు. కాగా, యాంటీ డోపింగ్ నియమావళిని ఉల్లంఘించినందుకు గానూ గత ఒలింపిక్స్ స్వర్ణపతక విజేత ప్రమోద్‌పై బీడబ్ల్యూఎఫ్ 18 నెలల నిషేధం విధించింది. 'పారాలింపిక్స్‌లో పతకం తెచ్చేవారి జాబితాలో ప్రమోద్ భగత్ పేరు ముందుండాల్సింది. కానీ అతడిపై నిషేధం పడింది. అయినా విశ్వ క్రీడల్లో మన అథ్లెట్లు 25 పతకాలు సాధించగలరు. పారాలింపిక్స్ చరిత్రలోనే ఈసారి భారత్ నుంచి అత్యధిక మంది అథ్లెట్లు పాల్గొంటున్నారు. 2020 టోక్యో పారాలింపిక్స్‌లో మనవాళ్లు 19 పతకాలు సాధించారు. ఇప్పుడు ఆ మార్క్ దాటడంతో పాటు.. పతకాల జాబితాలో టాప్–20లో నిలుస్తాం' అని ఝఝారియా అన్నాడు. ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 8 వరకు జరగనున్న 'పారిస్' పారా క్రీడల్లో భారత్ నుంచి 84 మంది అథ్లెట్లు 12 క్రీడాంశాల్లో పోటీపడుతున్నారు. ఇప్పటికే భారత అథ్లెట్ల బృందం క్రీడా గ్రామంలో అడుగుపెట్టింది.

అల్‌కరాజ్ అనూహ్య పరాజయం



సిన్సినాటి: నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో స్పెయిన్ సంచలనంగా మారిన కార్లోస్ అల్‌కరాజ్ సిన్సినాటి ఓపెన్‌లో ఓడిపోవడాన్ని ఏమాత్రం జీర్ణించుకోలేకపోయాడు. దీంతో కోర్టులోనే ఈ ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్ తన రాకెట్‌ను విరగ్గొట్టేశాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో రెండో సీడ్ అల్‌కరాజ్ 6–4, 6–7 (5/7), 4–6తో గేల్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం చవిచూశాడు. గురువారం అర్ధరాత్రి జరగాల్సిన ఈ మ్యాచ్ వర్షం వల్ల ఆగిపోయింది. తొలి సెట్ గెలుపొందగా, రెండో సెట్ టైబ్రేక్‌కు దారి తీసింది. ఈ దశలో మ్యాచ్ ఆగిపోగా మరుసటి రోజు టైబ్రేక్‌లో పుంజుకొని మ్యాచ్‌ను వరుస సెట్లలోనే ముగించవచ్చని అల్‌కరాజ్ భావించాడు. కానీ 37 ఏళ్ల వెటరన్ మోన్‌ఫిల్స్ పట్టుదలగా ఆడటంతో రెండో సెట్ అతని వశమైంది. అదే జోరుతో ఆఖరి సెట్‌నూ నెగ్గిన మోన్‌ఫిల్స్ మ్యాచ్ గెలుపొందాడు. దీంతో తన ప్రదర్శన, మ్యాచ్ ఫలితంతో నిరాశచెందిన స్పెయిన్ స్టార్ రాకెట్ బద్దలుకొట్టాడు. తన కెరీర్‌లోనే ఇదో చెత్తమ్యాచ్ అని, దీన్ని త్వరగా మర్చిపోయి యూఎస్ ఓపెన్‌పై దృష్టిపెట్టాలనుకుంటున్నట్లు చెప్పాడు. న్యూయార్క్‌లో ఈ నెల 26 నుంచి యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ జరుగుతుంది.

'నదీమ్ రికార్డును బ్రేక్ చేస్తాననుకున్నా'

స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా



న్యూఢిల్లీ: పాకిస్తాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ రికార్డు బ్రేక్ చేయడం పెద్ద కష్టం కాదనుకున్నానని భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. జావెలిన్ పట్టుకుంటే వంద శాతం ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి పెడతానని.. అది ఎంత దూరం వెళ్తుందనే దాన్ని పట్టించుకోనని నీరజ్ అన్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం నెగ్గిన నీరజ్.. 90 మీటర్ల మార్కు అందుకోవడం గురించి ఎక్కువ ఆలోచించడం లేదని.. అది ఎప్పుడు జరగాలని రాసిపెట్టి ఉందో అప్పుడే జరుగుతుందని పేర్కొన్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్ స్వర్ణం గెలిచి.. అథ్లెటిక్స్‌లో భారత్ తరఫున తొలి పసిడి గెలిచిన ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కిన నీరజ్.. తాజాగా 'పారిస్' క్రీడల్లో గాయంతోనే రజతం గెలిచి అదుర్స్ అనిపించుకున్నాడు. విశ్వ క్రీడల అనంతరం స్విట్జర్లాండ్‌లో శిక్షణ తీసుకుంటున్న నీరజ్‌చోప్రా.. శనివారం ఓ ప్రత్యేక కార్యక్రమంలో పలు అంశాలపై మాట్లాడాడు. 'మెరుగైన ప్రదర్శన చేసే విధంగా సిద్ధం కావడమే నా చేతిలో ఉంది. 90 మీటర్ల మార్కు అందుకోవడం గురించి ఇప్పటికే ఎక్కువ చర్చ జరిగింది. ఇకపై దాని గురించి ఆలోచించొద్దని అనుకుంటున్నా. రాబోయే రెండు మూడు టోర్నీల్లో వంద శాతం ప్రయత్నిస్తా.. ఫలితం ఎలా వస్తుందో చూస్తా. పారిస్ పోటీల్లో నదీమ్ విసిరిన దూరాన్ని అందుకోలేనని ఒక్క శాతం కూడా అనిపించలేదు' అని 26 ఏళ్ల నీరజ్ అన్నాడు. గత ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్ నుంచి గజ్జల్లో గాయంతో ఇబ్బంది పడుతున్న నీరజ్.. వచ్చే నెల బ్రస్సెల్స్ డైమండ్ లీగ్ అనంతరం చికిత్స చేయించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా పారిస్ క్రీడల్లో గాయంతోనే బరిలోకి దిగిన నీరజ్.. ఆ ప్రభావం కూడా తన ప్రదర్శనపై పడిందని అన్నాడు. 'జావెలిన్‌ను మరింత దూరం విసరగలనని అనుకున్నా. పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫికేషన్, ఫైనల్లో నేను వేసిన రెండు త్రోలు నా కెరీర్‌లో రెండో, మూడో అత్యుత్తమ త్రోలు. అందులో ఒకటి సీజన్ బెస్ట్ కూడా. వంద శాతం కష్టపడితే మెరుగైన ఫలితాలు వస్తాయి. అయితే గాయం భయంతో పూర్తి ఎఫర్ట్ పెట్టనట్లు అనిపించింది. త్రో చేయడానికి ముందు జావెలిన్‌తో పరిగెడుతున్నప్పుడు గజ్జల్లో ఇబ్బందిగా ఉంది. దీంతో పాటు జావెలిన్ వదిలే కోణంపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరముంది. దేశంలో క్రీడల ప్రాముఖ్యత పెరగాలి. ప్రత్యేకంగా ఒక ఆట అని కాకుండా.. అన్నింటిలో ఎదిగితేనే స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా మారగలం. క్రికెట్‌లో మెరుగైన స్థితిలో ఉన్నాం. వచ్చే ఒలింపిక్స్‌లో ఎక్కువ పతకాలు సాధించడంతో పాటు.. ఫిఫా ప్రపంచకప్‌నకు అర్హత సాధించే దిశగా అడుగులు వేయాలి' అని నీరజ్ వివరించాడు.

లుసానే డైమండ్ లీగ్‌లో నీరజ్

ఈ నెల 22 నుంచి లుసానే వేదికగా జరగనున్న డైమండ్ లీగ్‌లో బరిలోకి దిగనున్నట్లు నీరజ్ చోప్రా ప్రకటించాడు. సెప్టెంబర్‌లో జరగనున్న బ్రస్సెల్స్ డైమండ్ లీగ్‌తో సీజన్ ముగియనుండగా.. ఆ తర్వాతే గాయానికి చికిత్స తీసుకోవాలని నీరజ్ భావిస్తున్నాడు. 'లుసానే లీగ్‌లో పోటీపడాలని నిర్ణయించుకున్నా. మరో నెల రోజుల్లో సీజన్ ముగుస్తుంది. ఆ తర్వాతే చికిత్సపై దృష్టి పెడతా. డైమండ్ లీగ్‌కు ముందు శిక్షణ కోసం స్విట్జర్లాండ్‌కు వచ్చా. వైద్యుల పర్యవేక్షణలో ట్రెయినింగ్ సాగుతుంది. ఒకసారి పోటీలు ముగిసిన తర్వాత గాయం గురించి ఆలోచిస్తా' అని నీరజ్ అన్నాడు.

వెస్టిండీస్ విజయ లక్ష్యం 263


జేడెన్ సీల్స్

ప్రావిడెన్స్: రెండో టెస్టు మ్యాచ్‌లో వెస్టిండీస్‌కు దక్షిణాఫ్రికా 263 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. ఛేదనలో 25 ఓవర్లు ముగిసే సరికి విండీస్ 3 వికెట్లు కోల్పోయి 70 పరుగులు చేసింది. అంతకు ముందు దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 246 పరుగులకు ఆలౌటైంది. కైల్ వెరీన్ (59), ఎయిడెన్ మార్క్‌రమ్ (51), టోనీ జోర్జీ (39), వియాన్ ముల్డర్ (34) కీలక పరుగులు సాధించారు. విండీస్ బౌలర్లలో జేడెన్ సీల్స్ (6/61) ఆరు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీయగా...వారికాన్, గుడకేశ్ మోతీ చెరో 2 వికెట్లు పడగొట్టారు.

సినిమా


● వై. రవిశంకర్, హను రాఘవపూడి, ఇమాన్వి, ప్రభాస్, నవీన్ ఎర్నేని

పవర్‌ఫుల్ వారియర్

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో హిస్టారికల్ వార్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనున్న చిత్రం శనివారం ప్రారంభమైంది. ఈ చిత్రంతో ఇమాన్వి హీరోయిన్‌గా నటించనున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్‌కుమార్, టీ సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ''ఆధిపత్యం కోసం యుద్ధాలు జరుగుతున్నప్పుడు ఓ వారియర్ మాత్రం వారి పోరాటం దేని కోసమో నిర్వచించగలిగాడు'' అంటూ ఈ సినిమాని ఉద్దేశించి 'ఎక్స్'లో పేర్కొన్నారు హను రాఘవపూడి. ''1940 నేపథ్యంలో సాగే ఈ సినిమాకు హను పవర్‌ఫుల్ వారియర్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారు. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రల్లో నటించనున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: సుదీప్ ఛటర్జీ ఐఎస్‌సీ.

ఆయ్‌కి ఎన్టీఆర్ అభినందనలు

ఎన్టీఆర్ బావమరిది, 'మ్యాడ్' ఫేమ్ నార్నే నితిన్, నయన్ సారిక హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఆయ్'. అంజి కె. మణిపుత్ర దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదలైంది. తమ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని చిత్రబృందం పేర్కొంది. తాజాగా 'ఆయ్' యూనిట్ ఎన్టీఆర్‌ను కలిసింది. సినిమా విజయం సాధించినందుకు యూనిట్ సభ్యులను ఎన్టీఆర్ అభినందించారు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.


● ఎన్టీఆర్, నార్నే నితిన్


● నిధీ అగర్వాల్

శనివారం (ఆగస్టు 17) హీరోయిన్ నిధీ అగర్వాల్ బర్త్ డే. ఈ సందర్భంగా 'హరి హర వీర మల్లు' సినిమా నుంచి నిధీ అగర్వాల్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. పంచమి పాత్రలో నిధీ అగర్వాల్ కనిపిస్తారు. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ సినిమాలో పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తుండగా, జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఏఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్నారు. తొలి భాగం 'హరి హర వీర మల్లు పార్ట్–1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' త్వరలో రిలీజ్ కానుంది. అలాగే ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'రాజా సాబ్'లో నిధి ఓ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మారుతి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 10న విడుదల కానుంది.

మహాశివరాత్రికి జటాధర


● సుధీర్‌బాబు

సుధీర్‌బాబు హీరోగా నటించనున్న ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రం 'జటాధర'. సూపర్ నేచురల్ ఫ్యాంటసీ అంశాలతో వెంకట్ కల్యాణ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. హిందీలో 'రుస్తుమ్, టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథ, ప్యాడ్‌మ్యాన్, పరి'లాంటి చిత్రాలను నిర్మించిన ప్రేరణ అరోరాతో కలిసి శివిన్ నారంగ్, నిఖిల్ నందా, ఉజ్వల్ ఆనంద్‌లు ఈ సినిమాను నిర్మించనున్నారు. 'జటాధర'ను శనివారం ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను విడుదల చేయడంతో పాటు ఈ సినిమాను వచ్చే ఏడాది మహాశివరాత్రి సందర్భంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు మేకర్స్. ''ఈ చిత్రంలో సుధీర్‌బాబు ఓ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తారు. త్వరలోనే షూటింగ్ ఆరంభిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'టర్బో' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

సీరియస్ రోడ్.... కామెడీ జర్నీ



ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి నటించిన చిత్రం 'టర్బో'. ఇదో సీరియస్ యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్. దీనికి దర్శకులు వైశాఖ్. డెబ్బై ఏళ్ళ పైబడి వయస్సులో ఉన్న మమ్ముట్టి ఈ సినిమాలో నలభై ఏళ్ల వ్యక్తిలా యంగ్ అండ్ ఎనర్జిటిక్‌గా కనిపించారు. టర్బో జోస్ (మమ్ముట్టి) తనకు సంబంధం లేని తగాదాల్లో తల దూరుస్తుంటాడు. అతనిది ఎవ్వరికీ భయపడని మనస్తత్వం... ఒక్క వాళ్లమ్మకు తప్ప. జోస్‌కి మంచి ఆప్తుడు జెర్రీ. జెర్రీకి సంబంధించిన ఓ సమస్యను పరిష్కరించడంలో జెర్రీని ప్రేమించిన నిరంజనకు జోస్ తారసపడి, అదే సందర్భంలో తన ఆప్తుడైన జెర్రీని పోగొట్టుకుంటాడు. అలాగే జెర్రీ సమస్య నగరంలో అసమాన్యుడి నుండి సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ భయపడే వెట్రివేల్ షణ్ముగంతో ముడిపడి ఉంటుంది. దీంతో వెట్రివేల్‌తో టర్బో జోస్ పోరాడవలసి వస్తుంది. అసలు జెర్రీకి వచ్చిన సీరియస్ సమస్య ఏంటి ? జెర్రీ ఎలా చనిపోయాడు? వెట్రివేల్‌ను జోస్ ఎలా ఎదుర్కొన్నాడు? అన్నది మాత్రం సోనీ లివ్ ఓటీటీ తెరమీదే చూడాలి. టర్బో అంటే అదనపు శక్తి అన్నమాట. టైటిల్‌కి తగ్గట్టే సినిమాలో ఎలిమెంట్స్ అన్నీ అదనపు శక్తితో నడుస్తాయి. మమ్ముట్టి మంచి ఈజ్‌తో జోస్ పాత్రను రక్తి కట్టించారు. ఆ తరువాత చెప్పుకోవలసిన పాత్ర రాజ్ బి. శెట్టిది. ఇతనే వెట్రివేల్ షణ్ముగం. ఈ సినిమాలో ప్రతినాయకుడు. విలన్ పాత్రలో రాజ్ బి. శెట్టి చాలా విలక్షణంగా చేశారు. ఈ పాత్రలతో పాటు సినిమా మొత్తం యాక్షన్, కామెడీ సన్నివేశాలతో సీరియస్ కథను సరదా స్క్రీన్‌ప్లేతో తెరకెక్కించిన విధానం అద్భుతం. వీకెండ్‌కి ఓ మంచి సినిమా ఈ 'టర్బో'.

– ఇంటూరి హరికృష్ణ

మాస్... క్లాస్ అని ఆలోచించను

– సంగీత దర్శకుడు మిక్కీ జె. మేయర్



''ఏ సినిమాలో అయినా కథని బట్టే పాటలు ఉంటాయి. ప్రత్యేకించి మాస్, క్లాస్ అని నేను ఆలోచించను. 'మిస్టర్ బచ్చన్'లో మాస్ సాంగ్స్ చేసే చాన్స్ దక్కింది. ఈ పాటలివ్వడం నాకేం షాకింగ్‌గా లేదు. ఎందుకంటే నేను మాస్ సాంగ్స్ చేయగలనని నాకు తెలుసు. 'మిస్టర్ బచ్చన్' సంగీతానికి మంచి స్పందన రావడం చాలా హ్యాపీగా ఉంది'' అని సంగీత దర్శకుడు మిక్కీ జె. మేయర్ అన్నారు. రవితేజ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన 'మిస్టర్ బచ్చన్' ఈ నెల 15న విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు మిక్కీ జె. మేయర్ మాట్లాడుతూ– ''నా భార్య, పిల్లలతో కలిసి అమెరికాలో ఉంటాను. డైరెక్టర్స్ కథని ఫోన్‌లో లేదా జూమ్ కాల్స్‌లో వినిపిస్తారు. కథ విని ట్యూన్స్ ఇస్తాను. అయితే నేపథ్య సంగీతం మాత్రం ఇండియాకి వచ్చి చేస్తాను. నేనెప్పుడూ డైరెక్టర్‌తో మ్యూజిక్ సిట్టింగ్స్‌లో కూర్చోలేదు. కానీ, 'మిస్టర్ బచ్చన్' కోసం హరీష్‌గారు సియాటిల్ వచ్చారు. కేవలం నాలుగు రోజుల్లో ఈ సినిమా ట్యూన్స్ పూర్తి చేశాం. నేను అమెరికాలో కాకుండా ఇండియాలో ఉంటే మరిన్ని సినిమాలు చేసే చాన్స్ ఉండేది. కానీ, ఫ్యామిలీకి కూడా ప్రాధాన్యత ఇస్తాను.. అందుకే అమెరికాలో ఉంటున్నాను. ప్రస్తుతం మూడు ప్రాజెక్టులు చర్చల్లో ఉన్నాయి'' అన్నారు.

రేవు కాన్సెప్ట్ బాగుంది – 'దిల్' రాజు


● రాంబాబు, ప్రభు, 'దిల్' రాజు, మురళి

వంశీ రామ్ పెండ్యాల, అజయ్ స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వంలో డా. మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్‌కి దర్శకుడు కోదండ రామిరెడ్డి, నిర్మాత 'దిల్' రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''రేవు' పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు కోదండ రామిరెడ్డి. ''ఈ సినిమా కాన్సెప్ట్ బాగుంది. నాకు స్నేహితులైన ప్రభు, రాంబాబులు ఈ సినిమా తీశారు. కాబట్టి నేను ముందుండి నడిపించాలనుకున్నాను. ఇంతవరకు వీళ్ల సినిమాని చూసి రివ్యూ రాశారు. 'రేవు' చూసి నేను రివ్యూ రాస్తా'' అన్నారు 'దిల్' రాజు. ''రేవు'లోని ప్రతి పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు'' అన్నారు మురళి. ఈ చిత్రానికి నిర్మాణ సూపర్‌విజన్‌ని జర్నలిస్ట్ ప్రభు నిర్వర్తించ గా, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా జర్నలిస్ట్ పి. రాంబాబు వ్యవహరించారు.

ఫుల్లుగా నవ్వుతారు

– డైరెక్టర్ లక్ష్మణ్ కార్య



''మారుతినగర్ సుబ్రమణ్యం' సినిమాని సుకుమార్‌గారి వైఫ్ తబితగారికి, మైత్రీ మూవీస్ శశిగారికి ప్రివ్యూ వేశాం. వారికి బాగా నచ్చింది. ఆ తర్వాత సుకుమార్‌గారు చూసి, నాకు ఫోన్ చేసి, 'బాగా తీశావు.. రావు రమేశ్‌గారు అద్భుతంగా చేశారు' అని చెప్పారు. ఆయన మాటలతో సినిమాపై మరింత నమ్మకం పెరిగింది. ఈ సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు ఫుల్లుగా నవ్వుతారు'' అని దర్శకుడు లక్ష్మణ్ కార్య అన్నారు. రావు రమేశ్, ఇంద్రజ జంటగా నటించిన చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. తబితా సుకుమార్ సమర్పణలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా లక్ష్మణ్ కార్య మాట్లాడుతూ– ''ఓంకార్‌గారి 'జీనియస్' షోకి, సినిమాటోగ్రాఫర్ శ్రీకాంత్ నరోజ్ వద్ద అసిస్టెంట్‌గా చేశా. డైరెక్టర్ దేవా కట్టగారి 'ఆటో నగర్ సూర్య' సినిమాకు దర్శకత్వ శాఖలో చేశాను. సుమంత్ అశ్విన్‌తో తీసిన 'ఎందుకిలా' వెబ్ సిరీస్‌తో దర్శకుడినయ్యాను. ఆ తర్వాత ఆయన, నిహారిక జంటగా 'హ్యాపీ వెడ్డింగ్' సినిమా చేశాను. దర్శకుడిగా 'మారుతి నగర్ సుబ్రమణ్యం' నా రెండో సినిమా. టైటిల్ రోల్‌కి రావు రమేశ్‌గారిని తప్ప ఎవర్నీ ఊహించుకోలేదు. అంతలా ఆయన నటన ఉంటుంది. ఆయన భార్య కళామణి పాత్రలో ఇంద్రజగారు బాగా నటించారు. ఇటీవల వచ్చిన సినిమాల్లో బెస్ట్ ఫాదర్ అండ్ సన్ రిలేషన్‌ని ఈ సినిమాలో చూస్తారు'' అని తెలిపారు.

కాలనీలో థ్రిల్



● అరుళ్ నిధి

అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వంలో విజయ సుబ్రహ్మణ్యన్, ఆర్‌సీ రాజ్‌కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న తమిళంలో రిలీజైంది. ఈ సినిమాని రాజ్ వర్మ ఎంటర్‌టైన్‌మెంట్–శ్రీ బాలాజీ ఫిలింస్ తెలుగులో ఈ నెల 23న విడుదల చేస్తున్నాయి. ''హారర్ థ్రిల్లర్‌గా 'డీమాంటీ కాలనీ 2' చిత్రం రూపొందింది. 'తంగలాన్' వంటి పెద్ద సినిమాతో పాటు విడుదలైన మా 'డీమాంటీ కాలనీ 2' కూడా ప్రేక్షకాదరణ పొందుతోంది. తెలుగులోనూ విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు మేకర్స్.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



రజక/కట్నం ప్రసక్తిలేదు/M.Tech, IIT/C. Govt. టెక్నికల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ /DRDO/ 1 Lakh. PM/6' ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-16344]

ముదిరాజ్/కట్నం ప్రసక్తిలేదు/M.Sc/Govt. బిల్ కలెక్టర్/మున్సిపల్ Dept/65000/- PM/ 5'11" ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-16344]

బెస్త, గంగపుత్ర, అగ్నికుల క్షత్రియ/ M.Sc Agri/Govt.AO/అగ్రికల్చర్ Dept/ 80,000/-PM/6'ఎత్తు/29 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-16344]

క్రిస్టియన్ మాదిగ / కట్నం ప్రసక్తి లేదు/ B.Tech, IIT/MBA, IIM/ SWE/ 38 Lakhs. PA/6' ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-16344]

37 సం॥ గల బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు. నో డౌరీ. Ph: 9866724586, 6301943220 [H-782767]

2వ పెళ్లి/5,00,000 PM/కుల ప్రసక్తి లేదు, కోట్ల ప్రాపర్టీ కల్గిన అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను. మంచి ఫ్యామిలీ నుండి అమ్మాయి కావలెను (Kids లేరు) Ph: 9381696641 [H-796624]

SC మాల/B.Tech/C.Govt. గ్రూప్-II ఆఫీసర్/ACTO / 90,000/-PM / 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-16345]

రజక/కట్నప్రసక్తి లేదు/ M.Tech / C. Govt. కస్టమ్స్ ఆఫీసర్/80,000/-PM/ 5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-16345]

యాదవ/కట్నప్రసక్తి లేదు / M.Tech (IT)/ Govt. A.E.E./ ఇరిగేషన్ Dept/14 Lakhs. P.A/5'8" ఎత్తు/29 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-16345]

క్రిస్టియన్ మాల/ కట్నప్రసక్తి లేదు / 28/ 5'9"/ B.Tech/C.Govt. రిసెర్చ్ ఆఫీసర్/ DRDO/1 Lakh. PM/ అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-16345]

వెలమ/ B.Tech, IIT, M.Tech,IIM / C. Govt.సైంటిస్ట్/ ఇస్రో /1,30,000/-PM/ 6'ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-16345]

రజక/కట్నం ప్రసక్తిలేదు/B.Tech, సివిల్ ఇంజనీరింగ్/ Asst. గెజిటెడ్ ఆఫీసర్/ 90,000/- PM/ 5'10" ఎత్తు/ 29 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 7075953400 [HA-16350]

2వ పెళ్లి/ క్రిస్టియన్/కుల ప్రసక్తిలేదు/ B.Tech, సివిల్ ఇంజనీర్/ 1 Lakh PM/ 5'8" ఎత్తు/ 36 సం॥ల పిల్లలు లేని వరుడికి వధువు కావలెను. Ph: 9550650024 [HA-16350]

రెడ్డి: హ్యాండ్సమ్/కట్నప్రసక్తి లేదు/29/ 5'10"/B.Tech, IIT/ సాఫ్ట్ వేర్ ఇంజనీర్/ 3Lakhs pm/కోట్ల ఆస్తి గల వరునికి వధువు కావలెను. Ph: 8367619529 [H-16346]

కుల పట్టింపు లేదు: Age: 35 లోపు విడో డాక్టర్ అమ్మాయి కావాలి. ఆసక్తి కలిగినవారు సంప్రదించండి. డైరెక్ట్ పేరెంట్ ✆ : 9705135074. [Z-1080808]

★

SC/32/5'8"/ BE(EEE) / Govt. Employee / Electricity Dept/ Hyderabad / 2 Lakhs PM వెల్ సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9949919285 [HA-14506]


డైరెక్ట్, కుల పట్టింపులేదు, 48Y, Pvt. జాబ్ & బిజినెస్ చేస్తున్న వరుడికి లేటు, డైవర్సీ, విడో, అత్యున్నత కుటుంబపు వధువు కావలెను. సంప్ర: 9391728497 [HA-16349]

★★

కాపు/35సం॥/6.1/MBBS/45వేలు PM కోటి ఆస్థి, విజయవాడ చైతన్య కాలేజీ నందు జాబ్ చేస్తున్న వరునికి వధువు కావలెను. డైరెక్ట్. సంప్ర॥ 9440406367 [G-795974]

వధువు కావలెను. కాపు నాయుడు డైవర్స్ Age: 42. H :5.6, 2 కోట్ల ప్రాపర్టీ గల సాంప్రదాయ కుటుంబం కలిగిన కాపు అమ్మాయి కావలెను. డైరెక్ట్ నో బ్రోకర్ సంప్ర: 95815 30661 [P-772831]

వరుడు కావలెను



రెడ్డి/2nd, కుల, మత, ఆస్తి పట్టింపు లేదు/Q: డిగ్రీ, ఎత్తు5'4", బిజినెస్‌లు గల అందమైన వధువుకి వరుడు కావలెను. 1st/2nd (ఇల్లరికం OK.) అన్ని కులాల వారికి సంబంధాలకై. Ph: 9032596676 [H-796624]

కాపు: 38yr కులపట్టింపు లేదు/ఫెయిర్/ Govt ఎంప్లాయ్ 2,50,000/- (PM), వెల్ సెటిల్డ్ & 3సొంత ఇల్లులు కలిగిన వధువుకి వరుడు కావలెను. (1st, 2nd మ్యాచ్ & ఇల్లరికం Ok) సంప్ర: 8374802603 [H-796681]

కుల పట్టింపు లేదు: డైవర్సీ 38 yrs Govt ఎంప్లాయ్ 2,00,000/- (PM), వెల్ సెటిల్డ్ బాగా స్థిరపడిన అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. (పిల్లలు ఉన్న Ok) సంప్ర: 8332006483 [H-796681]

Reddy: కుల పట్టింపు లేదు/ Age 58yrs/2nd & లేట్ మ్యాచ్ అయిన ఓకే/ 5'4"/ఫెయిర్ /Govt జాబ్ 95K(PM)/ ప్రాపర్టీస్ కలవు/ No Children/ ఇల్లరికం కావలెను. Ph: 9581120134 [H-796681]

రెడ్డి: 32yr/5'5"/ ఫెయిర్/కులపట్టింపు లేదు/ M.Com/ Govt ఎంప్లాయ్ 50k (PM) వెల్ సెటిల్డ్ బిజినెస్ & సొంత ఇల్లు కలిగిన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం ఓకె) సంప్ర: 9133672661 [H-796681]

ధాత్రి మ్యారేజి బ్యూరో

Something Special ధాత్రి మ్యారేజి బ్యూరో All Communities H.O : Vijayawada, B.O. : Hyderabad అన్ని కులముల వారికి వివాహ సంబంధములు అతి త్వరగా కుదర్చబడును. సంబంధములు కుదుర్చుట మా ప్రత్యేకత. రెండవ వివాహ సంబంధములు కూడా కుదుర్చుట మా ప్రత్యేకత. Ph: 96422 15777, 96429 57888

వధువు కావలెను

కమ్మ * 29, 5.10', DM Nephorology, CMC, 200CR, * 30, 5.11' DM Nephorology, ,50CR * 30, 6', MCH, Surgical Ancology, 50CR * 32, 5.10' MCH, Neuro Surgeon 60CR ✆ 96429 57888

పద్మశాలి * 30, 5.8', DM Nephorology, 20 CR, * 32, 6' DM Cardialogy, 50CR * 32, 5.7', MCH, Neuro Surgeon, 30CR * 30, 5.11' MCH, Plastic Surgeon 25CR ✆ 96429 57888

కాపు * 30, 5.9', MDGM 100 CR, * 30, 5.10' MDGM, 10 CR * 30, 5.9', MSGS, 20 CR * 30, 5.6' MD, Dermatology, 30 LPA, 30 CR ✆ 96429 57888

కాపు * 29, 5.7', MCH Surgical Gastro, 50 CR, * 30, 5.9' MDGM, 30 CR * 30, 5.10', MSGS, 25 CR * 31, 5.9' MS Ortho, 20 CR ✆ 96429 57888

రెడ్డి * 31, 6', MCH Surgical Ancology, 100 CR, * 32, 5.11' MDGM, 50 CR * 33, 5.10', MSGS, 40 LPA, 25 CR * 34, 5.10' MD Dermatology, 36 LPA, 15 CR ✆ 96429 57888

కాపు * 30, 5.7', MS, 160KS 15 CR, * 31, 5.9' MS, 160KS 20 CR * 30, 5.8', MS, 140KS, 10CR * 32, 5.10' MS 160KS, 20CR ✆ 96429 57888

రెడ్డి * 30, 5.11', B.Tech, MBA, 45LPA, 30 CR * 31, 5.11' B.Tech, MBA, 45LPA, 25 CR * 30, 5.10', B.Tech, MBA, 40 LPA, 20 CR * 30, 6' B.Tech, MBA, 36 LPA, 20 CR ✆ 96429 57888

SC కొండదొర * 30, 5.11', IIT, KGP, MBA, IIM, CAL, 60 LPA, 20 CR * 31, 5.11' IIT Gowhathi, 72 LPA, 10 CR * 32, 5.9', IIT Mumbai, 50 LPA, 10 CR ✆ 96429 57888

పద్మనాయక వెలమ * 29, 5.11', B.Tech, MBA, 45 LPA, 12 CR * 33, 5.10' B.Tech MBA, 30 LPA, 10 CR * 30, 5.8', B.Tech MBA, 36 LPA, 15 CR * 32, 6', B.Tech MBA, 50 LPA, 20 CR ✆ 96429 57888

కాపు : CNB * 32, 5.9', M.Tech,1 CR PA, 200 CR Property కలిగి బిజినెస్ చేసి ఉన్న అందమైన వరుడికి డాక్టర్ చదివిన అందమైన వధువు కావలెను ✆ 96429 57888

వరుడు కావలెను

కమ్మ, * 28, 5.6', MS OBG, IVF, 100 CR, * 30, 5.4' MS OBG, 36 LPA, 50 CR, * 28, 5.7', MS OBG, 40CR, * 27, 5.5' MD RADIALOGY, 50CR ✆ 96422 15777

రెడ్డి * 30, 5.5', MDGM, 30 CR, * 34, 5.6' MS ENT, 35 CR, * 27, 5.2', MSGS, 20CR, * 32, 5.4' MDGM, 10CR ✆ 96422 15777

కాపు * 28, 5.6', MD OBG, 20 CR, * 31, 5.6' MD RADIALOGY, 30 CR, * 29, 5.2', MD, DERMATOLOGY, 15 CR * 27, 5.4' MDGM, 10CR ✆ 96422 15777

కాపు * 30, 5.4', MS OBG, 10 CR, * 30, 5.4' MD PEDIATICS, 20 CR, * 29, 5.3', MS OBG, 15 CR * 33, 5.6' MD RADIALOGY, 25CR ✆ 96422 15777

పద్మశాలి * 28, 5.2', MDGM, 10 CR, * 30, 5.3' MS OBG, 15 CR, * 28, 5.6', MS OBG, IVF, 50 CR * 26, 5.5' MBBS, 15CR ✆ 96422 15777

పద్మనాయక వెలమ * 28, 5.6', MD RADIALOGY, 20 CR, * 29, 5.6' MDGM, * 34, 5.3', MCH, SURGICAL ANCOLOGY, 50 CR, 45 LPA * 34, 5.7' DM NEUROLOGY, 50LPA, 25CR ✆ 96422 15777

గౌడ * 31, 5.3', MS OBG, 20 CR, * 29, 5.5' MD RADIALOGY, 10 CR, * 32, 5.2', MS PULMONOLOGY, 15 CR * 28, 5.5' MS OBG, 10CR ✆ 96422 15777

కాపు * 28, 5.5', B.Tech, 25 LPA, 10CR, * 30, 5.3' B.Tech, 16 LPA, 5CR, * 30, 5.2', B.Tech, 9LPA, 8CR * 33, 5.5' B.Tech, 12 LPA, 5CR ✆ 96422 15777

రెడ్డి * 32, 5.4', MS, 270KS, 15CR, * 31, 5.6' MS 160KS, 10CR, * 34, 5.6', MS, 200KS 15CR * 32, 5.7' MS 180KS, 10CR ✆ 96422 15777

కమ్మ Divorce : * 29, 5.7', MDGM, 36 LPA, 50CR * 32, 5.5' MD RADIALOGY 36LPA, 60CR * 32, 5.7', MD RADIALOGY, 40LPA, 20CR * 36, 5.4' MS OBG IVF, 40LPA 30CR ✆ 96422 15777

[B-190510]

కాపు: 43yr/కులపట్టింపు లేదు/ Govt ఎంప్లాయ్ 70k (PM) వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ 4 సొంత ఇల్లులు & బిజినెస్ కలిగిన వధువుకి వరుడు కావలెను. (1st & 2nd మ్యాచ్ ఓకె ఇల్లరికం ఓకె) సంప్ర: 9640133485 [H-796681]

రెండో పెళ్ళి/విడో/50y/Fair/ వైజాగ్/ కాలేజీ జాబ్/వెల్ సెటిల్ పిల్లలు లేని ఏ బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-782767]

కుల, ఆస్తి పట్టింపు లేదు/విడో/45y/DMHO / మంచి జీతం/Own Hospitals/ సొంత విల్లా/18 ఎ॥ ల్యాండ్స్/కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9573960642 [H-782767]

రెడ్డి/2nd, విడో (కుల/మత/ఆస్తి) ప్రసక్తి లేదు/ 30Y/ డిగ్రీ/సొంత ఇల్లు & ప్రాపర్టీలు/వెల్ సెటిల్డ్ అందమైన వధువుకి 1వ/2వ వరుడు కా. ఇల్లరికం OK. అన్ని వయస్సుల వారి సంబంధాలకై. 9392332143 [H-796624]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Business, BE, 26, 6' 1", Very Rich Family, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 30, 5' 8", Analyst, 61 L P/A, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 24, 5' 7", SWE, 30 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 29, 5' 11", Hyderabad, Handsome, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, MS, 28, 5' 2", 100 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 25, 5' 5", Wipro, 25 Crores, Hyderabad, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 26, 5' 6", SWE, Amazon, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (IIM), 27, 5' 7", Sr. Associate, 30 L P/A, Hyd, Fair & Slim Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, ME, MS, 27, 5' 10", Developer, H1, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, 28, 6' 1", Hyderabad, Very Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MBA (IIM), MD, 27, 5' 7", PG Doctor, 30 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 9", SWE, Apple, 50 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MBA, 27, 5' 5", L & T, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 5", SWE, 126 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 25, 5' 5", PG Doctor, 25 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 24, 5' 4", SWE, 11 L P/A, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

2వ పెళ్ళి/Govt.Emp/3,00,000PM/బాగా స్థిరపడిన కోట్ల ప్రాపర్టీ కల్గిన అందమైన వధువుకి అందమైన అబ్బాయి కావలెను. కుల ప్రసక్తి లేదు. Kids ఉన్నా OK. Ph: 9381696641 [H-796624]

వడ్డెర/50 లక్షల ఆస్తి/M.Sc/ C.Govt. Jr.అకౌంటెంట్/48000/-PM/5'5" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-16344]

హిందూ మాదిగ/50 లక్షల ఆస్తి/ B.Tech/ Govt. Asst. ఇంజనీర్ / ఇరిగేషన్ Dept/ 75000/-PM / 5'4"ఎత్తు/25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6305007091 [HA-16344]

యాదవ/ఏకైక కుమార్తె/M.Tech/C.Govt. డిజైన్ & వెరిఫికేషన్ ఇంజనీర్/VLSI ఇస్రో/8 Lakhs.PA/5'6"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-16344]

పద్మశాలి/CA/చార్టెడ్ అకౌంటెంట్/9 Lakhs PA/5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8297439565 [HA-16344]

గౌడ/1 కోటి ఆస్తి /M.Sc / Govt. Jr. Asst./రెవెన్యూ Dept./45000/-PM/ 5'5" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. 9550572571 [HA-16344]

విశ్వబ్రాహ్మణ/ఏకైక కుమార్తె/B.Tech/ C.Govt. P.O/SBI బ్యాంక్/50,000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-16344]

SC మాల & క్రిస్టియన్/M.Tech (EEE)/ C.Govt. డిప్యూటీ మేనేజర్/ 65000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-16345]

వడ్డెర/B.Tech/C.Govt.Asst.మేనేజర్ /ఆంధ్రాబ్యాంక్/60,000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-16345]

రజక/B.Tech/C.Govt.బ్యాంక్ క్యాషియర్ / ఇండియన్ బ్యాంక్/ 32,000/-PM/5'4" ఎత్తు /24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515942275 [HA-16345]

మాదిగ/B.Tech/C.Govt.స్టెనోగ్రాఫర్/ రెల్వే / 42000/-PM / 5'4"ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8985557129 [HA-16345]

క్రిస్టియన్ మాల/25/5'4"/B.Tech/ C. Govt.Asst. మేనేజర్/కెనరా బ్యాంక్ / 60,000/-PM / అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-16345]

కమ్మనాయుడు/ విడో/ 50Y/ ప్రభుత్వ జాబ్/సొంత ఇల్లు గల వెల్ సెటిల్డ్ వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 9705889182 [H-796337]

నాయుడు/50Y/విడో / 5'4"/ Govt.Job/ 80K/ PM/2 సొంత ఇల్లులు/Rents: 1L/ PM/ పిల్లలులేని వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 7702278724 [H-796337]

వైశ్య/45Y/విడో/5'5"/V.Fair/Govt.Teacher /సొంత ఇల్లు & రెంట్స్/28 ఎకరాల మాగాణి/ బిజినెస్/3L/PM ఏ బాదరబందీలేని వధువుకి వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 9492718486 [H-796337]

FC/విడో/Degree / State Government Job/ 5'3"/ Fair/ ఆంధ్రాలో తోటలు గల వధువుకి మధ్య తరగతి వరుడు కావలెను. Ph: 9391272485 [H-796337]

రెడ్డి, Kaapu/విడో/48/49y/Nelloreలో సొంత ప్లాట్లు/Hyd లో సొంత బిజినెస్, రెంట్స్/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-796624]

యాదవ/ఎర్రశాఖ/అప్పర్ మిడిల్ క్లాస్/ 37Y/ 5'4"ఎత్తు/M.ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కలిగిన లక్ష రూ॥PM ఆపై ఆదాయం కలిగిన యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ Father నెంబర్: 9989597799 [H-796337]

ఆస్తి, కుల పట్టింపులేదు, రెడ్డి, విడో, 35y/ 5'3"/ డిగ్రీ/ 3 కోట్ల ప్రాపర్టీ కలిగి పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సప్‌లో సెండ్ చేయండి. Ph: 9133640971 [HA-16350]

యాదవ/ CA / Govt. అకౌంటెంట్/ 40,000/- pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 7075953400 [HA-16350]

వాల్మీకి బోయ: మొదటి పెళ్లి/గుడ్ లుకింగ్/ 37/5'3"/ డిగ్రీ గుడ్ జాబ్. వెల్ సెటిల్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. మొదటి లేదా రెండవ పెళ్లి అయినా ఓకే. Ph: 8367619529 [H-16346]

ముదిరాజ్: చాలా అందమైన/ 27/5'4"/ M.Tech/ సాఫ్ట్ వేర్ ఇంజనీర్/ వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [H-16346]

కాపు: కుల పట్టింపు లేదు/ అందమైన/ 27/5'5"/B.Tech/ సాఫ్ట్ వేర్ ఇంజనీర్/ కోట్ల ఆస్తి/ గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. US అయినా OK Ph: 8367619529 [H-16346]

కుల పట్టింపు లేదు: 2వ పెళ్ళి/గుడ్ లుకింగ్ /పిల్లలు లేరు/40/5'4"/ డిగ్రీ/ గుడ్ ఫ్యామిలీ/ వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. పిల్లలు ఉన్నా ఓకె. Ph: 8367619529 [H-16346]

బ్రాహ్మణ/ 24/5'3"/B.Sc "27/5'4" / MBA "30/ 5'3"/B.Sc"27/5'2"/ఇంటర్/32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/బిజినెస్/ పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph: 7842635086 [HA-16313]

కమ్మ, క్రిస్టియన్, B.Tech, 24Y, 5'.4", VJA లో 2 ఇళ్ళు, 1 సైట్ ఉన్న ఒన్లీ డాటర్‌కు ఎలాంటి వ్యసనాలు లేని Govt. గెజిటెడ్ ఎంప్లాయి కమ్మ క్రిస్టియన్ వరుడు కావలెను. ✆ 63098 77141 [B-190539]

★★

వధువు ఎంప్లాయి కావలెను. మాల క్రిస్టియన్స్ 2nd మ్యాచ్ సంబంధాలు చూడబడును. వయస్సు 37, 5'3"H, MBA, బ్యాంక్ మేనేజర్, వయస్సు 39, 5'3"H, M.Tech., సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, వయస్సు 38, 5'3"H, MBA సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ✆ 77949 11019 [R-1229043]

వేదికలు



కావ్య మ్యారేజ్ లింక్స్! 1వ, 2వ లేట్ మ్యారేజిస్, డైవర్స్, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ ఫ్రీలకు ఫ్రీ. Ph: 7702526428 [H-782767]

V.F మ్యారేజ్ బ్యూరో : ఒక్క రూపాయి ఫీజు లేదు (సూర్ బాషా) 1వ, సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, డెంటల్ బ్యాంకింగ్, Govt.C.Govt లేట్, విదేశాలలో జాబ్ చేయు 25 సం॥ -55 సం॥ వయస్సు గల వధూవరుల సంబంధాలకై సంప్ర : 9948820402, 9640999003 [H-782767]

మాల మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph:7396915712 [HA-16350]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd లేట్/విదేశ సంబంధాలకై సంప్ర: S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790890909 [H-796337]

మాల, మాదిగ, హిందూ, క్రిస్టియన్/ Govt. సాఫ్ట్‌వేర్ /గెజిటెడ్/MBBS/PG/ NRI/PVT/ బిజినెస్/1వ/2వ/లేట్/ AP/ TS/ 15 సం॥ Exp. Ph: 8790555273 [HA-32610]

ధ్రువ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1వ, 2వ, లేటు, విడో, డైవర్స్ వారికి తగిన సంబంధాలు చూపబడును. Age: 18-70 సం.లు. Ph: 7702955854 [HA-15785]

Doctors, Software, NRI, Rich Persons కు Late Matches కు, అన్ని ప్రాంతాల వార్కి వ్యక్తిగత శ్రద్ధతో Fast గా సెటిల్‌మెంట్ చేయబడును. పూర్ణమ్యాట్రిమోని, తిరుపతి ✆ 7093722724 [T-2957]

పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారా! Software, డాక్టర్స్, NRI, Govt., అన్ని ప్రాంతాల వార్కి ప్రత్యేక శ్రద్ధతో పెళ్లి సంబంధాలు చూడబడును. పూర్ణమ్యాట్రిమోని, తిరుపతి ✆ 7093722724 [T-3486]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9494809254 (Whatsapp) [HA-986]

★★

మాల,మాదిగలకు మాత్రమే. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల వారు ఎక్కడ ఉన్నా సాఫ్ట్‌వేర్ గవర్నమెంట్ వధువరులకై సంప్ర. M.S.N, కొత్తపేట. ✆ 99121 05777; 98492 08013 [R-1229077]

చెన్నై వీఐటీలో స్నాతకోత్సవం

సాక్షి, హైదరాబాద్: వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) చెన్నైలో శనివారం స్నాతకోత్సవం, నూతన భవనాల ప్రారంభం వీఐటీ వ్యవస్థాపకుడు, చాన్సలర్ జి.విశ్వనాథన్ చేతుల మీదుగా జరిగింది. వీఐటీ వైస్ చాన్సలర్ కంచన భాస్కరన్ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ స్నాతకోత్సవంలో 3 వేల మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్లు పొందగా.. 38 మంది గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా చాన్సలర్ విశ్వనాథన్ మాట్లాడుతూ 145 కోట్ల దేశ జనాభాలో 10 శాతం మంది జనాభా మాత్రమే డిగ్రీ పొందుతున్నారని తెలిపారు. ఉపాధి అవకాశాలు పెరగాలంటే వ్యవసాయం, తయారీ రంగాల్లో నైపుణ్య శిక్షణను పెంపొందించాల్సిన అవసరముందని చెప్పారు. వీఐటీకి గతేడాది 947 కంపెనీలు క్యాంపస్ సెలక్షన్స్ కోసం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఐటీ వైస్ ప్రెసిడెంట్స్ శంకర్‌విశ్వనాథన్, శేఖర్ విశ్వనాథన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంధ్య పెంటరెడ్డి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరి విశ్వనాథన్, వీఐటీ చెన్నై ప్రో వైస్ చాన్సలర్ త్యాగరాజన్, చాన్సలర్ సలహాదారు ఎస్పీ త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

జీఆర్‌టీ జ్యువెల్లర్స్ రూ.1.5 కోట్ల స్కాలర్‌షిప్స్

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ ఆభరణాల సంస్థ జీఆర్‌టీ జ్యువెల్లర్స్ ఎండోమెంట్ ద్వారా స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తూ విద్య పట్ల దాని సామాజిక బాధ్యతను చాటుతోంది. ఈ ఏడాది విద్యా స్కాలర్‌షిప్‌ల కోసం రూ.1.50 కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. కాలేజీల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థులకు ఇప్పటికే మొదటి దశలో రూ.80.96 లక్షలు అందించినట్లు వెల్లడించింది. చెన్నైలోని అశోక్‌నగర్‌లో జీఆర్‌టీ మహాలక్ష్మి విద్యాలయంలో స్కాలర్‌షిప్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను సత్కరించింది. ఆ సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ 'విద్య అనేది పురోగతికి నాంది. జీఆర్‌టీ జ్యువెల్లర్స్ ప్రతిభావంతులైన విద్యార్థుల జీవితాల్లో అర్థవంతమైన మార్పును తీసుకురావడంలో మద్దతు అందించడం గర్వంగా ఉంది' అని పేర్కొన్నారు.

స్కూల్ కమిటీ ఎన్నికల్లో మళ్లీ కూటమి కుట్ర

చదువుల నిలయాల్లో వర్గపోరుకు శ్రీకారం

- అర్హత, ఆసక్తి ఉన్న తల్లిదండ్రులను పోటీచేయకుండా అడ్డుకున్న వైనం
- శనివారం గొడవలు, అడ్డగింతతో 282 స్కూళ్లల్లో ఆగిన ఎన్నికలు
- ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికకు రాజకీయ రంగు

సాక్షి, అమరావతి/నెల్లూరు సిటీ/కొనకనమిట్ల: ప్రశాంతంగా జరగాల్సిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలకు టీడీపీతోపాటు కూటమి నాయకులు రాజకీయరంగు పులిమారు. ఈ నెల 8వ తేదీన 40,150 పాఠశాలల్లో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఆ రోజు 631 స్కూళ్లలో గ్రామస్థాయి కూటమి నాయకులు గొడవలకు దిగారు. దీంతో కోరం లేక 631 స్కూళ్లలో ఎన్నికలు నిలిచిపోయాయి. ఆ ఎన్నికల్ని విద్యాశాఖ అధికారులు శనివారం నిర్వహించగా.. కూటమి నేతలు మళ్లీ పాత పరిస్థితినే తీసుకొచ్చారు. పలుచోట్ల ఎన్నికల్లో పోటీచేసేందుకు ఆసక్తి చూపిన తల్లిదండ్రులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులన్న నెపంతో మళ్లీ ఎన్నికలు నిలిపేసేందుకు యత్నించారు. పలుచోట్ల దళిత తల్లిదండ్రులపై దాడులు చేశారు. కొన్నిచోట్ల తమకు బలం లేదన్న అక్కసుతో ఎన్నికల్ని నిలిపేయించారు. టీడీపీ నాయకుల అరాచకాలతో కొన్నిచోట్ల పేరెంట్స్ తమ పిల్లలకు టీసీలు ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తు చేసుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కూటమి నాయకుల కుట్రలకు కొన్ని స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు సైతం వత్తాసు పలకడం గమనార్హం. మొత్తంమీద టీడీపీ నేతల కుట్రలతో 282 పాఠశాలల్లో కమిటీ ఎన్నికలు నిలిచిపోయాయి.

దళితులపై దౌర్జన్యం

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గొల్లకందుకూరు పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికలను టీడీపీ నేతలు మరోసారి వాయిదా వేయించారు. ఇక్కడ వైఎస్సార్‌సీపీ వర్గానికి 15 ఓట్లు ఉండగా, టీడీపీ వర్గానికి 6 ఓట్లు ఉన్నాయి. ఎన్నికల్లో తాము ఓడిపోతామన్న భయంతో టీడీపీ నేతలు స్థానిక దళితులైన ఇద్దరు పేరెంట్స్‌ను భయభ్రాంతుల్ని చేశారు. దళితుడైన నారాయణ ఎన్నికల్లో పాల్గొనేందుకు వస్తుండటంతో దాడిచేశారు. ఎన్నికల్లో పాల్గొంటే అంతు చూస్తామని బెదిరించారు. మరో దళితుడు వెంకటరమణయ్యను రాకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఎంఈవో ఎన్నికలను మరోసారి వాయిదా వేశారు. టీడీపీ వర్గీయుల అరాచకాలను నిరసిస్తూ 13 మంది పేరెంట్స్ తమ పిల్లలను మరో పాఠశాలలో చేర్చాలని నిర్ణయించుకున్నారు. తమ పిల్లలకు టీసీలు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలంలోని కాట్రగుంట పంచాయతీ పేరారెడ్డిపల్లి యూపీ పాఠశాల ఎస్‌ఎంసీ ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. ఎన్నికల్ని ఆపాలని టీడీపీ నాయకులు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతోపాటు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే కమిటీ సభ్యులుగా ఎన్నికవడంతో ఉక్రోషం పట్టలేని టీడీపీ కార్యకర్త కె.బసవయ్య పాఠశాల సభ్యులున్న గదిలోకి వెళ్లి టేబుల్‌పై ఉన్న పేపర్లు చించి బయటవేశాడు.



ప్రకాశం జిల్లా పేరారెడ్డిపల్లిలో ఎన్నికల అధికారులతో గొడవ పడుతున్న టీడీపీ కార్యకర్త బసవయ్య

99.38 శాతం ఎన్నికలు పూర్తి ఎస్పీడీ శ్రీనివాసులు

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు 99.38 శాతం పాఠశాలల్లో పూర్తయ్యాయని సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ బి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. జీరో ఎన్‌రోల్‌మెంట్, పాఠశాలల మూసివేత, కోరం లేకపోవడం వంటి కారణాలతో 282 పాఠశాలల్లో యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేయలేదన్నారు.

శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి ఆపండి

- తెలంగాణ, ఏపీ జెన్‌కోలకు లేఖ రాసిన కర్నూలు సీఈ
- ఎగువన ప్రాజెక్టుల గేట్ల క్లోజ్‌తో శ్రీశైలానికి తగ్గిన నీటి రాక



కర్నూలు సిటీ: శ్రీశైలం రిజర్వాయర్ నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రస్తుతానికి నిలిపివేయాలని కోరుతూ జల వనరుల శాఖ కర్నూలు ప్రాజెక్టు సీఈ కబీర్ బాషా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జెన్‌కో అధికారులకు శనివారం లేఖ రాశారు. రాయలసీమ జిల్లాలకు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ఉండాల్సిన అవసరం ఉంది. ఆ ప్రాంతంలో ఇప్పుడిప్పుడే రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఇన్‌ఫ్లో తగ్గడం, కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల గేట్లు మూతబడటంతో శ్రీశైలానికి పైనుంచి నీటి రాక దాదాపు నిలిచిపోయింది. ఇదే సమయంలో విద్యుదుత్పత్తి కారణంగా నీటి నిల్వలు వేగంగా పడిపోతున్నాయి. దీంతో జల వనరుల శాఖ ఇంజినీర్లు అప్రమత్తం అయ్యారు.

శ్రీశైలానికి 606 టీఎంసీలు రాక

ఈ ఏడాది ఇప్పటి వరకు 606.19 టీఎంసీలు శ్రీశైలం డ్యాంలోకి వచ్చింది. ఇందులో ఏపీ కుడి గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 38.29 టీఎంసీలు, తెలంగాణ జెన్‌కో ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 59.45 టీఎంసీలు, క్రస్టు గేట్లను 13 రోజుల పాటు తెరిచి 346.26 టీఎంసీలు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 5.79 టీఎంసీలు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 29.21 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు. వీటితో పాటు 0.43 టీఎంసీల నీరు ఆవిరి అయినట్లు జల వనరుల శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

శ్రీశైలంలో స్థిరంగా ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో కొద్దిరోజులుగా ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో స్థిరంగా కొనసాగుతున్నాయి. ఎగువ నుంచి వస్తున్న వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. శుక్రవారం నుంచి శనివారం వరకు జూరాల, సుంకేసుల నుంచి 1,00,531 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరింది. దిగువ ప్రాంతాలకు 1,00,426 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.296 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.907 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం జలాశయంలో 193.8593 టిఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 881.10 అడుగులుగా నమోదైంది.

విజయవంతంగా స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు

- ఐదు భాగాలను బిగించిన ఇంజినీర్లు
- తుంగభద్ర ధ్యాం గేట్లు మూసివేత

సాక్షి, బళ్లారి/ హొసపేటె/హొళగుంద: తుంగభద్ర డ్యాంలో కొట్టుకుపోయిన 19వ క్రస్ట్ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు పూర్తయింది. శుక్రవారం రాత్రి ఈ గేటు తొలి భాగాన్ని బిగించిన సిబ్బంది.. శనివారం ఉదయం నుంచి సాయంత్రంలోగా మరో నాలుగు భాగాలను బిగించారు. దీంతో గేటు ఏర్పాటు విజయవంతంగా పూర్తయింది. ఓపక్క 71 టీఎంసీల నీరు జలాశయంలో ఉన్నప్పటికీ.. ప్రత్యేక నిపుణుడు కన్నయ్యనాయుడు పర్యవేక్షణలో ఇంజినీర్లు, సిబ్బంది సాహసోపేతంగా ఐదు భాగాలను బిగించారు. దీంతో డ్యాం గేట్లను మూసివేశారు. స్టాప్‌లాగ్ గేటు నుంచి మాత్రం కొద్దిపాటి నీరు లీకవుతోంది. దానిని కూడా ఆదివారానికి సరిచేస్తామని అధికారులు తెలిపారు. ఈ ఖరీఫ్ పంటలకు ఇబ్బంది లేదని తెలిపారు. ఈ నెల 9వ తేదీన కొట్టుకుపోయిన 19వ గేటు భాగాలు డ్యాంకు దిగువన కొంత దూరంలో శనివారం కనిపించాయి.

నీరు వృథా కాకుండా..

కొట్టుకుపోయిన గేటు స్థానంలో స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటులో ప్రభుత్వం, అధికారులు చూపిన చొరవ 35 టీఎంసీల జలాలు వృథాగా పోకుండా కాపాడగలిగారు. గేటు కొట్టుకుపోయిన వెంటనే డ్యాం అధికారులు రక్షణ చర్యల్లో భాగంగా 33 గేట్లలో 29 గేట్ల వరకు ఎత్తి దాదాపు లక్షా ఇరవై వేల క్యూసెక్కుల నీటిని వారం పాటు నదిలోకి వదిలాల్సి వచ్చింది. జలాశయంలో ముందుగా 65 టీఎంసీల నీరును ఖాళీ చేస్తే గేట్లు అమర్చవచ్చని అనుకున్నప్పటికీ, అధికారులు కేవలం 30 టీఎంసీలే నీరు నదిలోకి వదిలి గేట్లను పెట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గేట్ల నిపుణుడు 81 ఏళ్ల కన్నయ్యనాయుడు కృషితో 71 టీఎంసీల వద్ద గేట్లు ఏర్పాటు చేశారు. దీంతో 35 టీఎంసీల నీటిని ఆదా చేయగలిగారు. గేటు కొట్టుకుపోవడంతో పంటలు నష్టపోతామని రైతులు ఆందోళన చెందారని, స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటుతో వారంతా ఊపిరి పీల్చుకున్నారని ఏపీ తుంగభద్ర రైతు సంఘం నేత తప్పెట రామిరెడ్డి అన్నారు.



డ్యాం వద్ద స్టాప్‌లాగ్ గేటును అమరుస్తున్న దృశ్యం

సోనోవిజన్ ఇండిపెండెన్స్ డే సేల్ లక్కీడ్రా విజేతలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీలోనే అతిపెద్ద ఎలక్ట్రానిక్ షోరూం సోనోవిజన్ స్వాతంత్ర్య దినోత్సవ సేల్ లక్కీడ్రా ముగిసింది. విజయవాడ ఏలూరు రోడ్డులో ఉన్న విజయ ప్లాజా సోనోవిజన్ షోరూంలో శనివారం లక్కీ డ్రా నిర్వహించారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని డ్రా తీశారు. ఈ లక్కీడ్రాలో విజయవాడ ఆంజనేయవాగుకు చెందిన కనక సింహాచలం (కూపన్ నెం.135784) హోండా ఎమేజ్ కారు గెలుచుకున్నారు. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన బి.రెడ్డినాయుడు (120388) ఎల్‌ఈడీ టీవీ, జె.వర్ధనం (113430) రిఫ్రిజిరేటర్, కొత్తపేటకు చెందిన షేక్ రేష్మా (63521) వాషింగ్ మెషీన్ గెలుచుకున్నారు. విజేతలకు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ పి.భాస్కరమూర్తి శుభాకాంక్షలు తెలిపారు.



సోనోవిజన్ లక్కీడ్రాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు




పల్లె జీవన సౌందర్యం!

ఇంటి వద్ద కన్నబిడ్డలను వదల్లేక.. వెంట తెచ్చుకున్న కంటిపాపలను పొలంలో విడిచిపెట్టలేక.. ఓ చెట్టుకు ఊయల కట్టి బిడ్డను నిద్రపుచ్చిన దృశ్యం పల్లె వాతావరణానికి అద్దం పట్టింది. ఉదయాన్నే పొలంలో నడుం వంచిన రైతులు, వ్యవసాయ కూలీలు.. సూరీడు నెత్తిమీదకొస్తున్న యాల ఒక చోట గుమికూడి 'ముద్ద' పంచుకున్న తీరు అరమరికలు లేని పల్లె జీవనాన్ని చాటిచెప్పింది. కర్నూలు జిల్లా గోనెగండ్ల సమీపంలోని ఓ పొలం వద్ద కనిపించిన దృశ్యాలివీ..

– డి. హుస్సేన్
సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



కంటితో చూస్తోన్న వృక్షం

ఈ చిత్రంలోని మహావృక్షం కర్నూలు నగరంలోని కలెక్టర్ కార్యాలయం వెనుక భాగంలో ఉంది. ఈ చెట్టు మధ్యభాగంలో ఓ కన్ను ఆకారం ఏర్పడింది. అది అందర్నీ ఇట్టే ఆకర్షిస్తోంది. సమీపంలోని టీస్టాల్ వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఈ వేప చెట్టు కంటిని చూస్తూ ఒక నిమిషం పాటు అలాగే ఆశ్చర్యంగా ఉండిపోతున్నారు. ఈ వృక్షం కంటితో చూస్తోందని ఆనందంగా చెబుతున్నారు.

– వడ్డే శ్రీనివాసులు సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

కొండెక్కుతున్న ఇళ్లు

విశాఖ నడిబొడ్డులో ఇళ్లు కొండెక్కుతున్నాయి. కొండచరియలు తొలుచుకుంటూ పైపైకి పోతున్నాయి. మొక్కలు, వక్షాలు సైతం దాటుకుంటూ పైపైకి పోతున్నాయి. కొండపైన ఇళ్లు కట్టినట్లుగా కాకుండా.. ఇళ్లకు పచ్చదనం గొడుగు పట్టినట్లుగా దర్శనమిస్తోంది. అది ఎక్కడో కాదు.. హనుమంతవాక జంక్షన్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కొండే ఇది. చూడడానికి ఎంత ఆకర్షణీయంగా ఉందో.. అక్కడ నివాసముండే వారికి అంతే ప్రమాదం పొంచి ఉంది.

– పి.ఎల్ మోహనరావు
సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖ



క్లుప్తంగా...

గురువుల పాత్ర అమూల్యం

ట్రిపుల్ ఐటీ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ రవిశర్మ



తాడేపల్లిగూడెం: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న గురువుల పాత్ర ఎంతో అమూల్యమని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్, ఐఐటీ అలుమ్ని కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిశర్మ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో శనివారం జరిగిన ఆరో స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ నైతికత, జ్ఞానం, స్నేహాలకు శాశ్వత పునాది ఈ విద్యాలయం అని చెప్పారు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త సాంకేతికతలు ఆవిష్కృతం అవుతున్నాయని, వాటిలో మెలకువలు నేర్చుకొని పట్టు సాధించాలని సూచించారు. ఇన్‌చార్జి డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ పరిశోధన, అభివృద్ధికి పెద్దపీట వేసినప్పుడే విద్యార్థులైనా, దేశాలైనా పురోగతిలో పయనిస్తాయన్నారు. 2020–24 మధ్య బీటెక్ పూర్తి చేసిన 527 మంది విద్యార్థులకు, ఎంటెక్ కోర్సు పూర్తి చేసిన 15 మందికి, 25 మంది పరిశోధన విద్యార్థులకు పట్టాలు అందజేశారు. బ్రాంచీల వారీగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'అంతరిక్ష' ఆవిష్కరణలు


విద్యార్థులు ప్రదర్శిస్తున్న సౌరకుటుంబం

ఏర్పేడు: తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో నవవిష్కర్ ఆధ్వర్యంలో శనివారం ముందస్తు జాతీయ అంతరిక్ష పరిశోధన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 1000 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులు, క్విజ్‌లు, పెయింటింగ్‌లను ప్రదర్శించారు. వీటిలో ప్రధానంగా సౌర కుటుంబం, చంద్రయాన్–3, రోబో, వ్యోమగామి, ఆదిత్య ఎల్–1 విశేషంగా ఆకట్టుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఐఐటీ డైరెక్టర్ కేఎన్‌సత్యనారాయణ చేతుల ద్వారా బహుమతులు అందజేశారు.

విశాఖ చేరుకున్న ఐఎన్ఎస్ షాల్కీ


ఐఎన్ఎస్ షాల్కీకి స్వాగతం పలుకుతున్న వారి కుటుంబసభ్యులు

సింథియా(విశాఖ పశ్చిమ): సన్‌రైజ్ కమాండ్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిని గుర్తించడం ద్వారా ఐఎన్ఎస్ షాల్కీ జలాంతర్గామి కొత్త హోమ్ పోర్ట్ విశాఖపట్నానికి చేరుకుంది. ఐఎన్ఎస్ షాల్కీ కెప్టెన్‌కు, అతని సిబ్బందికి తూర్పు నావికాదళానికి చెందిన పలువురు నేవీ అధికారులు, వారి కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఐఎన్ఎస్ షాల్కీ సిబ్బంది కమాండ్‌లో చేరినప్పుడు 'హంటర్స్ ఆఫ్ ది డీప్' ప్రేరణతో దేశం గర్వించదగ్గ సేవలను అందించారని నేవీ వర్గాలు తెలిపాయి.


ప్రముఖ గాయని పి.సుశీలకు అస్వస్థత



తమిళ సినిమా: ప్రఖ్యాత గాయని పి.సుశీల శనివారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను చెన్నై మైలాపూర్‌లోని కావేరి ఆస్పత్రిలో చేర్చారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందనే వార్తలు వెలువడుతున్నాయి. పి.సుశీల కడుపునొప్పి కారణంగా ఆస్పత్రిలో చేరారని ఆస్పత్రి వైద్యసిబ్బంది తెలిపారు. అది సాధారణ కడుపునొప్పేనని, ఆమె ఆరోగ్యంగానే ఉన్నారని పేర్కొన్నారు. పి.సుశీల ఆరోగ్య విషయమై సినీవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఇదేనా 'దూర'దృష్టి!

- ఏయూ దూరవిద్య పరీక్షల్లో వీసీ అత్యుత్సాహం
- మాస్‌మీడియా పరీక్షలో 'ఈనాడు' పత్రిక గురించి రాయాలంటూ ప్రశ్న
- ప్రభుత్వం మెప్పుకోసమేనంటూ విద్యార్థుల విమర్శ


[Total No. of Pages:3
CDOMJ-101
M.A. (JMC) DEGREE EXAMINATION, JULY/AUGUST- 2024
Paper-I : HISTORY OF MASS MEDIA
(Semester - I)
(w.e.f. 2024 Admitted Batch)
Time : 3 Hours | Max. Marks: 70
SECTION-A
Answer any five of the following: (5×4=20)
a) News Books.
b) Bombay Chronicle.
c) Kesari.
d) Free Press Journal.
e) Hitvada.
f) Kandukuri.
g) Mutnuri.
h) Eenadu.
AU-486 [1] [P.T.O.]

'ఈనాడు' గురించి రాయాలంటూ ఇచ్చిన ప్రశ్న

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాక్ ర్యాంకింగ్‌తో ఆంధ్రా యూనివర్సిటీని అగ్రస్థానంలో నిలబెట్టగా.. ఇప్పుడు సొంత బాకా కొట్టుకునేందుకే అన్నట్టుగా మార్చేశారు. ఏయూలో ఎంఏ జర్నలిజం దూరవిద్య పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు జరిగిన పరీక్షలో ఏయూ వీసీ శశిభూషణరావు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రభుత్వ మెప్పు పొందేందుకు టీడీపీ కరపత్రికగా ఉన్న ఈనాడు గురించి ప్రశ్నలు సంధించారు. వీసీ, ఏయూ అధికారుల వ్యవహారంపై విద్యార్థులు నిర్ఘాంతపోయారు. హిస్టరీ ఆఫ్ మాస్ మీడియా పరీక్ష ప్రశ్నపత్రంలో విద్యార్థులకు వింత అనుభవం ఎదురైంది. సెక్షన్–ఏ లో మొదటి ప్రశ్నలో ఏవైనా 5 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటూ 4 మార్కులు ప్రశ్న ఇచ్చారు. ఇందులో ఎనిమిది టాపిక్స్ ఇవ్వగా.. అందులో ఏడు మాత్రం సిలబస్‌లో ఉన్నవే ఇచ్చారు. కానీ.. సిలబస్‌లో లేని 'ఈనాడు' గురించి కూడా రాయాలంటూ ప్రశ్నపత్రంలో ఇవ్వడంపై విద్యార్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈనాడు గురించి సిలబస్‌లో ఉంటే కచ్చితంగా ప్రశ్న ఇచ్చినా ప్రిపేరై రాసేవాళ్లమని.. కానీ, ఎక్కడాలేని ప్రశ్నని ఇస్తే.. తాము ఎలా రాస్తామంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు ఎనిమిదింటిలో నాలుగు ప్రశ్నలు మాత్రమే తెలుసనీ.. ఈనాడు బదులు సిలబస్‌లో ఉన్నది ఇచ్చి ఉంటే మరో ప్రశ్న కూడా రాసేవాళ్లమని చెబుతున్నారు. కేవలం ప్రభుత్వం మెప్పు పొందేందుకే వైస్ చాన్సలర్ ఈ విధంగా ప్రశ్నపత్రం తయారు చేయించి ఉంటారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో పరీక్షలో ఇంకెవరి గురించి రాయమని ప్రశ్నపత్నం తయారు చేస్తారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిభ చూపి అమెరికాకు!

- ఏఎఫ్ఎస్ ఆన్‌లైన్ టెస్ట్‌లో సూర్యతేజశ్రీ ప్రతిభ
- అమెరికాలో ఏడాది పాటు ఉచిత విద్యనభ్యసించే అరుదైన అవకాశం
- నేడు బయలుదేరనున్న జంగారెడ్డిగూడెం విద్యార్థిని

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన బందిల సూర్యతేజశ్రీ విద్యలో చూపిన ప్రతిభ కారణంగా అమెరికాలో ఉచిత విద్యను అభ్యసించే అరుదైన అవకాశాన్ని సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన సూర్యతేజశ్రీ తల్లి నాగమణి.. ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలు. విజయవాడ ఈడ్పుగల్లులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ అండ్ నీట్ గురుకులంలో సూర్యతేజశ్రీ ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తిచేసింది. గతేడాది అమెరికా ఫీల్డ్ సర్వీసెస్ సంస్థ(ఏఎఫ్ఎస్) కెన్నెడి లూగర్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహించింది. 12 విభాగాల్లో నిర్వహించిన ఈ టెస్ట్‌లో 17 ఏళ్ల సూర్యతేజశ్రీ పాల్గొని ప్రతిభ చూపింది. దీంతో అమెరికా మిషిగన్ రాష్ట్రంలోని హోప్కిన్‌లో ఏడాది పాటు ఉచితంగా డిప్లమో కోర్సును అభ్యసించేందుకు అర్హత సాధించింది.


బందిల సూర్యతేజశ్రీ

ఉచిత శిక్షణతో పాటు ప్రయాణ ఖర్చులు కూడా ఏఎఫ్ఎస్ సంస్థ భరించనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సూర్యతేజశ్రీ అమెరికా వెళ్లనుంది. ఏపీ ప్రతినిధిగా ఇక్కడ సంస్కృతి, సంప్రదాయాలను అక్కడ తెలియజేయడం, అక్కడి సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడానికి ఆమెకు అవకాశం ఏర్పడింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నుంచి రూ.లక్ష నగదు, ల్యాప్‌టాప్‌ను సూర్యతేజశ్రీ అందుకుంది.

ఏలూరులో మహిళపై సామూహిక అత్యాచారం

భర్తను చితక్కొట్టి మహిళను లాక్కెళ్లిన ముగ్గురు యువకులు

- జీవనోపాధి కోసం ఇటీవలే ఏలూరు వచ్చిన జంట
- హోటల్లో పనిచేస్తూ ఓ భవనంలో నిద్రిస్తున్న దంపతులు
- ఇదే అదనుగా అర్ధరాత్రి అత్యాచారానికి పాల్పడ్డ యువకులు
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

ఏలూరు టౌన్: కోల్‌కతాలో డాక్టర్‌పై హత్యాచార ఘటన దేశాన్ని కుదిపేస్తున్న వేళ.. ఏలూరులో ముగ్గురు యువకులు ఓ మహిళపై సామూహిక అత్యాచారం చేయడం స్థానికంగా కలకలం రేపింది. భార్యాభర్తలు నిద్రిస్తున్న సమయంలో భర్తను చితక్కొట్టి.. భార్యను లాక్కెళ్లి అత్యాచారానికి పాల్పడిన ఈ ఘటన ఆ మృగాళ్ల ఉన్మాదానికి పరాకాష్టగా నిలుస్తోంది. పోలీసులు వెంటనే స్పందించకపోవడం, ఘటన వివరాలు ఓ వ్యక్తి వెంటనే తెలిపినా నిర్లక్ష్యంగా వ్యవహరించడం చూస్తే.. కూటమి సర్కారులో మహిళలకు భద్రత కరువైందన్న దానికి తార్కాణంలా ఈ ఘటన నిలుస్తోంది. భర్త ఫిర్యాదుతో ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. బాధితురాలికి ఏలూరు జీజీహెచ్‌లో వైద్యచికిత్స అందిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ అమానుష ఘటన వివరాలు.. ఏలూరు జిల్లా లింగపాలెం మండలానికి చెందిన భార్యాభర్తలు జీవనోపాధి కోసం 20 రోజుల క్రితం ఏలూరు నగరానికి వచ్చారు. వన్‌టౌన్ ప్రాంతంలోని ఓ హోటల్‌లో పనికి కుదిరారు. రాత్రి వేళల్లో స్థానికంగా ఉన్న ఆధ్యాత్మిక వేదిక రామకోటిలో నిద్రపోయి.. ఉదయం లేచి పనులకు వెళుతున్నారు. జీతం వచ్చాక అద్దె ఇల్లు కూడా తీసుకోవాలని భావించారు. వీరు ఇలా జీవించడం చూసిన ముగ్గురు జులాయి యువకులు కొద్ది రోజులుగా భర్తతో స్నేహంగా ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ముగ్గురు యువకులు భర్తకు మద్యం తాగించారు. అతను మత్తులో మునిగి నిద్రపోగా.. అతని భార్య (35)ను అక్కడి నుంచి లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆమె కేకలు వేయగా.. మెలకువ వచ్చిన భర్త వారిని అడ్డగించాడు. యువకులు బలమైన కర్రతో భర్త కాళ్లను చితక్కొట్టారు. అనంతరం మహిళను సమీపంలోని భవనంలోకి లాక్కెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ క్రమంలో ఆమె ముఖంపైనా బలంగా కొట్టారు.


పోలీసుల అదుపులో నిందితులు


బాలాజీ, ఏలూరు (పోలీసులకు ఫోన్ చేసిన యువకుడు)

పోలీసుల అలసత్వం

కాళ్లపై బలంగా దెబ్బతిన్నా.. భర్త రోడ్డుపైకి వచ్చి సాయం కోసం అరిచాడు. సినిమా చూసి అటుగా వెళుతున్న బాలాజీ అనే యువకుడు ఇది గుర్తించి డయల్ 100కు ఫోన్ చేయగా సిబ్బంది పట్టించుకోలేదు. చేసేది లేక ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడి సిబ్బందికి జరిగిన విషయాన్ని చెప్పగా.. వారు వెంటనే స్పందించకుండా ఆలస్యం చేశారు. పోలీసులు వెంటనే స్పందించకపోవడంతో బాలాజీ.. తన స్నేహితులకు ఫోన్ చేసి ఘటనా స్థలానికి వెళ్లాడు. వీరు వెళ్లాక నిందితులు ముగ్గురూ బాధిత మహిళను అక్కడే వదిలేసి పారిపోయారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితులు ముగ్గురినీ ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. 24 గంటలు గడవక ముందే శనివారం ఏలూరు వన్‌టౌన్ గజ్జవారి చెరువు వద్ద బిట్టు బార్ ఎదురుగా రోడ్డుపై నిందితులు ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జులాయిగా తిరిగే ఈ నిందితులు ఏలూరు టీచర్స్ కాలనీలో చెంచుకాలనీ రోడ్డు ప్రాంతానికి చెందిన నూతిపల్లి పవన్, లంబాడీపేట, సాయిబాబా గుడి ప్రాంతానికి చెందిన నారపాటి నాగేంద్ర, ఎంఆర్ఆర్ కాలనీ 13వ రోడ్డు ప్రాంతానికి చెందిన గడ్డి విజయకుమార్ అని పోలీసులు వెల్లడించారు.

ఆరుగురు సాక్షి ఫొటోగ్రాఫర్లకు జాతీయస్థాయి అవార్డులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) నిర్వహించిన జాతీయస్థాయి ఫొటోగ్రఫీ పోటీలు–2024 ఫలితాలను శనివారం ప్రకటించారు. ఈ ఫలితాలను ఏపీపీజేఏ అధ్యక్షుడు డాక్టర్ సిహెచ్.విజయభాస్కర రావు, ప్రధాన కార్యదర్శి వి.రూబెన్ బెసాలియల్ విడుదల చేశారు. ఈ పోటీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆరుగురు సాక్షి ఫొటోగ్రాఫర్లకు అవార్డులు లభించాయి. డి.హుస్సేన్ (కర్నూలు), పి.ఎల్.మోహనరావు (వైజాగ్), ఎండీ నవాజ్ (వైజాగ్), జి.వీరేష్ (అనంతపురం), కె.జయశంకర్ (శ్రీకాకుళం)లకు ఏపీపీజేఏ అచీవ్‌మెంట్ అవార్డులు, సనకా లక్ష్మీపవన్ (విజయవాడ)కు కన్సొలేషన్ అవార్డు లభించాయి.


డి.హుస్సేన్


పి.ఎల్.మోహనరావు


ఎండీ నవాజ్


జి.వీరేష్


కె.జయశంకర్


సనకా లక్ష్మీపవన్


కందుల చక్రపాణి

ఏఎన్‌యూ పోటీల్లో..

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) నిర్వహించిన ఫొటో కాంటెస్ట్–2024 ఫలితాలను ఇన్‌చార్జి వీసీ గంగాధర రావు విడుదల చేశారు. ఐదు విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించారు. కలర్స్ విభాగంలో సాక్షి ఫొటోగ్రాఫర్ కందుల చక్రపాణి అప్రిసియేషన్ అవార్డు గెల్చుకున్నారు.



ఆకలి రుచి ఎరగదు.. నిద్ర సుఖమెరగదు

ఆకలి మంట కడుపుతీపిని జయించింది. శనివారం మధ్యాహ్నం నెల్లూరు పాతమున్సిపల్ కార్యాలయం సమీపంలోని అన్న క్యాంటీన్‌కు భోజనానికి వచ్చిన ఓతల్లి నిద్రిస్తున్న తన బిడ్డను ఇలా నేలపై పడుకోబెట్టి భోజనం కోసం లైన్లో నిల్చొంది.

– విజయ్‌కృష్ణ సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న స్మార్ట్‌ఫోన్లు

- 2023లో 692 కోట్ల స్మార్ట్‌ఫోన్లు..
- 2024 చివరి నాటికి 713 కోట్లకు పైగా చేరుకుంటాయని అంచనా

చైనాలో అత్యధికం..
బంగ్లాదేశ్‌లో అత్యల్పం

- భారత్‌లో 2023 నాటికి 65.90 కోట్ల స్మార్ట్‌ఫోన్లు...
- 2026 నాటికి 35జీబీకి చేరనున్న నెలవారీ డేటా వినియోగం


స్మార్ట్ వరల్డ్

ప్రపంచ వ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరుగుతోంది. కమ్యూనికేషన్, వెబ్ బ్రౌజింగ్, నావిగేషన్, వినోదం వంటి సేవలతోపాటు ఆర్థిక లావాదేవీలు, సామాజిక అవసరాల విషయంలో విస్తృత మార్పులు రావడంతో ప్రతి వ్యక్తికి స్మార్ట్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారింది. ఒక వ్యక్తి వద్ద ఒకటి కంటే ఎక్కువ కూడా స్మార్ట్‌ఫోన్లు ఉంటున్నాయి. దీంతో 2023లో ప్రపంచ వ్యాప్తంగా 692 కోట్లు స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. పట్టణాల్లో 83 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 78 శాతం స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. ఇదే ఒరవడి కొనసాగితే 2025 నాటికి ప్రపంచ జనాభాలో 90.33 శాతం మంది స్మార్ట్‌ఫోన్లు కలిగి ఉంటారని యూరప్‌కు చెందిన ఈ–కామర్స్ సేవలు అందిస్తున్న ఒబెర్లో అనే సంస్థ ఇటీవల విడుదల చేసిన ఒక నివేదికలో వెల్లడించింది. 2026 నాటికి 752 కోట్ల వరకు స్మార్ట్‌ఫోన్లు వినియోగదారుల చేతుల్లో ఉంటాయని ఆ సంస్థ అంచనా వేసింది. చైనాలో గత ఏడాది వరకు అత్యధికంగా 97.46 కోట్లు స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో అత్యల్పంగా 5 కోట్లు మాత్రమే ఉన్నాయి. అయితే అమెరికా(27.61కోట్లు) కన్నా దాదాపు రెండున్నర రెట్లు ఎక్కువగా మనదేశంలో 65.90 కోట్ల స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి.

– సాక్షి, అమరావతి

ఫోన్‌లోనే ఇంటర్నెట్ వినియోగం అత్యధికం...

స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి రావడంతో ప్రజలకు ఇంటర్నెట్ వినియోగం సులభమైంది. గత ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నెట్ వినియోగదారుల్లో 200 కోట్ల మంది (57.14శాతం) స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా యాక్సెస్ చేశారు. ఇది 2025 నాటికి 72.6శాతాకి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. 2023లో నెలవారీ సగటు డేటా వినియోగం 14 జీబీగా ఉంటే.. 5జీ అందుబాటులోకి రావడంతో 2026 నాటికి 35జీబీకి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.



స్ఫూర్తిదాయక సేవాగమనం

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

నెల్లూరు (దర్గామిట్ట): స్వర్ణభారత్ ట్రస్ట్ 23 ఏళ్ల ప్రస్థానం.. అంకెలు కాదని, స్ఫూర్తిదాయక గమనమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చెప్పారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలో శనివారం జరిగిన స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవంలో ఆయన సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హృదయం ఎప్పుడూ గ్రామీణ ప్రాంతాలతో మమేకమై ఉందని చెప్పారు. దీనికి స్వర్ణభారత్ ట్రస్ట్ ఉదాహరణగా నిలుస్తుందన్నారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ విద్య, నైపుణ్య శిక్షణతో పాటు మన భాష, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవటానికి స్వర్ణభారత్ ట్రస్ట్ నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. వెంకయ్యనాయుడు జీవనప్రస్థాన ఛాయాచిత్ర ఆంగ్ల గ్రంథాన్ని ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. అంతకుముందు ఉపరాష్ట్రపతి అక్షర విద్యాలయాన్ని, సోమా నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని, దంత, సాధారణ వైద్యశాలలను సందర్శించారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో నిర్మించిన అడ్మిన్ బిల్డింగ్‌ను ప్రారంభించి ఆవరణలో మొక్క నాటారు. స్వర్ణభారత్– భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయ సమితి సంయుక్తంగా నిర్వహిస్తున్న జైపూర్ ఫుట్ ఉచిత శిబిరాన్ని సందర్శించి కొందరికి కృత్రిమ అవయవాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు, వెంకయ్యనాయుడి సతీమణి ఉషమ్మ పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో ఉపరాష్ట్రపతి, గవర్నర్, వెంకయ్యనాయుడు దంపతులు

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.